

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 48

శనివారం 10-5-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




LAUNCHING

CASAGRAND BELAIR
GOWDAVALLI

5 BHK అత్యంత విలాసవంతమైన 4000+ చ.అ. బంగళాలు

From ₹3.4cr*




వాక్-ఇన్ వార్డ్‌రోబ్‌తో అతిపెద్ద 20 అ. వెడల్పు బెడ్‌రూమ్‌ను మీరు చూడొచ్చు



ప్రతీ బంగళాలో ప్రైవేట్ హోమ్ థియేటర్* కొరకు ఆప్షన్ కలదు



లాంజ్‌లు, పూల్‌సైడ్ వాలీబాల్, పార్టీ నూక్ మరియు మరెన్నో వాటితో 2800 చ.అ. 2 రూఫ్‌టాప్ స్విమ్మింగ్ పూల్స్



ప్రతీ యూనిట్*లో ప్రైవేట్ లిఫ్ట్ ఆప్షన్



ప్రత్యేకంగా 20,000 చ.అ. క్లబ్‌హౌస్ నందు విలాసంలో మునగండి




ప్రతీ యూనిట్ చుట్టూ 1000 చ.అ. ప్రైవేట్ గార్డెన్



కాసాగ్రాండ్ బేలేరులో బంగళా కొనుగోలు చేయుటకు మరెన్నో కారణాలు

లొకేషన్ మ్యాప్



ఓఆర్ఆర్‌కు అతి చేరువలో ఉన్నందున హైదరాబాద్‌లోని అన్ని ముఖ్యమైన ప్రాంతాలకు అదేవిధంగా ప్రధాన జిల్లాలకు అత్యుత్తమ కనెక్టివిటీ

- సికింద్రాబాద్, సిటీ సెంటర్
- ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్
- గచ్చిబౌలి, హైటెక్ సిటీ
- సమీప జిల్లాలు ఉదా. కామారెడ్డి, నిజామాబాద్, కరీంనగర్

రాబోయే మరియు ఇతర అభివృద్ధి కార్యక్రమాలు

- మేడ్చల్ నుండి మల్కాజ్‌గిరి వరకు హైవే మరియు మెట్రో కొరకు డబుల్-డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్
- భారతదేశంలోని అతిపెద్ద మెడికల్ డివైజెస్ పార్క్ ఓఆర్ఆర్ 4 వద్ద ఉన్నది. ఇది సుమారు 25 నిమిషాల దూరంలో సుమారు 302 ఎకరాలు కలిగి భారతదేశంలోనే అతిపెద్దది

హైదరాబాద్‌లో వేగవంతంగా రూపొందుతున్న ఈ బంగళా హబ్‌లో గణనీయ మూలధన విలువ పెరుగుతుందని ఆశిస్తున్నాము.

*T&C Apply

WHY CASAGRAND

20 years of real estate excellence	160+ landmark projects	55,000+ happy families	2023 rigorous quality checks	87% on-time delivery	7 cities Chennai, Bengaluru, Hyderabad, Coimbatore, Pune, Delhi & Dubai
2 months of rental assurance	6 months of resale support	8 Year warranty & 10-year community maintenance	75% open area for 2x more light & ventilation	0% space wastage for carpet area efficiency	23 global brands used in fittings and finishing materials

CREDAI

Exclusive site visit available | www.casagrand.co.in

90475 40000

Scan for Walkthrough

Scan for location

CASAGRAND building aspirations

శనివారం 10-5-2025


'రాష్ట్రంలో నిరుపేదలెవరూ డబ్బులేని కారణంగా ఉన్నత విద్యకు దూరం కాకూడదు. అందుకే ఫీజుల చెల్లింపు పథకాన్ని చేపట్టాం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 20 వెల: ₹ 5.50
సంపుటి: 18 సంచిక: 48



వారం రోజుల విరామం
ఐపీఎల్ మ్యాచ్‌ల నిలిపివేత. ఆటకంటే దేశం ముఖ్యమన్న బీసీసీఐ -17లో



కొనసాగిన యుద్ధ భయాలు
80వేల దిగువకు సెన్సెక్స్. రెండురోజుల్లో రూ. 7 లక్షల కోట్లు ఆవిరి. -17లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

న్యూస్‌రీల్

సీఐసీగా చంద్రశేఖర్‌రెడ్డి ప్రమాణం



సమాచార హక్కు చట్టం రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్‌గా డాక్టర్ జి.చంద్రశేఖర్ రెడ్డి ప్రమాణం చేశారు. రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు.

- వివరాలు 3లో ▶

రాజకీయ కారణాలతో కేసులు సరికాదు



రాజకీయ కారణాలతో మీడియా ప్రతినిధులపై కేసులు సమర్థనీయం కాదని ఆర్థిక, రాజకీయరంగ నిపుణుడు, మాజీ ఎమ్మెల్సీ ప్రొ. కె.నాగేశ్వర్ అన్నారు. భావప్రకటనా స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిన హక్కు అని, దానిని అందరూ గౌరవించాలని అన్నారు.


- వివరాలు 2లో ▶

రెండ్రోజులు తేలికపాటి వానలు




రాష్ట్రంలో రానున్న రెండు రోజులు పలుచోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఉపరితల ద్రోణి ప్రభావంతో దక్షిణ తెలంగాణ జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది.

- వివరాలు 3లో ▶


జమ్మూలో..


శత్రు స్థావరాలను ధ్వంసం చేస్తున్న భారత్ సైన్యం


కశ్మీర్‌లోని రాజౌరీలో...

దాయాది.. మళ్లీ బరితెగింపు

రెండో రోజూ రెచ్చిపోయిన పాక్ • సరిహద్దు ప్రాంతాలపైకి క్షిపణులు, డ్రోన్లు

- 20 నగరాలు సహా 26 ప్రాంతాలపై గురి
- శ్రీనగర్ విమానాశ్రయంపై దాడికి యత్నం
- దాడులను దీటుగా తిప్పికొట్టిన సైన్యం
- క్షిపణులు, డ్రోన్లు ఎక్కడివక్కడ కూల్చివేత
- కాల్పులతో దద్దరిల్లుతున్న సరిహద్దులు
- అక్కడి రాష్ట్రాల్లో అప్రమత్తత, బ్లాకౌట్లు
- ప్రధాని మోదీ అత్యున్నత స్థాయి సమీక్షలు

దాయాది బుద్ధి మారలేదు. తొలిరోజు భారత్‌పై విరుచుకుపడేందుకు విఫలయత్నం చేసి చావుదెబ్బ తిన్న పాకిస్తాన్.. రెండోరోజూ సరిహద్దు ప్రాంతాలపై దాడులకు ప్రయత్నించింది. శుక్రవారం చీకట్లు పడుతూనే జమ్మూకశ్మీర్ మొదలు రాజస్తాన్ దాకా 26కుపైగా ప్రాంతాలపైకి క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించింది. అయితే ఈ దాడులను సైన్యం దీటుగా తిప్పికొడుతోంది. వాటిని ఎక్కడివక్కడ కూల్చేస్తోంది. ఉద్రిక్తతల నేపథ్యంలో ముందుజాగ్రత్తగా బ్లాకౌట్ కొనసాగుతుండటంతో ఆయా రాష్ట్రాల్లో శ్రీనగర్ మొదలుకుని జోధ్‌పూర్ దాకా పలు పట్టణాల్లో చీకట్లు కమ్ముకున్నాయి. ఓవైపు దాడులకు తెగబడుతూనే, మరోవైపు భారత్‌తో ఉద్రిక్తతలను తగ్గించాలంటూ ఇరాన్, సౌదీ, ఇతర గల్ఫ్ దేశాలను పాక్ ప్రాధేయపడుతోంది. తాజా పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని మోదీ.. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్, త్రివిధ దళాధిపతులతో శుక్రవారం రాత్రి సమీక్షించారు.

- వివరాలు 6లో

పాకిస్తాన్‌కు బిలియన్ డాలర్లు

భారత్ అభ్యంతరం తెలిపినా ఎగ్జిక్యూటివ్ బోర్డు భేటీలో ఐఎంఎఫ్ ఆమోదముద్ర

పాక్ ప్రధాని కార్యాలయం ప్రకటన

పాక్ పని పట్టాం

కీలక వ్యవస్థలను దెబ్బ తీశాం.. సైనిక స్థావరాలు, రాడార్ డిఫెన్స్ ధ్వంసం చేశాం: కేంద్రం

- పశ్చిమ సరిహద్దు పొడవునా పాక్ దాడులు.. పౌర, సైనిక వ్యవస్థలను లక్ష్యం చేసుకుంది
- 36 ప్రాంతాలపై 400 పై చిలుకు టర్కీ డ్రోన్లు.. వాటన్నింటినీ సైన్యం దీటుగా తిప్పికొట్టింది
- కల్నల్ ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమిక వెల్లడి

పాక్ చెయ్యి వదిలేసిన అమెరికా

➤ భారత్–పాక్ ఘర్షణలో జోక్యం చేసుకోబోమని స్పష్టీకరణ

మన పాశుపతాలు

పాక్ దాడులను నిర్వీర్యం చేసిన పెచోరా, కాస్, సమర్, ఏడీ వ్యవస్థలు

పాక్ పక్కలో బల్లెం బలూచిస్తాన్

- సైన్యంపై విరుచుకుపడుతున్న బలూచ్ రెబల్స్.. తాజా దాడుల్లో 16 మంది పాకిస్తాన్ సైనికులు హతం

- వివరాలు 6,7 పేజీల్లో ▶

నాది లేటెస్ట్ మోడల్

అందుకే కేంద్రం తెలంగాణను అనుసరిస్తోంది

'ది హిందూ హడిల్' చర్చాగోష్టిలో సీఎం రేవంత్‌రెడ్డి

- మోదీది వాట్సాప్ యూనివర్సిటీ.. నాది స్కిల్స్ యూనివర్సిటీ
- కులం ప్రభావం ఎలా ఉంటుందో నాకు బాగా తెలుసు.. అందుకే సామాజిక న్యాయంపై దృష్టి సారించి పనిచేస్తున్నా
- అభివృద్ధి, సంక్షేమాలను మిళితం చేసి రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నా
- న్యూయార్క్, టోక్యో, దుబాయ్, సింగపూర్‌లతో పోటీ పడాలన్నదే నా లక్ష్యం



సాక్షి, హైదరాబాద్: 'దేశంలో ఇప్పటిదాకా గుజరాత్ మోడల్ గురించి చర్చ జరుగుతోంది. కానీ అది 2000 సంవత్సరం కంటే ముందున్న మోడల్. ప్రస్తుత తెలంగాణ మోడల్ 2025లో ఉన్న అప్ డేటెడ్ మోడల్. మోదీ మోడల్ వాట్సాప్ యూనివర్సిటీ అయితే, నాది స్కిల్స్ యూనివర్సిటీ. గుజరాత్‌లో ఉద్యోగాల్లేవు. నేను ఏడాదిలో 60 వేల ఉద్యోగాలిచ్చా. అక్కడ రైతుల రుణమాఫీ లేదు.. నేను రూ.21 వేల కోట్లు మాఫీ చేశా. గుజరాత్‌లో మద్దతు ధర లేదు. తెలంగాణలో మద్దతు ధరతో పాటు

మిగతా 14వ పేజీలో ▶



ఒక ఓటుకు ఐదేళ్ల శిక్ష!

- తప్పు పార్టీకి ఓటేస్తే అనుభవించాలి కదా.. కేసీఆర్ చెప్పినా వినకపోవడం వల్లే మోసకారి ప్రభుత్వం వచ్చింది
- ఖమ్మం జిల్లా పర్యటనలో కేటీఆర్ వ్యాఖ్యలు
- రేవంత్‌రెడ్డి వంటి దివాలాకోరు సీఎంను చూడలేదని ధ్వజం.. స్థానిక ఎన్నికల్లో ప్రజాసమస్యలపై కాంగ్రెస్ నేతలను నిలదీయాలని పిలుపు

14లో



జొన్న 'మద్దతూ' దళారీకే

- బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.2,000తో కొన్న దళారులు, వ్యాపారులు
- క్వింటాల్‌కు మద్దతు ధర రూ.3,371తో కొనుగోలు చేస్తున్న మార్క్‌ఫెడ్
- రైతుల ముసుగులో దళారుల ప్రవేశం
- రైతుల నుంచి కొన్న జొన్నలు.. మార్క్‌ఫెడ్ కేంద్రాల్లో విక్రయం
- ఏపీ నుంచి తెచ్చి ఇక్కడ విక్రయాలు

8లో



అందాల పండగ నేడే షురూ

- హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ప్రపంచ సుందరి పోటీల ప్రారంభ వేడుకలు
- హాజరుకానున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఘనంగా ఏర్పాట్లు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఇప్పటివరకు 111 మంది సుందరీమణుల రాక

-18లో

శుక్రవారం శంషాబాద్ విమానాశ్రయంలో మిస్‌వరల్డ్ -2024 క్రిస్టినా పిస్కోవా

ఇదండీ సంగతి



సార్! మన సైన్యం అంతా బార్డర్ నుంచి వచ్చి టెర్రరిస్టుల అంత్యక్రియల్లో బిజీగా ఉన్నారు! నేనూ వచ్చేదా!!


విమర్శను సహించలేరా?

పోలీసులకు అపరిమిత స్వేచ్ఛ ప్రమాదకరం

ప్రభుత్వంలో ఎవరు అధికారంలో ఉంటే వారిని పోలీసులు బాస్‌లుగా భావిస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులకు అపరిమితమైన స్వేచ్ఛ ఇవ్వడం అత్యంత ప్రమాదకరం. ప్రస్తుత దుష్పరిణామాలకు మద్దతు తెలపడం అంటే రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించడమే.

ప్రజాస్వామ్యాన్ని కాపాడటమే నిజమైన దేశభక్తి

మన ప్రజాస్వామ్యం ఇంకా బతికే ఉంది. ఇది ప్రభుత్వాలు గ్రహించాలి. తమపై విమర్శలు చేసే వ్యక్తులు, పత్రికలపై కేసులు పెడతామంటే ప్రజాస్వామ్యాన్ని తీసేసి రాచరిక, నియంతృత్వ వ్యవస్థలను పెట్టుకోవాలి. కాబట్టి ప్రజాస్వామ్యాన్ని కాపాడటమే నిజమైన దేశభక్తి. బాధ్యతగల ప్రభుత్వాలు ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి.



భావ ప్రకటన స్వేచ్ఛ.. రాజ్యాంగం కల్పించిన హక్కు

- మనం ప్రజాస్వామ్యాన్ని ఎంచుకున్నాం.. రాచరికం, నియంతృత్వాన్ని కాదు
- తప్పును ఎత్తిచూపి, విమర్శించే హక్కు పత్రికలకు రాజ్యాంగం కల్పించింది
- ప్రజా జీవితంలో ఉన్న వారిపై పత్రికలు, పౌరులు కచ్చితంగా విమర్శలు చేస్తారు
- వారిపై కేసులు పెడతాం, జైలుకు పంపుతామంటే రాజ్యాంగ ఉల్లంఘనే
- ప్రభుత్వంలో ఉన్నవారే తమ బాస్‌లుగా పోలీసులు భావిస్తున్నారు
- పోలీసులకు అపరిమితమైన స్వేచ్ఛ ఇవ్వడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు
- పత్రికల స్వేచ్ఛ, పౌర హక్కులను ప్రభుత్వాలు, వ్యవస్థలు కాపాడాలి

జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మారెడ్డి

సాక్షి ప్రతినిధి, కర్నూలు: 'మనది ప్రజాస్వామ్య దేశం. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు రాజ్యాంగం నాలుగు వ్యవస్థలను ఏర్పాటు చేసింది. అందులో నాలుగో వ్యవస్థ (ఫోర్త్ ఎస్టేట్) పత్రికలు. వీటి భావ ప్రకటన స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిన హక్కు. ప్రజా జీవితంలోని వ్యక్తులు, ప్రభుత్వాలు, వ్యవస్థలు తప్పుచేస్తే ఎత్తిచూపడం, విమర్శించే హక్కు పత్రికలకు ఉంది. కానీ.. పత్రికలు వార్తలు రాస్తే కేసులు పెడతాం, జైలుకు పంపిస్తామంటే ప్రజాస్వామ్యాన్ని కాలరాయడమే. మనం రాచరిక, నియంతృత్వ వ్యవస్థలో లేం అనే విషయాన్ని ప్రభుత్వాలు గుర్తించాలి. ప్రజాస్వామ్యాన్ని, భావ ప్రకటన స్వేచ్ఛను కాపాడాలి' అని జన విజ్ఞానవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బ్రహ్మారెడ్డి అన్నారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టడం, సాక్షి ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి నివాసానికి వెళ్లి భయానక వాతావరణాన్ని సృష్టించడం వంటి పరిణామాల నేపథ్యంలో భావ ప్రకటన స్వేచ్ఛ, ప్రభుత్వాల బాధ్యత, తాజా పరిణామాలపై ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..



మనం రాచరికాన్ని ఎంచుకోలేదు

మనం ప్రజాస్వామ్య వ్యవస్థను ఎంచుకున్నాం. రాచరిక, నియంతృత్వ వ్యవస్థలను కాదు. ప్రజాస్వామ్యంలో భావ ప్రకటన స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిన హక్కు. ప్రజాస్వామ్యం బతికేందుకు మనం నాలుగు వ్యవస్థలను ఎంచుకున్నాం. అందులో నాలుగో వ్యవస్థగా పత్రికలకు, భావ ప్రకటన స్వేచ్ఛకు రాజ్యాంగ నిర్మాతలు చోటు కల్పించారు. ప్రజాస్వామ్యం బతకాలంటే భావ ప్రకటన స్వేచ్ఛ బతకాలి. సమాజంలోని మంచిని ఎలా పత్రికలు తెలియజేస్తాయో.. ప్రభుత్వాలు తమ సమాచారాన్ని ప్రజలకు చేరవేయాలని పత్రికలను ఎలా ఆశ్రయిస్తాయో.. అలాగే ప్రభుత్వాలు, ప్రజాజీవితంలోని వ్యక్తుల తప్పులను ఎత్తిచూపడం, విమర్శించడం పత్రికలకు ఉన్న హక్కు. దీన్ని కాలరాయడం ముమ్మాటికీ తప్పు. ఎడిటర్ ఇంటికి వెళ్లి అలజడి సృష్టించడం సరికాదు.

తప్పును ఎత్తిచూపడం పత్రికల హక్కు

తప్పును ఎత్తిచూపడం, విమర్శించడం పత్రికల హక్కు. ఇలాంటి వాటిపై అభ్యంతరాలుంటే న్యాయస్థానాలను ఆశ్రయించాలి. తప్పొప్పులను కోర్టులు నిర్ణయిస్తాయి. అంతేకానీ.. 'తప్పులు ఎత్తిచూపకూడదు, వార్తలు రాస్తే పోలీసులతో కేసులు పెడతాం, రిమాండ్‌కు పంపుతాం' అంటే ఎలా? ఇది ముమ్మాటికీ తప్పే. ఈ కేసులేవీ కోర్టుల్లో నిలబడవు. అప్పుడు రిమాండ్‌కు పంపిన వ్యక్తికి పరిహారం కూడా ప్రభుత్వాలు చెల్లించాలి. ఇటీవల భావ ప్రకటన స్వేచ్ఛను హరించేలా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి. దీనిని పౌరసంఘాలు ఖండించాలి. భావ ప్రకటన స్వేచ్ఛకు మద్దతుగా నిలవాలి.

పౌర సంఘాలు ప్రశ్నించాలి..

ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లితే ప్రశ్నించడం పౌరహక్కుల నేతల బాధ్యత. కాబట్టే ప్రజాస్వామ్యానికి భంగం వాటిల్లితే కచ్చితంగా ప్రశ్నిస్తా. ప్రశ్నించకూడదు అంటే ఎలా? ఈవీఎంలపై అనుమానాలు మాకు ఉన్నాయి. ప్రజలకు ఉన్నాయి. ఈవీఎంలో పోలైన ఓట్లకు, వీవీ ప్యాట్లకు తేడాలు ఉన్నాయి. వీటిని ప్రశ్నిస్తే నివృత్తి చేసి వ్యవస్థపై నమ్మకం పెంచేలా ప్రభుత్వాలు, ఎన్నికల కమిషన్ బాధ్యతలు తీసుకోవాలి. కానీ.. ఆ పని చేయలేదు. దీంతో అనుమానాలు పెరుగుతాయి. వ్యవస్థలపై నమ్మకం పోతుంది. ఎన్నికల కమిషన్ నిష్పాక్షికంగా వ్యవహరించలేదనే అనుమానాలు ప్రజల్లో ఉంటాయి. ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. ఇలాంటి అంశాలలో పౌరసంఘాలు ప్రశ్నించాలి.

రాజకీయ కారణాలతో

కేసులు సరికాదు

మీడియా స్వేచ్ఛను హరించకూడదు: మాజీ ఎమ్మెల్సీ ప్రొ. కె.నాగేశ్వర్



సాక్షి, హైదరాబాద్: రాజకీయపరమైన కారణాలతో మీడియా ప్రతినిధులపై కేసులు పెట్టడం సమర్థనీయం కాదని ఆర్థిక, రాజకీయరంగ నిపుణుడు, మాజీ ఎమ్మెల్సీ ప్రొ. కె.నాగేశ్వర్ అన్నారు. భావప్రకటనా స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిన హక్కు అని, దానిని అందరూ గౌరవించాలని సూచించారు. విజయవాడలో ఏపీ పోలీసులు 'సాక్షి' దినపత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి నివాసానికి సెర్చ్‌వారెంట్ లేకుండానే వెళ్లి సోదాలు జరపడంపై నాగేశ్వర్ స్పందించారు. ప్రభుత్వంలో ఎవరున్నా మీడియా కవరేజీ విషయంలో ఏమైనా భిన్నాభిప్రాయాలుంటే దాని గురించి చెప్పాలే తప్ప, కేసులు పెట్టడం సరికాదన్నారు. కేసులు పెట్టి మీడియా స్వేచ్ఛను హరించకూడదని, వార్తలపై ఏమైనా అభ్యంతరాలుంటే రీజాయిండర్ లేదా వివరణ కోరవచ్చునని అన్నారు. ప్రజాస్వామ్యానికి మూలం విమర్శ కాబట్టి దానిని సరైన పద్ధతిలో అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఏదైనా నేరం చేస్తే కేసులు పెట్టడం వేరని, కానీ కేవలం రాజకీయ కారణాలతో మీడియా ప్రతినిధులపై కేసులు పెట్టడం సరికాదని సూచించారు.

సాక్షి ఎడిటర్‌కు వేధింపులు అన్యాయం

సీనియర్ సంపాదకుడు కె.శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: 'సాక్షి'దినపత్రిక సంపాదకుడు ధనంజయరెడ్డిపై వేధింపులు అన్యాయమని సీనియర్ సంపాదకుడు కె.శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. విజయవాడలోని ధనంజయరెడ్డి నివాసంలో పోలీసులు సోదాలు నిర్వహించిన నేపథ్యంలో.. కె.శ్రీనివాస్ పై విధంగా స్పందించారు. ఒక పత్రికా సంపాదకుడిని లక్ష్యంగా చేసుకోవడం సరైంది కాదని స్పష్టం చేశారు.

నోటీసుల్లేకుండా

సాక్షి ఎడిటర్ ఇంట్లో సోదాలా?

తెలంగాణ స్టేట్ ఫొటో జర్నలిస్టుల అసోసియేషన్ ఖండన

సాక్షి, హైదరాబాద్: విజయవాడలోని 'సాక్షి' దినపత్రిక సంపాదకుడు ఆర్, ధనంజయరెడ్డి నివాసంలో.. ఆంధ్రప్రదేశ్ పోలీసులు ఎలాంటి ముందస్తు నోటీసులు లేకుండా సోదాలు చేయడాన్ని తెలంగాణ స్టేట్ ఫొటో జర్నలిస్టుల అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.గంగాధర్, ప్రధాన కార్యదర్శి హరి ఒక ప్రకటనలో పోలీసుల తీరును గర్హించారు. ఏదో కేసు పేరుతో.. నేరుగా సంపాదకుడి నివాసంలోకి ముందస్తు సమాచారం లేకుండా ప్రవేశించి సోదాలు జరపడాన్ని వారు తప్పుబట్టారు. ఇది పత్రికా స్వేచ్ఛను హరించడమేనని స్పష్టం చేశారు. పత్రికల్లో ఏవైనా ప్రభుత్వ వ్యతిరేక వార్తలు వస్తే ఖండించవచ్చని.. అలా కాకుండా భయభ్రాంతుల్ని చేసేలా మూకుమ్మడిగా పోలీసులు ఇంట్లో సోదాలు చేయడమేమిటని వారు ప్రశ్నించారు. ఇలాంటి చర్యలను మానుకోవాలని కోరారు. రాజకీయ ప్రేరేపిత చర్యలతో పోలీసులు ఇలా చేయడం పద్ధతి కాదని హితవు పలికారు. పత్రికా స్వేచ్ఛను కాపాడాలని వారు డిమాండ్ చేశారు.

శంషాబాద్ విమానాశ్రయానికి

బాంబు బెదిరింపు మెయిల్



శంషాబాద్ ఎయిర్‌పోర్టులో బాంబుస్క్వాడ్ సిబ్బంది తనిఖీలు

శంషాబాద్: ఓవైపు హైఅలర్ట్ కొనసాగుతున్న పరిస్థితుల్లో శంషాబాద్ విమానాశ్రయాన్ని బాంబుతో పేల్చేస్తామంటూ వచ్చిన ఈ–మెయిల్ ఎయిర్‌పోర్టులో కలకలం రేపింది. శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో ఆర్‌జీఐఏ కస్టమర్ సపోర్ట్ విభాగానికి ఓ మెయిల్ వచ్చింది. అందులో విమానాశ్రయాన్ని ఏ సమయంలోనైనా పేల్చేస్తామంటూ పేర్కొన్నారు. దీంతో అప్రమత్తమైన ఎయిర్‌పోర్టు అధికారులు భద్రతాధికారులను అలర్ట్ చేయడంతో పాటు వెంటనే ఔట్‌పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బెదిరింపు ఈ–మెయిల్ కారణంగా ఎయిర్‌పోర్టులోని డిపార్చర్ ప్రయాణికులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. బాంబుస్క్వాడ్ బృందం కూడా రంగంలోకి దిగింది. విస్తృత తనిఖీల తర్వాత ఎలాంటి ప్రమాదకరమైన వస్తువులు లేవని నిర్ధారించుకున్నారు. అయితే ఆ మెయిల్ ఎక్కడి నుంచి వచ్చింది..? వారి ఉద్దేశం ఏమై ఉంటుందనే దానిపై ఆర్‌జీఐఏ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మిస్ వరల్డ్ పోటీలను

వాయిదా వేయాలి

యుద్ధ వాతావరణంలో అందాల పోటీలు తప్పుడు సంకేతం

ఎమ్మెల్సీ కవిత.. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ర్యాలీ



ర్యాలీలో నినాదాలు చేస్తున్న ఎమ్మెల్సీ కవిత తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ పోటీలను వాయిదా వేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. దేశంలో యుద్ధ వాతావరణం నెలకొన్న ఈ సమయంలో అందాల పోటీలు నిర్వహించడం సరికాదని, ఐపీఎల్‌ను వాయిదా వేసినట్లుగానే మిస్ వరల్డ్ పోటీలను కూడా వాయిదా వేయాలని కోరారు. ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా, భారత సైన్యానికి సంఘీభావంగా శుక్రవారం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఇందిరా పార్కు నుంచి ఆర్టీసీ క్రాస్‌రోడ్డు వరకు జరిగిన ర్యాలీకి కవిత నాయకత్వం వహించారు. సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తున్న క్రమంలో పాకిస్తాన్ చేసిన దాడుల్లో వీరమరణం పొందిన సైనికుడు మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా పాక్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలను భారత సైన్యం ధ్వంసం చేసిందని కవిత ప్రశంసించారు. పాకిస్తాన్ మన దేశంలోని ఎయిర్‌పోర్టులను టార్గెట్ చేసుకొని చేసిన దాడులను భారత సైన్యం గట్టిగా తిప్పికొట్టిందని, ఈ నేపథ్యంలో అన్ని జిల్లాల్లో ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సీఎంకు రాష్ట్ర ఆదాయాన్ని పెంచడం రాకపోతే పదవి నుంచి తప్పుకోవాలన్నారు. పరిపాలన చేతకాని సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

'మిస్ వరల్డ్ అందాల పోటీలను రద్దు చేయాలి'

సాక్షి, హైదరాబాద్: మిస్ వరల్డ్ అందాల పోటీలను రద్దు చేయాలని ఏఐఎంఎస్ఎస్, ఏఐడీఎస్‌వో, ఏఐడీవైవో సంఘాలు డిమాండ్ చేశాయి. మహిళల ఆత్మగౌరవం, వ్యక్తిత్వాన్ని కించపరిచే, మహిళలను మార్కెట్‌లో ఒక వస్తువుగా దిగజార్చే అందాల పోటీలను వెంటనే ఆపాలని ఒక ప్రకటనలో కోరారు. ఈ మేరకు శుక్రవారం ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డికి ఈ మూడు సంఘాల నేతలు హేమలత, జ్యోతి, నితీశ్, నాగరాజు, తేజ, దేవరాజులు వినతిపత్రం అందించారు.

క్లుప్తంగా...

జాతీయ రక్షణ నిధికి

సీఎం విరాళం

నెల జీతం ఇస్తున్నట్లు రేవంత్ ప్రకటన



సాక్షి, హైదరాబాద్: ఉగ్రవాద నిర్మూలనకు ధైర్యంగా పోరాడుతున్న సాయుధ దళాలకు అండగా నిలిచేందుకు.. ఒక నెల వేతనాన్ని విరాళంగా జాతీయ రక్షణ నిధికి ఇస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దేశ రక్షణ కోసం ప్రాణాలకు తెగించి పోరాడుతున్న సైనికులకు చేయూతగా నిలిచే ఉద్యమంలో.. పార్టీ సహచరులు, సన్నిహితులు, పౌరులందరూ చేరాలని ఆయన విజ్ఞప్తి చేశారు. 'భారత్ విజయతీరాన్ని చేరేంతవరకు అందరం ఐక్యంగా సైన్యానికి అండగా నిలవాలని కోరుతున్నా'.. అని ఎక్స్ వేదికగా ఆయన ట్వీట్ చేశారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సైతం.. జాతీయ రక్షణ నిధికి ఇప్పటికే రాష్ట్రంలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నెల వేతనాన్ని విరాళంగా ఇవ్వనున్నట్టు ప్రకటించారు. తాము కూడా అదే బాటలో వెళ్తామని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రంలోని లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు కూడా ముందుకు రావాలని ఎక్స్ వేదికగా ఆయన కోరారు. ఒక రోజు వేతనాన్ని సైన్యానికి విరాళంగా ఇవ్వాలని డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ తీర్మానించింది.

నాలుగు యుద్ధాల్లో మూడు కాంగ్రెస్ హయాంలోవే..

ఎంపీ చామల



సాక్షి, హైదరాబాద్: పాకిస్తాన్‌తో జరిగిన నాలుగు యుద్ధాల్లో మూడుసార్లు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే జరిగాయని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. 1947లో జవహర్‌లాల్ నెహ్రూ, 1965లో లాల్‌బహదూర్ శాస్త్రి, 1971లో ఇందిరాగాంధీ హయాంలో మూడుసార్లు యుద్ధం జరిగిందని, 1999లో వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు జరిగిన కార్గిల్ యుద్ధానికి కూడా మద్దతిచ్చామని వెల్లడించారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇప్పుడు జరుగుతున్న ఆపరేషన్ సిందూర్‌కు కూడా కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతిస్తోందని అన్నారు.

బాంబులు పెట్టాం.. ఖాళీ చేయండి

ట్రైడెంట్ హోటల్ జీఎంకు బెదిరింపు మెయిల్

సాక్షి, హైదరాబాద్: మిస్ వరల్డ్ పోటీల కోసం వివిధ దేశాల నుంచి వచ్చిన అతిథుల్లో.. కొందరు బస చేసిన ట్రైడెంట్ హోటల్‌కు బెదిరింపు ఈ–మెయిల్ వచ్చింది. గురువారం తెల్లవారుజామున 12.54 గంటలకు ఆ హోటల్ జనరల్ మేనేజర్ అధికారిక మెయిల్ ఐడీకి ఈ–మెయిల్ అందింది. ఈ మేరకు ట్రైడెంట్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీఎస్‌వో), రిటైర్డ్ లెఫ్టినెంట్ కల్నల్ జాకబ్ ఫిలిప్.. శుక్రవారం సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న అధికారులు ఇంటర్‌నెట్ ప్రొటోకాల్ (ఐపీ) చిరునామా ఆధారంగా ముందుకు వెళ్తున్నారు. 'పహెల్గాం ఫస్ట్.. ట్రైడెంట్ నెక్స్ట్. భారతదేశానికి హైదరాబాద్ నగరం అత్యంత కీలకం. అత్యంత శక్తిమంతమైన బాంబుల్ని (హై ఇంటెన్సిటీ ఎక్స్‌ప్లోజివ్ డివైజెస్) హోటల్‌లో పెట్టాం. మధ్యాహ్నం ఒంటి గంటకల్లా హోటల్‌ను ఖాళీ చేయండి'.. అని ఆ మెయిల్‌లో ఉంది. ఈ–మెయిల్ ఐడీతో పాటు అందులోని మరికొన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న దర్యాప్తు అధికారులు.. ఇది తమిళనాడుకు చెందిన వ్యక్తి చేసిన పనిగా అనుమానిస్తున్నారు.

అమరుడా.. నీకు వందనం..

భారత్-పాక్ యుద్ధంలో జవాన్ మురళి నాయక్ వీర మరణం

జమ్మూ కశ్మీర్‌లో విధి నిర్వహణలో ప్రాణాలొదిలిన యువ తేజం

- స్వస్థలం సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లి తండా




కన్నీరు మున్నీరవుతున్న వీర జవాన్ మురళి నాయక్ కుటుంబ సభ్యులు. ఇన్‌సెట్‌లో మురళి నాయక్ (ఫైల్)

సాక్షి, న్యూఢిల్లీ/గోరంట్ల/కర్నూలు(సెంట్రల్)/సాక్షి, అమరావతి: భారత్ – పాకిస్తాన్ మధ్య జరుగుతున్న యుద్ధంలో తెలుగు జవాన్ మురళి నాయక్ (22) వీర మరణం పొందాడు. దేశ రక్షణకు సేవలందించే క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున రెండున్నర గంటల ప్రాంతంలో దయాది బుల్లెట్‌కు బలయ్యాడు. ఆంధ్రప్రదేశ్‌లోని సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గంలోని గోరంట్ల మండలం కల్లి తండాకు చెందిన మురళి 'ఆపరేషన్ సిందూర్'సందర్భంగా ఉద్రిక్తత నియంత్రణ రేఖ (జమ్మూ కాశ్మీర్) వద్ద పని చేస్తున్నాడు. ఈ క్రమంలో జరిగిన కాల్పుల్లో తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన చికిత్స నిమిత్తం విమానంలో ఢిల్లీకి తీసుకెళ్తుండగా మార్గం మధ్యలోనే తనువు చాలించాడు. దేశ భద్రతలో తన ప్రాణాలను పణంగా పెట్టిన మురళి నాయక్ త్యాగం మన దేశం ఎప్పటికీ మరువలేనిదని కేంద్ర, రాష్ట్ర ప్రముఖులు నివాళులర్పించారు. యావత్ భారత ప్రజానీకం ఈ వీర జవాన్‌కు సెల్యూట్ కొడుతోంది. ఈ మేరకు సోషల్ మీడియాలో నెటిజన్లు పోస్టులు పెడుతున్నారు.

ఏకైక సంతానం.. దేశ సేవకు అంకితం

జ్యోతిబాయి, శ్రీరాంనాయక్ దంపతులకు మురళి నాయక్ ఏకైక సంతానం. వీరిది నిరుపేద కుటుంబం. శ్రీరాం నాయక్ దంపతులు 30 ఏళ్ల క్రితం జీవనోపాధి కోసం ముంబై వెళ్లారు. ఇద్దరూ అక్కడ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. తల్లిదండ్రులు ముంబైలో ఉండటంతో మురళి నాయక్ సోమందేపల్లి మండలం నాగినాయిన చెరువు తండాలో అమ్మమ్మ శాంతి బాయి వద్ద ఉంటూ సోమందేపల్లిలోని విజ్ఞాన్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో పదో తరగతి, ఇంటర్మీడియట్ అనంతపురంలోని సాయి జూనియర్ కళాశాలలో పూర్తి చేశాడు. అనంతపురంలోనే డిగ్రీ చదువుతూ 2022 నవంబర్‌లో భారత సైన్యంలో చేరాడు. మహారాష్ట్రలో శిక్షణ పొందాక అస్సాం బార్డర్‌లో కొంతకాలం పనిచేశాడు. తర్వాత జమ్మూ కశ్మీర్‌కు బదిలీ అయ్యాడు. ఒక్కగానొక్క కుమారుడు కావడంతో మిలటరీలో చేరొద్దని తాము ప్రాధేయపడినా, దేశ సేవ చేయాలన్న తలంపుతో ముందుకు సాగాడని తల్లిదండ్రులు తెలిపారు. మురళి నాయక్ ఇక లేడన్న సమాచారాన్ని భారత సైనికాధికారులు శుక్రవారం ఉదయం 9 గంటలకు తండ్రి శ్రీరాం నాయక్‌కు తెలియజేశారు. భౌతికకాయాన్ని శనివారం సాయంత్రం స్వగ్రామానికి తీసుకురానున్నట్లు సమాచారమిచ్చారు.

మిలటరీ దుస్తుల్లో చనిపోవాలనేవాడు..

మురళి నాయక్ చిట్టచివరిగా తల్లిదండ్రులకు గురువారం ఉదయం తొమ్మిది గంటలకు ఫోన్ చేసి మాట్లాడాడు. పాకిస్తాన్‌తో యుద్ధం నేపథ్యంలో బుధవారం రాత్రి నైట్ డ్యూటీ చేశానని, నిద్ర వస్తోందని చెప్పాడు. దీంతో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని మురళికి సూచించారు. అంతలోనే ఇలా ఘోరం జరిగిందంటూ వారు కన్నీటి పర్యంతమయ్యారు. దేశానికి సేవ చేయాలన్న సంకల్పం మురళి నాయక్‌కు చిన్నప్పటి నుంచే బలంగా ఉండేది. ఒక్క రోజైనా భారత సైన్యంలో పనిచేసి.. మిలటరీ దుస్తులతో చనిపోవాలన్నదే తన లక్ష్యమని చెబుతుండేవాడని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపారు.

మురళీనాయక్ త్యాగం మరువలేనిది

కిషన్‌రెడ్డి, బండి, రేవంత్, వైఎస్ జగన్ నివాళి

సాక్షి, హైదరాబాద్: పాకిస్తాన్‌తో జరుగుతున్న పోరాటంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జవాన్ ముదావత్ మురళీ నాయక్ మృతి చెందడంపై కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్ వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు. ఈ సంఘటనపై కిషన్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మురళీ నాయక్ వీరమరణాన్ని దేశం గుర్తు ఉంచుకుంటుందని బండి సంజయ్ పేర్కొన్నారు. మురళీ నాయక్ తండ్రి శ్రీరామ్ నాయక్‌తో సంజయ్ ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మురళీ నాయక్ వీరమరణం దిగ్భ్రాంతిని కలిగించిందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు. అమరజవాన్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్టు ఎక్స్ వేదికగా రేవంత్ ట్వీట్ చేశారు. యుద్ధ భూమిలో వీర మరణం పొందిన జవాన్ మురళీ నాయక్ త్యాగాన్ని ఎప్పటికీ మరువలేమని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. జమ్మూ కశ్మీర్‌లో తెలుగు జవాన్ వీర మరణం చెందడం పట్ల ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఢిల్లీలో తెలంగాణ, ఏపీ కంట్రోల్ రూమ్‌లు

సాక్షి, న్యూఢిల్లీ: భారత్-పాకిస్తాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తత నేపథ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. ఢిల్లీ, ఉత్తరాది రాష్ట్రాల్లో ఉన్న రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు ఢిల్లీలోని అధికారిక భవన్‌లో శుక్రవారం కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశాయి. ఉత్తరాది రాష్ట్రాల్లో నివసిస్తున్న, చిక్కుకున్న వారి కోసం మెరుగైన సమాచారం అందిస్తూ ఎప్పటికప్పుడు వారిని సురక్షితంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రెండు ప్రభుత్వాల ఢిల్లీ రెసిడెంట్ కమిషనర్లు తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్‌లో ఉన్న అధికారులు, సిబ్బంది 24 గంటలూ సమాచారం అందిస్తారన్నారు. తెలంగాణ వారు ల్యాండ్‌లైన్ 011–23380556 వందన, రెసిడెంట్ కమిషనర్ ప్రైవేటు సెక్రటరీ–9871999044, హైదర్‌అలీ నఖ్వీ, రెసిడెంట్ కమిషనర్ వ్యక్తిగత సహాయకుడు – 9971387500, జి.రక్షిత్‌నాయక్, లైజన్ ఆఫీసర్ – 9643723157, సి.హెచ్.చక్రవర్తి, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ – 9949351270 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. అలాగే, ఏపీ వారు 011–23387089, 9871999430, 9871999053 రామారావు, డిప్యూటీ కమిషనర్–9871990081, వి.సురేశ్ బాబు, లైజనింగ్ ఆఫీసర్–9818395787.. ఈ నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

యాక్షన్ ప్లాన్‌తో రెడీగా ఉండాలి

పోలీసు అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి సూచన

- పరిస్థితిని బట్టి మాక్ డ్రిల్ చేపట్టాలి
- హైదరాబాద్‌లో సైరన్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి
- జాతీయ వాదాన్ని పెంపొందించేందుకు ర్యాలీలు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. చిత్రంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు

సాక్షి, హైదరాబాద్: దేశ సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం నేపథ్యంలో ఉత్పన్నమయ్యే పరిస్థితులను ఎదుర్కొనేందుకు పోలీస్ అధికారులు సమగ్రమైన యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. 'పరిస్థితిని బట్టి 24 గంటల ముందే ప్రజలను అప్రమత్తం చేసి మాక్ డ్రిల్, ట్రయల్ వంటివి నిర్వహించాలి. హైదరాబాద్‌లో సైరన్ అలర్ట్ వ్యవస్థ ఏర్పాటు చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలి. అందుకు సంబంధించిన పరికరాలు ఎక్కడున్నా కొనుగోలు చేయాలి. ప్రజల్లో జాతీయ వాదాన్ని పెంపొందించడానికి వీలుగా అన్ని జిల్లా కేంద్రాల్లో అన్ని వర్గాల ప్రజలతో సంఘీభావ ర్యాలీలు నిర్వహించాలి..'అని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో గురువారం నిర్వహించిన సంఘీభావ ర్యాలీ సమాజానికి మంచి సంకేతాన్ని ఇచ్చిందని అన్నారు. శుక్రవారం సచివాలయంలో డిప్యూటీ సీఎం ఉన్నతస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్, డీజీపీ జితేందర్, ఇంటెలిజెన్స్ డీజీ శివధర్ రెడ్డి, హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్, సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, రాచకొండ సీపీ సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి పలు కీలక సూచనలు చేశారు.

సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం కట్టడి చేయాలి

'అత్యవసర విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సెలవులను రద్దుచేయాలి. వార్తా ప్రసారాల్లో తగు జాగ్రత్తల కోసం మీడియా అధిపతులతో సమావేశం నిర్వహించాలి. సున్నితమైన అంశాలపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం కాకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ కట్టడి చేయాలి. తప్పుడు ప్రచారం చేసే వారిపై పోలీసులు కఠినచర్యలు తీసుకోవాలి..'అని డిప్యూటీ సీఎం చెప్పారు. సీఎస్ రామకృష్ణారావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలో సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్ నిర్వహించినట్లు చెప్పారు. రక్షణ రంగానికి సంబంధించిన పరిశ్రమల వద్ద కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆసుపత్రి భవనాల శ్లాబులపై ఎరుపు రంగుతో ప్లస్ గుర్తును ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తూ అన్ని ఆసుపత్రులకు నోటీసులు జారీ చేశామని వివరించారు.

నిరంతర పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్: డీజీపీ

డీజీపీ జితేందర్ మాట్లాడుతూ.. రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్ల వద్ద భద్రత పెంచినట్లు చెప్పారు. రక్షణ రంగానికి చెందిన సంస్థల వద్ద 24 గంటల పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని, సీసీటీవీలతో మానిటరింగ్ చేస్తున్నామని తెలిపారు. ఎప్పటికప్పుడు పరిస్థితులను అంచనా వేసి పర్యవేక్షించడానికి హైదరాబాద్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఉక్రెయిన్‌లో యుద్ధం నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయడానికి ప్రత్యేకంగా యాప్ రూపొందించారని, అలాంటి యాప్ రాష్ట్రంలో తీసుకురావడంపై ఆలోచన చేస్తున్నట్లు డీజీపీ తెలిపారు.

రెండ్రోజులు తేలికపాటి వానలు

- ఒకటి, రెండు చోట్ల మోస్తరు వర్షాలు
- రానున్న 3 రోజులు సాధారణం కంటే తక్కువగా ఉష్ణోగ్రతలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రానున్న రెండు రోజులు పలుచోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. దక్షిణ తెలంగాణ ప్రాంతం నుంచి రాయలసీమ, తమిళనాడు మీదుగా గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. ఇది సముద్రమట్టం నుంచి సగటున 0.9 కిలోమీటర్ల ఎత్తువరకు ఉంది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని దక్షిణ ప్రాంత జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు, ఒకట్రెండు చోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. శుక్రవారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే.. ఆదిలాబాద్‌లో 40.3 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత, మెదక్‌లో 22.8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగానే నమోదయ్యాయి. హనుమకొండలో గరిష్ట ఉష్ణోగ్రత సాధారణం కంటే 4.1 డిగ్రీల సెల్సియస్ తక్కువగా నమోదైంది. అలాగే భద్రాచలంలో 3.8 డిగ్రీల సెల్సియస్ తక్కువగా నమోదు కాగా.. మిగిలిన ప్రాంతాల్లో 1 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ తక్కువగా నమోదైంది. కనిష్ట ఉష్ణోగ్రత చాలాచోట్ల సాధారణం కంటే తక్కువగా ఉంది. రానున్న 3 రోజులు గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదవుతాయని వాతావరణ శాఖ వివరించింది.

శుక్రవారం రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
ఆదిలాబాద్	40.3	25.7
నిజామాబాద్	40.2	26.3
నల్లగొండ	39.5	24.4
ఖమ్మం	39.4	25.0
రామగుండం	39.4	23.3
మెదక్	39.4	22.8
మహబూబ్‌నగర్	38.6	25.6
హైదరాబాద్	38.2	24.2
హకీంపేట్	38.0	25.0
దుండిగల్	38.0	24.1
హనుమకొండ	37.0	23.0
భద్రాచలం	36.6	24.0

పిడుగుపాటుతో రైతు మృతి


రాజారావు (ఫైల్)

అశ్వారావుపేట రూరల్: పిడుగుపాటుతో ఓ రైతు అక్కడికక్కడే మృతిచెందగా, ఇద్దరు చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లికి చెందిన సాధనం రాజారావు (42) శుక్రవారం సాయంత్రం తన బంధువుల పిల్లలతో కూరగాయల తోటకు వెళ్లాడు. కూరగాయలు కోస్తుండగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో పిల్లలు సాయిల తేజ, బాలుతో పాటు రాజారావు సమీపంలోని వేప చెట్టు కిందకు వెళ్లాడు. అదే సమయంలో పిడుగు పడటంతో రాజారావు మృతిచెందగా, కొంచెం దూరంలో ఉన్న తేజ, బాలు అస్వస్థతకు గురయ్యారు. కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడైన మృతుడు రాజారావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మృతుని కుటుంబాన్ని పరామర్శించారు.

బస్సు దిగి.. బెంచీపై కూర్చుని

- వడదెబ్బతో వృద్ధుడి మృతి
- చికిత్స పొందుతూ మరో మహిళ..


బెంచీపైనే మృతి చెందిన మల్లయ్య

కోటపల్లి: మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలానికి చెందిన ఇద్దరు వడదెబ్బతో మృతి చెందారు. సుపాక గ్రామానికి చెందిన నల్లగుంట మల్లయ్య (77) బ్యాంకు, ఎంపీడీవో కార్యాలయంలో పనుల నిమిత్తం శుక్రవారం బస్సులో వచ్చాడు. ఎంపీడీవో కార్యాలయం ముందు బస్సు దిగగానే.. ముందు ఉన్న బెంచీపై కూర్చుని హఠాత్తుగా మరణించాడు. పోలీసులు మృతదేహాన్ని చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గుండెజబ్బు లేదా వడదెబ్బతో మరణించి ఉండవచ్చని మల్లయ్య కుమారుడు శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజేందర్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన కార్డాటకం లక్ష్మమ్మ (55) మహిళా సమాఖ్య కార్యాలయంలో తాత్కాలిక ఉద్యోగిగా పని చేస్తోంది. ఇటీవల అస్వస్థతకు గురి కాగా కుటుంబ సభ్యులు ఆమెను కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం చనిపోయింది.

సీఐసీగా చంద్రశేఖర్‌రెడ్డి ప్రమాణం

ప్రమాణస్వీకారం చేయించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ


చంద్రశేఖర్‌రెడ్డిని అభినందిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్‌గా డాక్టర్ జి.చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం ప్రమాణం చేశారు. మధ్యాహ్నం రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.విజయసేన్‌రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ జితేందర్, రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణీ కుముదిని, విజిలెన్స్ కమిషనర్ ఎంజీ గోపాల్, సీఎంవో అధికారులు శేషాద్రి, శ్రీనివాస రాజు, మాణిక్ రాజ్, శ్రీనివాసులు, రాజ్ భవన్ కార్యదర్శి దానకిషోర్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, సీనియర్ ఐఏఎస్ అధికారులు మహేశ్ దత్ ఎక్కా, రఘునందన్ రావు, బుద్ధ ప్రకాశ్, వినయ్ కృష్ణారెడ్డి, ఐపీఎస్ అధికారి మహేశ్ భగవత్ తదితరులు హాజరయ్యారు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం బోరేగావ్‌కు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి ఉస్మానియా వర్సిటీ నుంచి బీఎస్సీ డిగ్రీ పూర్తి చేశారు. ఢిల్లీలో జేఎన్‌టీయూ నుంచి లైఫ్ సైన్సెస్‌లో మాస్టర్స్ చదివారు. 1991లో ఇండియన్ ఫారెస్టు సర్వీస్‌లో చేశారు. ఆయన పలు ప్రభుత్వ సర్వీసుల్లో సుదీర్ఘ కాలం విధులు నిర్వహించారు. సీఎం కార్యాలయంలో ముఖ్య కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఐఎఫ్ఎస్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డిని సీఐసీగా నియమిస్తూ నాలుగు రోజుల క్రితం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. కాగా, కమిషనర్లుగా బోరెడ్డి అయోధ్యరెడ్డి, పీవీ శ్రీనివాసరావు, కప్పర హరిప్రసాద్, కేఎల్ఎన్ ప్రసాద్, రాములు, వైష్ణవి, పర్వీన్ మొహిసిన్‌లను ప్రభుత్వం ప్రతిపాదించగా, వివిధ ఆరోపణల కారణంగా ఈ అంశం గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉంది.

"ఆత్మదర్శనము కల్గినపుడే సర్వదుఃఖములకు హాని ఏర్పడును. బుద్ధి సుస్థిరత చెందును. మనస్సు నిర్మలత్వము పొందును.
– హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 10 మే 2025

సముచిత నిర్ణయాలు

స్వీయ లోటుపాట్లను సరిదిద్దుకోవటంలో న్యాయవ్యవస్థ సక్రమంగా వ్యవహరించటం లేదన్న విమర్శలు వస్తున్న నేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానం తీసుకున్న రెండు నిర్ణయాలు ఎన్నదగినవి. ఇప్పటికే 21 మంది న్యాయమూర్తులు తమ ఆస్తుల వివరాలను వెల్లడించగా, వాటిని సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. మొన్న మార్చి 4న ఢిల్లీలోని తన అధికార నివాసంలో భారీ యెత్తున కరెన్సీ నోట్ల కట్టలు బయటపడిన ఉదంతంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసనకు చర్యలు తీసుకోవాలంటూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకూ, ప్రధాని నరేంద్ర మోదీకీ లేఖ రాయటం కీలక పరిణామం. ఆ ఉదంతంపై విచారణకు నియమించిన ముగ్గురు సభ్యుల కమిటీ ఇచ్చిన నివేదికనూ, జస్టిస్ వర్మ ఇచ్చిన ప్రత్యుత్తరాన్ని కూడా దానికి జతపరిచారు.

అవినీతి మకిలి అంటిన న్యాయమూర్తుల్ని తొలగించటమనే ప్రక్రియ చాలా సుదీర్ఘమైనదీ, సంక్లిష్టమైనదీ. న్యాయమూర్తిపై ఆరోపణలొచ్చినప్పుడు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అంతర్గత విచారణ కమిటీని నియమించటం, అది ఇచ్చే నివేదికపై నిందపడిన న్యాయమూర్తి అభిప్రాయాన్ని కోరటం, ఆ తర్వాత అవసరమనుకుంటే రాజీనామా లేదా స్వచ్ఛంద పదవీ విరమణ చేయమని అడగటం రివాజుగా వస్తోంది. అందుకు నిరాకరిస్తే పార్లమెంటులో అభిశంసన తీర్మానం ద్వారా తొలగించమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సిఫార్సు చేస్తారు. ఈ తీర్మానం కోసం ఇచ్చే నోటీసుపై లోక్‌సభలో కనీసం 150 మంది ఎంపీలూ, రాజ్యసభలో కనీసం 50 మంది ఎంపీలూ సంతకాలు పెట్టాల్సివుంటుంది. ఆ తీర్మానాన్ని అనుమతించాలో లేదో స్పీకర్ లేదా రాజ్యసభ చైర్మన్ నిర్ణయిస్తారు. రాజ్యాంగంలోని 124, 218 అధికరణలు దుర్వర్తన లేదా అసమర్థత ఆరోపణల ఆధారంగా న్యాయమూర్తుల తొలగింపునకు అవకాశాన్నిస్తున్నాయి. అయితే ఇన్ని దశాబ్దాల్లో ఈ ప్రక్రియ కింద పదవిని కోల్పోయిన న్యాయమూర్తి ఒక్కరూ లేరంటే ఆశ్చర్యం కలుగుతుంది. అలాగని ఫిర్యాదుల సంఖ్య తక్కువేం లేదు. 2017–2021 మధ్య సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికీ, వివిధ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులకూ 1,631 ఫిర్యాదులు వచ్చాయని చెబుతున్నారు. అయితే అంతర్గత విచారణ ప్రక్రియ రహస్యమైనది కావటంవల్ల ఎంతమంది న్యాయమూర్తులపై విచారణ జరిగిందో, ఎందరిపై చర్యలు మొదలయ్యాయో తెలియదు.

తొలిసారి 1993లో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.రామస్వామిపై నిధుల దుర్వినియోగం విషయంలో వచ్చిన ఆరోపణల పర్యవసానంగా పార్లమెంటులో అభిశంసన ప్రక్రియ నడిచింది. అప్పట్లో ఆయనపై వచ్చిన 14 ఆరోపణల్లో పదకొండింటికి ఆధారాలున్నాయని తేల్చారు. తీరా పార్లమెంటులో అభిశంసన తీర్మానంపై జరిగిన వోటింగ్‌కు కాంగ్రెస్ గైర్హాజర్ కావటంతో అది వీగిపోయింది. 2009లో అప్పటి సిక్కిం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పీడీ దినకరన్‌పైనా ఆదాయానికి మించి ఆస్తులున్నాయన్న అభియోగం వచ్చింది. అభిశంసన ప్రక్రియ ప్రారంభం కాగానే ఆయన రాజీనామా చేయటంతో అది అర్ధాంతరంగా ముగిసింది. మద్రాస్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె. వీరాస్వామిపై అవినీతి కేసులో సీబీఐ చార్జిషీటు నమోదు చేసింది. కానీ విచారణ ముందుకు సాగకుండా ఆయన అన్నివిధాలా ప్రయత్నించారు. చివరకు 2010లో ఆయన మరణించారు. అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ విశ్వహిందూ పరిషత్ సభలో చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. సుప్రీంకోర్టు కొలీజియం బహిరంగ క్షమాపణ చెప్పాలని, వివరణనివ్వాలని కోరింది కూడా. కానీ ఇంతవరకూ అదేం జరగలేదు. అదే హైకోర్టుకు చెందిన జస్టిస్ ఎస్ఎన్ శుక్లా అవినీతిపై అంతర్గత కమిటీకి ఆధారాలు లభ్యమయ్యాయన్నారు. కేసుల విచారణ పని అప్పగించటం మానే శారు. కానీ ఆయన రిటైరయ్యేవరకూ న్యాయమూర్తిగా జీతభత్యాలు తీసుకుంటూనే వున్నారు. అందుకే అవినీతి ఆరోపణలున్న ప్రభుత్వోద్యోగులూ, రాజకీయ పక్షాల నేతల మాదిరి న్యాయమూ ర్తులపై విచారణ సాగటం లేదన్న విమర్శలుంటున్నాయి. జస్టిస్ వర్మ వ్యవహారశైలి మొదటినుంచీ అనుమానాలకు తావిచ్చేదిగావుంది. మార్చి 14–15 రాత్రి అగ్నిప్రమాదం జరిగినప్పుడు కొన్ని కరెన్సీ కట్టలు తగలబడినా, మిగిలినవి సురక్షితంగా వున్నాయని మొదటగా అక్కడికొచ్చిన అగ్ని మాపక సిబ్బంది, పోలీసులు చెప్పగా... అటుపై బాగున్న కట్టలు మాయమయ్యాయి. దీనిపై జస్టిస్ వర్మ వివరణ సంతృప్తికరంగా లేకపోవటంతో వ్యవహారం అభిశంసన వరకూ వెళ్లింది. ఇప్పటికే కేసుల విచారణనుంచి ఆయన్ను తప్పించారు.

నిజానికి జస్టిస్ వర్మ ఉదంతం ప్రభావంతోనే న్యాయవ్యవస్థపై నింద పడకూడదన్న ఉద్దేశంతో జస్టిస్ సంజీవ్ ఖన్నా న్యాయమూర్తుల ఆస్తుల ప్రకటన నిర్ణయం తీసుకున్నారు. మన దేశంలో న్యాయమూర్తులు ఆస్తులు ప్రకటిస్తున్నా ఎవరైనా సమాచార హక్కు చట్టంకింద కోరితే తప్ప వివరాలు బహిరంగపరిచే విధానం లేదు. బ్రిటన్, కెనడాల్లోనూ అంతే. అయితే అమెరికా, దక్షిణ కొరియా, అర్జెంటీనా, రష్యాల్లో చట్టప్రకారం న్యాయమూర్తుల ఆస్తుల వెల్లడి తప్పనిసరి. ఏదేమైనా జస్టిస్ సంజీవ్ ఖన్నా తాజా నిర్ణయం పారదర్శకత దిశగా ఒక కీలకమైన ముందడుగనే చెప్పాలి. అయితే నిందపడిన న్యాయమూర్తులను లోక్‌పాల్ చట్టం కింద విచారించవచ్చునా లేదా అన్నది ఇంకా తేలాల్సివుంది. మొత్తానికి స్వీయప్రక్షాళనకు న్యాయవ్యవస్థ నడుం బిగించటం ప్రశంసనీయమైన పరిణామం.

ఈ ఉద్రిక్తతలు తగ్గే మార్గం

విశ్లేషణ



తారా కార్థా

పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలపైనే కాకుండా, 1971 తర్వాత మొదటిసారిగా పాకిస్తాన్ పై, అది కూడా పంజాబ్ నడిబొడ్డున ఉన్న ఉగ్రవాద శిబిరాలపై భారతదేశం దాడులు ప్రారంభించడంతో ఇప్పుడు యుద్ధ ఢంకా గట్టిగా మోగుతోంది. ముఖ్యంగా పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసీమ్ మునీర్ ఒక సైనిక విన్యాస క్రమంలో యుద్ధట్యాంక్ పైకి ఎక్కి, తమపై ఏదైనా భారతీయ 'సైనిక దురదృష్టకర ఘటన' జరిగితే, 'తక్షణ స్పందన'తో దాన్ని ఎదుర్కొంటామని ప్రకటించారు. కానీ భారత్ ప్రతిదాడి చేశాక పాక్ ఆర్మీ చీఫ్ ప్రతిష్ఠ దెబ్బతింది.

అసీమ్ మునీర్ అన్నట్లుగా, భారత ప్రతి దాడి నిజంగా 'సైనిక దురదృష్టకర ఘటనా'? ఏ రకంగా చూసినా, అది నిజం కాదు. ఇది చాలా కచ్చితమైన ఉగ్రవాద నిరోధక దాడి. భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మాట్లాడుతూ, మన ప్రతిదాడి ఉద్రిక్తతలు పెంచేది కాదనీ, పాక్‌లోని ఏ సైనిక లక్ష్యాన్నీ 'ఆపరేషన్ సిందూర్' తాకలేదనీ తెలిపారు. సందేశం స్పష్టంగా ఉంది. పౌరులను, భారత సైన్యాన్ని తాకాలా వద్దా అనే విషయాన్ని పాకిస్తాన్ నిర్ణయించుకోవాల్సి ఉండింది. ఎందుకంటే, భారత్‌లో ఉగ్రవాద శిబిరాలు లేవు. అయినా సరే, పాక్ సైన్యం ఏకంగా భారతీయ నగరాలపై, జనావాసాలపై, విమానాశ్రయంపై నేరుగా దాడికి దిగింది. తర్వాత ఏం జరుగుతున్నదో మనం చూస్తున్నాం.

జనరల్ మునీర్ దూకుడు

పాక్ సైనిక దాడులకు ఒక రోజు ముందే భారత హోమ్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ దేశంలోని 244 జిల్లాల్లో పౌర రక్షణ కసరత్తులకు ఆదేశించింది. భారతదేశం పూర్తి యుద్ధానికి సిద్ధమవుతోందని ఇది సూచిస్తుంది. అయితే, ఇది నేషనల్ క్యాడెట్ కోర్ (ఎన్‌సీసీ) లేదా నేషనల్ సర్వీస్ స్కీమ్(ఎన్ఎస్ఎస్) వంటి స్వచ్ఛంద సంస్థలను మాత్రమే సమీకరించే రక్షణాత్మక చర్య. జాగ్రత్తగా చేపట్టిన ఈ ప్రయత్నాలన్నింటికీ భిన్నంగా, పాకిస్తాన్ చేపట్టిన సైనిక దాడి ఆ దేశానికి ఏ ప్రయోజనమూ కలిగించలేదు. జనరల్ మునీర్ దూకుడు మీద ఎటువంటి సందేహం లేదు. ఉద్దేశపూర్వకంగా మతతత్వ రంగు పులుముతూ, పహల్‌గామ్ ఉగ్రవాద దాడికి ముందు ఇస్లామాబాద్‌లో ఏప్రిల్ 18న జరిగిన ఒక కార్యక్రమంలో 'రెండు దేశాల సిద్ధాంతం'పై ఆయన చేసిన ఆవేశపూరిత ప్రసంగం భారతదేశాన్ని రెచ్చగొట్టింది. ఉగ్రదాడిపై గట్టి చర్యకు దిగాలనే దృఢ సంకల్పాన్ని భారత్‌కు కలిగించింది.

మునీర్ తీవ్ర ఒత్తిడిలో ఉన్నారని స్పష్టంగా తెలుస్తోంది. పాకిస్తాన్ లో ఉగ్రవాద కార్యకలాపాలు దాదాపు 66 శాతం పెరిగి, తొమ్మిదేళ్ల గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. ఎంతోమంది అనుచరులున్న మాజీ ప్రధాన మంత్రి ఇమ్రాన్ ఖాన్‌ను, ఆ పార్టీ నేతలను పాక్ సైనిక వ్యవస్థ జైలులో పెట్టించింది. మాజీ ఐఎస్ఐ చీఫ్, లెఫ్టినెంట్ జనరల్ ఫైజ్ హమీద్‌నూ, తన సొంత ప్రజలపై కాల్పులు జరపడానికి నిరాకరించిన మరో జనరల్‌తో సహా మరి కొందరు సీనియర్ అధికారులనూ జైల్లో పెట్టింది. మునీర్ తన ప్రతిష్ఠను తానే చెరుపుకున్నారు. ఇమ్రాన్ ఖాన్ ప్రధానిగా ఉన్నప్పుడు, ఐఎస్ఐ డీజీగా ఉన్న తనను అమర్యాదగా బయటకు నెట్టివేయడం తనకు జరిగిన ఘోరావమానంగా మునీర్ భావించారు. దాంతో సరైన అవకాశం కోసం చాలా కాలం వేచి ఉండి చివరకు కొరడాను ఉపయోగించారు.



బాలాకోట్ సర్జికల్ దాడులు జరిగినప్పుడు పాక్ స్పందన సంయమనంతో ఉండింది. అప్పుడు పాక్ ఆర్మీ చీఫ్‌గా ఉన్న జనరల్ బాజ్వా పూర్తి భిన్నమైన మనిషి. ఆయన ఇండియాతో వాణిజ్య సంబంధాలను కోరుకున్నారు. కానీ ఇప్పుడు భారత్– పాక్ ఘర్షణ భిన్న స్థాయికి చేరుకుంది.

పట్టించుకునే స్థితిలో లేని ప్రపంచం

విస్తృత ప్రాంతీయ సంఘర్షణను రెచ్చగొట్టవద్దని అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి. వాన్స్ భారతదేశానికి సలహా ఇచ్చారు. అలా రెచ్చగొట్టిన పక్షంలో చైనా జోక్యం చేసుకోవచ్చనే హెచ్చరిక దీంట్లో ఉండవచ్చు లేదా ఈ ప్రకటనకు పెద్దగా అర్థం ఏమీ ఉండకపోవచ్చు. కానీ, అగ్రశ్రేణి దేశాల నాయకత్వంలో ఉన్న గందరగోళం కనివిని ఎరుగనిది. తూర్పున, మాస్కో మరింత దారుణమైన ఇబ్బందుల్లో ఉంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత్‌కు మద్దతు ఇచ్చిన తర్వాత, తన వైఖరిని కాస్త సవరించి మధ్యవర్తిత్వం అందించడానికి ప్రయత్నించారు. ఇది ఢిల్లీకి ఏమాత్రం నచ్చదని క్రెమ్లిన్ కు తెలుసు. కానీ క్షిపణుల భారీ సమూహాన్ని మనకు రష్యా పంపడం ప్రోత్సాహకరంగా ఉంది. అయితే రష్యన్ సైనిక భుజం ఇప్పుడు అందుబాటులో లేదు. ఆర్థిక మాంద్యం, తీవ్రమైన అంతర్గత ఇబ్బందులతో పోరాడుతున్న యూరోపియన్ యూనియన్ సంయమనం వహించాలని ప్రకటించింది. ఇజ్రాయెల్, భారతదేశం పట్ల క్రియాశీలంగా, బలంగా సానుభూతి చూపుతున్నప్పటికీ, గాజాలో గందరగోళాన్ని చూస్తే ఇజ్రాయెల్ ఇక్కడ నిర్వహించే పాత్ర చాలా తక్కువేనని చెప్పాలి. మొత్తం మీద, ప్రపంచం ఈ యుద్ధాన్ని పట్టించుకునే స్థితిలో లేదు.

ఇప్పుడు ఇరు దేశాల సైనిక ఘర్షణను తగ్గించడానికి చైనా ప్రభుత్వం గనక పూనుకుంటే అదొక పరిహాసం అవుతుంది. పాకిస్తాన్‌లో చైనా ప్రాబల్యం నిస్సందేహంగా ఉందనేది జగమెరిగిన సత్యం. మరోవైపున చైనానే పాకిస్తాన్ యుద్ధానికి నిధులు సమకూర్చే అవకాశం ఉంది. దేశాలు చాలా అరుదుగా హేతుబద్ధంగా వ్యవహరిస్తాయి. అలా సమకూర్చిన నిధులు వేరే విధంగా మళ్లే అవకాశం ఉంది. ఇది ప్రమాదకరమని ఢిల్లీకి పూర్తిగా తెలుసు.

> ◆ బాలాకోట్ దాడులప్పుడు పాక్ స్పందన సంయమనంతో ఉండింది. అప్పటి ఆర్మీ చీఫ్ జనరల్ బాజ్వా ఇండియాతో వాణిజ్య సంబంధాలను కోరుకున్నారు. కానీ అసీమ్ మునీర్ దూకుడు మనిషి.
>
> ◆ ఇరు దేశాల సైనిక ఘర్షణను తగ్గించడానికి చైనా గనక పూనుకుంటే అదొక పరిహాసం అవుతుంది.
>
> ◆ ఉపఖండం నుండి ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి ఇరు దేశాలు ఉమ్మడి చొరవను ప్రకటించవచ్చు. పాకిస్తాన్ ప్రపంచంలోనే అత్యంత దారుణమైన ఉగ్రవాద ప్రేరేపక దేశం అనే ఆరోపణను పదే పదే ఎదుర్కొంటున్నందున ఇదేమీ అంత అసాధ్యమైనది కాదు.

ఇరు దేశాలు ఏం చేయొచ్చు?

అయితే, ఇప్పుడు కూడా ఆశ ఉంది. అంగీకరించని నిజం ఏమిటంటే– భారతదేశం, పాకిస్తాన్ తమ సైనిక చర్యల విషయంలో అనేక పాశ్చాత్య దేశాల కంటే గతంలో చాలా పరిణతితో వ్యవహరించాయి. గత మూడు యుద్ధాలలోనూ ఏవీ పౌర లక్ష్యాలపై పెద్ద ఎత్తున బాంబు దాడి చేయలేదు. భారతదేశ క్షిపణి పాకిస్తాన్‌ను తాకినప్పుడు, సైన్యం ప్రతిస్పందన సాపేక్షంగా తేలికగా ఉంది. ప్రస్తుతానికి, రెండు వైపులా సైనిక కార్యకలాపాల డైరెక్టర్ జనరల్స్ మాట్లాడుతున్నారు. అది ఒక ఆశాజనకమైన సంకేతం. ఐఎస్ఐ డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ మహమ్మద్ అసీమ్ మాలిక్‌ను పాకిస్తాన్ జాతీయ భద్రతా సలహాదారుగా నియమించడం కూడా అంతే. రెండు దేశాల నిఘా సంస్థల అధిపతులు మాట్లాడుకోవాలని నిర్ణయించుకుంటే, అది పెద్ద విషయమే.

ఉపఖండం నుండి ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి రెండు దేశాలు ఉమ్మడి చొరవను ప్రకటించవచ్చు. పాకిస్తాన్ ప్రపంచంలోనే అత్యంత దారుణమైన ఉగ్రవాద ప్రేరేపక దేశం అనే ఆరోపణను పదే పదే ఎదుర్కొంటున్నందున ఇదేమీ అంత అసాధ్యమైనది కాదు. ఇరుదేశాల మధ్య వాణిజ్య బంధాలు ప్రస్తుత పరిస్థితుల్లో సాగేలా లేవు. కాబట్టి, పాత్రధారులు, సూత్రధారులతో సహా ఉగ్రవాదానికి సంబంధించిన ప్రతిదానినీ దెబ్బతీయడమే ఏకైక ఎంపిక. ఇది ప్రమాదకరం. మొత్తంగా చివరి పాఠం మాత్రం ఇదీ: మీ సొంత యుద్ధాలను మీరే చేసుకోవాలి. 'ఆపరేషన్ సిందూర్' ఇప్పుడే దాన్నే తెలియజెప్పింది.

వ్యాసకర్త డైరెక్టర్ (రిసెర్చ్), సెంటర్ ఫర్ ల్యాండ్ వార్‌ఫేర్ స్టడీస్ । ('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

శాంతి ముఖ్యం



ఉగ్రవాదం ఎవరినీ వదిలి పెట్టదు – ఏ చిన్నారినీ, ఏ మాతృమూర్తినీ, ఏ దేశాన్నీ. శాంతి నెల కొనాలంటే నాగరిక ప్రపంచంలో ఉగ్రవాదానికి చోటు ఉండకూడదు. ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలో ఉన్న మన భారత ప్రభుత్వం, సైనిక దళాల మీద నాకు గట్టి విశ్వాసం ఉంది. తక్షణం ఈ ఉద్రిక్తతలు తగ్గాలనీ, ప్రతి ఒక్కరూ సంయమనం, బాధ్యత, కరుణతో వ్యవహరించాలనీ కోరు తున్నాను.
– కైలాశ్ సత్యార్థి, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత

స్పష్టమైన ఆలోచన



పాకిస్తాన్, ఇండియా మధ్య జరుగుతున్నది ఇస్లాం కోసం జరుగుతున్న యుద్ధం కాదని ఇస్లామాబాద్‌లోని లాల్ మసీదు ఇమామ్ చెబుతున్నారు. మొత్తం పాకిస్తాన్ మిలిటరీ, రాజకీయ నాయకత్వాల ఉమ్మడి జ్ఞానం కంటే కూడా ఈయన తర్కం, స్పష్టత ఉన్నత స్థాయిలో ఉన్నాయి.
– యూసుఫ్ ఎ అహ్మద్ అన్సారీ, ఇండో–ఇస్లామిక్ హిస్టారియన్

పోయేదేముంది?



శాంతిని కోరుకోవడం అనేది ఎల్లవేళలా బలహీనతకు సంకేతం కాదు. అది వివేకంతో చేయగలిగేది. ఒక పోకిరితో శ్రీమంతుడు వీధి కొట్లాటకు దిగడు. ఎందుకంటే శ్రీమంతుడికే పోయేది చాలా ఎక్కువ.
– చేతన్ భగత్, రచయిత

అంతిమ ఫలితం



రెండు దేశాల మధ్య యుద్ధం నిజానికెప్పుడూ యుద్ధక్షేత్రంలో ముగియదు. అది ఆసుపత్రుల్లో, అనాథాశ్రమాల్లో... బహుశా వాళ్లు కోరుకోని, అయినా సర్వం కోల్పోయే ఇరువైపుల అమ్మల నిశ్శబ్ద కన్నీళ్లలో ముగుస్తుంది.
– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

ఎప్పుడో జరగాల్సింది!



చాలా చాలా కాలం క్రితమే, పాకిస్తాన్‌ను ఉగ్రవాద ప్రాయోజిత దేశంగా నియుక్తం చేయవలసింది!
– మ్యాక్స్ అబ్రహామ్స్, ప్రొఫెసర్

సాంకేతిక విజ్ఞానంతో అద్భుతాలు

సందర్భం



డా॥ సి.వి. సర్వేశ్వర శర్మ

సాంకేతికత అంటే శాస్త్రీయ జ్ఞానాన్ని ఆచరణాత్మక ప్రయోజనలకోసం ఉపయోగించగలగటం. దీని ద్వారా మనం కొత్త సాధనాలు, పద్ధతులు, లేదా వస్తువులను రూపొందించవచ్చు. సాంకేతిక ఆవిష్కరణలలో గ్లోబల్ లీడర్‌గా దేశం ఆవిర్భవించడానికి భారతదేశం మే 11వ తేదీని 'జాతీయ సాంకేతిక దినోత్సవం'గా జరుపుకుంటోంది. 1998 మే 11న తొలి స్వదేశీయ విమానం 'హంసా–3'ని పరీక్షించారు. అదే రోజు 'త్రిశూల్' క్షిపణిని భారత్ విజయవంతంగా పరీక్షించింది. ఆ సమయంలోనే అణుశక్తి విషయంలో అణుక్లబ్‌లో ఆరవ దేశంగా ఆవిర్భవించింది భారత్. 1998లో రాజస్థాన్‌లో భారత్ నిర్వహించిన చారిత్రాత్మక పోఖ్రాన్ అణుపరీక్షల జ్ఞాపకార్థం మాజీ ప్రధాని వాజ్‌పేయ్ మే 11ను జాతీయ సాంకేతిక దినోత్సవంగా ప్రకటించారు. ఈ ఏడాది ఈ దినోత్సవ ఇతివృత్తం 'ఆవిష్కరణల ద్వారా సుస్థిర రేపటిని సాధికారపరచడం'.

ఐటీ, బయోటెక్నాలజీ, ఏరోస్పేస్, న్యూక్లియార్ సైన్స్, తయారీ టెక్నాలజీ, ఆటోమొబైల్ ఇంజినీరింగ్, కెమికల్ ఇంజినీరింగ్, స్పేస్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్, ఇంకా వైద్య శాస్త్ర సంబంధిత పరిశోధన – అభివృద్ధి వంటి వాటిల్లో భారత్ పురోగమిస్తోంది.

అంతరిక్ష పరిశోధనలలో భారత్ అగ్రస్థానంలో ఉన్న దేశాలలో ఒకటిగా ఉంది. నేడు టోకామాక్, న్యూట్రినో, గురుత్వ తరంగాలు, స్క్రామ్ జెట్‌లు, అంతరిక్షంలోకి మానవులను పంపి పరిశోధనలు చేయించడం వంటి ఆధునిక సాంకేతికతలలో భారత్ పురోగతి సాధిస్తోంది. 'డిజిటల్ ఇండియా' మిషన్ ద్వారా సాంకేతికతను మరింతగా ప్రోత్సహిస్తూ, దానిని ప్రజలకు అందుబాటులోకి తెస్తోంది.

మానవ చరిత్రలో సైనిక అవసరాలు, సవాళ్లను ఎదుర్కోనేందుకు అనేక సాంకేతిక పురోగతులు, ఇంజినీరింగ్ పద్ధతులు అభివృద్ధి అయ్యాయి. సైనిక ఇంజినీరింగ్‌లో యుద్ధం, రక్షణకు ఉపయోగించే నిర్మాణాలు, వ్యవస్థల రూప కల్పన – నిర్మాణం – నిర్వహణ ఉంటుంది. దీని తరువాత రోడ్లు, ఇళ్ళు, కోటలు, వంతెనలు, మొదలైన వాటి నిర్మాణానికి సంబంధించిన అవసరాలు, సమస్యలు ఉంటాయి. వీటిని పరిష్కరించడానికి సివిల్ ఇంజినీరింగ్ ఆవిర్భవించిది. పారిశ్రామిక విప్లవంతో మెకానికల్, ఎలక్ట్రికల్, కెమికల్ ఇంజినీరింగ్‌లతో బాటు ఇతర సాంకేతికలు వచ్చాయి. ప్రస్తుతం కంప్యూటర్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ప్రాచుర్యంలో ఉన్నాయి.

సాంకేతిక ప్రక్రియ ద్వారా మనం పనులను వేగవంతంగాను, సమర్థవంతంగాను చేయగల్గుతున్నాం. ఖర్చు బాగా తగ్గుతోంది. సమాజం అభివృద్ధి చెందుతోంది. దీని వల్ల కొత్త పరిశ్రమలు, కొత్తవ్యాపారాలు వస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధ పవనాలు వేగంగా వీస్తున్నాయి. మనిషి చేసే ప్రతి పని చక్కబెట్టేందుకు కంప్యూటర్లు సిద్ధమవుతున్నాయి. దీనివల్ల ఉద్యోగాల తీరు తెన్నులు, సమాజ గమనం, ప్రజల జీవన విధానాల్లో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి.

వ్యాసకర్త పాపులర్ సైన్స్ రచయిత
(మే 11న జాతీయ సాంకేతిక దినోత్సవం)

చట్టం పట్ల న్యాయమూర్తులకే శ్రద్ధ లేదా?!

అభిప్రాయం




ఎన్. వేణుగోపాల్

ఒక కీలకమైన కేసు సందర్భంగా ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేష్ సిన్హా, జస్టిస్ అరవింద్ కుమార్ వర్మల ద్విసభ్య ధర్మాసనం ఇటీవల (2025 మే 5న) చేసిన వ్యాఖ్యలు, ఇచ్చిన తీర్పు మన ఉన్నత న్యాయస్థానాల న్యాయమూర్తులకు కూడా చట్టబద్ధ పాలన పట్ల శ్రద్ధాసక్తులు లేవా అనే అనుమానాన్ని బలోపేతం చేస్తున్నాయి. ఈ కేసు 'మూలవాసి బచావో మంచ్' (ఎంబీఎం) అనే ఆదివాసీ సంస్థ మీద ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం విధించిన నిషేధపు నోటిఫికేషన్ చెల్లదని, దాన్ని కొట్టివేయాలనీ కోరుతూ దాఖలైన పిటిషన్‌కు సంబంధించినది.

'ఛత్తీస్‌గఢ్ విశేష్ జన సురక్షా అధినియమ్ – 2005' (ఛత్తీస్‌గఢ్ ప్రత్యేక ప్రజా భద్రతా చట్టం–2005) అనే చట్టం ప్రకారం అక్టోబర్ 30న ఆ నోటిఫికేషన్ విడుదలయింది. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు వ్యతిరేకంగా ఎంబీఎం నిరంతరంగా ప్రజలను రెచ్చగొడుతున్నదని, ప్రజలలో శాసనోల్లంఘనను ప్రోత్సహిస్తూ, సామాజిక శాంతిని భగ్నం చేస్తూ, రాజ్య భద్రతకు ప్రమాదంగా మారిందని, అందువల్ల నిషేధం విధిస్తున్నామని ఆ నోటిఫికేషన్‌లో ప్రభుత్వం చెప్పింది. ఆ చట్టం ప్రకారం ప్రభుత్వం ఏదైనా ఒక సంస్థను చట్టవ్యతిరేకమైనదిగా భావిస్తే, ఆ సంస్థపై నిషేధం విధించవచ్చు. ఈ 'భావిస్తే' అనే మాట చాలా అస్పష్టమైనదని, ఎవరి మీదనైనా చట్టాన్ని నిష్కారణంగా ప్రయోగించే అవకాశం ఉందని, అందువల్ల ఈ చట్టమే అన్యాయమైనదని, కొట్టివేయాలని సుప్రీంకోర్టులో వేసిన వ్యాజ్యం ఇరవై ఏళ్లు కావస్తున్నా విచారణకే రాలేదు!

ఆ చట్టంలోని సెక్షన్ 2 'చట్టవ్యతిరేక కార్యకలాపాలు' అనే మాటకు ఇచ్చిన నిర్వచనం ఎంత విశాలమైనదంటే అన్ని ప్రజాస్వామిక నిరసనలనూ ఆ మాట కింద చేర్చవచ్చు. సెక్షన్ 3 (2)లో నోటిఫికేషన్‌లో నిషేధానికి కారణాలు స్పష్టీకరించాలి అంటూనే, తర్వాత వాక్యంలో 'ఆ వాస్తవం బైట పెట్టడం ప్రజా ప్రయోజనాలకు వ్యతిరేకమని భావిస్తే, ప్రభుత్వం ఆ కారణాలను బైటపెట్టకుండా ఉండవచ్చు' అని రాశారు. అంటే ఏ కారణమూ చెప్పకుండానే ఒక సంస్థను 'చట్టవ్యతిరేకమైనద'ని ముద్ర వేసి నిషేధించే అధికారాన్ని ప్రభుత్వం తనకు తానే ఇచ్చుకుంది. ఈ నిరంకుశ, ప్రశ్నాతీత అధికారాన్ని తనకు తాను ఇచ్చుకున్న ప్రభుత్వ చర్యే నిజానికి చట్టవ్యతిరేకమైనది, న్యాయవ్యతిరేకమైనది. ఈ మితిమీరిన అధికారాన్ని కొట్టివేయవలసిన న్యాయస్థానాలు దాని వైపే చూడడం లేదు. ఈ చట్టం కింద వందలాది కేసులు పెట్టి, వేలాది మంది ఆదివాసులను సంవత్సరాల తరబడి జైళ్లలో మగ్గిపోయేలా చేస్తుంటే మన న్యాయవ్యవస్థకు చీమ కుట్టినట్టయినా లేదు.



> ◆ ఆ చట్టంలోని సెక్షన్ 2 'చట్టవ్యతిరేక కార్యకలాపాలు' అనే మాటకు ఇచ్చిన నిర్వచనం ఎంత విశాలమైనదంటే అన్ని ప్రజాస్వామిక నిరసనలనూ ఆ మాట కింద చేర్చవచ్చు.

అంతే కాదు, న్యాయస్థానాలలో ఇంకా విచిత్రాలున్నాయి. అనుచితంగా నిషేధపుటుత్తర్వులు జారీ చేస్తే అడ్డుకోవడానికి చట్టమే రెండు మూడు పరిమితులు విధించింది. ఆ పరిమితులను న్యాయబద్ధంగా అమలయ్యేలా చూడాలని కూడా న్యాయ స్థానాలు అనుకోవడం లేదు. నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి పదిహేను రోజుల్లోగా బాధిత సంస్థ తన అభ్యంతరాలు చెప్పుకోవచ్చునని, నోటిఫికేషన్ జారీ అయిన ఆరు వారాల లోగా ప్రభుత్వం హైకోర్టు న్యాయమూర్తుల స్థాయికి తగ్గని ముగ్గురితో సలహా మండలిని నియమించాలని, బాధిత సంస్థ అభ్యంతరాలను విచారించిన సలహా మండలి మూడు నెలల్లోగా నివేదిక ఇవ్వాలని, ఆ నివేదికను బట్టి నిషేధం అమలులోకి రావడం గాని, ఉపసంహరించడం గాని జరుగుతుందని సెక్షన్ 5, 6, 7 చెబుతాయి.

మూలవాసి బచావ్ మంచ్ విషయంలో ఈ చట్ట నిబంధనలన్నిటినీ తుంగలో తొక్కారు. అక్టోబర్ 30 నోటిఫికేషన్‌ను నవంబర్ 8న గెజిట్ విడుదల చేసి, నవంబర్ 18న బహిరంగంగా ప్రకటించారు. అంటే సాంకేతికంగా బాధిత సంస్థ అభ్యంతరాలు చెప్పే హక్కును కొల్లగొట్టారు. అయినా సరే ఎంబీఎం తన అభ్యంతరాలను నవంబర్‌లో ప్రభుత్వానికి అందజేసింది. తాము అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకుంటున్నామనేది అబద్ధమని, నిజానికి తాము ఆదివాసీ ప్రాంతాలలో విద్య, వైద్యం, తాగునీరు వంటి అభివృద్ధి సౌకర్యాలు కల్పించమని కోరుతున్నామని వాదించింది. తాము చట్టవ్యతిరేకంగా ప్రవర్తించడం లేదని, శాసనోల్లంఘనను ప్రోత్సహించడం లేదని, వాస్తవానికి రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్‌ను, 'పంచాయత్ ఎక్స్‌టెన్షన్ టు షెడ్యూల్డ్ ఏరియాస్ చట్టం – 1996'ను, 'అటవీ హక్కుల చట్టం–2006'ను ప్రభుత్వం ఉల్లంఘిస్తుండగా, వాటిని పాటించమని కోరుతున్నామని వాదించింది. సలహా మండలి మరిన్ని వివరాలు కావాలని తాత్సారం చేస్తూ, తనకు చట్టం ఇచ్చిన మూడు నెలల కాలం దాటి, మరొక మూడు నెలలు గడిచినా కిమ్మనకుండా ఉన్నది. ఈలోగా నిషేధం పేరిట ఎడాపెడా అరెస్టులు జరిగిపోతున్నాయి.

అసలు ఎంబీఎం స్థాపనే ప్రభుత్వ బలగాల చట్టవ్యతిరేక ఆక్రమణలకు వ్యతిరేకంగా ప్రజలు సాగించిన శాంతియుత నిరసనల క్రమంలో జరిగింది. 2021 మే 12 ఉదయానికల్లా 'సిల్గేర్' అనే గ్రామంలో రోడ్డు పక్కన ఉన్న పది ఎకరాల పంట భూమిని ఆక్రమించి సీఆర్‌పీఎఫ్ క్యాంపు నిర్మాణాలు చేశారు. తెల్లవారిన తరువాత వాటిని చూసి ఆ గ్రామస్థులు... ఐదవ షెడ్యూల్, పీసా, అటవీ హక్కుల చట్టాల ద్వారా తమ ప్రాంతంలో ప్రభుత్వమైనా సరే ఏ నిర్మాణం చేయాలన్నా గ్రామసభ ముందస్తు అనుమతి పొందాలి కదా, తమ భూమిని ఎలా ఆక్రమించారని క్యాంపు అధికారులను అడిగారు. పోలీసులు తమకు తెలిసిన ఏకైక భాషలో ఆదివాసుల మీద లాఠీచార్జీ జవాబు ఇచ్చారు. మూడు రోజుల తర్వాత పరిసర గ్రామాల ఆదివాసులందరూ దాదాపు ఇరవై వేల మంది ఆ క్యాంపు ముందు నిరసన ప్రదర్శనకు వచ్చారు. పోలీసులు వారి మీద కాల్పులు జరిపి అక్కడికక్కడే ముగ్గురు ఆదివాసులను చంపేశారు. కాల్పులకు బాధ్యుల మీద చర్య తీసుకునే వరకూ మృతదేహాలను అక్కడి నుంచి కదిలించబోమని ఆదివాసులు చేసిన ఆందోళన నుంచి మూలవాసి బచావో మంచ్ పుట్టింది. సల్వా జుడుమ్ కాలంలో పోలీసు క్యాంపుల్లో తమ కుటుంబాల మీద జరిగిన హత్యాకాండను, అత్యాచారాలను చూసిన బాల బాలికలు ఇప్పుడు యువతగా ఎదిగి, ఈ నిరాయుధ, శాంతియుత ఆందోళనా రూపాన్ని చేపట్టి ఎంబీఎంను స్థాపించారు.

ఆ సంస్థ సిల్గేర్ లో నాలుగు సంవత్సరాలుగా నిరసన శిబిరాన్ని నడుపుతున్నది. మరొక ముప్పై చోట్ల క్యాంపుల పట్ల నిరసన తెలుపుతున్నది. ఈ శాంతియుత ప్రజా నిరసనలను అడ్డుకోవడానికే ప్రస్తుత నిషేధం. 'సంస్థ అభ్యంతరాల మీద సలహా మండలి ఇంకా మాట్లాడలేదు గనుక మేం దీనిలో జోక్యం చేసుకోలేం' అంటూ ధర్మాసనం... సారాంశంలో నిషేధానికీ, నిర్బంధానికీ ఆమోదముద్ర వేసింది. ప్రాసిక్యూటర్ల అబద్ధా లకు, ప్రభుత్వపు చట్ట ఉల్లంఘనలకు, రాజ్యపు దౌర్జన్యా లకు వత్తాసు పలకడమే తమ విధి అని కొందరు న్యాయమూర్తులు అనుకోవడమే విషాదం!

వ్యాసకర్త 'వీక్షణం' ఎడిటర్

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, తిథి: శు.త్రయోదశి సా.4.59 వరకు, తదుపరి చతుర్దశి, నక్షత్రం: చిత్త రా.2.48 వరకు, తదుపరి స్వాతి, వర్జ్యం: ఉ.9.09 నుండి 10.55 వరకు, దుర్ముహూర్తం: ఉ.6.03 నుండి 7.14 వరకు, అమృతఘడియలు: రా.7.46 నుండి 9.33 వరకు, శనిత్రయోదశి; రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు, యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు, సూర్యోదయం: 5.34, సూర్యాస్తమయం: 6.17.

రేపే ఈఏపీసెట్ ఫలితాలు

11 గంటలకు విడుదల చేయనున్న సీఎం

- సెట్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయన్న అధికారులు
- కాలేజీల్లో సీట్లకు ఏఐసీటీఈ నుంచి రాని అనుమతి
- కౌన్సెలింగ్ ప్రక్రియ ఆలస్యమయ్యే అవకాశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఇంజనీరింగ్, అగ్రికల్చర్ ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (టీజీఈఏపీసెట్) ఫలితాలు ఆదివారం ఉదయం 11 గంటలకు విడుదల కానున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన నివాసంలో ఫలితాలు వెల్లడిస్తారని ఈఏపీసెట్ కో–కన్వీనర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. అగ్రికల్చర్, ఫార్మసీ సెట్ ఏప్రిల్ 29, 30 తేదీల్లో జరిగింది. ఇంజనీరింగ్ సెట్ మే 2 నుంచి 4 వరకూ జరిగింది. మొత్తం 2,88,388 మంది పరీక్షలు రాశారు. ఫలితాల కోసం https://eapcet.tlche.ac.in వెబ్‌సైట్‌కు లాగిన్ అవ్వొచ్చని అధికారులు తెలిపారు. సెట్ ఫలితాలను త్వరగా అందించేందుకు 'సాక్షి'దినపత్రిక ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. www.sakshieducation.com వెబ్‌సైట్‌లో ఫలితాలు వేగంగా తెలుసుకోవచ్చు.

ఏఐసీటీఈ అనుమతి ఎప్పుడు?

2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇంజనీరింగ్ సీట్లకు ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీలు దరఖాస్తు చేసుకున్నా.. ఇప్పటివరకూ అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) అనుమతి మంజూరు చేయలేదు. కొన్ని కాలేజీలు కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో సీట్లు పెంచాలని, మరికొన్ని డేటాసైన్స్, ఏఐఎంఎల్, సైబర్ సెక్యూరిటీ బ్రాంచీల్లో సీట్ల పెంపునకు దరఖాస్తు చేసుకున్నాయి. ఏఐసీటీఈ అనుమతిని ఇస్తేనే కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టడానికి వీలవుతుంది. రాష్ట్రంలో గత ఏడాది లెక్కల ప్రకారం 1.16 లక్షల ఇంజనీరింగ్ సీట్లు (కన్వీనర్, మేనేజ్‌మెంట్ కలిపి) ఉన్నాయి. ఇందులో గత సంవత్సరం 1.03 లక్షల సీట్లు భర్తీ అయ్యాయి. సివిల్, మెకానికల్, ఈఈఈ బ్రాంచీల్లో దాదాపు 35 శాతానికి పైగా సీట్లు మిగిలిపోయాయి. వీటిల్లో కొన్ని తగ్గించుకునేందుకు ప్రైవేటు కాలేజీలు దరఖాస్తు చేశాయి. అయితే ప్రభుత్వం సీట్ల తగ్గింపు విషయంలో తమ అభిప్రాయం తీసుకోవాలని ఏఐసీఈటీని కోరింది.

ఖరారు కాని ఫీజులు

ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల ఫీజులను రాష్ట్ర ఫీజులు, ప్రవేశాల నియంత్రణ మండలి ఇంతవరకూ ఖరారు చేయలేదు. ప్రతి మూడేళ్ళకోసారి ఫీజులను టీఎఫ్ఆర్‌సీ సమీక్షిస్తుంది. మూడేళ్ళ క్రితం నిర్ణయించిన ఫీజులు 2024–25 విద్యా సంవత్సరం వరకూ వర్తించాయి. 2025–26 నుంచి మూడేళ్ళకు గాను కొత్త ఫీజుల ఖరారుపై ఎఫ్ఆర్‌సీ కొన్ని నెలలుగా కసరత్తు చేస్తోంది. ప్రైవేటు కాలేజీలతో సంప్రదింపులు కూడా చేపట్టింది. కొన్ని కాలేజీలు ఏకంగా రూ.1.45 లక్షల నుంచి రూ. 2.5 లక్షల వార్షిక ఫీజును డిమాండ్ చేస్తున్నాయి. గత ఏడాది రూ.75 వేలున్న ఫీజులను రూ.1.25 వేలకు పెంచాలని 50 కాలేజీలు ప్రతిపాదనలు పంపాయి. వీటన్నింటినీ సమీక్షించిన ఎఫ్ఆర్‌సీ ప్రభుత్వ నిర్ణయం కోసం వేచిచూస్తోంది.

పూర్తవ్వని అనుబంధ గుర్తింపు ప్రక్రియ

రాష్ట్రంలోని 159 కాలేజీలకు వివిధ విశ్వవిద్యాలయాల నుంచి అనుబంధ గుర్తింపు రావాల్సి ఉంది. ఇది ప్రతి సంవత్సరం జరిగే ప్రక్రియే. ఈ క్రమంలో విశ్వవిద్యాలయ బృందాలు ఆయా కాలేజీలను తనిఖీ చేయాల్సి ఉంటుంది. కాలేజీల్లో మౌలిక వసతులు, అర్హత గల అధ్యాపకులు ఉన్నారా? అనే అంశాలను పరిశీలిస్తారు. ఇది ఇంతవరకూ పూర్తవ్వలేదు. కొన్ని కాలేజీలు కోర్ బ్రాంచీల్లో సీట్లు తగ్గించుకుని, కంప్యూటర్ సైన్స్ సంబంధిత కొత్త బ్రాంచీల్లో సీట్లు పెంచుకునేందుకు ఆసక్తి చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త కోర్సులకు అవసరమైన లైబ్రరీ, లేబొరేటరీ తదితర సౌకర్యాలు ఏ మేరకు ఉన్నాయనేది పరిశీలించిన తర్వాతే అనుబంధ గుర్తింపు ఇవ్వాల్సి ఉంటుంది. ఒకవైపు సెట్ ఫలితాలు వెలువడుతుంటే, మరోవైపు కాలేజీల తనిఖీలు, అనుబంధ గుర్తింపు ఎప్పుడు పూర్తవుతుందో అధికారులు చెప్పలేక పోతుండటం గమనార్హం.

విడుదల కాని జోసా కౌన్సెలింగ్ షెడ్యూల్

ఈఏపీసెట్ ఫలితాలు విడుదలైన వెంటనే సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేస్తుంటారు. అయితే ఈ ఏడాది కౌన్సెలింగ్ ఆలస్యమయ్యేలా కన్పిస్తోంది. జాతీయ ఇంజనీరింగ్ కాలేజీలు, ఐఐటీల్లో ప్రవేశానికి సంబంధించిన జాయింట్ సీట్ అలొకేషన్ అథారిటీ (జోసా) కౌన్సెలింగ్ షెడ్యూల్ ఇప్పటివరకు విడుదల కాలేదు. దీన్ని బట్టే రాష్ట్ర ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను రూపొందిస్తారు. మరోవైపు సీట్లకు ఏఐసీటీఈ నుంచి అనుమతి రాకపోవడం, కాలేజీలకు అనుబంధ గుర్తింపు మంజూరు పూర్తి కాకపోవడంతో ఈసారి కౌన్సెలింగ్ ఆలస్యమయ్యే అవకాశం కన్పిస్తోంది.

నిమ్స్ డాక్టర్లు, వైద్య సిబ్బందికి

ఆరోగ్యశ్రీ ఇన్‌సెంటివ్

- నెరవేరిన పదేళ్ల ఆకాంక్ష
- 800లకుపైగా సిబ్బంది భర్తీకి మంత్రి దామోదర అనుమతి
- నిమ్స్ 2024–25 ప్రగతి నివేదికను మంత్రికి అందజేసిన డైరెక్టర్ బీరప్ప

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని ప్రముఖ ప్రభుత్వ ఆసుపత్రి నిమ్స్‌లో ఆరోగ్యశ్రీ పేషెంట్లకు చికిత్స అందించినందుకు, ఆరోగ్యశ్రీ ట్రస్టు నుంచి వచ్చే రీయింబర్స్‌మెంట్ నుంచి 35 శాతం ఇకనుంచి డాక్టర్లు, వైద్య సిబ్బందికి అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలకు శుక్రవారం సచివాలయంలో జరిగిన నిమ్స్ ఎగ్జిక్యూటివ్ బోర్డు సమావేశంలో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆమోదం తెలిపారు. తద్వారా డాక్టర్లు, సిబ్బంది పదేళ్ల ఆకాంక్ష నెరవేరినట్లయింది. ఈ మేరకు మంత్రికి నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, ఇతర వైద్యాధికారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా 2024–25 లో నిమ్స్ పేషెంట్లకు అందించిన సేవల వివరాలతో కూడిన



నివేదికను డైరెక్టర్ బీరప్ప మంత్రికి అందజేశారు. 2023 కంటే 2024 లో అవుట్ పేషెంట్ల సంఖ్య 12.6 శాతం పెరిగిందని, ఆరోగ్యశ్రీ కింద అడ్మిట్ అయిన పేషెంట్ల సంఖ్య 22.4 శాతం పెరిగిందని బీరప్ప తెలిపారు. నిమ్స్‌లో చికిత్స కోసం 2024లో 11 వేల మంది పేదలకు ప్రభుత్వం ఇచ్చిన ఎల్‌వోసీల ద్వారా చికిత్స అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిమ్స్‌లో పెరిగిన రోగుల సంఖ్యకు అనుగుణంగా డాక్టర్లు, నర్స్, స్టాఫ్‌ను రిక్రూట్ చేసుకునేందుకు అనుమతించాలని మంత్రిని కోరగా, సుమారు 800లకు పైగా పోస్టుల భర్తీకి మంత్రి అనుమతి ఇచ్చారు.

వైద్యం విషయంలో రాజీ పడొద్దు

ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడుతూ వైద్యం విషయంలో ఏమాత్రం రాజీ పడవద్దని వైద్యాధికారులకు సూచించారు. నిమ్స్‌పై ప్రజలకు ఎంతో నమ్మకం ఉన్నదని, సుదూర ప్రాంతాల నుంచి ఇక్కడికి చికిత్స కోసం వస్తుంటారన్నారు. నిమ్స్ నూతన భవనాల నిర్మాణంలో కూడా నాణ్యతలో లోపం లేకుండా, వీలైనంత వేగంగా పనులు పూర్తి చేయాలన్నారు. నిర్మాణ పనులపై త్వరలోనే పూర్తి స్థాయిలో సమీక్షిస్తానని, అన్ని వివరాలతో రావాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా చొంగ్తూ, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, ఆర్థిక శాఖ డిప్యూటీ సెక్రటరీ శైలజ తదితరులు పాల్గొన్నారు.



పేట్రేగిన పాక్

రెండో రోజూ దాడులు

- సరిహద్దు ప్రాంతాలపైకి క్షిపణులు, డ్రోన్లు
- 20 నగరాలు సహా 26 ప్రాంతాలపై గురి
- శ్రీనగర్ విమానాశ్రయంపై దాడికి యత్నం
- దాడులను దీటుగా తిప్పికొట్టిన సైన్యం
- క్షిపణులు, డ్రోన్లు ఎక్కడివక్కడ కూల్చివేత
- కాల్పులతో దద్దరిల్లుతున్న సరిహద్దులు
- అక్కడి రాష్ట్రాల్లో అప్రమత్తత, బ్లాకౌట్లు
- మోదీ అత్యున్నత స్థాయి సమీక్షలు

న్యూఢిల్లీ: సరిహద్దు ప్రాంతాలపై పాక్ దాడులు వరుసగా రెండో రోజు శుక్రవారం కూడా కొనసాగాయి. చీకట్లు పడుతూనే జమ్మూ కశ్మీర్ మొదలుకుని రాజస్తాన్ దాకా 26కు పైగా ప్రాంతాల్లో దాయాది మరోసారి క్షిపణి, డ్రోన్ దాడులకు దిగింది. జమ్మూ కశ్మీర్‌లోని ఉరి, సాంబా, నౌగావ్, పూంఛ్, జమ్మూ, ఉధంపూర్, నగ్రోటా, రాజౌరీ, పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్, పఠాన్‌కోట్, అమృత్‌సర్, రాజస్తాన్‌లోని జైసల్మేర్, పోఖ్రాన్ తదితర ప్రాంతాలు వీటిలో ఉన్నాయి. అక్కడి పౌర ఆవాసాలతో పాటు సైనిక స్థావరాలను పాక్ డ్రోన్లు లక్ష్యంగా చేసుకున్నాయి. దాడులను సైన్యం దీటుగా తిప్పికొడుతోంది. వాటిని ఎక్కడివక్కడ కూల్చేస్తోంది. ఉద్రిక్తతల నేపథ్యంలో సరిహద్దు రాష్ట్రాలన్నింటా అప్రమత్తత పాటిస్తున్నారు. ముందుజాగ్రత్తగా బ్లాకౌట్ కొనసాగుతుండటంతో ఆయా రాష్ట్రాల్లో శ్రీనగర్ మొదలుకుని జోధ్‌పూర్ దాకా పలు పట్టణాల్లో చీకట్లు కమ్ముకున్నాయి. మరోవైపు సరిహద్దుల పొడవునా పాక్ భారీగా కాల్పులకు తెగబడుతోంది. జమ్మూలోని రాంగఢ్, సుచేత్‌గఢ్ మొదలుకుని రాజస్తాన్‌లోని గంగానగర్ దాకా పలు ప్రాంతాలు కాల్పుల మోతతో దద్దరిల్లిపోతున్నాయి. ఈ నేపథ్యంలో పలు సరిహద్దు జిల్లాలకు రెడ్ అలర్టులు జారీ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ అత్యున్నత స్థాయి సమావేశంలో పరిస్థితిని సమీక్షించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్‌తో పాటు త్రివిధ దళాధిపతులు భేటీలో పాల్గొన్నారు. భావి కార్యాచరణపై లోతుగా చర్చించారు. అనంతరం విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, ఆ శాఖ కార్యదర్శి మిస్రీ, దోవల్‌తో కూడా మోదీ గంటన్నరకు పైగా భేటీ అయ్యారు. అంతకుముందు త్రివిధ దళాల మాజీ అధిపతులు, ఉన్నతాధికారులతో కూడా ఆయన సమావేశమై పరిస్థితిపై చర్చించారు. మరోవైపు కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా సరిహద్దుల వెంబడి పరిస్థితిపై కూలంకషంగా సమీక్ష జరిపారు. అవసరమైతే టెరిటోరియల్ ఆర్మీని కూడా పూర్తిస్థాయిలో విధుల్లో నియోగించాల్సిందిగా ఆర్మీ చీఫ్‌ను కేంద్రం ఆదేశించింది. శత్రువుకు మర్చిపోలేని రీతిలో బుద్ధి చెప్పాలని సైన్యాన్ని రాజ్‌నాథ్ ఆదేశించారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలంటూ అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు కేంద్ర అగ్నిమాపక సేవలు, పౌర రక్షణ విభాగాల డీజీ వివేక్ శ్రీవాత్సవ సర్క్యులర్ పంపారు. దేశవ్యాప్తంగా వైద్య సిబ్బందికి సెలవులను కూడా రద్దు చేశారు. ఉద్రిక్తతల నేపథ్యంలో సరిహద్దుల్లోని పలు విమానాశ్రయాల మూసివేతను మే 15 దాకా పొడిగించాలని కేంద్రం నిర్ణయించింది.


పంజాబ్‌లోని అమృత్‌సర్ నగరంలో శుక్రవారం రాత్రి బ్లాకౌట్‌తో అలుముకున్న అంధకారం

పేలుళ్లు, సైరన్లు

శుక్రవారం అర్ధరాత్రి దాకా సరిహద్దుల పొడవునా పదులకొద్దీ పాక్ డ్రోన్లను సైన్యం కూల్చేసింది. మంటల్లో కాలుతూ కూలిపోతున్న డ్రోన్లతో ఆకాశం ప్రకాశమానంగా మారింది. అంతకుముందు శ్రీనగర్ విమానాశ్రయం, దక్షిణ కశ్మీర్‌లోని అవంతిపురా వైమానిక బేస్‌పై డ్రోన్ దాడులకు పాక్ చేసిన ప్రయత్నాలను తిప్పికొట్టింది. అంతకుముందు జమ్మూతో పాటు పలు ఇతర ప్రాంతాల్లో భారీ పేలుళ్ల శబ్దాలు విన్పించాయి. సైరన్లు మోగాయి. పాక్ కాల్పులకు ఒక మహిళ బలవగా 18 మందికి పైగా గాయపడ్డారు. లైట్లు ఆర్పేయాల్సిందిగా స్థానిక మసీదుల్లోని లౌడ్‌స్పీకర్ల ద్వారా ప్రజలకు అధికారులు విజ్ఞప్తి చేశారు. తన చుట్టుపక్కల ప్రాంతాలన్నీ బాంబులు, కాల్పుల మోతతో దద్దరిల్లిపోతున్నాయంటూ జమ్మూ కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. బారాముల్లా, కుప్వారా, బందీపురా వంటి సరిహద్దు జిల్లాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలు, బంకర్లకు తరలిస్తున్నారు. దాడులు తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో సరిహద్దుల వెంబడి మరిన్ని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను సైన్యం యుద్ధ ప్రాతిపదికన మోహరిస్తోంది. ఓవైపు దాడులకు తెగబడుతూనే, మరోవైపు భారత్‌తో ఉద్రిక్తతలను తగ్గించాలంటూ ఇరాన్, సౌదీ అరేబియా, ఇతర గల్ఫ్ దేశాలను పాక్ ప్రాధేయపడుతోంది. పాక్‌తో యుద్ధ పరిస్థితి నెలకొని ఉందని అమెరికాలో భారత రాయబారి వినయ్ క్వాత్రా అభిప్రాయపడ్డారు.

పాశుపతాలు

పాక్ క్షిపణులు, డ్రోన్లను మధ్యలోనే అడ్డుకుని కూల్చేసేందుకు గురువారం కాజ్, పెచోరా, సమర్, ఏడీ గన్స్ తదితరాలను రంగంలోకి దించినట్టు సైన్యం ప్రకటించింది. అత్యాధునిక ఎస్–400 ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ మన గగనతలాన్ని కంటికి రెప్పలా కాపాడుతుండటం తెలిసిందే. ఎస్–400, ఆకాశ్ ఎన్‌జీ, ఎంఆర్‌ఎస్‌ఏఎంలకు తోడుగా కాజ్, పెచోరా, సమర్, ఏడీ గన్స్ తదితరాలు మన వాయుతలాన్ని పూర్తిగా శత్రు దుర్భేద్యంగా మార్చేశాయి.

పెచోరా
దశాబ్దాలుగా సేవలు



ఇది సోవియట్ కాలంనాటి మీడియం రేంజ్ సర్ఫేస్ టు ఎయిర్ (ఎస్‌ఏఎం) క్షిపణి. అధికారిక నామం ఎస్–125 నెవా. దశాబ్దాలుగా సేవలందిస్తోంది. 1970ల నుంచీ మన ఎయిర్ డిఫెన్స్ నెట్‌వర్క్‌లో అత్యంత విశ్వసనీయమైన, కీలకమైన అస్త్రంగా ఉంటూ వస్తోంది. మానవరహిత వైమానిక వాహనాల (యూఏవీ) పాలిట ఇది సింహస్వప్నమేనని చెప్పాలి. తక్కువ, మధ్యశ్రేణి ఎత్తుల్లోని లక్ష్యాలను ఛేదించడంలో దీనికి తిరుగులేదు. వాటిని గాల్లోనే అడ్డుకుని తునాతునకలు చేసేస్తుంది. గురువారం పాక్ డ్రోన్లను ఎక్కడికక్కడ నేలకూల్చడంలో కీలక పాత్ర పోషించింది.

- పెచోరాలో రాడార్ ఆధారిత మిసైల్ లాంచర్, ఫైర్ కంట్రోల్ యూనిట్ ఉంటాయి.
- ఐదు హై ఇంటర్‌సెప్టివ్ యాంటెన్నాలతో కూడిన 4ఆర్90 యత్నాగన్ రాడార్ దీని ప్రత్యేకత
- ఇది సాధారణంగా వీ–600 క్షిపణులను ప్రయోగిస్తుంటుంది.
- రక్షణ వ్యవస్థ కన్నుగప్పేందుకు టార్గెట్లు ఎన్ని ప్రయత్నాలు చేసినా వాటిని ఇట్టే పట్టేస్తుంది.
- ఆ వెంటనే క్షిపణులు ప్రయోగించి వాటిని గాల్లో మధ్యలోనే అడ్డుకుని నేలకూలుస్తుంది.
- ఎలక్ట్రానిక్ జామింగ్ యత్నాలను కూడా ఇది సమర్థంగా అడ్డుకుంటూ పని పూర్తి చేసేస్తుంది.
- **గుర్తింపు సామర్థ్యం:** లక్ష్యాలను 100 కి.మీ. దూరంలోనే గుర్తిస్తుంది.
- **కచ్చితత్వం:** 92 శాతం పై చిలుకే! అందుకే దీన్ని హై కిల్ కేపబిలిటీ (హెచ్‌కేకే) వ్యవస్థగా పిలుస్తారు.
- **ప్రత్యేకత:** ఏకకాలంలో రెండు లక్ష్యాలపై గురి పెట్టగలదు.
- **వేగం:** పెచోరా నుంచి ప్రయోగించే క్షిపణులు సెకనుకు 900 మీటర్ల వేగంతో దూసుకెళ్తాయి. కన్నుమూసి తెరిచేలోపు టార్గెట్‌ను నేలకూలుస్తాయి.

కాజ్
మన ఇంద్రజాలం



కౌంటర్ అన్‌మ్యాన్డ్ ఎయిర్‌క్రాఫ్ట్ సిస్టమ్స్ (సీఏయూఏఎస్). ఇది ప్రధానంగా యాంటీ డ్రోన్ వ్యవస్థ. డ్రోన్లను ముందుగానే పసిగట్టి నేలకూలుస్తుంది. ఇంద్రజాల్, భార్గవాస్త్ర అని దీని ముద్దుపేర్లు.

- **ప్రత్యేకతలు:** ఇతర ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలతో సమన్వయం చేసుకుంటూ శత్రువు పని పడుతుంది. గురువారం జమ్మూ కశ్మీర్, పఠాన్‌కోట్‌పైకి దూసుకొచ్చిన డ్రోన్లను సమీకృత కాజ్ గ్రిడ్ ద్వారా ఎక్కడివక్కడ గుర్తించి నేలకూల్చారు.
- లేయర్డ్ అప్రోచ్, అంటే మల్టీ సెన్సర్ డిటెక్షన్, సాఫ్ట్/హార్డ్ కిల్ సామర్థ్యం దీని సొంతం.
- రాడార్లు, రేడియో ఫ్రీక్వెన్సీ సెన్సర్లు, ఈఓ/ఐఆర్ (ఎలక్ట్రో–ఆప్టికల్/ఇన్‌ఫ్రారెడ్) కెమెరా వంటి పలు మార్గాల్లో ఎంత తక్కువ ఎత్తులో వచ్చే డ్రోన్లనైనా ఇట్టే పసిగడుతుంది.
- ఆ వెంటనే అవసరాన్ని బట్టి సాఫ్ట్ కిల్ (డ్రోన్ల కమ్యూనికేషన్ సిగ్నల్స్ జామింగ్), హార్డ్ కిల్ (నేలకూల్చడం) చేస్తుంది.

సమర్
వైమానికాస్త్రం



సర్ఫేస్ టు ఎయిర్ మిసైల్ ఫర్ అష్యూర్డ్ రిటాలియేషన్ (సమర్). వైమానిక దళం అమ్ములపొదిలోని తిరుగులేని అస్త్రం. మన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలో కీలక అంగం. రక్షణ రంగంలో మన స్వావలంబనకు నిలువెత్తు నిదర్శనం.

- వైమానిక దళానికి చెందిన మెయింటెనెన్స్ కమాండ్ దీన్ని పూర్తిగా దేశీయంగా అభివృద్ధి చేసింది. ఇందులో ప్రైవేట్ రంగ కంపెనీలు కూడా భాగస్వామ్యమయ్యాయి.
- స్వల్పశ్రేణి లక్ష్యాల పాలిట మృత్యుపాశం. ఒకసారి దీని కంటబడ్డాక తప్పించుకోవడం అసాధ్యమే.
- డ్రోన్లతో పాటు దీని పరిధిలోకి వచ్చే హెలికాప్టర్లు, ఫైటర్‌జెట్లు నేలకూలినట్టే లెక్క.
- సమర్–1 వ్యవస్థ ఆర్–73ఈ, సమర్–2 ఆర్–27 మిసైళ్లను ఉపయోగిస్తాయి.
- ఆర్–73ఈ మిసైళ్ల రేంజ్ 8 కి.మీ. ఆర్–27లది 30 కి.మీ.
- ముప్పును బట్టి ఒకే ప్లాట్‌ఫాం నుంచి ఏకకాలంలో రెండు క్షిపణులను ప్రయోగించవచ్చు.

ఏడీ గన్స్
లక్ష్యమేదైనా తుత్తునియలే



ఎయిర్ డిఫెన్స్ గన్స్. ఎల్–70, షిల్కా తదితరాలు మన ఏడీ వ్యవస్థలో ప్రధానమైనవి.

- **ఎల్–70:** ఇవి 40 ఎంఎం విమాన విధ్వంసక గన్స్. తొలుత స్వీడిష్ కంపెనీ బోఫోర్స్ తయారు చేసిచ్చేది. ఇప్పుడు భారత్‌లోనే తయారవుతున్నాయి.
- రాడార్లు, ఎలక్ట్రో–ఆప్టికల్ సెన్సర్లు, ఆటో ట్రాకింగ్ సిస్టమ్స్ వంటివాటి ద్వారా ఎల్–70లను పూర్తిస్థాయిలో ఆధునీకరించారు.
- ఇవి నిమిషానికి 240 నుంచి 330 రౌండ్లు పేల్చగలవు. రేంజి 4 కి.మీ.
- ఇతర రాడార్ల కన్నుగప్పి వాయుతలం లోనికి వచ్చే డ్రోన్లు కూడా వీటినుంచి తప్పించుకోలేవు.
- **షిల్కా:** జెడ్ఎస్‌యూ–24–4 గన్స్. షిల్కా అనేది వీటి రష్యన్ నిక్‌నేమ్.
- ఇవి 22 ఎంఎం గన్నర్లు. సెల్ఫ్ ప్రొపెల్డ్ వ్యవస్థలు.
- నిమిషానికి ఏకంగా 4 వేల రౌండ్లు కాల్చగలవు.

– సాక్షి, నేషనల్ డెస్క్

పాక్‌కు బిలియన్ డాలర్లు

- విడుదల చేసిన ఐఎంఎఫ్
- ఓటింగ్‌కు దూరంగా ఉన్న భారత్

ఇస్లామాబాద్: అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) నుంచి తనకు 100 కోట్ల డాలర్లు మంజూరైనట్టు పాకిస్తాన్ పేర్కొంది. పాక్ ప్రధాని కార్యాలయం ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. శుక్రవారం నాటి ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ బోర్డు భేటీలో ఇందుకు ఆమోదముద్ర పడ్డట్టు పేర్కొంది. ఇది పాక్‌కు 700 కోట్ల డాలర్ల ఐఎంఎఫ్ రుణ ప్యాకేజీలో భాగం. ఈ మొత్తాన్ని మూడేళ్ల వ్యవధిలో ఇచ్చేందుకు గత జూలైలో ఐఎంఎఫ్ అంగీకరించింది. రుణ వాయిదాల వినియోగాన్ని ఆర్నెల్లకోసారి సమీక్షిస్తూ ఏడు వాయిదాల్లో రుణాన్ని అందజేస్తామని పేర్కొంది. తొలి వాయిదాగా గతంలోనే 100 కోట్ల డాలర్లు అందజేసింది. ఈ రుణంపై భారత్ తొలినుంచీ తీవ్ర అభ్యంతరం వెలిబుచ్చుతూ వస్తోంది. ''ఈ నిధులను పాక్ ప్రధానంగా ఉగ్రవాద కార్యకలాపాలపైనే వెచ్చిస్తుంది. అంతిమంగా ఇది భారత్‌కే గాక అంతర్జాతీయ సమాజానికే పెనుముప్పుగా పరిణమిస్తుంది. కనుక పాక్‌కు రుణసాయాన్ని పూర్తిగా నిలిపేయాలి''అని కోరుతూ వస్తోంది. పాక్‌కు 100 కోట్ల డాలర్ల విడుదల ప్రతిపాదనను శుక్రవారం నాటి ఐఎంఎఫ్ బోర్డు భేటీలో భారత్ వ్యతిరేకించింది. దానిపై జరిగిన ఓటింగ్‌కు దూరంగా ఉండిపోయింది. ఈ నిర్ణయాన్ని కాంగ్రెస్ తీవ్రంగా తప్పుబట్టింది. ''పాక్‌పై ఉక్కుపాదం మోపుతున్నామని ప్రచారం చేసుకుంటున్న మోదీ ప్రభుత్వం ఓటింగ్‌కు దూరంగా ఎందుకు ఉన్నట్టు? అలాగాక వ్యతిరేకంగా ఓటేస్తే మన వైఖరిని సమర్థంగా వినిపించినట్టుగా ఉండేది''అంటూ ఆక్షేపించింది. దివాలా స్థితిలో ఉన్న పాక్‌ను చైనా, సౌదీ అరేబియా, ఖతార్‌తో పాటు ప్రపంచబ్యాంక్, ఐఎంఎఫ్‌లే ఆర్థికంగా ఆదుకుంటూ వస్తున్నాయి. 2024 నాటికి పాక్ విదేశీ రుణభారం 130 బిలియన్ డాలర్లు దాటింది.

ప్రతీ దాడికి పక్కా రికార్డు

- ఉగ్రవాద శిబిరాలపై దాడులను రికార్డు చేస్తున్న బలగాలు
- వివరాల నమోదుతో పాటు వీడియో రూపంలోనూ సేకరణ

న్యూఢిల్లీ: పాకిస్తాన్‌లోని ఉగ్రవాద శిబిరాలను బాంబులు, క్షిపణులతో ధ్వంసం చేస్తున్న భారత బలగాలు.. ఆ దాడుల వివరాలను పక్కాగా రికార్డు చేస్తున్నాయని సమాచారం. ఈ నెల 7న పాక్, పీఓకేలోని 9 లక్ష్యాలపై భారత్ దాడి చేసింది. ఆయా స్థావరాలు ఎవరివి? ఏ ఉగ్రవాద సంస్థ వాడుతోంది? ప్రస్తుతం అందులో ఎవరు ఉంటున్నారు? అనే వివరాలను భారత బలగాలు రికార్డు చేసినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. దాడులకు సంబంధించిన వీడియోలను కూడా చిత్రీకరించి భద్రపరిచినట్లు వెల్లడించాయి. ఇందుకోసం ప్రత్యేకంగా ఓ వ్యవస్థను ఏర్పాటుచేసినట్లు సమాచారం. పాకిస్తాన్ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు ఈ ఆధారాలను ఉపయోగించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

పశ్చిమ సరిహద్దులో అప్రమత్తం

రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆదేశం

న్యూఢిల్లీ: పాకిస్తాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో జాతీయ భద్రతపై రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కె.త్రిపాఠితోపాటు రక్షణ శాఖ కార్యదర్శి రాజేశ్‌కుమార్ సింగ్‌తో ఆయన శుక్రవారం సమావేశమయ్యారు. భారత్–పాక్ మధ్య దాడులు, ప్రతిదాడులతోపాటు తాజా పరిణామాలపై సుదీర్ఘంగా చర్చించారు. సరిహద్దుల్లో భద్రతపై ఆరా తీశారు. పాకిస్తాన్ సైన్యం మళ్లీ దాడులు చేస్తే గట్టిగా తిప్పికొట్టాలని నిర్ణయానికొచ్చారు. ప్రధానంగా పశ్చిమ సరిహద్దులో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సైనిక దళాలను రాజ్‌నాథ్ సింగ్ ఆదేశించారు. పాక్ సైన్యం కవ్వింపు చర్యలకు పాల్పడుతున్న నేపథ్యంలో భారత సైనిక దళాల యుద్ధ సన్నద్ధతను సమీక్షించారు. దేశ సార్వభౌమత్వంతోపాటు ప్రజల రక్షణకు పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉన్నట్లు రక్షణ శాఖ స్పష్టం చేసింది. పాక్ సైన్యం ఎలాంటి దాడులకు పాల్పడినా గట్టిగా బుద్ధి చెప్తామని వెల్లడించింది.

ప్రాదేశిక సైన్యం సేవలు ఉపయోగించుకోండి

ఆర్మీ చీఫ్‌కు రక్షణ శాఖ ఆదేశం

న్యూఢిల్లీ: పాకిస్తాన్‌తో ఘర్షణల నేపథ్యంలో ప్రాదేశిక సైన్యం(టీఏ) సేవలు సైతం ఉపయోగించుకోవాలని ఆర్మీ చీఫ్‌కు కేంద్ర ప్రభుత్వం సూచించింది. టెరిటోరియల్ ఆర్మీలోని ప్రతి ఒక్కరినీ రంగంలోకి దించేందుకు అధికారం అప్పగించింది. క్షేత్రస్థాయిలో ప్రధాన సైన్యానికి అనుబంధంగా, మద్దతుగా ప్రాదేశిక సైన్యం సేవలు వాడుకోవాలని స్పష్టంచేసింది. ఈ మేరకు రక్షణ శాఖకు చెందిన డిపార్టుమెంట్ ఆఫ్ మిలటరీ అఫైర్స్ తాజాగా నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నోటిఫికేషన్ ఈ ఏడాది ఫిబ్రవరి 10 నుంచి 2028 ఫిబ్రవరి 9 దాకా.. మూడేళ్లపాటు అమల్లో ఉంటుందని వెల్లడించింది. టెరిటోరియల్ ఆర్మీ(టీఏ)ను 1949 అక్టోబర్ 9న ఏర్పాటు చేశారు. ఈ సైనిక దళం గతేడాది 75 ఏళ్లు పూర్తిచేసుకుంది. యుద్ధాలతోపాటు విపత్తులు, సంక్షోభాల సమయంలో విశేషమైన సేవలందించింది. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లోనూ చురుగ్గా పనిచేసింది. ప్రాదేశిక సైన్యంలో దేశవ్యాప్తంగా 32 ఇన్‌ఫాంట్రీ బెటాలియన్లు ఉన్నాయి.

హస్తినలో హై అలర్ట్

సాక్షి, న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ కొనసాగుతున్న నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీలో ప్రభుత్వం హై అలర్ట్ ప్రకటించింది. ఎక్కడా ఏవిధమైన అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రభుత్వం భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేసింది. ఢిల్లీ వ్యాప్తంగా 144వ సెక్షన్ కింద నిషేధాజ్ఞలు విధించారు. జనం గుంపులుగా నిలువొద్దంటూ హెచ్చరికలు జారీ చేశారు. ఇండియా గేట్, ఎర్రకోట, హుమాయూన్ సమాధి, లోటస్ టెంపుల్, నేషనల్ మ్యూజియం తదితర పర్యాటక ప్రాంతాల్లో ఆంక్షలు విధించారు. మెట్రో, రైల్వే స్టేషన్, బస్టాండ్, క్యాబ్, ఆటో స్టాండ్, మాల్స్, మార్కెట్లు, హోటళ్ల వద్ద తనిఖీలు ముమ్మరం చేశారు. సున్నిత ప్రాంతాల్లో పోలీసు, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్ బలగాలను పెంచడంతోపాటు బాంబ్ స్క్వాడ్ బృందాలు సైతం కనిపిస్తుండటంతో ఏం జరుగుతోందోనని ఆందోళన ప్రజల్లో పెరిగింది.

ఎయిమ్స్‌లో సెలవులు రద్దు

ఢిల్లీ ఎయిమ్స్‌లో అన్ని స్థాయిల ఉద్యోగులు, అధికారుల సెలవులను రద్దు చేశారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆదేశాలు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇప్పటికే సెలవులో ఉన్న వారు విధులకు వెంటనే హాజరు కావాలని, ఎవ్వరికీ సెలవులు ఉండవని స్పష్టం చేశారు.

3 గంటల ముందే ఎయిర్‌పోర్టుకు చేరుకోండి

సాక్షి, న్యూఢిల్లీ: యుద్ధం నేపథ్యంలో దేశంలోని అన్ని విమానాశ్రయాల్లో బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ(బీసీఏఎస్) మెరుగైన భద్రతా ప్రోటోకాల్‌ను తప్పనిసరి చేసింది. పూర్తిస్థాయిలో తనిఖీలను చేపట్టేందుకు వీలుగా ప్రయాణికులు బయలుదేరే సమయానికి కనీసం మూడు గంటలు ముందే విమానాశ్రయానికి చేరుకోవాలంది. ఈ మేరకు ఎయిర్ ఇండియా, ఇండిగో, స్పైస్‌జెట్, ఆకాశ వంటి ప్రధాన విమానయాన సంస్థలు ప్రయాణికులకు సూచనలు జారీ చేశాయి. 75 నిమిషాల ముందే చెక్ ఇన్‌ను క్లోజ్ చేస్తున్నట్లు ప్రకటించాయి.

పాక్ పనిపట్టాం!

కీలక వ్యవస్థలను దెబ్బ తీశాం: కేంద్రం

- సైనిక స్థావరాలు, రాడార్ డిఫెన్స్ ధ్వంసం
- పశ్చిమ సరిహద్దు పొడవునా పాక్ దాడులు
- పౌర, సైనిక వ్యవస్థలను లక్ష్యం చేసుకుంది
- 36 ప్రాంతాలపై 400 పై చిలుకు టర్కీ డ్రోన్లు
- వాటన్నింటినీ సైన్యం దీటుగా తిప్పికొట్టింది
- కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమిక వెల్లడి


సోఫియా ఖురేషీ


వ్యోమికాసింగ్

న్యూఢిల్లీ: భారత నగరాలు, పౌర ఆవాసాలు, సైనిక స్థావరాలే లక్ష్యంగా పశ్చిమ సరిహద్దుల పొడవునా గురువారం పాక్ మతిలేని దాడులకు దిగిందని కేంద్రం వెల్లడించింది. వాటిని మన బలగాలు పూర్తిగా తిప్పికొట్టినట్టు కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికాసింగ్ తెలిపారు. విదేశాంగ కార్యదర్శి విక్రం మిస్రీతో కలిసి వారు శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ''భారత సైనిక వ్యవస్థలే లక్ష్యంగా గురువారం రాత్రి పాక్ సైన్యం మన గగనతలంపై పదేపదే దాడులు చేసింది. లేహ్ నుంచి సర్‌క్రీక్ దాకా 36 ప్రాంతాలపై 300 నుంచి 400 డ్రోన్లు ప్రయోగించింది. బహుశా నిఘా సమాచార సేకరణ, పాక్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను పరీక్షించి చూసుకోవడమే ఈ డ్రోన్ చొరబాట్ల లక్ష్యం. వాటిలో చాలావరకు ఎక్కడివక్కడ కూల్చేశాం. అవి తుర్కియే డ్రోన్లని ప్రాథమిక దర్యాప్తు ఆధారంగా అంచనాకు వచ్చాం. తర్వాత పాక్ తేలికపాటి యుద్ధ విమానం భటిండా సైనిక స్థావరంపై దాడికి యత్నించగా అడ్డుకుని తిప్పికొట్టాం. అదే సమయంలో అంతర్జాతీయ సరిహద్దుకు, నియంత్రణ రేఖకు ఆవలి నుంచి పాక్ భారీగా కాల్పులకు కూడా తెగబడింది. జమ్మూ కశ్మీర్‌లో సుందర్, ఉరి, పూంఛ్, మేంధర్, రాజౌరీ, అఖ్నూర్, ఉధంపూర్ ప్రాంతాల్లో భారీ మోర్టార్లు, గన్లతో దాడులు చేసింది. వీటిలో కొందరు సైనికులు మరణించగా పలువురు గాయపడ్డారు. మన ప్రతీకార దాడుల్లో పాక్ తీవ్ర నష్టం చవిచూసింది. 4 పాక్ సైనిక స్థావరాలపై సైన్యం డ్రోన్ దాడులు జరిపింది. వారి ఏడీ రాడార్ వ్యవస్థను ధ్వంసం చేశాం''అని వారు వెల్లడించారు. ఈ దాడుల్లో ఎస్–400 వ్యవస్థతో పాటు బరాక్–8, ఆకాశ్ మిసైళ్ల తదితరాలను వాడినట్టు అధికార వర్గాలు తెలిపాయి.

మతం రంగు పులిమే యత్నం

గురుద్వారాపై దాడుల ప్రచారంపై మిస్రీ

భారత్ తన సొంత ప్రార్థనా స్థలాలపైనే దాడులు చేసుకుందన్న పాక్ ప్రచారంపై మిస్రీ నిప్పులు చెరిగారు. ''పాక్ ద్వంద్వ వైఖరికి, తప్పుడు ప్రచారానికి ఇది పరాకాష్ట. చివరికి దాడులకు మతం రంగు పులిమే స్థాయికి దిగజారింది''అంటూ దుయ్యబట్టారు. ''పాక్ సైన్యం అమృత్‌సర్, పూంఛ్ సమీపంలో నన్కానా సాహిబ్ తదితర గురుద్వారాలు, ఆలయాలపై దాడులకు పాల్పడి పాక్షికంగా ధ్వంసం చేసింది. ఆ నెపాన్ని మనపై వేస్తూ దుష్ప్రచారానికి దిగుతోంది. భారత్ తన సొంత ప్రాంతాలపైనే దాడులు చేసుకుందని ఆరోపించే స్థాయికి దిగజారడం పాక్‌కు మాత్రమే సాధ్యం. సొంత ప్రాంతాలపై దాడులు చేసుకుని నెపాన్ని భారత్‌పైకి నెట్టేవారికి ఇలాంటి కుయుక్తులే తోస్తాయి''అంటూ ఎద్దేవా చేశారు. ''పాక్ కాల్పుల్లో పూంఛ్‌లోని ఓ క్రైస్తవ మిషనరీ స్కూలు వెనక భాగం ధ్వంసమైంది. ఇద్దరు చిన్నారులు మరణించారు. కాల్పుల నేపథ్యంలో స్థానిక క్రైస్తవ నన్స్ తదితరులు బంకర్లలో తలదాచుకుంటున్నారు''అని చెప్పారు.

పౌర విమానాలను కవచం చేసుకునే కుట్ర

భారత్ ప్రతిదాడులు చేయకుండా అడ్డుకునేందుకు పాక్ తన సొంత పౌర విమానాలనే కవచంగా చేసుకునే నైచ్యానికి దిగిందని కల్నల్ ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమిక తెలిపారు. ''పాక్ ఏకపక్ష డ్రోన్ దాడులకు ప్రతిగా వైమానిక దాడులతో భారత్ దీటుగా స్పందిస్తుందని, అది పౌర విమానాలకు తీవ్ర ముప్పని తెలిసి కూడా తమ గగనతలాన్ని మూసేయలేదు. భారత్ సరిహద్దుల వెంబడి తన గగనతలాన్ని పూర్తిగా మూసేసింది. పాక్‌లో మాత్రం లాహోర్, కరాచీ తదితర నగరాల నడుమ దేశీయ విమానాలు తిరుగుతూనే ఉన్నాయి. అంతర్జాతీయ పౌర విమానాలు కూడా పాక్ గగనతలంపై సరిహద్దులకు అతి సమీపంలో ఎగురుతూనే ఉన్నాయి''అని వివరించారు. ఇందుకు సంబంధించి ఫ్లైట్‌రాడార్24 డేటాను మీడియా ముందుంచారు. ''అయినా మన వైమానిక దళం అత్యంత జాగరూకతతో వ్యవహరించింది. పౌర విమానాలకు ఎలాంటి నష్టమూ వాటిల్లని రీతిలో అత్యంత కచ్చితత్వంతో పాక్‌పై ప్రతి దాడులు నిర్వహించింది''అని తెలిపారు.

ఉద్రిక్తతలు చల్లార్చేందుకు

దౌత్య ప్రయత్నాలు

ఇరాన్, సౌదీలతో చర్చలు: పాక్

ఇస్లామాబాద్: ఉద్రిక్తతలను చల్లార్చేందుకు తాము నిత్యం సౌదీ అరేబియా, ఇరాన్, ఖతార్, చైనా వంటి దేశాలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ చెప్పారు. గురువారం సౌదీ విదేశాంగ శాఖ సహాయ మంత్రి అడెల్ అల్ జుబేర్ ఢిల్లీకి రావడం తెల్సిందే. అనంతరం శుక్రవారం ఆయన పాక్ చేరుకున్నారు. ప్రధాని షరీఫ్, ఆర్మీ చీఫ్ మునీర్‌తో చర్చలు జరపనున్న వేళ మంత్రి ఆసిఫ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల భారత్ డ్రోన్లు పాక్ గగనతలంలోకి ప్రవేశించడంపై స్పందిస్తూ.. నిఘా కోసమే తప్ప దాడుల కోసం కాదని భావిస్తున్నామన్నారు.

చొరబాటుకు యత్నించిన

ఏడుగురు ఉగ్రవాదులు హతం

న్యూఢిల్లీ/జమ్మూ: జమ్మూలోని భారత్–పాక్ అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఉగ్రవాదుల చొరబాటు యత్నాన్ని సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) భగ్నం చేసింది. ఏడుగురు జైషే మహ్మద్ ఉగ్రవాదులను హతమార్చింది. ఒక రేంజర్స్ పోస్టును ధ్వంసం చేసింది. గురువారం అర్ధరాత్రి సమయంలో ఈ ఘటన జరిగినట్లు బీఎస్ఎఫ్ శుక్రవారం తెలిపింది. జమ్మూలోని సాంబా సెక్టార్‌లో గురువారం రాత్రి 11 గంటల సమయంలో అనుమానాస్పద కదలికలను బీఎస్ఎఫ్ సిబ్బంది గుర్తించారు. ఉగ్రవాదులు పెద్ద ఎత్తున ఉన్నట్లు నిఘా గ్రిడ్ ద్వారా తెలుసుకున్నారు. ఈ చొరబాటు ప్రయత్నానికి పాకిస్తాన్ రేంజర్స్ పోస్టు ధంధార్ సహకరించింది. ఉగ్రవాదులు ప్రవేశించడానికి ముందు కాల్పులు జరిపింది. దీనిని నిఘా గ్రిడ్ ద్వారా గుర్తించిన బీఎస్ఎఫ్ బలగాలు.. చొరబాటు యత్నాన్ని నిర్వీర్యం చేశాయి. ధంధార్ పోస్టును ధ్వంసం చేశాయి. ఈ క్రమంలో ఏడుగురు ఉగ్రవాదులు మరణించారు. మరింత మంది ఉగ్రవాదులు ఉండే అవకాశం ఉందని, వారిని కూడా మట్టుబెడతామని బీఎస్ఎఫ్ తెలిపింది. పాక్ రేంజర్స్‌కు చెందిన భారీ మెషిన్‌గన్ అమర్చిన బంకర్‌పై కాల్పులు జరిపి ధ్వంసం చేసిన థర్మల్ ఇమేజర్ క్లిప్‌ను బీఎస్ఎఫ్ షేర్ చేసింది.



పాక్ చెయ్యి వదిలేసిన అమెరికా

భారత్-పాక్ ఘర్షణలో జోక్యం చేసుకోబోమని స్పష్టీకరణ

- గతంలో ఘర్షణ జరిగిన ప్రతిసారీ పాక్‌కు అమెరికా వత్తాసు
- ఈసారి పాక్ బుద్ధి తెలిసి దూరం పెట్టిన ట్రంప్ యంత్రాంగం
- విస్పష్టమైన ప్రకటన చేసిన ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్
- దిక్కు తోచని స్థితిలో దాయాది దేశం..

గిల్లి కయ్యం పెట్టుకోవటం.. గట్టిగా నాలుగు దెబ్బలు తగిలేసరికి అమెరికా కాళ్లపై పడి కాపాడాలని వేడుకోవటం.. ఆ దేశం వెంటనే రంగంలోకి దిగి భారత్‌కు నచ్చజెప్పి వెనక్కు తగ్గేలా చేయటం.. 1971 నుంచీ పాకిస్తాన్ తీరు ఇదే. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. పాకిస్తాన్ దుష్టబుద్ధి అమెరికా పాలకులకు కూడా తెలిసి వచ్చింది. పొరుగుదేశంతో నువ్వు గొడవ పెట్టుకుంటే నిన్ను నేనెందుకు కాపాడాలని అమెరికా నిలదీస్తోంది. 'భారత్-పాక్ సైనిక ఘర్షణలో జోక్యం చేసుకోవటం మా పని కాదు'అని అగ్రరాజ్య ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ విస్పష్టమైన ప్రకటన చేశారు. దీంతో దాయాది దేశానికి దిక్కు తోచటం లేదు.

కాపాడుతూ వచ్చిన అమెరికా

1971 యుద్ధం, 1999 కార్గిల్ యుద్ధం, 2001లో ఘర్షణ, 2016 సర్జికల్ స్ట్రైక్స్, 2019 బాలాకోట్ వైమానిక దాడులు.. ఇలా భారత్ చేతిలో చావుదెబ్బ తిన్న ప్రతిసారీ పాకిస్తాన్ పాలకులు రాత్రికి రాత్రి అమెరికాలో వాలిపోయి కాపాడాలని ఆ దేశ పెద్దలకు మొరపెట్టుకున్నారు. నాడు పాకిస్తాన్ పక్షపాతిగా ఉన్న అమెరికా అడిగిందే తడవుగా రంగంలోకి దిగి భారత్‌తో చర్చలు జరిపి శాంతించేలా చేసేది. 1971 యుద్ధ సమయంలో పాక్‌కు మద్దతుగా ఏకంగా అణ్వాయుధాలు గల విమాన వాహక నౌక యూఎస్ఎస్ఆర్ ఎంటర్‌ప్రైజ్ నాయకత్వంలో 7వ ఫ్లీట్‌ను బంగాళాఖాతంలో మోహరించింది. 1999లో జమ్మూకశ్మీర్‌లోని కార్గిల్‌ను ఉగ్రమూకల ముసుగులో పాక్ సైన్యం ఆక్రమించింది. ఆలస్యంగా గుర్తించిన భారత సైన్యం.. భీకర దాడులతో వారిని తరిమికొట్టింది. అంతటితో వదలకూడదని పాక్‌పై సైనిక చర్యకు ప్రణాళిక వేసింది. భారీగా యుద్ధ ట్యాంకులు, ఆయుధాలను సరిహద్దులకు తరలించింది. తన గూఢచారి ఉపగ్రహాల ద్వారా ఈ విషయాన్ని అమెరికా పసిగట్టి పాక్‌కు ఉప్పందించింది. దీంతో భయపడిన నాటి పాక్ ప్రధాని నవాజ్‌షరీఫ్.. అమెరికాకు పరుగు పెట్టి అప్పటి అగ్రరాజ్య అధ్యక్షుడు బిల్ క్లింటన్‌తో సమావేశమయ్యాడు. మొదట కార్గిల్‌ను తాము ఆక్రమించ లేదని బుకాయించిన నవాజ్‌షరీఫ్.. క్లింటన్‌తో సమావేశం తర్వాత 1999, జూలై 12న కార్గిల్ నుంచి వెనక్కు తగ్గుతున్నట్లు ప్రకటించటం గమనార్హం. 2001లో పాక్ ఉగ్రవాదులు భారత పార్లమెంటుపై దాడి చేయటంతో రెండు దేశాలు మరోసారి యుద్ధం ముందు నిలిచాయి. ఆ సమయంలో కూడా పాక్‌ను కాపాడేందుకు అమెరికా జోక్యం చేసుకుంది. తన రాయబారిని ఢిల్లీకి పంపి భారత్‌ను శాంతింపజేసింది. ఇలా దౌత్యంతోపాటు ఎప్పటికప్పుడు ఆయుధాలు, అత్యాధునిక యుద్ధ విమానాలు కూడా సరఫరా చేస్తూ పాకిస్తాన్‌ను అగ్రరాజ్యం కాపాడుతూ వచ్చింది. ఎఫ్-16 సూపర్‌సోనిక్ యుద్ధ విమానాలను కూడా పాక్‌కు అందించింది.


జేడీ వాన్స్

కాలం మారింది.. కథ అడ్డం తిరిగింది

చాలాకాలంపాటు ఆత్మరక్షణ విధానాన్నే అవలంబించిన భారత్.. కొంతకాలంగా దూకుడుగా వెళ్తోంది. అంతర్జాతీయ సమాజంలో పేరుప్రతిష్ఠలు పెంచుకోవటంతోపాటు తెలివైన దౌత్య విధానాలతో కొత్త మిత్రులను సంపాదిస్తోంది. ఈ క్రమంలో భారత్ పట్ల అమెరికా వైఖరిలోనూ స్పష్టమైన మార్పు వచ్చిందని విశ్లేషకులు చెబుతున్నారు. జేడీ వాన్స్ ప్రకటనే అందుకు ఉదాహరణ అని పేర్కొంటున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఘర్షణపై ఇటీవల ఆయన ఓ టీవీ చానల్ ఇంటర్వ్యూలో స్పష్టమైన ప్రకటన చేశారు. 'చూడండి.. ఆయుధాలు వదిలేయాలని భారత్‌కుగానీ, పాకిస్తాన్‌కు గానీ మేము చెప్పలేము. ఈ ఘర్షణలో జోక్యం చేసుకోవటం మా పని కూడా కాదు. దౌత్య మార్గాల ద్వారానే ఈ సమస్యను పరిష్కరించుకోవాలని మేము మొదటి నుంచీ చెబుతున్నాం. ఈ ఘర్షణ తీవ్రస్థాయి యుద్ధంగా, అణు యుద్ధంగా మారబోదనే నమ్ముతున్నాం'అని వాన్స్ పేర్కొన్నారు. వాన్స్ ప్రకటనతో దిక్కుతోచని స్థితిలో పడిన పాక్‌పై.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు మద్దతుదారైన నిక్కీ హేలీ మరో బాంబు వేశారు. పహల్గాంలో సామాన్యులను చంపిన ఉగ్రవాదులను శిక్షించే హక్కు, అధికారం భారత్‌కు ఉన్నాయని ఆమె ఎక్స్ వేదికగా స్పష్టంచేశారు. బాధితురాలిగా నటించొద్దని పాక్‌కు చురకలంటించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్


కశ్మీర్‌లోని ఉరి జిల్లాల్లోని గింగాల్ గ్రామంలో దెబ్బతిన్న దుకాణాన్ని పరిశీలిస్తున్న యజమాని


బారాముల్లాలో పాక్ దాడుల్లో ధ్వంసమైన తన ఇంటిని పరిశీలిస్తున్న వ్యక్తి

జమ్మూకశ్మీర్‌పై కొనసాగుతున్న పాక్ కాల్పులు

- ఇద్దరు మృతి, ఐదుగురికి గాయాలు
- ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న భద్రతా దళాలు

పూంచ్/జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని వివిధ ప్రాంతాల్లో గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజామున వరకు పాక్ జరిపిన కాల్పుల్లో ఇద్దరు పౌరులు చనిపోయారు. ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. మరణించినవారిలో ఒక మహిళ, ఒక పురుషుడు ఉండగా.. ఇరు కుటుంబాలకు చెందినవారు గాయపడ్డారు.

కాల్పుల్లో గ్రామస్తుని మృతి

పూంచ్, రాజౌరీ జిల్లాల్లోని ఫార్వర్డ్ ప్రాంతాల్లో శుక్రవారం తెల్లవారుజామున పాక్ జరిపిన కాల్పుల్లో ఓ వ్యక్తి మృతి చెందాడు. అతని భార్యతో సహా మరో ముగ్గురు గాయపడ్డారు. మృతుడిని లోరాన్ ప్రాంతానికి చెందిన మహ్మద్ అబ్రార్‌గా గుర్తించారు. మెంధర్‌లోని చలేరి ప్రాంతానికి చెందిన లయాఖత్ హుస్సేన్ గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం తెల్లవారుజామున 3.50 గంటల నుంచి 4.45 గంటల మధ్య భారీ పేలుళ్లు సంభవించడంతో అధికారులు వెంటనే సైరన్లు మోగించారు. కశ్మీర్‌లోని కుప్వారా, బారాముల్లా జిల్లాలతో పాటు రాజౌరీ, పూంచ్, జమ్మూ జిల్లాల్లోని ప్రాంతాలపై రాత్రికి రాత్రే కాల్పులు, షెల్లింగ్ జరిగాయి. ఈ కాల్పుల్లో భారీగా ఆస్తి నష్టం వాటిల్లిందని, పలు ఇళ్లు, వందలాది వాహనాలు ధ్వంసమయ్యాయని అధికారులు తెలిపారు. పాకిస్తాన్ దాడుల నేపథ్యంలో జమ్మూ ప్రాంతంలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలను మూసివేశారు. సీనియర్ పోలీసు అధికారులు భద్రతా చర్యలను పర్యవేక్షించారు. నియంత్రణ రేఖ వెంబడి ఉన్న ప్రాంతాల ప్రజలను జమ్మూతో పాటు పూంచ్, రాజౌరీ జిల్లాల్లోని సురక్షిత ప్రాంతాలకు తరలించామని, శిబిరాల్లో ఉంచామని అధికారులు తెలిపారు.

ఉరి సెక్టార్‌లో మహిళ మృతి

ఉరి సెక్టార్‌లోని నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ) సమీప ప్రాంతాల్లో పాక్ దళాలు గురువారం రాత్రి జరిపిన కాల్పుల్లో ఓ మహిళ మృతి చెందారు. ఆమె కుటుంబ సభ్యులు ఇద్దరు గాయపడ్డారు. ఉత్తర కశ్మీర్‌లోని బారాముల్లా జిల్లా ఉరి సెక్టార్‌లోని సిలికోట్, బోనియార్, కమల్‌కోట్, మొహ్రా, గింగ్లే ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని భారీ షెల్లింగ్ జరిగిందని అధికారులు తెలిపారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తుండగా మొహ్రా సమీపంలో కారును షెల్ ఢీకొనడంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలించగా నర్గీస్ బేగం అనే మహిళ మృతి చెందారు. షెల్లింగ్‌తో పలు భవనాలు ధ్వంసమయ్యాయి. ఇక శుక్రవారం ఉరి సెక్టార్‌లోని టూర్నా పోస్టులో ఉన్న గోహలన్, చోటాలీ ప్రాంతాల్లో పాక్ బలగాలు కాల్పులు జరిపాయి. భారత పోస్టులు, పౌర ప్రాంతాలపై విచక్షణారహితంగా కాల్పులు జరిపాయి. అయితే ఈ ప్రాంతాల్లో ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం జరిగినట్లు సమాచారం లేదు.

నిత్యావసరాలపై ఆందోళన..!

- వదంతులను నమ్మొద్దని ప్రజలకు కేంద్రం సూచన
- అవసరానికి మించి నిల్వలు: వ్యవసాయ మంత్రి

సాక్షి, న్యూఢిల్లీ: పాకిస్తాన్‌తో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ సరిహద్దు రాష్ట్రాల ప్రజల్లో నిత్యావసర సరుకుల లభ్యతపై ఆందోళన మొదలైంది. అదనంగా ఆహారం, ఇంధనం కొనుగోలు చేసేందుకు జనం పరుగులు పెడుతున్న ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ముఖ్యంగా పంజాబ్, హరియాణా, జమ్మూకశ్మీర్, రాజస్తాన్ రాష్ట్రాల్లో ఈ ధోరణి ఒక్కసారిగా పెరిగిపోయింది. ఇదే అవకాశంగా చేసుకొని కొందరు సోషల్ మీడియాలో ఆహార, ఇంధన కొరత ఏర్పడనుందంటూ తప్పుడు ప్రచారం మొదలు పెట్టారు. దీంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఆహార నిల్వల అందుబాటుపై వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ శుక్రవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. కృత్రిమ కొరత సృష్టించకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.


పుష్కలంగా ఆహార ధాన్యాలు

ఉద్రిక్తతల నేపథ్యంలో ఆహారధాన్యాల అందుబాటుపై కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి స్పష్టతనిచ్చారు. 'ప్రజల ఆహార భద్రతను నిర్ధారించడం ప్రభుత్వ బాధ్యత. దేశంలో వినియోగానికి తగినంత ఆహార నిల్వలు అందుబాటులో ఉన్నాయి. అవసరానికి మించి నిల్వ ఉన్నాయి. బియ్యం, గోధుమలు, పప్పుధాన్యాలన్నీ పుష్కలంగా ఉన్నాయి. బియ్యం, గోధుమల సరఫరాను 4 నుంచి 5 శాతానికి పెంచాం. హోల్‌సేల్ వ్యాపారులు, రిటైలర్లు కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు విక్రయించినా అత్యవసర వస్తువుల చట్టం కింద కఠిన చర్యలు తప్పవు. తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు. అదనంగా కొనుగోలు చేసేందుకు మార్కెట్లకు పరుగులు తీయొద్దు'అని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

చండీగఢ్‌లో నిల్వలపై నిషేధం..

సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో చండీగఢ్‌లో శుక్రవారం ప్రజలు మార్కెట్‌లకు పోటెత్తారు. అదనంగా కొని నిల్వ పెట్టుకునేందుకు జనం పోటీలు పడ్డారు. దీంతో చండీగఢ్‌లో నిత్యావసర వస్తువుల నిల్వలను నిషేధిస్తూ జిల్లా మేజిస్ట్రేట్ ఉత్తర్వులు ఇచ్చారు. 'ఏ వ్యక్తి, వ్యాపారులు, టోకు, రిటైలర్లు బియ్యం, గోధుమలు, పప్పుధాన్యాలు, చక్కెర, నూనెలు, కూరగాయలు, పాల ఉత్పత్తులు, మందులు, పెట్రోల్, డీజిల్ వంటి అవసరమైన వస్తువులను నిల్వ చేయరాదు'అని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్ వంటి అంశాలపై అధికారులకు సమాచారం ఇవ్వాలని అందులో సూచించారు.

ఇంధన నిల్వలు పుష్కలం : దేశంలో పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ వంటగ్యాస్ నిల్వలు పుష్కలంగా అందుబాటులో ఉన్నాయని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వ రంగ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐవోసీఎల్), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(బీపీసీఎల్), హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌పీసీఎల్)శుక్రవారం ప్రకటించాయి. దేశ వ్యాప్తంగా ఇంధన నిల్వల కొరత ఏర్పడినట్లు సోషల్ మీడియాల్లో వార్తలు, పెట్రోల్ పంపుల వద్ద ప్రజలు క్యూలో నిల్చున్న ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న నేపథ్యంలో పైవిధంగా స్పందించాయి.



తుర్కియే సోంగర్లు

పాకిస్తాన్ దాడులు వీటితోనే..

ప్రమాదకర డ్రోన్లుగా గుర్తింపు

మెషీన్‌గన్స్, క్షిపణులు ప్రయోగించగల సత్తా

రియల్‌టైమ్ నిఘా పెట్టడంలో దిట్ట

భారత త్రివిధ దళాల ముప్పేట దాడులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న పాకిస్తాన్.. కొత్త కుయుక్తులతో యుద్ధానికి దిగుతోంది. సంప్రదాయ ఆయుధాలకు బదులుగా అత్యాధునిక డ్రోన్లతో భారత్‌పై దాడులు చేసేందుకు ప్రయత్నిస్తోంది. వీటిలో పాక్ మిత్రదేశం తుర్కియే తయారుచేసిన అత్యంత ప్రమాదకరమైన అసిస్‌గార్డ్ సోంగర్ సాయుధ యూఏవీలు ఉండటం కాస్త కలవరపెడుతోంది. ఎందుకంటే ఆధునిక యుద్ధ పద్ధతుల్లో సోంగర్ డ్రోన్లు సమర్థవంతమైనవిగా నిరూపించుకున్నాయి. వీటిని బహుళ ప్రయోజనాల కోసం వినియోగించుకోవచ్చు. గురువారం రాత్రి భారత్‌లోని 36 మిలిటరీ, పౌర లక్ష్యాలపై సోంగర్ డ్రోన్లతోనే పాక్ దాడిచేసినట్లు మన రక్షణ శాఖ ప్రకటించింది. వాటిని సమర్థంగా కూల్చేసినట్లు శుక్రవారం మీడియా సమావేశంలో కల్నల్ సోఫియా ఖురేషీ తెలిపారు. సోంగర్ డ్రోన్లను సమర్థంగా అడ్డుకోగల గగనతల రక్షణ వ్యవస్థలు మనకు ఉన్నప్పటికీ.. వాటిని తక్కువగా అంచనా వేయకూడదని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు.

సోంగర్ డ్రోన్ల ప్రత్యేకతలు ఇవీ..

- సోంగర్ డ్రోన్లను తుర్కియేలోని అంకారా కేంద్రంగా పనిచేస్తున్న అసిస్‌గార్డ్ సంస్థ తయారుచేసింది. వీటిని 2019 నుంచి వినియోగిస్తున్నారు.
- ఈ డ్రోన్లు స్వయంచాలితంగా ప్రయాణించి లక్ష్యాలపై దాడులు చేసి తిరిగి గ్రౌండ్ కంట్రోల్ స్టేషన్‌కు చేరుకోగలవు. రిమోట్ కంట్రోల్‌తో కూడా నియంత్రించవచ్చు. ఆధునిక యుద్ధ తంత్రంలో ఇవి కీలకంగా పనిచేయగలవు. సరిహద్దులు దాటి దాడులు చేయటంలో వీటికి మంచి రికార్డు ఉంది.

ప్రమాదకర సాయుధ డ్రోన్

సోంగర్ డ్రోన్‌కు ఒక అత్యాధునిక ఆటోమేటిక్ మెషీన్ గన్ అమర్చబడి ఉంటుంది. చిన్నపాటి క్షిపణులను కూడా ఇది ప్రయోగించగలదు. 81 ఎంఎం మోర్టార్ రౌండ్స్‌ను పేల్చగలదు. వ్యక్తులు, వాహనాలు, ఎంపికచేసిన చిన్నపాటి లక్ష్యాలపై సమర్థంగా దాడి చేయగలదు.

ఫ్లైట్ పెర్ఫార్మెన్స్

సోంగర్ డ్రోన్లు 45 కిలోల బరువును మోసుకెళ్లగలవు. పేలోడ్ లేకుండా ఏకబిగిన 25 నుంచి 30 నిమిషాల వరకు గగనతలంలో ఎగరగలవు. గ్రౌండ్ కంట్రోల్ స్టేషనుంచి 3–5 కిలోమీటర్ల దూరం వరకు ఇవి దాడులు చేయగలవు. సముద్రమట్టం నుంచి 2,800 మీటర్లు, భూ మట్టం నుంచి 400 మీటర్ల ఎత్తువరకు ఇవి ఎగరగలవు.

రియల్‌టైమ్ ఇంటెలిజెన్స్

లక్ష్యాలపై నిఘా పెట్టడంలో కూడా సోంగర్ డ్రోన్లది అందెవేసిన చెయ్యి. ఇవి గగనతలంలో ఎగురుతూ గ్రౌండ్ స్టేషన్‌కు రియల్‌టైమ్ (ప్రత్యక్షంగా)లో వీడియోలు, చిత్రాలను పంపగలవు. దాడుల తర్వాత జరిగిన నష్టాన్ని కూడా విశ్లేషించి వెంటనే గ్రౌండ్ స్టేషన్‌కు పంపుతాయి. రాత్రి-పగలు అన్న తేడా లేకుండా ఎలాంటి వాతావరణంలో అయినా ఈ డ్రోన్లు నిఘా పెట్టగలవు. రాత్రిపూట వీడియోలు, చిత్రాలు తీసేందుకు వీటిలో ఇన్‌ఫ్రారెడ్ కెమెరాలు ఉంటాయి.

స్వయంచాలితం

ఈ డ్రోన్లను గ్రౌండ్ స్టేషన్ నుంచి రిమోట్ కంట్రోల్‌తో నియంత్రించవచ్చు. అవసరమైతే వాటికవే స్వయంగా ఎగురుతూ నిర్దేశిత లక్ష్యాలపై దాడులు చేయగలవు. గ్రౌండ్ స్టేషన్‌తో సంబంధాలు తెగిపోయినా వాటికవే తిరిగి స్టేషన్‌ను వెతుక్కుంటూ తిరిగి రాగలవు. బ్యాటరీలో చార్జింగ్ తగ్గిపోయినా వెంటనే గ్రౌండ్ స్టేషన్‌కు వచ్చేస్తాయి. దీంతో వీటిని నియంత్రించే వారికి పని సులువు అవుతుంది.

గుంపుగా దాడిచేయగల సామర్థ్యం

సోంగర్ డ్రోన్లు ఒక్కొక్కటిగా నిర్దేశించిన లక్ష్యాలతోపాటు దాడులు చేయటంతోపాటు గుంపులుగా కూడా వెళ్లి దాడులు చేయగలవు. పదుల సంఖ్యలో ఒకేసారి ఆకాశంలోకి ఎగిరినప్పుడు స్వయంగా సమన్వయం చేసుకుంటూ లక్ష్యంపై నలు దిక్కుల నుంచి దాడి చేస్తాయి. శత్రువు రక్షణ వ్యవస్థను గందరగోళపర్చి సమర్థంగా దాడులు చేయగల సత్తా వీటికి ఉంది. గురువారం భారత్‌లోని పలు లక్ష్యాలపై ఇలాగే దాడులు చేసినట్లు గుర్తించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

పాక్ ఆర్మీ చీఫ్‌కు మరిన్ని అధికారాలు

ఇస్లామాబాద్: ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునిర్‌కు మరిన్ని అధికారాలు కట్టబెడుతూ పాకిస్తాన్ సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న సామాన్యులను సైతం మిలటరీ కోర్టుల్లో విచారించి, శిక్షించే అధికారం ఇప్పుడు ఆర్మీ చీఫ్‌కు దఖలు పడింది. దీంతో, దేశంలో అసమ్మతిని ఉక్కుపాదంతో అణచి వేస్తున్న మునిర్‌తో న్యాయవ్యవస్థ వంతపాడినట్లయింది. మునిర్ స్థానం పదిలం కావడంతోపాటు అధికారాన్ని మరింత విస్తరించుకునే అవకాశమేర్పడింది. భారత్‌తో యుద్ధం కొనసాగుతున్న వేళ ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. ఇమ్రాన్ ఖాన్ సారథ్యంలోని పాకిస్తాన్ తెహ్రీక్ ఇ-ఇన్సాఫ్ కార్యకర్తలు 2023 మే 9వ తేదీన ఆర్మీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టి సైనిక వసతులపై దాడులు చేశారు. ఇందుకు కారకులనే ఆరోపణలపై అధికారికంగా వెయ్యిమందిని, అనధికారికంగా వేలాది మందిని సైన్యం అదుపులోకి తీసుకుంది. అయితే, ఇలాంటి దాడుల్లో పాల్గొన్న వారిని సైనిక కోర్టుల్లో విచారించరాదనే నిబంధన ఉండటంతో మునిర్ ఇప్పటి దాకా ఏమీ చేయలేకపోయారు. తాజాగా, సుప్రీం ఇచ్చిన రూలింగ్‌తో ఇమ్రాన్ అనుచరులను విచారించి, శిక్షలు విధించేందుకు అవకాశమేర్పడింది. సుప్రీంకోర్టు రూలింగ్‌ను ఇమ్రాన్ ఖాన్ పార్టీ పీటీఐ తీవ్రంగా వ్యతిరేకించింది.

పంజాబ్‌లో క్షిపణి శకలాలు

హోషియార్‌పూర్/భటిండా/జైపూర్: పాకిస్తాన్‌తో యుద్ధం కొనసాగుతున్న వేళ పంజాబ్‌లోని హోషియార్‌పూర్, భటిండా జిల్లాల్లో క్షిపణి విడి భాగాలుగా భావిస్తున్న శకలాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. గురువారం రాత్రి హోషియార్‌పూర్ జిల్లాలోని పొలంలో క్షిపణి భాగాలుగా భావిస్తున్న లోహపు శకలాలను గ్రామస్తులు గమనించారు. సమాచారం అందుకున్న ఎయిర్‌ఫోర్స్ బలగాలు ఆ ప్రాంతాన్ని దిగ్బంధించి, విచారణ చేపట్టాయి. అదేవిధంగా, భటిండా జిల్లాలో గురువారం రాత్రి గుర్తు తెలియని శకలాలు రెండు ప్రాంతాల్లో పడిపోయాయి. అంతకుముందు మెరుపులు మెరవడంతోపాటు, పెద్ద శబ్దం వినిపించిందని రైతులు తెలిపారు. శకలాలు పడిన ప్రాంతంలో ఓ ఇంటి కిటికీలు, తలుపులు, పశువుల షెడ్ ధ్వంసమయ్యాయన్నారు. శకలాలు పడిన ప్రాంతంలో మూడడుగుల లోతు గుంత ఏర్పడిందని రైతులు తెలిపారు. ఇందుకు సంబంధించిన సమాచారం ఆర్మీకి మాత్రమే తెలుస్తుందని స్థానిక పోలీసులు తెలిపారు. అయితే, ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదన్నారు. ఆ శకలాలను తాకవద్దని స్థానికులను హెచ్చరించారు. భటిండా జిల్లా బుర్జ్ మహిమా గ్రామంలోనూ లోహపు శకలాలు కనిపించాయి. పఠాన్‌కోట్ జిల్లాలో షెల్ వంటి లోహపు శకలం కనిపించిందని అధికారులు తెలిపారు. గురువారం పాకిస్తాన్ ఈ ప్రాంతంపై ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణులను భారత బలగాలు ధ్వంసం చేయడం తెల్సిందే.

రాజస్తాన్‌లో బాంబు స్వాధీనం

రాజస్తాన్‌లోని జైసల్మేర్ జిల్లా కిషన్‌ఘాట్ ప్రాంతంలో శుక్రవారం బాంబు వంటి వస్తువు కనిపించడం కలకలం రేపింది. నర్సరీ వద్ద ఈ వస్తువు కనిపించడంతో, ముందు జాగ్రత్తగా చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేసి, దగ్గరికి వెళ్లకుండా చర్యలు తీసుకున్నామని కొత్వాలీ పోలీస్ స్టేషన్ అధికారులు తెలిపారు. ఆర్మీ అధికారులు నిర్వీర్యం చేయనున్నారని వివరించారు. గురువారం సాయంత్రం జైసల్మేర్‌లో భారీ శబ్దాలతో పేలుళ్లు గంటపాటు కొనసాగడంతో, అధికారులు విద్యుత్ సరఫరాను పూర్తి స్థాయిలో నిలిపేశారు.

పాక్ పక్కలో బల్లెం బలూచిస్తాన్

- సైన్యంపై విరుచుకుపడుతున్న బలూచ్ రెబల్స్
- తాజా దాడుల్లో 16 మంది పాకిస్తాన్ సైనికులు హతం
- గ్యాస్ పైపులైన్లు, ఇంధన నిల్వలు సైతం ధ్వంసం
- తిరుగుబాటుదార్ల అధీనంలోకి రాజధాని క్వెట్టా

ఇస్లామాబాద్: భారత సైనికదళాలు చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో బెంబేలెత్తుతున్న పాకిస్తాన్‌కు నైరుతి ప్రాంతంలో బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ నుంచి మరిన్ని ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. బలూచిస్తాన్ తిరుగుబాటుదార్లు అదనుచూసి మరీ పాక్ సైన్యంపై దాడులకు దిగుతున్నారు. తాడో పేడో తేల్చుకోవడానికి ఇదే సరైన సమయమన్న భావన వారిలో కనిపిస్తోంది. తూర్పున భారత్, పశ్చిమాన బలూచిస్తాన్ రెబల్స్ దాడులతో పాకిస్తాన్ ఉక్కిరిబిక్కిరవుతోంది. గురువారం రాత్రి భారత్‌పై డ్రోన్లు, క్షిపణులు ప్రయోగించడంలో తీరికలేకుండా ఉన్న పాకిస్తాన్ సైన్యం మరోవైపు నుంచి వస్తున్న ముప్పును ఎదుర్కోవడంలో విఫలమైంది. బలూచ్ ఫైటర్లు పాక్ సైన్యంపై విరుచుకుపడ్డారు. ఇరువర్గాల మధ్య భీకర ఘర్షణ జరిగింది. ఈ దాడుల్లో ఏకంగా 16 మంది పాకిస్తాన్‌సైనికులు మరణించినట్లు తెలిసింది. మరోవైపు బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో పలు కీలక ప్రాంతాలను రెబల్స్ స్వాధీనం చేసుకున్నారు. అక్కడ పాకిస్తాన్ జాతీయ జెండాలను తొలగించి, తమ జెండాలు ఎగురవేసి పాక్ సార్వభౌమత్వానికి సవాలు విసిరారు. బలూచిస్తాన్ రాజధాని క్వెట్టా సైతం తిరుగుబాటుదార్ల అధీనంలోకి వచ్చినట్లు సమాచారం. ''పాకిస్తాన్‌కు వీడ్కోలు, కొత్త దేశం బలూచిస్తాన్‌కు స్వాగతం'' అంటూ స్థానిక రచయిత మీర్ యార్ బలూచ్ 'ఎక్స్'లో పోస్టుచేశారు. కొత్తగా అవతరించిన బలూచిస్తాన్‌లో రాయబార కార్యాలయాలు ఏర్పాటు చేయాలని, దౌత్య సంబంధాలు ఏర్పరచుకోవాలని ప్రపంచ దేశాలకు ఆయన పిలుపునిచ్చారు.

తిరుగుబాటు ఉధృతం

స్వతంత్ర బలూచిస్తాన్ దేశం కోసం దశాబ్దాలుగా పోరాటం సాగుతోంది. పాకిస్తాన్ నుంచి విడిపోతామన్న డిమాండ్లు నానాటికీ బలం పుంజుకుంటున్నాయి. ప్రజా ఉద్యమాలను పాక్ సైన్యం కర్కశంగా అణచివేస్తోంది. ఇప్పటికే ఎన్నో తిరుగుబాటు గ్రూప్‌లు పుట్టుకొచ్చాయి. ప్రధానంగా బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ చురుగ్గా కార్యకలాపాలు సాగిస్తోంది. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్-పాకిస్తాన్ మధ్య యుద్ధం ప్రారంభం కావడం బలూచిస్తాన్ రెబల్స్‌కు అందివచ్చిన అవకాశంగా మారింది. గురువారం పలు తిరుగుబాటు గ్రూప్‌లు ఉమ్మడిగా పాక్ సైన్యంతో తలపడ్డాయి. సైన్యానికి సంబంధించిన ఆస్తులు, మౌలిక సదుపాయాలపైనా దాడులకు దిగాయి. రెబల్స్ శుక్రవారం క్వెట్టాలోని ఫైజాబాద్ ప్రాంతంలో పాక్ సైన్యంపై దాడులకు పాల్పడ్డారు. సిబ్బీ మిలటరీ క్యాంపుపై హ్యాండ్ గ్రనేడ్ ప్రయోగించారు. బుధవారం బలూచిస్తాన్‌లో గ్యాస్ పైపులైన్లు, ఇంధన నిల్వలపై దాడికి దిగారు. ఈ ఘటనలో ప్రభుత్వానికి భారీగా నష్టం వాటిల్లినట్లు స్థానిక మీడియా తెలియజేసింది.


బలూచ్ రెబల్స్

ప్రధాని షహబాజ్ పిరికిపంద

దుమ్మెత్తిపోసిన పాక్ ఎంపీ ఖట్టక్

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా 'ఆపరేషన్ సిందూర్'కొనసాగుతున్న వేళ ఆ దేశానికి చెందిన ఎంపీ చేసిన వ్యాఖ్యల వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. అందులో..పాక్ ఎంపీ షాహిద్ అహ్మద్ ఖట్టక్ ప్రధాని షహబాజ్ షరీఫ్‌ను పిరికిపంద అని దూషించినట్లుగా ఉంది. భారత ప్రధాని మోదీ పేరును సైతం ఉచ్చరించేందుకు ఆయన భయపడుతున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నైతికంగా దిగజారిన పాక్ ఆర్మీ, చేష్టలుడిగి చూస్తోందని, ఈ క్లిష్టమైన సమయంలో సొంత బలగాలకు సైతం మద్దతుగా నిలిచే పరిస్థితిలో లేదని ఎంపీ విమర్శించారు. 'టిప్పు సుల్తాన్ చెప్పిన మాటలు గుర్తుకొస్తున్నాయి. అగ్రభాగాన సింహం ఉంటే నక్కలతో కూడిన సైన్యం సైతం సింహం మాదిరిగానే పోరాడుతుంది. అదే నక్క సారథ్యంలోని ఆర్మీలో సింహాలున్నా పోరాడ లేక ఓడిపోతుంది'అని ఎంపీ ఖట్టక్ వ్యాఖ్యానించారు. 'మన సైనికులు ఇప్పుడు సరిహద్దుల్లో ఉన్నారు. వారిలో ధైర్యాన్ని నూరిపోయాల్సింది ఎవరు? మన నేత, మన ప్రధాని. ఈ సవాల్‌ను మన ప్రధాని ధైర్యంతో స్వీకరించాలి. కానీ, ఆయన మోదీ పేరును సైతం ఉచ్చరించలేనంత పిరికివాడు. సరిహద్దుల్లోని మన జవాన్లకు ఏం సందేశం ఇస్తాడు?'అని అందులో షహబాజ్ షరీఫ్‌ను ఎంపీ దుయ్యబట్టారు.

మన రహస్యాలు దాచేందుకే భారత్ డ్రోన్లను ఆపలేదు

మరోసారి విచిత్ర ప్రకటన చేసిన పాక్ రక్షణ మంత్రి ఖవాజా

న్యూఢిల్లీ: భారత్‌తో సైనిక ఘర్షణ ప్రారంభమైనప్పటి నుంచి చిత్ర విచిత్ర ప్రకటనలు చేస్తూ పరువు పోగొట్టుకుంటున్న పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్.. మరోసారి అలాంటి ప్రకటనే చేశారు. శుక్రవారం పాక్ పార్లమెంటులో ప్రసంగించిన ఆయన.. భారత్ నుంచి వచ్చిన డ్రోన్లను ఆపకుండా తామే కావాలని వదిలేశామని చెప్పారు. 'నిన్నటి డ్రోన్ (భారత్) దాడులు నిజానికి మన సైనిక రహస్యాలను తెలుసుకొనేందుకు చేసినవి. ఇది సాంకేతిక అంశం. సాంకేతిక పరిభాషలో నేను వివరించలేను. కానీ, ఆ డ్రోన్లను అడ్డుకోకపోవటానికి కారణం మన సైనిక రహస్యాలు బహిర్గతం కాకుండా కాపాడటమే. వాటిని అడ్డుకొని ఉంటే.. మన సైనిక రహస్యాలు బయటపడి ఉండేవి. అందుకే అవి సురక్షిత ప్రాంతాలకు చేరుకున్న తర్వాత కూల్చేశాం'అని వివరించారు.

నృసింహుడి జయంతి ఉత్సవాలు ప్రారంభం


నృసింహుడి జయంతి ఉత్సవాలకు శ్రీకారం చుడుతున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీనృసింహస్వామి జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. స్వయంభువులకు ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం స్వస్తి వాచనం, విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షా బంధనం వేడుకలు చేపట్టారు. ఉత్సవమూర్తుల చెంత లక్ష కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం తిరువేంకటపతిగా శ్రీనృసింహస్వామిని అలంకరించి.. ఆలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగించారు. సాయంత్రం శ్రీస్వామి వారిని పరవాసుదేవుడిగా అలంకరించి ఆలయ తిరువీధుల్లో ఊరేగించారు. ఇక అనుబంధ ఆలయమైన పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో సైతం శ్రీనృసింహ జయంతి ఉత్సవాలను ప్రారంభించారు. వేడుకల్లో ఆలయ ఈవో వెంకట్రావ్, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి పాల్గొన్నారు.

భారత్ విజయం సాధించాలని పూజలు


శివాలయంలో చండీహవనం నిర్వహిస్తున్న అర్చకులు. పాల్గొన్న ఆలయాధికారులు

యాదగిరిగుట్ట: పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో భారత దేశం విజయం సాధించాలని యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం ఈవో వెంకట్రావ్ ఆధ్వర్యంలో అర్చకులు, అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీస్వామి వారి జయంతి ఉత్సవాలను ప్రారంభించే ముందే ఆలయంలో.. 'ఆపరేషన్ సిందూర్'లో పాల్గొన్న భారత త్రివిధ దళాలకు విజయం కలగాలని ప్రత్యేక పూజలు జరిపించారు. ఇక కొండపైనే అనుబంధ శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో చండీ హవనాన్ని అర్చకులు జరిపించారు. భారతదేశం విజయం సాధించేందుకు శ్రీనృసింహస్వామి, మహా శివుడు మరింత శక్తిని ఇవ్వాలని పూజలు జరిపినట్లు అర్చకులు వెల్లడించారు.

సరస్వతీ పుష్కరాలకోసం ప్రత్యేక అధికారుల నియామకం

సాక్షి, హైదరాబాద్: సరస్వతీ పుష్కరాల నిర్వహణలో సహకరించేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక అధికారులను నియమించింది. పుష్కరాల పారిశుద్ధ్య నిర్వహణ పర్యవేక్షణకు మొత్తం 50 మంది అధికారులను నియమిస్తూ పీఆర్‌ఆర్‌డీ డైరెక్టర్ డా.జి.సృజన శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆదేశాల మేరకు...ఈ విధుల కోసం నలుగురు డీపీవోలు, నలుగురు డీఎల్‌పీవోలు, 14 మంది ఎంపీడీవోలు, 28 మంది ఎంపీవోలను నియమించారు. వీరంతా జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్‌కు రిపోర్ట్ చేయాల్సిందిగా ఈ ఆదేశాల్లో డైరెక్టర్ పేర్కొన్నారు. ఈ నెల 15 నుంచి 31వ తేదీల మధ్యలో నిర్వహిస్తున్న సరస్వతి పుష్కరాల్లో పారిశుద్ధ్య లోపం తలెత్తకుండా కిందిస్థాయి సిబ్బందితో ఈ అధికారులు సమన్వయం చేస్తారని తెలియజేశారు.

జొన్న 'మద్దతూ' దళారీకే

బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.2,000తో కొన్న దళారులు, వ్యాపారులు
- క్వింటాల్‌కు మద్దతు ధర రూ.3,371తో కొనుగోలు చేస్తున్న మార్క్‌ఫెడ్
- 60కి పైగా కొనుగోలు కేంద్రాల ఏర్పాటు... రైతుల ముసుగులో దళారుల ప్రవేశం
- రైతుల నుంచి కొన్న జొన్నలు.. మార్క్‌ఫెడ్ కేంద్రాల్లో విక్రయం
- ఏపీలోని వివిధ ప్రాంతాల నుంచి తెచ్చి ఇక్కడ విక్రయాలు



సాక్షి, హైదరాబాద్: రైతులకు దక్కాల్సిన మద్దతు ధర.. దళారులు, ప్రైవేట్ వ్యాపారుల జేబుల్లోకి చేరుతోంది. పత్తి, వరి నుంచి జొన్నల కొనుగోళ్లలోనూ అదే దందా సాగుతోంది. రైతుల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకొని అతి తక్కువ ధరకు పంటను కొనుగోలు చేస్తున్నారు. రైతుల ముసుగులో అదే పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి దళారులు, ప్రైవేట్ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలో ఈ యాసంగి సీజన్‌లో 3.67 లక్షల ఎకరాల్లో హైబ్రిడ్ జొన్నలు సాగయ్యాయి. మార్చి నెలాఖరు నుంచే పంట రైతుల చేతికొచ్చింది. కేంద్ర ప్రభుత్వం జొన్నలకు మద్దతు ధర క్వింటాల్‌కు రూ.3,371 ప్రకటించింది. మార్క్‌ఫెడ్ మే ఒకటో తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా 60కి పైగా కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోళ్లు ప్రారంభించింది.

ముందే దళారుల వద్దకు చేరిన పంట

మార్చి నెలలో జొన్నలు చేతికిరాగా, అప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కాలేదు. మరోవైపు ఆర్థిక అవసరాలను ఆసరాగా తీసుకొని దళారులు మార్చి నెలాఖరు నుంచే రైతుల నుంచి కొనుగోళ్లు ప్రారంభించారు. ఆయా జిల్లాల్లో క్వింటాల్‌కు రూ.2,000 నుంచి రూ.2,300 వరకు చెల్లించి ఎక్కువ మొత్తంలో పంటను కొనుగోలు చేశారు. మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలు తెరిచిన తర్వాత రైతులతోపాటు దళారులు కూడా పెద్ద ఎత్తున జొన్నలను కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తున్నట్టు తెలిసింది. ఒక రైతు ఎకరాకు 14 క్వింటాళ్ల వరకు జొన్నలను విక్రయించుకునే వెసులుబాటు ఉంది. దీంతో ఆయా జిల్లాల్లోని రైతుల నుంచి పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డులు తీసుకొని, కౌలు రైతుల పేరిట దళారులే జొన్నలను మార్క్‌ఫెడ్ కేంద్రాల్లో విక్రయిస్తున్నట్టు ఫిర్యాదులున్నాయి. దీనికి మార్క్‌ఫెడ్ అధికారులతోపాటు కొనుగోలు కేంద్రాల బాధ్యులు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నట్టు క్షేత్రస్థాయి నుంచి వస్తున్న సమాచారం.

ఏపీలో వివిధ జిల్లాల నుంచి కూడా..

రాష్ట్రంలోని దళారులే కాక, ఏపీలోని వివిధ జిల్లాల నుంచి వ్యాపారులు కూడా రైతుల ముసుగులో తెలంగాణలో జొన్నలను విక్రయిస్తున్నట్టు తెలుస్తోంది. అక్కడ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కాకపోవడంతో పల్నాడు, రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలలో బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ. 2,000 ఆపై ధరలకు విక్రయించారు. ఆ జొన్నలు కొనుగోలు చేసిన వ్యాపారులు ఇప్పటికే తెలంగాణలోని వివిధ జిల్లాల్లో స్థానిక మార్క్‌ఫెడ్ కేంద్రాల నిర్వాహకుల సహకారంతో రైతుల ముసుగులో విక్రయిస్తున్నట్టు తెలిసింది. రైతుల ఆధార్‌కార్డులు, పాస్ పుస్తకాలు తీసుకొని, వారికి రూ.300 వరకు చెల్లిస్తున్నట్టు ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఓ రైతు తెలిపారు. ఆదిలాబాద్, నిర్మల్, కామారెడ్డి, సంగారెడ్డితోపాటు వికారాబాద్ , ఆసిఫాబాద్ తదితర జిల్లాల్లో ఈ దందా సాగుతున్నట్టు తెలిసింది. ఆదిలాబాద్‌కు చెందిన ఓ మార్క్‌ఫెడ్ అధికారి ఈ దందాలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలిసింది.

రాష్ట్రంలో ఈ సీజన్‌లో 3,67,440 ఎకరాల్లో జొన్న పంటను సాగు చేశారు. అందులో అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లాలో 1.37 లక్షల ఎకరాలు కాగా, సంగారెడ్డిలో 84 వేలు, కామారెడ్డిలో 71 వేలు, నిర్మల్‌లో 41 వేల ఎకరాల్లో పంట సాగైంది. వికారాబాద్, మెదక్, ఆసిఫాబాద్, గద్వాల్ వంటి జిల్లాల్లో కూడా 7వేల నుంచి 13 వేల ఎకరాల వరకు పంట సాగైంది. మరికొన్ని జిల్లాల్లో అక్కడక్కడా జొన్న సాగు చేశారు. గత సంవత్సరం కన్నా ఈ ఏడాది 1.30 లక్షల ఎకరాల్లో అధికంగా జొన్న సాగు చేశారు. 3 లక్షల మెట్రిక్ టన్నుల వరకు దిగుబడి వచ్చినట్టు తెలుస్తోంది. ఇందులో బహిరంగ మార్కెట్‌లో విక్రయించిందిపోగా, కొనుగోలు కేంద్రాల నుంచి లక్షన్నర మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేయాలని భావిస్తోంది. 100 శాతం పంటను కేంద్ర ప్రభుత్వం ద్వారా సెంట్రల్ పూల్‌కే పంపిస్తుండడంతో ఒక్కో రైతు నుంచి ఎకరానికి 14 క్వింటాళ్ల జొన్నల కొనుగోలుకు కేంద్రం ఆమోదం లభించింది. దీనిని ఆసరాగా చేసుకొని అక్రమ మార్గాల ద్వారా జొన్నల విక్రయం యథేచ్ఛగా సాగుతోంది.

లక్ష మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు అంచనా

అధికార లాంఛనాలతో గ్రేహౌండ్స్ జవాన్ల అంత్యక్రియలు

- మందుపాతరకు బలైన సందీప్, శ్రీధర్
- నివాళులర్పించిన సీపీ సుధీర్‌బాబు, ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు, కలెక్టర్ గౌతమ్ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, షబ్బీర్ అలీ, ఎంపీ సురేశ్ షెట్కార్


సందీప్ కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న శ్రీధర్‌బాబు


శ్రీధర్ తల్లి, భార్యను ఓదారుస్తున్న పొన్నం, షబ్బీర్‌అలీ

ఘట్‌కేసర్/మాచారెడ్డి: ములుగు జిల్లా కర్రెగుట్టల్లో మావోయిస్టులు అమర్చిన మందుపాతరలకు బలైన ఘట్‌కేసర్‌కు చెందిన తిక్క సందీప్, కామారెడ్డికి చెందిన వడ్ల శ్రీధర్ అంత్యక్రియలు అధికార లాంఛనాలతో నిర్వహించారు. పలువురు నేతలు హాజరై నివాళులు అర్పించారు. మరణించిన జవాన్ల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఘట్‌కేసర్ పట్టణంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన గ్రేహౌండ్స్ కమాండో తిక్క సందీప్ అంత్యక్రియలు శుక్రవారం అధికార లాంఛనాలతో వేలాది మంది మధ్యన నిర్వహించారు. ఎంపీ ఈటల రాజేందర్, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, స్పీకర్ గడ్డం ప్రసాద్, రాచకొండ సీపీ సుధీర్‌బాబు, కలెక్టర్ గౌతం మృతుడి ఇంటికి చేరుకొని పార్థివదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. శ్రీధర్‌బాబు మాట్లాడుతూ సీఎం ఆదేశం మేరకు మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటామని చెప్పారు. మందుపాతర పేలి మృతి చెందిన గ్రేహౌండ్స్ జవాన్ వడ్ల శ్రీధర్ (30) అంత్యక్రియలను శుక్రవారం కామారెడ్డి జిల్లా పాల్వంచ మండల కేంద్రంలో నిర్వహించారు. రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్ చంద్ర అంత్యక్రియల్లో పాల్గొని నివాళులు అర్పించారు. మృతుడి భార్య శ్రీవాణి, తల్లి లక్ష్మిలను ఓదార్చారు.

జవాన్ల కుటుంబాలకు రూ.కోటి పరిహారం
సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన

సాక్షి, హైదరాబాద్: ములుగు జిల్లాలో మావోయిస్టులు మందుపాతర పేల్చి కాల్పులు జరిపిన ఘటనలో మృతిచెందిన ముగ్గురు కానిస్టేబుళ్లకు సీఎం రేవంత్‌రెడ్డి సంతాపం ప్రకటించారు. అమరులైన కానిస్టేబుళ్ల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని, ప్రభుత్వపరంగా వారికి అన్ని రకాల ఆర్థిక సాయం అందించాలని అధికారులను ఆదేశించారు. ఒక్కో కానిస్టేబుల్ కుటుంబానికి ప్రభుత్వం రూ.కోటి స్పెషల్ ఎక్స్‌గ్రేషియా అందిస్తుందని ప్రకటించారు. భద్రత స్కీమ్‌లో రూ.80 లక్షలు, మూడు వందల గజాల ఇంటి స్థలం కేటాయించటంతో పాటు కుటుంబీకుల్లో అర్హులైన వారికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామన్నారు. చనిపోయిన వారిలో మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌కు చెందిన సందీప్(27), కామారెడ్డి జిల్లా పల్వంచకు చెందిన వడ్ల శ్రీధర్(29), ఏపీలోని ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన కానిస్టేబుల్ పవన్‌కల్యాణ్ (23) ఉన్నారు.

ప్రభుత్వాలు ఉచితాలపై ఆలోచించాలి

- సమయం ఆసన్నమైందన్న హైకోర్టు
- ప్రజలు కూడా పరిగణనలోకి తీసుకోవాలని వ్యాఖ్య
- గ్రాట్యుటీ పొందడం ఉద్యోగి హక్కు అని వెల్లడి
- పిటిషనర్ బకాయిలు 10 రోజుల్లో చెల్లించాలని ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై అవగాహన లేకుండా ఇష్టారాజ్యంగా ప్రభుత్వాలు ఇస్తున్న ఉచితాలపై ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందని హైకోర్టు అభిప్రాయపడింది. ఆర్థిక పరమైన అంశాలు, పథకాలు అనేవి శాసన పరిధిలోకి వస్తాయని.. న్యాయ పరమైన పరిశీలనకు అతీతంగా ఉంటాయని చెబుతూనే.. ప్రజలు కూడా పథకాలపై యోచన చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. 'రాజకీయ పార్టీలు నిధులు వనరులపై స్పష్టత లేకుండా పథకాలు ప్రకటించడం ఆందోళనకరం. ఇది దేశ ఆర్థిక శ్రేయస్సును దెబ్బతీస్తుంది'అని గతంలో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించింది. ఉద్యోగ విరమణ పొందినా ప్రయోజనాలు అందజేయలేదని ఓ వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. ఉద్యోగ విరమణ పొందిన అసిస్టెంట్ ఇంజనీర్ ప్రయోజనాలను దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంచడాన్ని తప్పుబట్టింది. 10 రోజుల్లోగా గ్రాట్యుటీ సహా ఇతర ప్రయోజనాలను విడుదల చేయాలని ఆదేశించింది. ఉద్యోగ విమరణ పొందినవారు బకాయిల కోసం పెద్ద ఎత్తున న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తున్నారని పేర్కొంది. 40 ఏళ్లుగా సేవలు అందించి ఉద్యోగ విరమణ పొందినా, రావాల్సిన బకాయిలు చెల్లించడం లేదని హైదరాబాద్‌కు చెందిన రిటైర్డ్ అసిస్టెంట్ ఇంజనీర్ ఏ నరేందర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇప్పటికి పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా ఎలాంటి పురోగతి లేదన్నారు.

ఉద్యోగులంతా కోర్టును ఆశ్రయిస్తున్నారు


ఈ పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది రాము వాదనలు వినిపిస్తూ.. 'ఉచిత విద్యుత్, నీరు, ప్రజా రవాణా, వ్యవసాయ రుణమాఫీలు, ఇతర సబ్సిడీల వంటి ఉచితాల ద్వారా నిధులను పెద్ద ఎత్తున పథకాలను తరలిస్తున్నారు. ఏళ్లుగా ప్రభుత్వంలో విధులు నిర్వర్తించిన ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు మాత్రం చెల్లించడం లేదు. ఉద్యోగ విరమణ పొందిన వారికి వృద్ధాప్యంలో హక్కుగా రావాల్సిన గ్రాట్యుటీ, ఇతర చెల్లింపులు చేయడం లేదు. ప్రభుత్వం నడవడానికి కావాల్సిన ఆర్థిక వనరులను ఏకపక్షంగా సంక్షేమాల పేరిట తరలిస్తున్నారు. గ్రాట్యుటీ చెల్లింపు చట్టం ప్రకారం ఆలస్యమైనా, చెల్లింపులపై వడ్డీని పొందేందుకు ఉద్యోగులు అర్హులు'అని నివేదించారు. ఆర్థిక పరిమితులు కారణంగా నిధులు విడుదల కాలేదని ప్రభుత్వ న్యాయవాది అంగీకరించారు. నిధుల లభ్యత మేరకు వరుసగా చెల్లింపులు చేస్తామని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు దాఖలు చేస్తున్న ఇటువంటి రిట్ పిటిషన్ల సంఖ్య పెరగడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 'ఉద్యోగ విరమణ తర్వాత వారి డబ్బు అందుబాటులో ఉంటుందనే నమ్మకంతో జీపీఎఫ్ వంటి పథకాల ద్వారా ఆదా చేస్తారు. వారి ప్రయోజనాలను విడుదల చేయడంలో జాప్యం ఈ నమ్మకాన్ని ఉల్లంఘించడమే కాకుండా వారిని ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టివేస్తుంది'అని పేర్కొన్నారు. పిటిషనర్ బకాయిలు చెల్లించాలని చెబుతూ విచారణ ముగించారు.

ఆ అంధులకు పూర్తి ప్రయోజనాలు చెల్లించండి: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ వికలాంగుల కో–ఆపరేటివ్ కార్పొరేషన్ (ఏపీవీసీసీ)కు చెందిన ఏడుగురు అంధులకు పూర్తి వేతన ప్రయోజనాలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ప్రభుత్వం వారిని తొలగిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసింది. వాస్తవ వయసు ఆధారంగా పూర్తి వేతనాలు, ప్రయోజనాలతో చెల్లింపులు చేయాలని కార్పొరేషన్‌కు స్పష్టం చేసింది. 1988–1990 మధ్య కార్పొరేషన్‌లో చేరిన హైదరాబాద్‌కు చెందిన సిరికొండ మల్లేశ్‌తోపాటు మరో ఆరుగురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌లోని ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగం నిర్వహించిన వయసు నిర్ధారణ ప్రక్రియ ఆధారంగా 2012, ఆగస్టులో తమను బలవంతంగా పదవీ విరమణ చేయించారన్నారు. ఎలాంటి నోటీసు, స్పందించే అవకాశం ఇవ్వకుండా తమను ఏకపక్షంగా తొలగించారన్నారని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది రామ్‌నరేశ్ కుమార్ వాదనలు వినిపిస్తూ.. వీరందరూ అంధులని, ప్రభుత్వ నిర్ణయం కారణంగా జీవనోపాధిని కోల్పోయారని నివేదించారు. వయసుపై వివాదం ఉండటంతో నిర్ధారణ కోసం కార్పొరేషన్ ఒక వైద్య బోర్డును నియమించిందని, పదవీ విరమణ వయసును చేరుకున్నారని తేల్చిన తరువాతే పదవీ విరమణ పొందారని ప్రభుత్వ న్యాయవాది పేర్కొన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పుట్టిన తేదీ ఆధారంగా ఉద్యోగంలోకి తీసుకున్న తర్వాత దానిని మారుస్తూ విధాన పరమైన నిర్ణయం తీసుకోవడంలో కార్పొరేషన్ సరైన విధానం అనుసరించలేదని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా, వయసు నిర్ధారణకు శాస్త్రీయమైన అన్ని విధానాలను పాటించకుండా తొలగింపు సరికాదన్నారు. పిటిషనర్లపై చర్యలు ఏకపక్షమని, వారి పూర్తి వేతన ప్రయోజనాలు అందించాలని ఆదేశించారు.

మంజీరలో జలసిరులు!

మండు వేసవిలో చెక్‌డ్యాంల నిండా నీరు • పరీవాహక ప్రాంతంలో పుష్కలంగా భూగర్భజలాలు • ఏటా రెండు పంటలు పండిస్తున్న రైతులు



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి/బాన్సువాడ/బిచ్కుంద: మండుటెండల్లోనూ మంజీర నది జలసవ్వడి చేస్తోంది. ఏడాది పొడవునా నీరు పారుతుండడంతో నది పరీవాహక ప్రాంతంలో బోర్లు ఎత్తిపోస్తున్నాయి. రైతులు ఏటా రెండు పంటలు తీస్తున్నారు. మంజీర నదిలో నిర్మించిన చెక్ డ్యాంలతో నది గర్భంలో నీరు నిల్వ ఉండటంతో, పరీవాహక ప్రాంతంలో భూగర్భ జలాల సమస్య లేకుండాపోయింది. నది పొడవునా వేలాది ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. మహారాష్ట్రలోని బీడ్ జిల్లా బాలాఘాట్ ప్రాంతంలో పుట్టిన మంజీర నది కర్ణాటక మీదుగా తెలంగాణలోని సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల మీదుగా ప్రవహిస్తూ నిజామాబాద్ జిల్లాలోని కందకుర్తి వద్ద గోదావరి నదిలో కలుస్తుంది. దాదాపు 724 కిలోమీటర్ల మేర ప్రవహించే మంజీర నది లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు లక్షల మంది దాహార్తి తీరుస్తోంది.. ఈ నదిపై ఘనపురం ఆనకట్ట, సింగూరు, నిజాంసాగర్ ప్రాజెక్టులు నిర్మించారు. మంజీర నది పొడవునా ప్రతిచోటా రైతులు బోర్లు తవ్వించి నీటిని ఎత్తిపోసుకుంటున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువన నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి మండలాల్లోని గ్రామాలు.. ప్రాజెక్టుకు దిగువన నిజాంసాగర్, మహ్మద్‌నగర్, బిచ్కుంద, బాన్సువాడ, పిట్లం మండలాల పరిధిలో వందలాది బోర్ల ద్వారా పంటలు పండిస్తున్నారు.

మండు వేసవిలోనూ పుష్కలంగా నీరు

మంజీర నదిపై చెక్ డ్యాంల నిర్మాణంతో దాదాపు పది కిలోమీటర్ల దూరం నదిలో నీరు నిల్వ ఉంటోంది. దీంతో మంజీర నదికి ఇరువైపులా ఉన్న బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల పరిధిలోని ఇరవైకి పైగా గ్రామాల్లో భూగర్భ జలాలు వృద్ధి చెంది బోర్లు నిండుగా పోస్తున్నాయి. బిచ్కుంద, బాన్సువాడ, పిట్లం మండలాల పరిధిలోని చింతల నాగారం, తాడ్కోల్, బొల్లక్‌పల్లి, మద్దెల చెరువు, గుండెనెమ్లి, దామరంచ, చింబోలి, రైతునగర్ బండరెంజల్, అన్నారం తదితర గ్రామాల పరిధిలో భూగర్భజలాలు సమృద్ధిగా లభిస్తున్నాయి.

చెక్‌డ్యాంలతో భారీగా నీటి నిల్వ


నిజాంసాగర్ ప్రాజెక్టు దిగువన బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల పరిధిలో మంజీర నదిపై నిర్మించిన చెక్‌డ్యాంలు వేసవి కాలంలోనూ నిండుకుండల్లా కనిపిస్తున్నాయి. బాన్సువాడ పట్టణానికి సమీపంలో చింతల నాగారం వద్ద నిర్మించిన భారీ చెక్‌డ్యాంతో కిలోమీటర్ల మేర నీరు నిలిచి ఉంది. ఎండాకాలంలో కూడా చెక్‌డ్యాం పై నుంచి నీరు పారుతోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తరువాత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మంజీర నదిపై చెక్‌డ్యాంల నిర్మాణానికి పూనుకుంది. బాన్సువాడతో పాటు బీర్కూర్ సమీపంలో రెండు చెక్‌డ్యాంల నిర్మాణానికి రూ.44.28 కోట్లు మంజూరు చేసింది. బాన్సువాడ సమీపంలోని చెక్ డ్యాం అప్పట్లోనే పూర్తయ్యింది. బీర్కూర్ వద్ద చెక్‌డ్యాం నిర్మాణ పనులు ఏళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. నీటి పారుదల శాఖ నిజాంసాగర్ డివిజన్ పరిధిలో చెక్ డ్యాంల నిర్మాణానికి రూ.65.35 కోట్లు మంజూరు చేశారు. అందులో రెండు మాత్రమే పూర్తయ్యాయి. నిజాంసాగర్‌కు దిగువన మల్లూరు వద్ద నాగమడుగు ఎత్తిపోతల పథకానికి అప్పటి ప్రభుత్వం రూ.476.25 కోట్లు మంజూరు చేసింది. ఈ పథకం పూర్తయితే నిజాంసాగర్, మహ్మద్‌నగర్ మండలాలకు భూగర్భ జల సమస్య తీరుతుంది.

రెండు పంటలు పండుతున్నాయి



చెక్‌డ్యాంల మూలంగా భూగర్భ జలాలు పెరిగాయి. ఊటలు పెరిగి బోర్లలో నీరు పుష్కలంగా ఉంటోంది. దీంతో ఏటా రెండు పంటలు పండిస్తున్నాం. నీటి సమస్య తీరడంతో పంటల దిగుబడి కూడా పెరిగింది. – అనిల్‌రెడ్డి, రైతు, గుండెనెమ్లి

భూగర్భజలాలు పెరిగాయి



చెక్‌డ్యాంలు నిర్మించడం వల్ల నదిలో నీరు నిలిచి భూగర్భజలం పెరిగింది. బోర్లు నిరాటంకంగా పోస్తున్నాయి. చాలామంది మంజీర ఒడ్డున బోర్లు వేయించి ఐదు కిలోమీటర్ల దూరం కూడా నీటిని తీసుకువెళుతున్నారు. – బాగారెడ్డి, రైతు, గుండెనెమ్లి

ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్లో మళ్లీ సహాయక చర్యలు

- సాంకేతిక కమిటీ సమావేశంలో నిర్ణయం


(ఫైల్)

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్‌ఎల్‌బీసీ) టన్నెల్ ప్రమాదంలో చిక్కుకుపోయిన వారి ఆచూకీ కోసం మళ్లీ అన్వేషణ చేపట్టాలని సాంకేతిక కమిటీ నిర్ణయం తీసుకుంది. అయితే దీనికి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రాక్ మెకానిక్స్ సహకారం తీసుకోవాలని, ఆ సంస్థ సూచించిన పద్ధతిని పాటిస్తూ సహాయ చర్యలు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. టన్నెల్‌లో సహాయ చర్యల కోసం ఏర్పాటు చేసిన సాంకేతిక కమిటీ శుక్రవారం జలసౌధలో సమావేశమయింది. ఈ సమావేశానికి జాతీయ విపత్తుల స్పందన సంస్థ (ఎన్డీఆర్‌ఎఫ్) ఎన్జీఆర్‌ఐ, జీఎస్‌ఐ, నేషనల్ సెంటర్ ఫర్ సెస్మాలజీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రాక్ మెకానిక్స్, బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్, ఎస్‌ఆర్‌ఎఫ్, నీటిపారుదల శాఖ అధికారులు హాజరయ్యారు. శిథిలాలను నెమ్మదిగా తరలిస్తూ.. సొరంగం పైకప్పు లైనింగ్ చేసుకుంటూ, ముందుకెళ్లాలని రాక్ మెకానిక్స్ సూచించింది. సొరంగంలో చిక్కుకుపోయిన వారి అచూకీ కోసం జయప్రకాశ్ అసోసియేట్స్ (జేపీ) ఆధ్వర్యంలో సహాయ చర్యలు వేగిరం చేయాలని నిర్దేశించారు. గత ఫిబ్రవరి 22వ తేదీన సొరంగంలో పైకప్పు కూలి.. 8 మంది చిక్కుకుపోగా రెండు మృతదేహాలు వెలికితీశారు. మరో ఆరుగురి ఆచూకీ లభించలేదు. సొరంగం చివర్లో ప్రమాదం జరిగిన చోట ఉన్న 50 మీటర్లు అత్యంత ప్రమాదకర ప్రదేశమని, ఆ 50 మీటర్లు ముందుకెళ్లడం ఏ మాత్రం శ్రేయస్కరం కాదని నిపుణులు హెచ్చరించడంతో గత నెల 24న సొరంగంలో సహాయ చర్యలు నిలిపివేశారు. అక్కడ జాతీయ భూభౌగోళిక పరిశోధన సంస్థ (ఎన్జీఆర్‌ఐ) ద్వారా జియో ఫిజికల్ పరీక్షలు చేయించాలని నిర్ణయించారు. దీనికి రెండు లేదా మూడు నెలలు పట్టవచ్చని, నివేదిక వచ్చాక సొరంగం తవ్వడానికి అవసరమైన పనులు చేపట్టాలని నిర్ణయానికి వచ్చారు. సొరంగం ఇన్‌లెట్ వైపు నుంచి డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ విధానంలో తవ్వకం చేపట్టాలని భావిస్తున్నారు. మరోవైపు ఔట్ లెట్ (మన్నెవారిపల్లి, అచ్చంపేట) వైపు టీబీఎం కోసం తెచ్చిన బేరింగ్‌ను బిగించడానికి నవంబర్ దాకా సమయం పడుతుందని నిర్మాణ సంస్థ చెపుతోంది.

సాక్షి హైదరాబాద్

శనివారం। 10। మే। 2025



వాతావరణం
నగరంలో శనివారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్ఠంగా 38, కనిష్ఠంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.



అందాల భామకు ఆత్మీయ స్వాగతం

శనివారం మిస్ వరల్డ్ పోటీలు ప్రారంభం కానున్న నేపథ్యంలో.. మాజీ ప్రపంచ సుందరి క్రిస్టినా పిస్కోవా శుక్రవారం శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుంది. ఆమెకు తెలంగాణ సంప్రదాయ రీతిలో స్వాగతం లభించింది.

‘మిస్ వరల్డ్’ పోటీల ఏర్పాట్లపై నిరంతర పర్యవేక్షణ

జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్



గచ్చిబౌలిలోని స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్‌వీ కర్ణన్

గచ్చిబౌలి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించతలపెట్టిన ‘మిస్ వరల్డ్’ పోటీలకు పటిష్టమైన ఏర్పాట్లు చేశామని, వీటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో మిస్ వరల్డ్ కార్యక్రమం నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గచ్చిబౌలి స్టేడియం, పరిసరాల్లో శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. స్టేడియం చుట్టూ పోటీలకు సంబంధించిన వివరాలు తెలిసేలా ప్రచార సామగ్రిని పెట్టించాలని అడ్వర్టైజ్‌మెంట్ అదనపు కమిషనర్‌ను ఆయన ఆదేశించారు. కమిషనర్ వెంట వెస్ట్‌జోన్ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ బోఖడే హేమంత్ సహదేవ్‌రావు, అడ్వర్టైజ్‌మెంట్ అదనపు కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి తదితరులు తున్నారు.

500 మంది పోలీసులతో బందోబస్తు

మాదాపూర్ డీసీపీ వినీత్

గచ్చిబౌలి: మిస్ వరల్డ్ పోటీలకు 500 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్ తెలిపారు. శుక్రవారం ఆయన గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియాన్ని పరిశీలించి, బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. మాదాపూర్ జోన్‌లో నిర్వహించే మిస్ వరల్డ్ ఈవెంట్‌కు సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి నేతృత్వంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలకు అనుగుణంగా భద్రత ఏర్పాట్లు ఉంటాయన్నారు. దాదాపు 500 మంది పోలీసులతో వివిధ చోట్ల బందోబస్తు నిర్వహిస్తున్నామని చెప్పారు. భారత్, పాక్ సరిహద్దులో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఎలాంటి సమాచారం ఉన్నా పోలీసులకు తెలియజేయాలని సూచించారు. సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

నెల రోజుల్లో 24 మంది అరెస్టు

- ఆరు రాష్ట్రాల్లో సైబర్ కాప్స్ ఆపరేషన్లు
- బాధితులకు రూ.1.49 కోట్లు రిఫండ్



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు గత నెలలో వివిధ సైబర్ నేరాలకు సంబంధించి ఆరు రాష్ట్రాల్లో ఆపరేషన్లు నిర్వహించారు. ఆయా కేసుల్లో బ్యాంకు ఖాతాలు అందించిన, సమకూర్చిన వారు సహా మొత్తం 24 మందిని అరెస్టు చేశారు. మరోపక్క నేరగాళ్ల బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజ్ అయిన మొత్తంలో రూ.1.49 కోట్లు బాధితులకు రిఫండ్ చేయించారు. పట్టుబడిన నేరగాళ్లలో ఢిల్లీకి చెందిన వారు 11 మంది, బిహార్‌కు చెందిన వారు ఒకరు, మహారాష్ట్రకు చెందిన వారు ఐదుగురు, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లకు సంబంధించి ముగ్గురు చొప్పున ఉన్నారు. వీరిపై తెలంగాణతో పాటు దేశ వ్యాప్తంగా 313 కేసులు నమోదై ఉన్నట్లు గుర్తించారు. 45 కేసుల్లో బాధితులుగా మారిన వారికి రూ.1.49 కోట్లు రిఫండ్ చేశారు.

అమర్‌నాథ్ యాత్రికులకు యుద్ధ భయం

ఫిట్‌నెస్ సర్టిఫికెట్లకు దరఖాస్తులు చేసుకోని వైనం

గాంధీఆస్పత్రి: మంచులింగాన్ని దర్శించుకునే అమర్‌నాథ్ యాత్రికులకు ప్రస్తుతం యుద్ధ భయం నెలకొంది. శుక్రవారం రోజంతా గాంధీ వైద్య బృందం ఎదురు చూసినా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం యాత్రికులెవరూ దరఖాస్తు చేసుకోకపోవడం గమనార్హం. సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో అమర్‌నాథ్‌కు వెళ్లే యాత్రికులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు మంజూరు చేస్తారు. ఈ సర్టిఫికెట్ లేకుంటే అమర్‌నాథ్ సమీపంలోని చెకింగ్ పాయింట్ల వద్ద కేంద్ర భద్రత బలగాలు యాత్రకు నిరాకరిస్తారు. ఈ నేపథ్యంలో గత నెలలో గాంధీ ఆస్పత్రిలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ ప్రారంభమైంది. వీటి కోసం మొదట్లో క్యూ కట్టిన యాత్రికులు ప్రస్తుతం భారత్– పాక్ మధ్య యుద్ధం నెలకొనడంతో క్రమంగా పలచబడ్డారు. ఈ నెల 7న కేవలం ఆరుగురు యాత్రికులు దరఖాస్తు చేసుకోగా, శుక్రవారం ఒక్కరు కూడా దరఖాస్తు చేసుకోకపోవడం గమనార్హం.



గ్రేటర్‌లోని పలు కేంద్రాల్లో ఆమ్యామ్యాల వ్యవహారం

- అక్రమార్జనే లక్ష్యంగా వాహనాల నమోదు, బదిలీలు, లైసెన్సులు
- గతంలో ఓ ఆర్టీఓపై క్రమశిక్షణ చర్యలు
- అయినా.. యథేచ్ఛగా కొనసాగుతున్న అవినీతి తతంగం



ఆర్టీఏలో ‘ఫేక్ అడ్రస్’

నకిలీ చిరునామాలతో రవాణా శాఖ పౌర సేవలు

సాక్షి, సిటీబ్యూరో:

వాహన పర్మిట్ బదిలీ కోసం దాని యజమాని నుంచి రూ.40 వేలు వసూలు చేసినట్లు నగరంలోని బండ్లగూడ ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఓ అధికారిపై కొద్దిరోజుల క్రితం ఫిర్యాదులు రావడంతో.. అతడిని అక్కడి నుంచి రవాణా కమిషనర్ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఇలా పర్మిట్ బదిలీయే కాదు.. అడిగినంత సమర్పించుకుంటే ఎలాంటి సర్వీసులైనా ఇక్కడ తేలిగ్గా లభిస్తాయనే ఆరోపణలున్నాయి. డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల బదిలీలు, కొత్త బండ్ల నమోదు సహా వివిధ రకాల పౌరసేవలు ఇక్కడ అంగడి సరుకుల్లా అమ్ముడవుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బండ్లగూడ కార్యాలయంలో తప్పుడు చిరునామాలతో వాహన అక్రమ రిజిస్ట్రేషన్లకు అడ్డుకట్ట పడటంలేదు. గతంలో ఇదే వ్యవహారంలో ఇక్కడి ఆర్టీఓపై క్రమశిక్షణ చర్యలు కూడా తీసుకున్నారు. కాగా.. ఈ అక్రమాల తంతు ఒక్క బండ్లగూడ కార్యాలయంలోనే కాదు.. నగరంలోని పలు ప్రాంతీయ రవాణా కార్యాలయాల్లో యథేచ్ఛగా కొనసాగుతున్నట్లు.. ‘ఫేక్ అడ్రస్’లకు చిరునామాలుగా మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చిరునామా ఎంతో కీలకం..

డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్‌లు, చిరునామా బదిలీలు, పర్మిట్ బదిలీలు వంటి వివిధ రకాల సేవల్లో వాహనదారుడి అడ్రస్‌ను ఎంతో కీలకంగా పరిగణిస్తారు. తప్పుడు వ్యక్తులు, అసాంఘిక శక్తుల చేతుల్లోకి వాహనాలు వెళ్లకుండా, అలాంటి వ్యక్తులు డ్రైవింగ్ లైసెన్సులను పొందకుండా నియంత్రించేందుకు కచ్చితమైన అడ్రస్‌ను సమర్పించాల్సి ఉంటుంది. ఆధార్, ఓటర్ గుర్తింపు, బ్యాంకు ఖాతా పుస్తకం, వంటగ్యాస్ డాక్యుమెంట్లు, కరెంట్ బిల్లు చెల్లింపు రసీదు తదితర 13 రకాల పత్రాలను చిరునామా ధ్రువీకరణకు ప్రామాణికంగా భావిస్తారు. కాగా.. సదరు వాహనదారు సమర్పించింది నిజమైనవో కాదో నిర్ధారించుకోవాలి. ఆ తర్వాతే పౌర సేవలను అందజేయాలి. కానీ కొన్ని ఆర్టీఏ కార్యాలయాల్లో ఎలాంటి నిర్ధారణ లేకుండానే పౌరసేవలను అంగడి సరుకుల్లా విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కాగా.. బండ్లగూడ ప్రాంతీయ రవాణా కార్యాలయానికి ప్రతిరోజూ సుమారు 120 లెర్నింగ్ లైసెన్సులను అందజేస్తే వాటిలో కనీసం 40 వరకు తప్పుడు అడ్రస్‌లపై జారీ చేసినవే ఉంటాయని ఆర్టీఏ అధికారి ఒకరు విస్మయం వ్యక్తం చేశారు. ఇందులో ఇతర రాష్ట్రాలకు చెందినవారివే ఎక్కువగా ఉంటాయన్నారు.

అడ్డుకుంటున్నా ఆగడంలేదు..

‘వివిధ రకాల పౌరసేవల కోసం వచ్చే వారి అడ్రస్‌లను పరిశీలించినప్పుడు మా కార్యాలయం పరిధిలోకి రానివి, తప్పుడు డాక్యుమెంట్‌లను సమర్పించినవి గుర్తించి అడ్డుకుంటున్నాం. కానీ అలాంటి వ్యక్తులు నగరంలో ఇతర ఆర్టీఏ కార్యాలయాల నుంచి యథేచ్ఛగా తమకు కావాల్సిన సర్వీసులను పొందుతున్నారు.’’ అని ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో పని చేసే ఒక అధికారి తెలిపారు. ‘ప్రతిరోజూ 100 నుంచి 120 లెర్నింగ్‌లు ఇస్తేనే గిట్టుబాటవుతుందని భావించే సిబ్బంది ఉన్నచోట స్క్రూటినీ చేస్తే కనీసం 30 శాతం తప్పుడు అడ్రస్‌లే నమోదైనట్లు తేలుతుంది’ అని మరో అధికారి చెప్పడం గమనార్హం. వాహనదారులు సమర్పించే అడ్రస్ పత్రాలు అసలివో, నకిలీవో నిర్ధారించే వ్యవస్థ లేకపోవడమే దీనికి కారణమని జూబ్లీహిల్స్‌కు చెందిన డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులు ఒకరు అభిప్రాయపడ్డారు.

2030 నాటికి గ్రేటర్ విద్యుత్ డిమాండ్ 9,089 మెగావాట్లు

- దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ అంచనా

పవర్ పంచ్!



గ్రేటర్‌లో 2030 నాటికి విద్యుత్ వృద్ధి రేటు ఇలా..

సంవత్సరం	మెగావాట్లు
2022	3,158
2023	3,435
2024	3,756
2025	4,352
2026	5,043
2027	5,843
2028	6,770
2029	7,644
2030	9,089

సాక్షి, సిటీబ్యూరో: నగరం శరవేగంగా విస్తరిస్తోంది. శివారు మున్సిపాలిటీల్లో భారీ బహుళ అంతస్తుల భవనాలు, పరిశ్రమలు పెద్ద సంఖ్యలో వెలుస్తున్నాయి. గృహ, వాణిజ్య, పారిశ్రామిక విద్యుత్ కనెక్షన్లు ఏటా పెరుగుతూనే ఉన్నాయి. ఫలితంగా గ్రేటర్‌లో విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయిలో నమోదవుతోంది. 2024 గ్రేటర్ గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 3,756 మెగావాట్లు నమోదు కాగా, 2025లో 4,352 మెగావాట్లకు చేరుకుంది. అదే 2030 నాటికి అనూహ్యంగా 9,089 మెగావాట్లకు పెరుగుతుందని డిస్కం అంచనా వేసింది. ఆ మేరకు విద్యుత్ లైన్ల విస్తరణ పనులకు శ్రీకారం చుట్టింది.

62 లక్షలకుపైగా విద్యుత్ కనెక్షన్లు

ప్రస్తుతం గ్రేటర్ పరిధిలో గృహ, వాణిజ్య, పారిశ్రామిక విద్యుత్ కనెక్షన్లు 62 లక్షలకుపైగా ఉన్నట్లు అంచనా. మరో ఐదేళ్లలో ఇవి 80 లక్షలు దాటే అవకాశం ఉంది. రాబోయే డిమాండ్‌ను ఇప్పుడే గుర్తించి 24 గంటలు విద్యుత్ వెలుగులు విరజిమ్మేలా డిస్కం భావిస్తోంది. ఇప్పటికే ఉన్న సబ్‌స్టేషన్లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, 33/11 కేవీ ఫీడర్లు, డీటీఆర్‌లు సామర్థ్యం పెంచుతున్న డిస్కం.. తాజాగా మరికొన్ని అదనపు సబ్‌స్టేషన్లు, లైన్ల విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. వచ్చే రెండేళ్లలో రూ.420 కోట్ల అంచనాతో రంగారెడ్డి జోన్‌లో 34, మెట్రో జోన్‌లో 36, మేడ్చల్ జోన్‌లో 18 చొప్పున మొత్తం 88 కొత్త 33/11 కేవీ సబ్‌స్టేషన్లు నిర్మించాలని లక్ష్యంగా నిర్ణయించింది.

ప్రాథమిక విచారణ తర్వాతే ఎఫ్ఐఆర్

హైడ్రా ఠాణా విషయంలో కమిషనర్ కీలక నిర్ణయం

- దుర్వినియోగం, బెదిరింపులకు తావులేకుండా చర్యలు
- న్యాయశాఖ ఉత్తర్వుల తర్వాత అధికారికంగా పని మరూ

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) పోలీసుస్టేషన్ కార్యకలాపాలకు సంబంధించి కమిషనర్ ఏవీ రంగనాథ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. దురుద్దేశాలతో కూడిన, తప్పుడు ఫిర్యాదులకు చెక్ చెప్పడానికి ప్రాథమిక విచారణ (పీఈ) విధానాన్ని ప్రవేశపెడుతున్నారు. ఎలాంటి ఫిర్యాదు వచ్చినా ఈ విచారణ పూర్తి చేసి, నేరానికి సంబంధించిన ప్రాథమిక ఆధారాలు లభించిన తర్వాతే హైడ్రా ఠాణాలో కేసు నమోదవుతుంది. ప్రతి ఫిర్యాదును కమిషనర్ క్షుణ్ణంగా పరిశీలించి, సిఫార్సు చేసిన తర్వాతే పోలీసుస్టేషన్‌కు చేరుతుంది. హైడ్రా పోలీసుస్టేషన్ డిజిగ్నేటెడ్ కోర్టుకు సంబంధించి న్యాయశాఖ ఉత్తర్వులు జారీ తర్వాత అధికారికంగా పని చేయడం ప్రారంభించనుంది.

కొన్ని ఫిర్యాదుల వెనుక అనేక ఉద్దేశాలు...

ప్రభుత్వ భూములు, లే అవుట్లలో ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాలు, పార్కులు, చెరువులు, కుంటలు, నాలాల కబ్జాలకు సంబంధించిన కేసుల్ని హైడ్రా ఠాణా నమోదు చేయనుంది. వీటితో పాటు నిర్మాణాల కోసం ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ వంటి వాటిని ధ్వంసం చేసినా పరిగణనలోకి తీసుకుంటోంది. ఇప్పటి వరకు తమ దృష్టికి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ముందుకు వెళ్తున్న హైడ్రా అధికారులు తీవ్రమైన అంశాలు, నకిలీ పత్రాల సృష్టి, ఫోర్జరీ వంటివి గుర్తిస్తున్నారు. ఆయా ఆక్రమణల్ని తొలగించడంతో పాటు బాధ్యులపై స్థానిక ఠాణాల్లో ఫిర్యాదులు చేస్తున్నారు. కాగా.. హైడ్రాకు వస్తున్న ఫిర్యాదుల్లో కొన్ని వ్యక్తిగత విభేదాలు, కక్షసాధింపు చర్యలు, బెదిరింపుల దందాలతో ముడిపడి ఉంటున్నాయి. దీన్ని పరిగణనలోకి తీసుకున్న కమిషనర్ రంగనాథ్ హైడ్రా ఠాణాలో కేసుల విషయంలో కీలక నిర్ణయం తీసుకున్నారు.

అవసరమైతే సుమోటో కేసులు..

కబ్జాలు, ప్రజా ఆస్తుల ధ్వంసానికి సంబంధించి ఫిర్యాదు చేయాలని భావించిన వారు నేరుగా హైడ్రా ఠాణాకు వెళ్లినా వెంటనే కేసు నమోదు కాదు. ఆ ఫిర్యాదును జనరల్ డైరీలో (జీడీ) ఎంట్రీ చేసే సిబ్బంది కమిషనర్ దృష్టికి తీసుకురావాల్సి ఉంటుంది. కమిషనర్ సిఫార్సు మేరకు సిబ్బంది విచారణ చేపడతారు. ఫిర్యాదుతో జత చేసిన పత్రాలు, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులతో పాటు ఆయా శాఖలు, విభాగాలకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తారు. ఈ వివరాలతో పీఈ పూర్తి చేసి.. నేరం జరిగినట్లు ప్రాథమిక ఆధారాలు జోడించి కమిషనర్‌కు నివేదిక ఇస్తారు. ఆపై ఆయన ఆమోదంతో కేసు నమోదవుతుంది. నేరం ఏ సంవత్సరంలో జరిగిందో పరిగణనలోకి తీసుకునే ఎస్‌హెచ్‌ఓ ఆరోపణలు జోడిస్తారు. ఇప్పటికే వేర్వేరు ఠాణాల్లో నమోదైన కేసుల్ని విడతల వారీగా హైడ్రా స్టేషన్‌కు బదిలీ చేయనున్నారు.



హైడ్రా పోలీసు స్టేషన్

పని కన్నా.. ప్రచారమే మిన్న

విచిత్రంగా జీహెచ్‌ఎంసీ తీరు

- యాప్‌పై పౌరుల మండిపాటు





సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీకి పని చేయకున్నా, ప్రచారంపై యావ పెరిగిపోయింది. పలు సందర్భాల్లో తప్పుడు తడకల సమాచారమిస్తున్న జీహెచ్‌ఎంసీ ప్రజాసంబంధాల విభాగం.. ప్రపంచసుందరి పోటీల సందర్భంగా ఎక్కడెక్కడ ఏయే ఏర్పాట్లు చేసిందో చెప్పడం లేదు కానీ.. ఎవరో తీసి పంపిన విద్యుత్ వెలుగుల ఫొటోలు ప్రచారం కోసం పంపుతోంది. కనీసం అవెక్కడ ఏర్పాటు చేశారో కూడా చెప్పలేని దుస్థితిలో ఉంది. ఇటీవలే వీధిదీపాల నిర్వహణ ఈఈఎస్‌ఎల్ (ఎనర్జీ ఎఫీషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్) నుంచి జీహెచ్‌ఎంసీ చేపట్టగా, ఈఈఎస్‌ఎల్‌కే ఇంకా పొడిగింపునిచ్చినట్లు పత్రికలకు తప్పుడు సమాచారమిచ్చింది. ఇక, తాజాగా ‘మై జీహెచ్‌ఎంసీ’ యాప్‌ను ప్రజలు వివిధ సమస్యల పరిష్కారంతో పాటు అవసరమైన సేవలు పొందేందుకు వినియోగించుకోవచ్చునంటూ కొత్త కార్యక్రమాన్ని చేపట్టినట్లు ప్రకటన విడుదల చేసింది. వాస్తవానికి ఆ యాప్ అందుబాటులోకి వచ్చి చాలా ఏళ్లయింది. ఫిర్యాదు చేయగానే మీ ఫిర్యాదును సంబంధిత అధికారికి పంపించామంటూ ఒక ఆటోమేటెడ్ మెసేజ్ రావడం తప్ప సమస్య పరిష్కారం కావడం లేదంటూ ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. పోనీ.. గతంలో లేని కొత్త సేవలేవైనా ఇప్పుడు ప్రారంభించిందేమో ప్రస్తావించలేదు. యాప్ ప్రారంభమయ్యాక కొత్తగా కొన్ని సేవల్ని అడపాదడపా యాడ్ చేస్తున్నారు.

పాత పాట.. కొత్త రాగం..

- ఈ యాప్ ద్వారా పారిశుద్ధ్యం, ఇంజినీరింగ్, ఆరోగ్యం, వీధిదీపాలు, రోడ్లు తదితర సమస్యల్ని ఫొటో తీసి జియో లొకేషన్ ద్వారా ఫిర్యాదు చేస్తే డైరెక్ట్‌గా పరిష్కారం కోసం సంబంధిత అధికారికి చేరుకుంటుందని.. ఫిర్యాదు పరిష్కారం అయ్యిందో, లేదో చెక్ చేసుకునే వెసులుబాటు ఉందని పాత ప్రకటననే కొత్తగా చెప్పింది. ప్రజలు మాత్రం సమస్య పరిష్కారం కాకుండానే పరిష్కరించినట్లు క్లోజ్ చేస్తున్నారని విమర్శిస్తున్నారు. ట్రేడ్ లైసెన్సు, ఆస్తిపన్ను, భవన నిర్మాణ వ్యర్థాలు తొలగించేందుకు వాహనం, తదితర సేవలు పొందవచ్చునని పాతపాటే పాడింది. యాప్‌ను వినియోగించుకొని ప్రజలు వివిధ రకాల సేవలతోపాటు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలకు కూడా పరిష్కారం పొందవచ్చునని పేర్కొంటూ కమిషనర్ కర్ణన్ పేరిట ఓ ప్రకటన విడుదల చేసింది. ఇంతకీ కొత్త సేవలేవైనా అందుబాటులోకి తెచ్చిందా.. లేక సమస్యల పరిష్కారానికి నిర్ణీత గడువు విధించిందా ? వంటి వివరాలేమీ లేవు. కనీసం ఈ యాప్ ద్వారా ఇప్పటి వరకు ఎన్ని ఫిర్యాదులందాయి.. ఎన్ని పరిష్కారమయ్యాయి.. ఎన్ని పురోగతిలో ఉన్నాయి.. వంటి వివరాలు సైతం లేవు. ఏవీ లేకుండా ఫొటోలు సహా కొత్తగా ఈ ప్రకటనను ఎందుకు విడుదల చేశారో సంబంధీకులకే తెలియాలి.

ఏపీకే ఫైలు.. దోచేశారు రూ.2.25 లక్షలు

- నగర విద్యార్థినికి సైబర్ నేరగాళ్ల టోకరా
- సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో కేసు నమోదు

సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరగాళ్ల వలలో పడిన నగర విద్యార్థిని రూ.2.25 లక్షలు కోల్పోయారు. ఇందులో రూ.25 వేలు ఔషధం కోసం, మరో రూ.2 లక్షలు మాల్ వేర్‌తో కూడిన ఆండ్రాయిడ్ ప్యాకేజ్ కిట్ (ఏపీకే) ఫైల్‌ను క్లిక్ చేయడంతో నష్టపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నగర విద్యార్థిని (23) సిప్లా నికోటిన్ గమ్స్ అనే ఔషధం గూగుల్‌లో సెర్చ్ చేశారు. హోల్‌సేల్‌లో యూనిట్‌కు దాదాపు రూ.5 వేలు పలికే ఈ ఔషధాన్ని సరఫరా చేసే మెడికల్ షాపుల కోసం అన్వేషించారు. అలా తన దృష్టికి వచ్చిన ఫోన్ నంబర్లతో సంప్రదింపులు జరిపారు. తాను వ్యాపారిని అంటూ సైబర్ నేరగాడు హోల్‌సేల్ ధరకే విక్రయిస్తానని నమ్మించాడు. తనకు ఐదు యూనిట్లు కావాలని బాధితురాలు చెప్పడంతో.. అడ్వాన్స్‌గా నగదు చెల్లించాలని షరతు విధించాడు. దీంతో అతడి నుంచి బ్యాంకు ఖాతా వివరాలు తీసుకున్న ఆమె దానికి రూ.25 వేలు బదిలీ చేశారు. అయినప్పటికీ తనకు ఔషధాలు రాకపోవడంతో విద్యార్థినికి అనుమానం వచ్చింది. సదరు సైబర్ నేరగాడిని సంప్రదించిన ఆమె తన ఆర్డర్ రద్దు చేసుకుంటున్నట్లు చెప్పారు. రూ.25 వేలను తక్షణం తిరిగి బదిలీ చేయాల్సిందిగా కోరారు. బదిలీ చేస్తానంటూ ఆమె తల్లి ఫోన్‌కు వాట్సాప్ కాల్ చేసిన నేరగాడు.. వాట్సాప్ ద్వారా ఏపీకే ఫైల్‌తో కూడిన లింకు పంపాడు. దీన్ని అనుకోకుండా క్లిక్ చేయడంతో ఆ ఫోన్ మొత్తం నేరగాడి అధీనంలోకి వెళ్లిపోయింది. బాధితురాలితో ఫోన్‌లో మాట్లాడుతూనే అతగాడు ఆమె తల్లి ఖాతా నుంచి రూ.2 లక్షలు తన ఖాతాలోకి బదిలీ చేసుకున్నాడు. అనుమానించిన బ్యాంకు అధికారులు ఆమె తల్లి ఫోన్ నంబర్‌కు కాల్ చేశారు. సదరు లావాదేవీపై ఆరా తీయగా.. అది అనధికారికమైందని ఆమె చెప్పారు. బ్యాంకు అధికారుల సూచనల మేరకు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు.

మారిన అడిషనల్ కమిషనర్

- ప్రకటనల విభాగం వేణుగోపాల్‌రెడ్డికి ‘వీధి దీపాలు’ బాధ్యతలు
- స్నేహ శబరీష్‌కు ప్రకటనల విభాగం బదలాయింపు



చీకట్లు తొలగేనా?

సాక్షి, సిటీబ్యూరో: బల్దియా వీధిదీపాల సమస్యల పరిష్కారం మిణుకుమిణుకుమంటోంది. జీహెచ్‌ఎంసీకి అందే ఫిర్యాదుల్లో సింహభాగం వీధిదీపాలకు సంబంధించినవే. ఈఈఎస్‌ఎల్ (ఎనర్జీ ఎఫీషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్)కు వీధిదీపాల నిర్వహణ బాధ్యతలు గత నెలాఖరుతో ముగిసిపోవడంతో ప్రస్తుతం జీహెచ్‌ఎంసీయే నిర్వహిస్తోంది. ఈఈఎస్‌ఎల్‌కు సబ్ కాంట్రాక్టర్లుగా పనిచేసిన ఏజెన్సీలతోనే జీహెచ్‌ఎంసీ నిర్వహిస్తోంది. వీధి దీపాల నిర్వహణను గాడిలో పెట్టేందుకు కృషి చేసిన ఐఏఎస్ అధికారి కిల్లు శివకుమార్ నాయుడు తనకంటే జూనియర్ జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా రావడంతో మనస్తాపంతో సెలవుపై వెళ్లారు. తిరిగి రాలేదు. ఇక వచ్చేదీ అనుమానమే. ఈ నేపథ్యంలో ఆయన నిర్వహిస్తున్న వీధిదీపాల విభాగాన్ని తాజాగా అడిషనల్ కమిషనర్ జి.వేణుగోపాల్‌రెడ్డికి అప్పగించారు.

ఆయన సెలవుపై వెళ్లడంతో..

- వీధిదీపాల సమస్య క్లిష్టంగా ఉండటంతో ఐఏఎస్ అధికారి అయితేనే సమస్యలు పరిష్కరించగలరని భావించిన గత కమిషనర్ ఇలంబర్తి ఆ విభాగాన్ని శివకుమార్‌నాయుడుకు అప్పగించారు. ఆయన ఆ బాధ్యతలు తీసుకున్నాక, పరిస్థితిని చక్కదిద్దే చర్యలతో పాటు దుబారాను అరికట్టారు. ముమ్మందు ఆధునిక సాంకేతికత వినియోగించుకునేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఈ నేపథ్యంలో, ఆయన సెలవుపై వెళ్లడంతో బహుశా ఇక రారని భావించే కాబోలు విద్యుత్ విభాగం బాధ్యతల్ని వేణుగోపాల్‌రెడ్డికి అప్పగించారు.
- గతంలో నాన్ ఐఏఎస్ ఉన్నప్పుడు పరిస్థితి బాగా లేదనే ఐఏఎస్ అధికారికి అప్పగించిన ఆ బాధ్యతల్ని తిరిగి ఇప్పుడు నాన్ ఐఏఎస్‌కు అప్పగించడంతో పరిస్థితి ఏం కానుందో అంతుచిక్కడం లేదు. మెటర్నిటీ లీవ్‌పై వెళ్లిన స్నేహ శబరీష్ తిరిగి విధుల్లో చేరడంతో వేణుగోపాల్‌రెడ్డి నిర్వహిస్తున్న ప్రకటనల విభాగాన్ని తాజాగా ఆమెకు అప్పగించారు. వేణుగోపాల్‌రెడ్డి నుంచి ప్రకటనలు తప్పించి, వీధిదీపాల విభాగం అప్పగించే బదులు.. ఆ విభాగాన్ని ఐఏఎస్ అయిన స్నేహ శబరీష్‌కు అప్పగించగలరని పలువురు భావించారు. గతంలోనూ ఐఏఎస్ అధికారి శ్రీవత్స వీధి దీపాల బాధ్యతలు నిర్వహించడం గమనార్హం.

మధ్యలో మారుస్తుండటంతో..

ఏ పనులు చేస్తున్న వారిని ఆ పనులు పూర్తిగా చేయకముందే మధ్యలో మారుస్తుండటంతో పరిస్థితులు మళ్లీ మొదటి కొస్తున్నాయనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. ప్రకటనల విభాగం ద్వారా జీహెచ్‌ఎంసీకి ఎంతో ఆదాయం వచ్చే చర్యలకు వేణుగోపాల్‌రెడ్డి శ్రీకారం చుట్టడం ఈ సందర్భంగా గమనార్హం. ప్రకటనల విభాగంతో పాటు ఎస్టేట్ ఆస్తుల అద్దెల చెల్లింపులకు డిజిటల్ పేమెంట్స్‌ను అమల్లోకి తెచ్చారు. తద్వారా జీహెచ్‌ఎంసీ ఆదాయం రెట్టింపైంది. షాపులు, సంస్థల గ్లోసైన్ బోర్డుల ద్వారా ఎంతో ఆదాయం వచ్చే దిశగా చర్యలు చేపట్టారు. వాటిద్వారా ఎంతో ఆదాయం రానుంది. చేపట్టిన పనులు వివిధ దశల్లో ఉండగానే అధికారులు తరచూ మారడం వల్ల పరిస్థితులు మళ్లీ మొదటి కొస్తాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. యూబీడీ విభాగం ఇన్‌చార్జిగానూ స్నేహ శబరీష్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహనకు ఒప్పందం



ఒప్పంద కార్యక్రమంలో ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు, జనార్దన్‌రెడ్డి తదితరులు

రాయదుర్గం: రోడ్డు ప్రమాదాల నివారణకు, అన్ని వర్గాల్లో అవగాహన కల్పించేందుకు గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఎస్కీ), సర్వేజనా ఫౌండేషన్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ మేరకు శుక్రవారం ఒప్పందంపై ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు, సర్వేజనా ఫౌండేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ బి.జనార్దన్ రెడ్డి సంతకాలు చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో ఏడాదికి సుమారు 4.62 లక్షల మంది చనిపోతున్నారని చెప్పారు. మృతుల కుటుంబాలకు తీరని నష్టం వాటిల్లుతోందన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగడానికి ప్రధానంగా వాహనాలను ఓవర్ స్పీడ్‌తో నడపడం, మద్యం మత్తులో డ్రైవింగ్, సీట్ బెల్ట్ లేదా హెల్మెట్ ధరించకపోవడం, ఓవర్ టేకింగ్, రెడ్ లైట్ సిగ్నల్ జంపింగ్ తదితరాలన్నీ కారణాలేనన్నారు. వీటిపై అవగాహన కోసమే ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ఏవీ గురువారెడ్డి ఆధ్వర్యంలో సర్వేజనా ఫౌండేషన్ ఏర్పాటు చేశామన్నారు. ప్రమాదాల నివారణకు అవగాహన కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలోని సివిల్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ విభాగంతోపాటు ఫ్యాకల్టీ డెవలప్ మెంట్ సెల్ ఏడాది పొడవునా నిర్వహించే ప్రతి శిక్షణ కార్యక్రమంలో ఒక పూర్తి స్థాయి సెషన్‌ను రోడ్డు ప్రమాదాల నివారణ కోసం కేటాయిస్తామని స్పష్టం చేశారు. ఇందులో సర్వేజనా ఫౌండేషన్‌లోని సభ్యులతో పాటు రవాణ అధికారులు, డాక్టర్లు, లాయర్లు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొంటారని చెప్పారు.

డ్రగ్స్‌తో పట్టుబడిన లేడీ డాక్టర్

- నాలుగేళ్లుగా మాదకద్రవ్యాలకు బానిసైన వైనం..
- ఇప్పటి వరకు డ్రగ్స్ కోసం రూ.70 లక్షలు ఖర్చు
- డాక్టర్‌తో పాటు మరొకరి రిమాండ్

గచ్చిబౌలి: కొన్నేళ్లుగా డ్రగ్స్‌కు బానిసైన ఓ లేడీ డాక్టర్‌పై టీన్యాబ్ అధికారులు నిఘా ఉంచారు. డ్రగ్ కొనుగోలు చేస్తుండగా రాయదుర్గం పోలీసుల సహాయంతో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. డెలివరీ బాయ్‌తో పాటు లేడీ డాక్టర్‌ను రిమాండ్‌కు తరలించారు. రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ సీహెచ్.వెంకన్న తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. షేక్‌పేట్ యానిమల్ హస్బెండరీ కాలనీలో నివాసం ఉండె నమ్రత (34) ఓ కార్పొరేట్ హాస్పిటల్‌లో డాక్టర్‌గా పని చేస్తున్నారు. ముంబైకి చెందిన వంశ్ థక్కర్‌కు వాట్సాప్ కాల్ చేసి కొకైన్ ఆర్డర్ చేసి రూ.5 లక్షలు చెల్లించింది. వంశ్ థక్కర్ కొకైన్ చేరవేసేందుకు ముంబైకి చెందిన బాలకృష్ణ రాంప్యార్ రాం(38)ను హైదరాబాద్‌కు పంపించాడు. గురువారం సాయంత్రం 5.20 గంటల సమయంలో కొకైన్ డెలివరీ చేసేందుకు రాయదుర్గం సర్కిల్‌కు వచ్చాడు. కాల్ చేయగా అక్కడికి వచ్చిన నమ్రత డెలివరీ బాయ్ నుంచి కొకైన్ తీసుకుంటుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి 53 గ్రాముల కొకైన్, పదివేల నగదు, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. లేడీ డాక్టర్ భర్తకు విడాకులు ఇచ్చిన అనంతరం డగ్స్‌కు అలవాటు పడ్డట్లు తెలుస్తోంది. గత నాలుగేళ్లుగా ఆ డాక్టర్ డ్రగ్స్ కోసం రూ.70 లక్షలు వెచ్చించినట్లు ప్రాథమిక విచారణలో తెలియడంతో పోలీసులు విస్తుపోయారు. ఆమెకు కౌన్సిలింగ్ చేయాల్సిన అవసరం ఉందని పోలీసులు పేర్కొన్నారు. ముంబై నుంచి జరిగే కొకైన్ సరఫరాపై దర్యాప్తు కొనసాగుతుందన్నారు.

సమాజాన్ని చైతన్యం చేసిన ఠాగూర్ రచనలు



కార్యక్రమంలో జ్యోతిప్రజ్వలన చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



నృత్యప్రదర్శనలో ఓ ఘట్టం..

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

గన్‌ఫౌండ్రీ: రవీంద్రనాథ్ ఠాగూర్ తన రచనలతో సమాజాన్ని చైతన్య పరిచారని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో బంగియ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ 164వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ నోబెల్ సాహిత్య బహుమతిని గెలుచుకున్న తొలి ఐరోపేతర కవి ఠాగూర్ అని కొనియాడారు. రవీంద్రనాథ్ ఠాగూర్ రచనలు మహిళలను చైతన్య పరిచే విధంగా ఉండేవని గుర్తు చేశారు. తను ఎన్నో పుస్తకాలు రాశారని, స్వేచ్ఛ అనే ఆలోచనలను రగిలించారన్నారు. అంతకు ముందు రవీంద్రనాథ్ ఠాగూర్ జీవితంపై నిర్వహించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సంఘం ప్రెసిడెంట్ దీపక్ భట్టాచార్య తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం చేసిన వ్యక్తికి ఐదేళ్ల జైలు

శంకర్‌పల్లి: ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో ఓ వ్యక్తి హత్యకు ప్రయత్నించిన నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ చేవెళ్ల కోర్టు న్యాయమూర్తి దశరథరామయ్య శుక్రవారం తీర్పు వెల్లడించారు. ఇందుకు సంబంధించి శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గాజులగూడ గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్, రాజేందర్‌రెడ్డి మధ్య ఆర్థిక లావాదేవీల విషయంలో విభేదాలు తలెత్తాయి. దీంతో దుర్గప్రసాద్‌ను హత్య చేయాలని రాజేందర్‌రెడ్డి భావించాడు. ఈ క్రమంలో గతేడాది ఫిబ్రవరి 10న హాస్పిటల్‌కు వెళ్లాల్సి ఉందని దుర్గాప్రసాద్‌ను బైక్‌పై తీసుకెళ్లాడు. మార్గమధ్యలో వాహనం ఆపి, బండరాయితో తలపై కొట్టాడు. బలంగా తగలడంతో చనిపోయి ఉంటాడని భావించి, అక్కడి నుంచి పారిపోయాడు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడికి శిక్షపడేలా వేగవంతంగా దర్యాప్తు చేశారు.

అంతర్జాతీయ క్రీడాకారులను అందించడం గర్వకారణం

ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్



బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించిన గోపీచంద్

గచ్చిబౌలి: తమ అకాడమీ నుంచి అంతర్జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారులను అందించడం గర్వకారణంగా ఉందని ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ అన్నారు. గచ్చిబౌలిలోని పుల్లెల గోపీచంద్ అకాడమీలో ఏర్పాటు చేసిన కార్పొరేట్ ఉద్యోగుల బ్యాడ్మింటన్ క్రీడా పోటీలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ ఉద్యోగులకు పని ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని, ఇలాంటి పోటీలు నిర్వహించడం వల్ల వారిలో పని ఒత్తిడి తగ్గుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఎంతో ఉద్యోగఒత్తిడి ఉన్నప్పటికీ శారీరక వ్యాయామం చాలా అవసరమన్నారు. శారీరక వ్యాయామ లేకపోవడం వల్లే చాలా మంది కార్పొరేట్ సంస్థల ఉద్యోగులు రోగాల బారిన పడుతున్నారన్నారు. వారిని రోగాలకు దూరం చేయాలంటే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం చాలా ఉందన్నారు. అంతకుముందు ఈ పోటీలలో రెడ్డీస్ ల్యాబ్, ఇన్ఫోసిస్, మైక్రోసాఫ్ట్, విప్రో, డెల్, ఐకియా వంటి సంస్థలకు చెందిన ఉద్యోగులు ఈ పోటీలలో పాల్గొంటున్నారు.

ఖైదీల్లో మానసిక పరివర్తన రావాలి

హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవి గుప్తా



కల్చరల్ మీట్‌ను ప్రారంభిస్తున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవిగుప్తా, జైళ్ల శాఖ డీజీపీ డాక్టర్ సౌమ్య మిశ్రా

కుషాయిగూడ: ఖైదీల సంక్షేమం కోసం తెలంగాణ జైళ్ల శాఖ అమలు చేస్తున్న సంస్కరణలతో ఖైదీలు మానసిక పరివర్తన చెందాలని రాష్ట్ర ప్రభుత్వ హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవి గుప్తా అన్నారు. తెలంగాణ జైళ్ల శాఖ ఆధ్వర్యంలో చర్లపల్లి సెంట్రల్ జైలులో ఏర్పాటుచేసిన ఖైదీల వార్షిక స్పోర్ట్స్ కల్చరల్ మీట్–2025ను శుక్రవారం జైళ్ల శాఖ డీజీపీ డాక్టర్ సౌమ్య మిశ్రాతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఖైదీల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్‌కు హాజరు కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఖైదీలు ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తూ ప్రస్తుతం ఉన్న ఫిట్‌నెస్‌ను విడుదల అనంతరం వరకు కూడా కొనసాగించాలన్నారు. జైళ్ల శాఖ అందిస్తున్న తోడ్పాటును సద్వినియోగం చేసుకొని నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. జైళ్ల శాఖ డీజీపీ డాక్టర్ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలతో ఖైదీల్లో క్రమశిక్షణతో పాటుగా మానసిక పరివర్తన సాధ్యమవుతుందన్నారు. అంతేకాకుండా వారి మధ్య స్నేహ భావం పెంపొందుతుందన్నారు. మూడు రోజుల పాటు జరిగే స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్‌లో అవుట్ డోర్, ఇండోర్ క్రీడలతో పాటు కల్చరల్ ఈవెంట్స్‌ను కూడా నిర్వహిస్తున్నారు. తెలంగాణ వ్యాప్తంగా 220 మంది ఖైదీలు ఈ మీట్‌లో పాలు పంచుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ ఐజీలు రాజేష్, మురళీబాబు, డీఐజీలు డాక్టర్ డి.శ్రీనివాస్, సంపత్, జైలు పర్యవేక్షణ ఇన్‌చార్జి అధికారి శివకుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

తుక్కుగూడ: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తామని డీఈఓ సుశీందర్‌రావు పేర్కొన్నారు. పురపాలిక సంఘం పరిధిలోని తుక్కుగూడ, సర్దార్‌నగర్, మంఖాల్ గ్రామాల్లో శుక్రవారం బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బోధిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు ఇటీవల వెలువడిన పదో తరగతి పరీక్ష ఫలితాలే నిదర్శనమన్నారు. విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, దుస్తులు, ఇతర సామగ్రి అందజేస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి, మంచి భవిష్యత్‌ను అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ కస్నానాయక్, హెచ్ఎం భాస్కర్‌రెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఆర్మీకి మద్దతుగా ర్యాలీ

బడంగ్‌పేట్: పాకిస్తాన్‌పై యుద్ధం నేపథ్యంలో ఆర్మీ జవాన్లకు మద్దతుగా శనివారం ర్యాలీ నిర్వహించనున్నట్లు మునిసిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రామిడి రాం రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే ర్యాలీ బడంగ్‌పేట్‌లోని బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం నుంచి బాలాపూర్ చౌరస్తా వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

నేటి నుంచి పురాతన నాణేలు, కరెన్సీ నోట్ల ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించనున్న పురాతన నాణేలు

చార్మినార్: పాతబస్తీలో రెండు రోజుల పాటు జరగనున్న అంతర్జాతీయ నాణేలు, కరెన్సీ నోట్లు, పురాతన వస్తువులు సేకరణల ప్రదర్శన శనివారం ప్రారంభం కానుంది. సందర్శకులకు ఉచితంగా ప్రవేశం కల్పించే ఈ ఎగ్జిబిషన్ పాతబస్తీ ఉర్దూ ఘర్‌లో ఉదయం 10 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు ఉంటుంది. అరుదైన నాణేలు, పేపర్ కరెన్సీ, స్టాంపులు, పెయింటింగ్‌ల ప్రదర్శన, చరిత్రపై ఆసక్తి ఉన్నవారికి ఈ ఎగ్జిబిషన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఏపీజే అబ్దుల్ కలాం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 7వ శతాబ్దం నాటి అంతర్జాతీయ నాణేలు, కరెన్సీని ప్రదర్శించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు సొసైటీ కార్యదర్శి డాక్టర్ సయ్యద్ అబ్దుల్ హై ఖాద్రి తెలిపారు. నాణేలు, పేపర్ కరెన్సీ, స్టాంపులు, పెయింటింగ్‌లతో పాటు ఇతర పురాతన వస్తువుల మిశ్రమ కలయిక గల వస్తువులను ఈ ఎగ్జిబిషన్లో సందర్శకులకు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. మరిన్ని వివరాల కోసం సొసైటీ కార్యదర్శి లేదా డైరెక్టర్ సిరాజుద్దీన్‌లను 8500212306 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మంటల్లో మాల్

- చందానగర్‌లో భారీ అగ్నిప్రమాదం
- రెండు భవనాలు పూర్తిగా దగ్ధం



సెంట్రో మాల్‌లో మంటలు చెలరేగిన దృశ్యం

చందానగర్: చందానగర్ పరిధి గంగారంలోని సెంట్రో మాల్‌లో శుక్రవారం సాయంత్రం భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. మాల్ ఐదు అంతస్తులలో ఉండగా..విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగి అన్ని ఫ్లోర్లకు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోగానే పక్కనే నాలుగు అంతస్తుల్లో ఉన్న ఆర్‌సీ కలెక్షన్స్ షాపింగ్ మాల్ భవనానికి కూడా మంటలు అంటుకున్నాయి. దీంతో నిమిషాల వ్యవధిలోనే రెండు భవనాలు మంటల్లో పూర్తిగా దగ్ధం అయ్యాయి. ఆరు ఫైరింజన్లను రప్పించి మంటలను అదుపులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేశారు. పక్కనే మరో భవనంలో ఉన్న ఆసుపత్రికి కూడా కొద్ది మేర మంటలు వ్యాపించగా అప్రమత్తమైన వైద్యులు, సిబ్బంది రోగులను బయటకు తీసుకువచ్చి మరో ఆసుపత్రికి తరలించారు. దాదాపు గంట తర్వాత అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ఆస్తి నష్టం మాత్రం భారీగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇక ప్రమాదం కారణంగా చందానగర్, మియాపూర్ రోడ్డులో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ఏడేళ్ల క్రితం ఇదే సెంట్రో మాల్ అగ్నికి ఆహుతి కాగా తిరిగి మరమ్మతులు చేసి పునఃప్రారంభించారు. ఈ విషయంపై చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. జీహెచ్ఎంసీ అధికారులు ఫైర్ సేఫ్టీ అనుమతులు ఉన్నాయా లేవా అనే కోణంలో విచారణ చేస్తున్నారు.

నియంతృత్వంపై ఉద్యమిద్దాం

- యుద్ధ సమయంలో అందాల పోటీలు అవసరమా
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ఇబ్రహీంపట్నం: ప్రపంచాన్నే గడగడలాడించిన హిట్లర్‌నే తరిమికొట్టిన పోరాట స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నియంతృత్వ విధానాలపై ఉద్యమించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. హిట్లర్ ఫాసిజంపై నాటి సోవియట్ యూనియన్ ఎర్రసైన్యం విజయం సాధించి 80 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం ఇబ్రహీంపట్నంలోని పాష నరహరి స్మారక కేంద్రంలో ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచదేశాలను ఆక్రమించుకోవాలన్న కుట్ర, కుతంత్రాలతో నియంత హిట్లర్ సాగించిన దూకుడుకు ఎర్రజెండా అడ్డుకట్టవేసిందన్నారు. ఒక్కో దేశాన్ని ఆక్రమించుకుంటూ వస్తూ రష్యాను సైతం ఆక్రమించుకునేందుకు చేసిన ప్రయత్నానికి 1945లో కమ్యూనిస్టు సైన్యం అడ్డుకట్టవేసి సోవియట్ యూనియన్‌లో కమ్యూనిస్టు నాయకత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించిందని విమర్శించారు. రాష్ట్రం అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతోందని ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలియదా అని ప్రశ్నించారు. ఉగ్రవాద చర్యలను సీపీఎం ఖండిస్తుందన్నారు. పాకిస్తాన్, భారత్ యుద్ధం కొనసాగుతుండగా హైదరాబాద్‌లో అందాల పోటీలు నిర్వహించడం సరికాదని జాన్‌వెస్లీ అన్నారు. వెంటనే ఈ పోటీలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కాడిగళ్ల భాస్కర్, సామేల్, జగదీశ్, ఈ.నర్సింహ, జగన్, చంద్రమోహన్ తదితరు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- మాదాపూర్ హైటెక్స్‌లో ప్రపంచ సుందరి పోటీలు ప్రారంభమవుతున్నాయి.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో 7 విజన్స్ పేరిట చిత్ర ప్రదర్శన ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మిస్ వరల్డ్ ప్రారంభ వేడుకల్లో భాగంగా గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జానపద కళాకారుల ప్రదర్శన జరుగుతుంది.
- శ్రీనగర్‌కాలనీలోని శ్రీసత్యసాయి నిగమాగమంలో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నేషనల్ సిల్క్ ఎక్స్‌పో అందుబాటులో ఉంటుంది. ఈ ప్రదర్శనలో డైరెక్ట్ వీవర్స్ 50 శాతం రాయితీపై అమ్మకాలు నిర్వహించనున్నారు.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- కేపీహెచ్‌బీకాలనీలో లులు మాల్‌లో బిగ్ చాకో దేస్ ఫెస్టివల్ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు జరుగుతుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో వేసవి సెలవుల సందర్భంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం1 గంట వరకు సమ్మర్ ఆర్ట్ క్యాంప్ జరుగుతుంది.
- మైలార్‌దేవ్‌పల్లి గణేష్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 8 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు ఉచిత వేసవి శిక్షణ శిబిరం జరుగుతుంది.
- తెలంగాణ సమాచార భారతి ఆధ్వర్యంలో దేవర్షి నారద జయంతి సందర్భంగా కోఠి మైంఐఎస్‌లో ఉదయం 10 గంటలకు విశిష్ట పాత్రికేయులకు పురస్కారాల ప్రదానోత్సవం జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

కళాకారులను ప్రోత్సహించిన గొప్ప వ్యక్తి సుబ్బారావు



ఎం.కె రాముకు అవార్డు అందచేస్తున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి తదితరులు

సాక్షి, సిటీబ్యూరో: ప్రతిభావంతులైన కళాకారులను ప్రోత్సహించిన గొప్ప వ్యక్తి కళా సుబ్బారావు అని శాసన మండలి ప్రతిపక్ష నాయకుడు మధుసూదనాచారి పేర్కొన్నారు. శుక్రవారం శ్రీత్యాగరాయ గానసభలో కళా సుబ్బారావు జయంతి వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జంట నగరాల్లో ప్రసిద్ధి పొందిన గానసభకు ఆజ్యంపోసిన వ్యక్తిగా, సుదీర్ఘకాలం పాటు అధ్యక్షుడిగా పని చేసి ఎంతో మంది కళాకారులకు తమ కళను ప్రదర్శించే వేదికను అందించిన గొప్ప వ్యక్తిగా సుబ్బారావు కీర్తి గడించారని పేర్కొన్నారు. అనంతరం బద్ధం కళా సుబ్బారావు స్మారక పురస్కారాన్ని ప్రముఖ కవి, రసమయి సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు ఎం.కె రాముకు బహూకరించారు. కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి, శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్, ముదిగొండ శివప్రసాద్, సుబ్రహ్మణ్య శాస్త్రి, మల్లాది భావన తదితరులు పాల్గొన్నారు.





'సిందూర్' సక్సెస్ కావాలని...

ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ బేగంపేట ప్రకాష్‌నగర్‌లోని శ్రీభూలక్ష్మీ అమ్మవారి ఆలయంలో భారతదేశ చిత్రపటాన్ని చిత్రీకరించి దీపాలు వెలిగించారు. ఐదుసార్లు అయిగిరి నందిని స్తోత్ర పారాయణం చేశారు. ఆలయ ధర్మకర్త విశాల్ సూదం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భారత సైనికులకు సంఘీభావంగా దీపాలు వెలిగించారు. - సనత్‌నగర్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: ప్రకాశ్‌నగర్ ఎక్స్‌టెన్షన్, రాజీవ్ నగర్, బంజారానగర్ 11కేవీ ఫీడర్లు సంజీవయ్య పార్క్, ప్రకాశ్‌నగర్, మోతీనగర్, బోరబండ సబ్‌స్టేషన్ల పరిధిల్లో కొనసాగుతున్న మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు కామాటిపుర, ప్రకాశ్‌నగర్ ఎక్స్‌టెన్షన్, ప్రకాశ్‌నగర్ వాటర్ ట్యాంకర్, ఆర్కా మసీదు, రిజిస్ట్రేషన్ ఆఫీస్, కల్యాణ్‌నగర్, రాజీవ్ నగర్, బీఎస్ పురి, జయంతినగర్, శ్రీరామ్‌నగర్, బంజారానగర్, ఎస్‌ఆర్‌టీనగర్, వినాయకరావు నగర్, శివాజీనగర్, ఆర్‌కే నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ శుక్రవారం తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ ఆస్పత్రి, ఎస్‌వీఎస్ టెంపుల్, కల్యాణ్ నగర్ పార్క్ 11 కేవీ ఫీడర్లు, బేగంపేట, బోరబండ సబ్‌స్టేషన్ల పరిధిల్లో కొనసాగుతున్న మరమ్మతుల వల్ల మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎస్‌వీఎస్ టెంపుల్ లైన్, బీ–టైప్, 3 ఆర్‌టీ, ఎస్‌ఆర్‌నగర్, గౌతమి ధామం రియా, ఓల్డ్ రిలయన్స్ ఫ్రెష్, జ్ఞాన సరస్వతి, కల్యాణ్‌నగర్ పార్క్, సారథినగర్ కో ఆపరేటివ్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రివాజ్‌లో తళుక్కుమన్న తారలు



రివాజ్ ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవంలో సినీ నటి సనూర్ సనా, మోడల్స్

బంజారాహిల్స్: రివాజ్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణా హోటల్‌లో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శన ఆకట్టుకుంది. సినీ నటి సనూర్ సనాతో పాటు పలువురు మోడల్స్, సోషలైట్లు శుక్రవారం ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి సందడి చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మూడు రోజుల పాటు కొనసాగే ఈ ఎగ్జిబిషన్‌లో దేశవ్యాప్తంగా 70కి పైగా ప్రసిద్ధిగాంచిన డిజైనర్లు, ప్రముఖ బ్రాండ్ల సంస్థలు తమ ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శిస్తారని తెలిపారు. హస్తకళల ఉత్పత్తులతో పాటు ప్రస్తుత ట్రెండీ డిజైన్లతో పాటు ఆభరణాలు ఇక్కడ లభిస్తాయని వెల్లడించారు.

ద్విచక్ర వాహనం చోరీ

వెంగళరావునగర్: మెట్రో వద్ద పార్క్ ద్విచక్ర వాహనం మాయమైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం జవహర్‌నగర్‌లో నివాసం ఉండే ఎండీ అజార్ వెంగళరావునగర్‌కాలనీలో కేక్ తయారీ సంస్థలో పని చేస్తుంటాడు. ఈ నెల 6వ తేదీ తాను పనిచేసే చోట ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేసి సొంతూరుకు వెళ్లి, గురువారం సాయంత్రం వచ్చాడు. అయితే అక్కడ తన వాహనం కనిపించలేదు. దాంతో శుక్రవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నమ్మించి నగదు దోచుకెళ్లాడు

వెంగళరావునగర్: తండ్రికి సేవలు అందించడానికి వచ్చిన యువకుడు నగదు దోచుకెళ్లాడని ఓ మహిళ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం వెంగళరావునగర్‌లో నివసించే పి.హిమబిందు రెండు నెలల కిందట తన తండ్రికి సేవలు అందించేందుకు కార్తీకేయ అంజన్న హోం సర్వీసెస్ సెంటర్‌కు కాల్ చేసింది. ఆ సంస్థకు చెందిన వారు నెలకు రూ.22 జీతం ఇస్తున్నట్లు అగ్రిమెంట్ రాసుకుని రవి అనే యువకుడిని పంపారు. ఈ నెల 7వ తేదీ సాయంత్రం రవి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. వెళ్లే సమయంలో హిమబిందు ఫోన్ తీసుకుని దానికి బదులు మరో ఫోన్ ఉంచి వెళ్లాడు. ఆమె అతడికి తన తల్లి ఫోన్ ద్వారా మాట్లాడగా 10 నిముషాల్లో వస్తున్నానని చెప్పి రాలేదు. అంతేగాకుండా దొంగిలించిన ఆమె ఫోన్ ద్వారా రవి రూ.63,326 నగదు కాజేశాడు. దాంతో బాధితురాలు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్యాన్సర్‌ను ముందే గుర్తిస్తే రక్షించవచ్చు

– ఐఏఎస్ అధికారి అలగు వర్షిణి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఫ్యాషన్ డిజైనర్ శిల్పారెడ్డి, ఐఏఎస్ అధికారి అలగు వర్షిణి

బంజారాహిల్స్: క్యాన్సర్ అనేది మరణ శిక్ష కాదని ప్రారంభ దశలో గుర్తించి వైద్యం అందిస్తే నయమైపోతుందని ఐఏఎస్ అధికారి అలగు వర్షిణి అన్నారు. జూబ్లీహిల్స్‌లోని దసపల్లా హోటల్‌లో ఫ్యాషన్ డిజైనర్ శిల్పారెడ్డితో కలిసి గ్రేస్ క్యాన్సర్‌ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ ఏడాది అక్టోబర్ 12వ తేదీన నిర్వహించే క్యాన్సర్ అవగాహన రన్ కార్యక్రమ పోస్టర్‌ను ఆమె శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేలాది మంది ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన లేదని, అవగాహనతోనే సగం రోగాలకు పరిష్కారం దొరుకుతుందని అన్నారు. గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ చిన్నబాబు సుంకవల్లి, గ్రేస్ రన్ డైరెక్టర్ కృపాకర్‌రెడ్డి, రిటైర్డ్ ఎస్పీ సుజాతారావు, రిటైర్డ్ ఐఏఎస్ అజయ్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

ఇక పార్కింగ్ ఈజీ

- వేగంగా మల్టీ లెవల్ రోటరీ పార్కింగ్ నిర్మాణం
- కాసు బ్రహ్మానందరెడ్డి పార్కుకు ఆనుకుని ఏర్పాటు
- రూ.6 కోట్ల వ్యయంతో కొనసాగుతున్న ప్రాజెక్టు
- 72 కార్లు పార్కింగ్ చేసుకునే అవకాశం
- ఈ నెల 31వ తేదీ లోపు పూర్తి చేయాలని లక్ష్యం



బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కును ఆనుకుని నిర్మిస్తున్న మల్టీలెవల్ రోటరీ పార్కింగ్

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని ప్రతిష్టాత్మక కాసు బ్రహ్మానందరెడ్డి పార్కును ఆనుకుని జీహెచ్ఎంసీ పార్కింగ్ స్థలంలో నిర్మిస్తున్న మల్టీలెవల్ రోటరీ పార్కింగ్ నిర్మాణం శరవేగంగా కొనసాగుతోంది. నిర్మాణాన్ని ఈ నెల 31వ తేదీలోపు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ మల్టీలెవల్ పార్కింగ్ హైదరాబాద్‌కే తలమానికంగా ఉండేలా రూ.6 కోట్ల వ్యయంతో అత్యాధునిక హంగులతో నిర్మిస్తున్నారు. నవనిర్మాణ్ అసోసియేట్స్ జాయింట్ వెంచర్‌ను జీహెచ్ఎంసీ నుంచి 10 సంవత్సరాల పాటు పీపీపీ ప్రాజెక్ట్‌లో భాగంగా చేపట్టారు. పార్కు లేయర్ కొరియన్ కంపెనీతో జాయింట్ వెంచర్‌లో నవనిర్మాణ్ అసోసియేట్స్ ద్వారా జీహెచ్ఎంసీ మల్టీలెవల్ రోటరీ పార్కింగ్‌ను చేపట్టింది. 484 చతురస్రాల్లో 400 చదరపు గజాల్లో ఈ నిర్మాణం కొనసాగుతోంది. ఆరు అంతస్తుల్లో నిర్మిస్తున్న ఈ పార్కింగ్ స్థలంలో 72 కార్లు పార్కింగ్ చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ప్రతి స్టాక్‌లో 12 కార్లు పార్కింగ్ చేస్తారు. ఇది 15 మీటర్ల ఎత్తులో నిర్మిస్తున్నారు.

- బంజారాహిల్స్‌లో ముఖ్యంగా కేబీఆర్ పార్కు చుట్టూ ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉండి పార్కింగ్ కొరతతో ఇబ్బందులు పడుతుండగా ఈ మల్టీలెవల్ పార్కింగ్ ట్రాఫిక్ సమస్యను చాలావరకు పరిష్కరిస్తుందని అధికారులు భావిస్తున్నారు. అందుకే పార్కింగ్ సమస్య ఉన్న ప్రాంతంలోనే నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.
- జపాన్, కొరియా, సింగపూర్ వంటి దేశాల్లో ఈ తరహా పార్కింగ్ విధానం విజయవంతమైంది. మన దేశంలో మొదటిసారిగా మన రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్మాణాన్ని చేపడుతోంది. నగరంలోని ఇతర ప్రాంతాల్లో ఇలాంటి మల్టీలెవల్ రోటరీ పార్కింగ్‌లను నిర్మించాలని ఆలోచనలు చేస్తున్నారు. నవనిర్మాణ్ కంపెనీ రూ.6 కోట్ల ఖర్చుతో ఈ ప్రాజెక్టును నిర్మిస్తుండగా ఈ ఖర్చును తిరిగి పొందడానికి సదరు సంస్థ కేబీఆర్ ప్రాంగణంలో ఎల్ఈడీ స్క్రీన్లను ప్రదర్శించనుంది.
- పార్కింగ్ సమస్యను పరిష్కరించడానికి ఈ ప్రాజెక్టు ఎంతగానో దోహదపడుతుందని అధికారులు వెల్లడించారు. పార్కింగ్ సమస్యను పరిష్కరించేందుకు కేబీఆర్ మల్టీలెవల్ పార్కింగ్ విజయవంతమైతే ఇలాంటి నిర్మాణాలను నగరంలోని మరిన్ని ప్రాంతాల్లో తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇదిలా ఉండగా కేబీఆర్ పార్కు పక్కన అత్యంత పార్కింగ్ సమస్య ఉన్న ప్రాంతంలో ఈ ప్రాజెక్టు రావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తక్కువ స్థలంలో ఎక్కువ కార్లు పార్కింగ్ చేసుకునే సదుపాయాన్ని కల్పించారు. నిర్మాణం పూర్తయిన తర్వాత ఇక్కడ పచ్చదనం, పరిశుభ్రతతో పాటు టాయిలెట్లు కూడా అందుబాటులోకి రానున్నాయి. ఈ రోడ్డంతా సుందరంగా తీర్చిదిద్దనున్నారు.

అమాయకులను చంపిన పాకిస్తాన్‌కు భారీ మూల్యం తప్పదు

సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ అజీజ్ పాషా



భారత సైన్యానికి సంఘీభావంగా ఇస్కఫ్ ర్యాలీలో అజీజ్ పాషా

హిమాయత్‌నగర్: పహల్గామ్‌లో అమాయక ప్రజల ప్రాణాలు తీసిన పాకిస్థాన్ తగిన మూల్యం చెల్లించుకుంటుందని సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. భారత సాంస్కృతిక స్నేహ సంఘం(ఇస్కఫ్) ఆధ్వర్యంలో భారత సైన్యానికి సంఘీభావంగా హిమాయత్‌నగర్ నుంచి హైదర్‌గూడ వరకు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఇస్కఫ్ అధ్యక్షుడు ఆర్.గోపాల్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్, ఇస్కఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడారి ప్రభాకర్, ఐప్సో రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కేవీఎల్, ఇస్కఫ్ ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్, ఇన్సాఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మునీర్ పటేల్, తెలంగాణ సర్వోదయ మండలి అధ్యక్షుడు ఆర్.శంకర్ నాయక్, ఇస్కఫ్ సభ్యులు విజయలక్ష్మి, కె.శ్రీనివాస్, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు. పాకిస్తాన్ ముర్దాబాద్, హిందూస్థాన్ జిందాబాద్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు.

మహిళను వేధిస్తున్న వ్యక్తిపై క్రిమినల్ కేసు

బంజారాహిల్స్: ఉద్యోగం నుంచి తొలగించారనే కక్షతో సంస్థ నిర్వాహకులను బ్లాక్‌మెయిల్ చేస్తున్న వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ రోడ్డు నంబర్–12లో నివసించే ఓ మహిళ తన సంస్థలో ఎం.సాయిసుధాకర్ అనే వ్యక్తిని డైరెక్టర్‌గా నియమించుకుంది. అతడు సంస్థ యజమానులకు తెలియకుండా నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డాడు. ఫోర్జరీ సంతకాలతో సంస్థను మోసం చేసి డాక్యుమెంట్లు తస్కరించి డబ్బులు దండుకున్నాడు. సంస్థ నిర్వాహకులు అతడిని ఉద్యోగం నుంచి తొలగించడమే కాకుండా పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి కక్ష పెంచుకున్న అతడు సంస్థ నిర్వాహకులను బ్లాక్‌మెయిల్ చేస్తూ మహిళల ఫొటోలను మార్ఫింగ్ చేసి వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు సాయిసుధాకర్‌తో పాటు అతడికి సహకరిస్తున్న రేగుళ్ల నీరజారాణిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యుద్ధంలో విజయం కలగాలని హోమం



బంజారాహిల్స్: భారత్–పాకిస్తాన్ మధ్య జరుగుతున్న యుద్ధంలో మన దేశానికి విజయం కలగాలని శ్రీనగర్‌కాలనీ శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం పూజలు నిర్వహించారు. వేద పండితులు జ్యోతిశ్చంద్ర శర్మ, ఆలయ ఈవో శ్రీనివాస శర్మ నేతృత్వంలో ఆలయ అర్చకులు, వేద పండితులు శంభు హోమం నిర్వహించారు.

లోన్ ఇప్పిస్తానని నమ్మించి మోసం

వెంగళరావునగర్: రుణం మంజూరు చేయిస్తానని వ్యక్తి నుంచి నగదు కాజేసిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ఎల్లారెడ్డిగూడకు చెందిన రాకేష్‌కుమార్ దుస్తులు ఐరన్ చేస్తుంటాడు. ఈ నెల 1వ తేదీ ఓ గుర్తు తెలియని వ్యక్తి తాను పేటీఎం డిస్ట్రిబ్యూటర్ అంటూ పరిచయం చేసుకున్నాడు. బ్యాంక్ నుంచి రుణం ఇప్పిస్తానని, రూ.5 లక్షల లోన్ కోసం రూ.70 వేలు చెల్లించాల్సి ఉంటుందని చెప్పాడు. దాంతో రాకేష్‌కుమార్ రూ.60 వేలు ఇచ్చాడు. అయితే రుణం ఇప్పించకపోవడంతో బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

వెంగళరావునగర్: ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం రహమత్‌నగర్‌లో నివాసం ఉండే తమ్మినేని శాంతారావు గురువారం రాత్రి తమ ఇంట్లో నీరు రాకపోవడంతో డాబా ఎక్కాడు. 3వ ఫ్లోర్‌లో నివసిస్తున్న తిరుమలరెడ్డి కిటికీ తెరిచి ఉంది. అందులో నుంచి చూడగా తిరుమలరెడ్డి బెడ్‌షీట్ కప్పుకుని కింద పడి ఉన్నాడు. దీంతో ఎన్నిసార్లు తలుపు కొట్టినా తీయకపోవడంతో అతడు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

రహమత్‌నగర్: ఓ దొంగ గంట వ్యవధిలోనే రెండుసార్లు ఏటీఎంను పగులకొట్టేందుకు ప్రయత్నించాడు. ఎంతకీ పగలకపోవడంతో పరారయ్యాడు. బోరబండ పోలీసుల వివరాలు ప్రకారం.. మిడ్‌లాండ్ బేకరి వద్ద ఐసీఐసీఐ ఏటీఎం ఉంది. గురువారం ఉదయం ఏటీఎంలో చోరీకి యత్నం జరుగుతోందని పుణెలోని ఐసీఐసీఐ బ్యాంకు అనుబంధ కార్యాలయం నుంచి గోల్కొండలో నివాసం ఉండే బ్యాంకు ఉద్యోగి సమాచారం అందింది. దీంతో అతడు స్థానికంగా ఉండే ఉద్యోగులకు సమాచారం అందించాడు. వారు వచ్చేలోపు ఆ దొంగ వెళ్లిపోయాడు. దీంతో వారు బోరబండ పోలీసులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వెంగళరావునగర్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వెంగళరావునగర్‌లో నివసించే బి.సంజయ్ రావు(77) మాజీ సైనిక ఉద్యోగి. హెల్త్ చెకప్ కోసం శుక్రవారం ఉదయం ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఎస్‌ఆర్‌నగర్ వద్ద యూ టర్న్ తీసుకుంటున్నాడు. ఎదురుగా ద్విచక్ర వాహనం రావడంతో సంజయ్‌రావు సడన్ బ్రేక్ వేశాడు. దాంతో కింద పడటంతో తలకు గాయాలు అయ్యాయి. వెంటనే ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆయన మృతి చెందాడు. కుమారుడు చంద్రమోహన్ ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేటినుంచి బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో అడ్మిషన్లు

– ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయ్‌కుమార్

హిమాయత్‌నగర్: నారాయణగూడలోని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 2025–28 మొదటి సంవత్సరం ప్రవేశాలకు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ గ్రూప్‌లలో చేరేందుకు ఈ నెల 10 నుంచి 22వ తేదీ వరకు మొదటి విడత వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలన్నారు. ఈ నెల 23న తొలివిడత సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. సీట్లు పొందిన విద్యార్థులు జూన్ 3వ తేదీలోపు కాలేజీలో రిపోర్ట్ చేయాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే సమయంలో విద్యార్థులు ఈ కాలేజీకి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు.

మహిళా సాధికారతే లక్ష్యం



మాట్లాడుతున్న శ్రీవంశీ

పంజగుట్ట: మహిళా సాధికారతే లక్ష్యమని యూనిటీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీవంశీ తెలిపారు. ఈ నెల 11వ తేదీన మదర్స్‌డే పురస్కరించుకుని యూనిటీ డ్రైవ్ పోర్టల్ ప్రారంభిస్తున్నట్లు, ఈ పోర్టల్ ద్వారా మహిళలకు ఉచితంగా పలు రంగాల్లో శిక్షణ ఇచ్చి వారు వ్యాపారం నిర్వహించి ఆర్థికంగా స్థిరపడేలా చేస్తామని ఆయన పేర్కొన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫౌండేషన్ ప్రతినిధులు నిఖిల్, లక్ష్మీప్రసాద్‌తో కలిసి మాట్లాడారు. తమ ఫౌండేషన్ ముఖ్యంగా మహిళా సాధికారత, రోడ్డు భద్రతపై అవగాహన, సైబర్ సెక్యూరిటీ విద్యపై పనిచేస్తుందన్నారు. మహిళలకు క్యాండిల్స్, అగర్‌బత్తీల తయారీ, డిజిటల్ మార్కెటింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చి వారికి సర్టిఫికెట్లు అందజేసి రుణాలు ఇప్పిస్తామన్నారు.

వైభవంగా లక్ష్మీనారాయణ స్వామి కల్యాణం



రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్ ఇందిరానగర్ ఫేజ్–2 బస్తీలోని దుర్గా భవానీ ఆలయంలో శుక్రవారం లక్ష్మీ నారాయణ స్వామి కల్యాణ మహోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞాన మందిరంలో సాయిబాబా, గణపతి విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం, లోకశాంతి కోసం యాగం, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త వేముల యాదయ్య మాట్లాడుతూ ఆలయ ఆవరణలో వెలిసిన రావి(లక్ష్మీనారాయణ స్వామి), వేప(లక్ష్మీదేవి) వివాహ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. దేవతా మూర్తుల వివాహ మహోత్సవంలో పాల్గొన్న భక్తులకు సకల శుభాలు కలగాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు సీఎన్ రెడ్డి, దళిత సేన రాష్ట్ర ఆలయ కమిటీ అధ్యక్షుడు ఘంట మల్లేష్, ఆలయ కమిటీ కోశాధికారి భరత్ ప్రసాద్, నాయకులు చెన్నయ్య, వెంకటేశ్, బాలయ్య, రాగిని యాదయ్యతో బస్తీవాసులు పాల్గొన్నారు.

చికిత్సా పద్ధతులు వేగంగా మారిపోతున్నాయి



సాక్షి, సిటీబ్యూరో: వైద్య శాస్త్రంలో చికిత్సా పద్ధతులు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) అధ్యక్షుడు, సీనియర్ ఈఎన్‌టీ వైద్యులు ద్వారకానాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఒమెగా ఆసుపత్రులు, ఇండియా ఓటోలారింజాలజిస్ట్స్ అసోసియేషన్(ఏఓఐ) హైదరాబాద్, స్టేట్ మెడికల్ కౌన్సిల్ సంయుక్తాధ్వర్యంలో లెర్నింగ్ టుడే లీడింగ్ టుమారో అనే అంశంపై రెండు రోజుల కాన్‌క్లేవ్ 2025 నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు నిత్య విద్యార్థిలా ఉండాలని తెలిపారు. ఈ కాన్‌క్లేవ్‌లో ఎంతో నేర్చుకున్నామన్నారు. ఒమెగా వైద్యురాలు వెన్నల మాట్లాడుతూ తల, మెడ భాగాల్లో వచ్చే కేన్సర్‌లకు కిమో థెరపీతో పాటు ఇమ్యునోథెరపీ చేయడం వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని తెలిపారు. సహజసిద్ధంగా రోగనిరోధక వ్యవస్థ అభివృద్ధి చెందుతుంది. కేన్సర్ సెల్స్‌ను నాశనం చేస్తుందని తెలిపారు. అంతర్జాతీయ వైద్య నిపుణులు, పీజీ విద్యార్థులు 175 మంది పాల్గొన్నారు.

ప్రజాప్రయోజనాలకే ఆ స్థలం కేటాయించాలి

జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్



పనులు అడ్డుకుంటున్న జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని షేక్‌పేట మండలం ఫిలింనగర్ పద్మాలయా అంబేడ్కర్‌నగర్ బస్తీని ఆనుకుని ఖరీదైన ప్రభుత్వ స్థలాన్ని ఆర్టీఓ కార్యాలయానికి కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ ఆధ్వర్యంలో బస్తీవాసులు ఆందోళనకు దిగారు. పద్మాలయా అంబేడ్కర్‌నగర్ బస్తీతో పాటు చుట్టుపక్కల బస్తీలకు చెందిన నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఇక్కడికి చేరుకుని ఈ స్థలాన్ని ఆర్టీఓ కార్యాలయ నిర్మాణానికి అప్పజెప్పడాన్ని నిరసిస్తూ బైఠాయించారు. స్థానిక పేద ప్రజలకు ఉపయోగపడే విధంగా ఈ స్థలంలో ప్రభుత్వ కళాశాల గానీ, ప్రభుత్వ ఆస్పత్రి గానీ నిర్మించాలని, లేదంటే పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కార్పొరేటర్ డిమాండ్ చేశారు. ఈ స్థలాన్ని ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి అప్పగించినా తమకు అభ్యంతరం లేదన్నారు. అంతేగానీ, టోలిచౌకీ ఆర్టీఏ కార్యాలయానికి ఎలా అప్పగిస్తారని నిలదీశారు. ఆర్టీఏ కార్యాలయానికి ఈ స్థలం కేటాయించడంపై తలెత్తిన వివాదంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఫిలింనగర్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్, స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మిస్తే ఫిలింనగర్ 18 బస్తీల ప్రజలకు ఉపయోగపడుతుందని, ఈ స్థలాన్ని స్థానిక ప్రయోజనాలకే కేటాయించాలని కార్పొరేటర్ డిమాండ్ చేశారు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ నివాసం ఎదుట ధర్నా చేస్తానని హెచ్చరించారు. ఎమ్మెల్యేకు తెలియకుండా ఈ స్థల కేటాయింపు జరగలేదన్నారు. ఇదిలా ఉండగా ప్రభుత్వం చేపట్టిన పనుల్లో జోక్యం చేసుకోవద్దని ఫిలింనగర్ పోలీసులు ఇరువర్గాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ స్థలాన్ని ప్రజల కోసం ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఉదయం నుంచి ఈ స్థలంలో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ఆర్టీఏ అధికారులు కూడా ఘటనా స్థలానికి చేరుకున్నారు.

సెల్‌ఫోన్ దొంగల అరెస్టు

పంజగుట్ట: స్విగ్గీ డెలివరీ బాయ్ సెల్‌ఫోన్ స్నాచింగ్ కేసులో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు మరో నిందితుడి కోసం గాలిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యూసూఫ్‌గూడకు చెందిన జావిద్ స్విగ్గీ డెలివరీ బాయ్. 5వ తేదీన రాత్రి డెలివరీ నిమిత్తం బేగంపేట నుంచి పంజగుట్టకు వచ్చాడు. పంజగుట్టలో డెలివరీ ఇచ్చేందుకు వెళ్లి తన ఫోన్‌ను ఆర్డర్ డైరెక్షన్ కోసం హ్యాండిల్‌కు ఉంచగా ఆ ఫోన్‌ను రెండు ద్విచక్రవాహనాలపై వచ్చిన నలుగురు నిందితులు దొంగిలించారు. గమనించిన జావిద్ అక్కడకు పరిగెత్తుకుంటూ వెళ్లగా అతడిని నెట్టేసి ఫోన్ తీసుకుని పరారయ్యారు. సీసీ కెమెరాలు పరిశీలించిన పోలీసులు నిందితులు బోడుప్పల్, పీర్జాదిగూడకు చెందిన ప్రమోద్(21), శ్రావణ్(22), రాజేష్(22), మహేష్(20)గా గుర్తించారు. వీరు అదేరోజు మాదాపూర్‌కు వెళ్లి అక్కడ రెండు సెల్‌ఫోన్లు స్నాచింగ్ చేశారు. అంతేకాకుండా మాదాపూర్‌లో ఒక పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ కొట్టించుకుని వారికి డబ్బులు ఇవ్వకుండా పరారయ్యారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు శుక్రవారం శ్రావణ్, రాజేష్, ప్రమోద్‌ను అదుపులోకి తీసుకున్నారు. మహేష్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు నిందితులను రిమాండ్‌కు తరలించారు.

సాక్షి సిటీ ప్లస్
12
హైదరాబాద్‌, శనివారం, 10, మే, 2025





నగర వేదికగా జరగనున్న ప్రపంచ సుందరి పోటీల్లో మిస్ వరల్డ్ కిరీటం తర్వాత దాదాపు దీంతో సమానంగా అత్యంత గౌరవనీయమైన టైటిల్స్‌లో ఒకటి 'బ్యూటీ విత్ పర్పస్'. ఈ పురస్కారం మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొన్న అభ్యర్థుల్లో సామాజిక సేవాపరమైన కార్యక్రమాల్లో స్ఫూర్తిదాయకంగా పనిచేసిన వారికి అందిస్తారు. ఈసారి జరిగే పోటీల్లో ఈ కిరీటం ఎవరిని వరించనుందోనని యావత్ ప్రపంచం ఆసక్తిగా ఎదురు చూస్తోంది. ఈ నేపథ్యంలో దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు..

- సాక్షి, సిటీబ్యూరో

మిస్ వరల్డ్ పోటీల్లో బ్యూటీ విత్ పర్పస్ టైటిల్ కీలకం

మానవత్వానికి పట్టం..

సేవకు కిరీటం..

- ప్రపంచవ్యాప్తంగా సేవా కార్యక్రమాల్లో పాల్గొనే ఛాన్స్
- గత కొంత కాలంగా ఈ టైటిల్ వేటలో ముందున్న భారత్
- పోటీలకు హుందాతనం, గౌరవం ఆపాదించిన వైనం

అందమైన రూపంతో పాటు హృదయం, సేవాభావం కలిగి ఉండే అభ్యర్థిని గుర్తించి అందించే ఈ టైటిల్‌ను 1972లో నిర్వాహకులు పరిచయం చేశారు. ఈ పోటీకి ప్రాణం పోసిన వ్యక్తి భార్య జూలియా మోర్లే ఆలోచనలతో దీన్ని రూపకల్పన చేశారు. మిస్ వరల్డ్ పోటీల్లో అందం ఒక్కటే కీలకంగా మారుతోందని గుర్తించి అది సరికాదని, సమాజానికి సేవ చేసే లక్షణాలు ఉన్నవారిని కూడా గౌరవించాలనే ఆలోచనతో ఆమె ఈ అవార్డును ప్రారంభించారు. ఆరోగ్యం, విద్య, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లో అభ్యర్థుల స్వచ్ఛంద సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు ఇస్తారు. ఈ పురస్కార విజేతలు తమ దేశాల్లోనే కాక, అంతర్జాతీయంగా కూడా సేవా కార్యక్రమాలు చేపట్టగలుగుతారు. అంతేకాకుండా ఈ అవార్డు గెలుచుకున్న అభ్యర్థులకు మిస్ వరల్డ్ టైటిల్ గెలిచే అవకాశాలు మెరుగవుతాయి.

పలు దేశాల్ని వరించిన టైటిల్..

ఇప్పటి వరకూ ఈ టైటిల్ గెలిచిన వారిలో మన దేశానికి చెందిన ఇషా గుప్తా ఒకరు. విద్యను ప్రోత్సహించే సేవా కార్యక్రమాల ద్వారా ఆమె గుర్తింపు పొందారు. అదే విధంగా మన దేశపు సుందరి మానుషి చిల్లర్ సైతం మహిళల మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టి 2017లో బ్యూటీ విత్ పర్పస్ టైటిల్‌ను గెలుచుకున్నారు. ఆమె ఆ ఏడాది మిస్ వరల్డ్ టైటిల్ కూడా గెలిచారు. ఆదివాసీల అభివృద్ధి కోసం పనిచేసిన మెక్సికన్ బ్యూటీ వనేసా పోన్ డీ లియోన్ 2018లో 'బ్యూటీ విత్ పర్పస్'గా నిలిచారు. జమైకాకు చెందిన టోనీ–అన్ సింగ్ 2019లో మహిళా సాధికారతపై కార్యకలాపాలతో ఈ టైటిల్‌కి ఎంపికయ్యారు. అదే విధంగా పేద బాలికల విద్యను ప్రోత్సహించడానికి చేసిన కృషికి గాను సౌత్‌ఆఫ్రికాకు చెందిన సునేషా బుక్సన్ 2023లో టైటిల్ దక్కించుకున్నారు.





అద్భుత అవకాశం.. సేవా ప్రకాశం..

ఈ టైటిల్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా మానవతా కార్యక్రమాల్లో పాల్గొనగల అవకాశాలు వస్తాయి. అభ్యర్థిని అంతర్జాతీయ వేదికలపై పరిచయం చేస్తారు. ఈ టైటిల్ గెలిచిన అభ్యర్థి చేపట్టిన సేవా ప్రాజెక్టులకు మిస్ వరల్డ్ సంస్థ నుంచి ఆర్థికంగా సహాయం అందుతుంది. ఇది ప్రాజెక్టును విస్తరించేందుకు ఉపయోగపడుతుంది. మిస్ వరల్డ్ ఫౌండేషన్ చేపట్టే ఇతర సేవా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు కూడా ఆహ్వానిస్తారు. వివిధ దేశాలకు వెళ్లి అక్కడి సేవా సంస్థలతో కలసి పని చేయడం జరుగుతుంది. మానుషి ఏర్పాటు చేసిన 'ప్రాజెక్ట్ శక్తి' ప్రాజెక్టుకు హర్యాణా ప్రభుత్వం రూ.18 కోట్లు మంజూరు చేసింది. ఇది ప్రభుత్వ పాఠశాలలలో ఉచిత శానిటరీ న్యాప్కిన్లను అందించేందుకు ఉపయోగపడింది. మిస్ వరల్డ్ బ్యూటీ విత్ పర్పస్ టూర్‌లో భాగంగా ఆమె కోల్‌కతా, ముంబైతో పాటు మన హైదరాబాద్‌లోనూ మహిళల ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.



విద్య, ఆరోగ్య సమస్యలపై..

దక్షిణాఫ్రికాకు చెదిన బ్యూటీ విత్ పర్పస్ విజేత షుడుఫడ్జో ముసిడా తన ప్రాజెక్ట్ ద్వారా మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. దక్షిణాఫ్రికాలో మానసిక ఆరోగ్య సమస్యలపై ఆమె చర్చలు నిర్వహించి, ప్రజల్లో అవగాహన పెంచేందుకు పని చేశారు. నేపాల్‌కు చెందిన ఇదే టైటిల్ విజేత శృంఖలా ఖతివాడ తన ప్రాజెక్ట్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య కేంద్రాల నిర్మాణం, శుభ్రత, ఆరోగ్య సేవలపై దృష్టి పెట్టారు. మన దేశానికి చెందిన బ్యూటీ విత్ పర్పస్ విజేత మానసా వరణాసి బాలికల విద్యను ప్రోత్సహించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అమెరికాకు చెందిన బ్యూటీ విత్ పర్పస్ విజేత శ్రీ సైనీ తన ప్రాజెక్ట్ ద్వారా గుండె ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. గుండె ఆరోగ్యంపై చర్చలు నిర్వహించి, ప్రజల్లో ఆరోగ్యపరమైన జీవనశైలిని ప్రోత్సహించారు.



వీ హబ్‌లో వీ ఎంగేజ్

- స్నాతకోత్సవంలో మహిళా వ్యాపారవేత్తలు
- ఆస్ట్రేలియా కాన్సులేట్-జనరల్ ఆండ్రూ కాలిస్టర్ అభినందన

సాక్షి, సిటీబ్యూరో: మహిళా వ్యాపారవేత్తలకు సాధికారత కలిగించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన వీ హబ్ ప్రధాన కార్యాలయంలో 'వీ ఎంగేజ్ : ఫ్లింట్ ప్రోగ్రామ్' స్నాతకోత్సవం నిర్వహించింది. రెండు బ్యాచ్‌లకు చెందిన 31 మంది మహిళా వ్యాపారవేత్తల శుక్రవారం జరిగిన స్నాతకోత్సవంలో పాల్గొన్నారు. ఈ ఆరు వారాల ప్రయాణంలో వారు సమస్యల గుర్తింపు, పరిష్కార మ్యాపింగ్, కస్టమర్ ధృవీకరణ, వారి ఆలోచనల ప్రదర్శన వంటి అంశాలపై పనిచేశారు. ఈ కార్యక్రమానికి బెంగళూరులోని ఆస్ట్రేలియా కాన్సులేట్–జనరల్ కార్యాలయంలో కాన్సుల్ ఆండ్రూ కాలిస్టర్, వీ హబ్ సీతా పల్లచొల్లా, వీ హబ్ చీఫ్ స్ట్రాటజిక్ అడ్వైజర్ వినూత రాళ్లపల్లి మహిళలను అభినందించారు.మిస్ వరల్డ్ నిర్వాహకులు కార్యక్రమాన్ని సందర్శించి, మహిళా వ్యాపారవేత్తలతో మట్లాడారు. ఈ వేదికగా మహిళా వ్యాపారవేత్తల ఆత్మవిశ్వాసం, ఆవిష్కరణలను అభినందించారు.

ఆభరణాల సోయగం..

- హైటెక్స్‌లో హైదరాబాద్ జ్యువెలరీ పెర్ల్ అండ్ జెమ్ ఫెయిర్'
- మూడు రోజుల పాటు, 220పైగా ప్రదర్శనకారులకు ఆతిథ్యం

మాదాపూర్: ముత్యాల నగరంగా ప్రసిద్ధి చెందిన హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మక 17వ 'హైదరాబాద్ జ్యువెలరీ పెర్ల్ అండ్ జెమ్ ఫెయిర్' ప్రారంభమైంది. హైటెక్స్‌లోని హాల్ 4లో నిర్వహించే ఈ ఫెయిర్‌లో దక్షిణాదిలోని హైదరాబాద్ సహా ముంబై, జైపూర్, కేరళ, బెంగళూరు, చెన్నై వంటి నగరాలకు చెందిన ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్లు నగరానికి చేరుకున్నాయి. మూడు రోజుల పాటు కొనసాగే ఈ భారతదేశపు ప్రీమియర్ బీ2బీ జ్యువెలరీ ఎగ్జిబిషన్‌లో 8 వేలకు పైగా వాణిజ్య సందర్శకులను ఆకర్షిస్తుందని, 220పైగా ప్రదర్శనకారులకు ఆతిథ్యం ఇస్తుందని అంచనా. శుక్రవారం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి జాతీయ మీడియా ప్యానలిస్ట్ కార్తీక్ రెడ్డి, జోస్ అలుక్కాస్ మేనేజింగ్ డైరెక్టర్ వర్గీస్ అలుక్కా వంటి ప్రముఖులు హాజరయ్యారు. ఇన్ఫార్మా మార్కెట్స్ ఇన్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ యోగేష్ ముద్రాస్ మాట్లాడుతూ భారత ఆభరణాల వ్యాపారం 2030 నాటికి 168 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు.



నైట్ లైఫ్.. @నాక్స్ క్లబ్

పార్టీ లవర్స్, నైట్ లైఫ్ ప్రియులకు హాట్‌స్పాట్

సాక్షి, సిటీబ్యూరో: ఎప్పటికప్పుడు అధునాతన లైఫ్ స్టైల్‌ను అందిపుచ్చుకునే హైదరాబాద్ సిటీ నైట్ లైఫ్ మరింత కొత్త రంగులను అందిపుచ్చుకుంటోంది. ఇందులో భాగంగా నగరంలో పార్టీ ప్రియులు, లైఫ్‌స్టైల్ ఔత్సాహికుల కోసం జూబ్లీహిల్స్‌లో 'నాక్స్ క్లబ్' ప్రారంభమైంది. క్లబ్ లైఫ్ ఇష్టపడే వారి కోసం ఆకర్షణీయంగా దీనిని రూపొందించారు. ఈ క్లబ్‌లో బిగ్ బాస్ సన్ని, రాజ్, అనిల్, కీర్తితో పాటు సినీ నటుడు సమీర్ పలువురు టాప్ సెలబ్రిటీలు, ఇన్ఫ్లుయెన్సర్లు, సోషలైట్లు సందడి చేశారు. ముఖ్యంగా ఎలక్ట్రిఫైయింగ్ మ్యూజిక్, సిగ్నేచర్ కాక్‌టెయిల్స్, డైనమిక్ వినోదం హైదరాబాద్‌లో లగ్జరీ క్లబ్బింగ్‌ను పునర్‌నిర్వచిస్తోంది.






లులులో మ్యాంగో ఫెస్ట్

18 వరకూ అందుబాటులో 50కి పైగా రకాలు

మూసాపేట: కేపీహెచ్‌బీకాలనీలోని లులు మాల్‌లో మ్యాంగో ఫెస్టివల్ –2025ను హార్టీకల్చర్, సెరీ కల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా శుక్రవారం ప్రారంభించారు. అనంతరం మాల్లో ఏర్పాటు చేసిన వివిధ రకాల మామిడి పండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఫెస్టివల్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. బయట మార్కెట్‌లో ఒకటి రెండు రకాలు దొరికితే మాల్‌లో దేశ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన 50కి పైగా రకాల పండ్లు ప్రజలకు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా మాల్ యాజమాన్యాన్ని అభినందించారు. అనంతరం మాల్ రీజనల్ డైరెక్టర్ అబ్దుల్ ఖాదీర్ షేక్ మాట్లాడుతూ ఈ నెల 18 వరకూ 10 రోజుల పాటు ఈ ఫెస్టివల్ నిర్వహిస్తామన్నారు. పండ్లతో చేసే ఇతర ఆహార పదార్థాలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. జనరల్ మేనేజర్ విమేష్ తదితరులు పాల్గొన్నారు.





సర్వాంగ సుందరం..

- నృసింహ జయంతి వేడుకలకు ఆలయం ముస్తాబు
- 1200 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం
- నగరంలో మొదటి స్వర్ణదేవాలయంగా గుర్తింపు

బంజారాహిల్స్: శ్రీ నృసింహ జయంతి వేడుకలను ఈ నెల 11న తెల్లవారుజామున 5.20 గంటల నుంచి అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు హరేకృష్ణ మూవ్‌మెంట్ హైదరాబాద్ స్వర్ణ దేవాలయం సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యింది. వేలాదిగా తరలివచ్చే భక్తులకు స్వామివారి దర్శన నిమిత్తం సౌకర్యాలు కల్పిస్తోంది. ఈ నేపథ్యంలో ఆలయాన్ని నానావిధ పుష్పాలతో అద్భుతంగా ముస్తాబు చేయనున్నట్లు హరేకృష్ణ మూవ్‌మెంట్ తెలంగాణ అధ్యక్షుడు శ్రీమాన్ సత్యగౌర చంద్రదాస ప్రభు వెల్లడించారు. కీర్తనలు, మూల విరాట్ అభిషేకాలు, శ్రీనరసింహ హోమం, శ్రీభూదేవి సమేత నరసింహస్వామి కళ్యాణోత్సవం, మహాభిషేకం అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. అలాగే 16 రకాల ఉపచారాలు, మధ్యాహ్నం 108 రకాల పిండి వంటలతో నైవేద్యాలు సమర్పించనున్నారు. వివిధ నదుల పవిత్ర జాలాలతో 108 కళశాలకు అభిషేకం ఉంటుందన్నారు. అనంతరం లక్ష్మీ నరసింహస్వామి ఊంజల సేవ ఉంటుందన్నారు.



1200 ఏళ్ల చరిత్ర..

బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని హరేకృష్ణ స్వర్ణ దేవాలయంలో కొలువుదీరిన స్వయంభూ శ్రీలక్ష్మీ నరసింహస్వామి 1200 సంవత్సరాల క్రితం ఇక్కడ కొలువుదీరారు. 1907లో కృష్ణ ప్రసాద్ జాగీర్దార్ అనే వ్యక్తి స్వామి వారి ఆలయ నిర్మాణం కోసం 47 ఎకరాలు కేటాయించారు. అప్పట్లో అత్యంత వైభవంగా ఉత్సవాలు జరిగేవని, అక్కన్న, మాదన్నలు కూడా వచ్చేవారని ప్రశస్తి. కాలక్రమంలో ఆలయం మరుగునపడిపోయింది. ఈ తరుణంలో ఈ ఆలయాన్ని యాదగిరిగుట్ట దేవస్థానం కిందకు తీసుకొచ్చారు. ఈ ఆలయ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్సార్ ఈ స్థలాన్ని హరేకృష్ణ మూవ్‌మెంట్‌కు అప్పగించారు. 2011లో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఈ ఆలయ అభివృద్ధికి ముందుకొచ్చి 2018లో నిర్మాణం పూర్తి చేశారు. హైదరాబాద్‌లోనే మొట్టమొదటి స్వర్ణ దేవాలయంగా, ఆధ్యాత్మిక కేంద్రంగా అవతరించింది. పరమ శివుడే తపస్సు చేసిన స్థలంగా ఈ ప్రాంతాన్ని పేర్కొంటున్నారు. అందుకే 'మంత్ర రాజ తథాస్తోత్ర' అనే శ్లోకాన్ని పఠిస్తే స్వామి వారి అనుగ్రహం లభిస్తుందని భక్తులు నమ్మకం. ఇక్కడి శివలింగంపై శంఖం ఉంటుందని, ఈ క్షేత్రంలోని జలగర్భ నారాయణ సాలిగ్రామంలోపల కొంత జలం ఉందని అర్చకులు చెబుతుంటారు.

గ్రాండ్ ఫ్యాషన్ ఫెస్ట్..

నేటి నుంచి ప్రతిష్టాత్మక మిస్ వరల్డ్–2025

చరిత్రలో మరో అద్భుత మైలురాయికి నేడు భాగ్యనగర నాంది పలుకనుంది. నగరంలో ప్రతిష్టాత్మక మిస్ వరల్డ్ 2025 పోటీలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటి వరకూ పలు అంతర్జాతీయ క్రీడా పోటీలు, విదేశాంగ సమావేశాలు, అంతర్జాతీయ శాస్త్ర–సాంకేతిక సమావేశాల వంటివి జరిగాయి. కానీ ఫ్యాషన్ రంగంలో అత్యంత ప్రతిష్టాత్మక మిస్ వరల్డ్ పోటీలు జరుగుతుండటం ఇదే ప్రథమం. గతేడాది 71వ మిస్ వరల్డ్ పోటీలు ముంబై వేదికగా నిర్వహించగా, వెనువెంటనే దేశంలో మరోసారి నిర్వహించడం.. దీనికి భాగ్యనగరం ప్రాతినిథ్యం వహించడం విశేషం. ఇప్పటికే నగరానికి ప్రపంచవ్యాప్తంగా 111 దేశాలకు చెందిన మిస్ వరల్డ్ పోటీదారులు చేరుకోగా నేడు మరో ఇద్దరు, ముగ్గురు వచ్చే అవకాశముంది. ఈ మిస్ వరల్డ్ నేపథ్యంలో హైదరాబాద్ నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన విషయం విదితమే.

– సాక్షి, సిటీబ్యూరో



- నగరానికి చేరుకున్న 111 దేశాల సుందరీమణులు
- పోటీలకు సన్నద్ధం, బిజీ బిజీగా రిహార్సల్స్
- హైదరాబాద్ వైపు ఆసక్తిగా చూస్తున్న ప్రపంచ దేశాలు
- ఈ నెల 31న మిస్ వరల్డ్ గ్రాండ్ ఫినాలే

నేడు ప్రారంభం కానున్న 72వ మిస్ వరల్డ్ పోటీలు ఈ నెల 31వ తేదీ వరకూ కొనసాగనున్నాయి. ఈ పోటీలను తెలంగాణ ప్రత్యేకతలను ప్రపంచానికి తెలిపేలా, అంతర్జాతీయంగా తెలంగాణకు బ్రాండ్ ఇమేజ్ పెంచేలా కార్యాచరణ సిద్ధం చేసింది రాష్ట్ర ప్రభుత్వం. ఈ సందర్భంగా తెలంగాణ సంస్కృతి, చరిత్ర, పర్యాటక ఆకర్షణలు, మెడికల్, సేఫ్టీ టూరిజం, తెలంగాణ గ్రోత్ స్టోరీ ఇతర ప్రత్యేకతలు ప్రపంచానికి పరిచయం చేయడానికి ప్రత్యేక థీమ్స్, టూరిస్ట్ సర్క్యూట్లు రూపొందించారు. ఇందులో భాగంగా హైదరాబాద్ హెరిటేజ్ వాక్, మెడికల్ టూరిజం ఈవెంట్, సేఫ్టీ టూరిజం ఇనిషియేటివ్, తెలంగాణ ఆర్ట్స్, క్రాఫ్ట్స్ వర్క్ షాప్ వంటి విభిన్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

జూన్ 2 వరకూ..

ఈ సారి మిస్ వరల్డ్‌లో భారత్‌తో పాటు అమెరికా, కెనడా, వెనిజులా, థాయ్‌లాండ్, దక్షిణాఫ్రికా, వంటి దేశాలతో పాటు గ్వాదలూప్, గిబ్రాల్టర్, మార్టినిక్, క్యురాకావ్ వంటి చిన్న దేశాల నుంచి అభ్యర్థులు పాల్గొంటున్నారు. ఈ నెల 31న మిస్ వరల్డ్ గ్రాండ్ ఫినాలే జరుగుతుంది. జూన్ 2న ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాల వరకూ విజేతగా నిలిచిన మిస్ వరల్డ్ నగరంలో ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

13

సాక్షి రియల్టీ

శనివారం
10-05-2025



ఇంతింతై ఇల్లంతై..

గృహ కొనుగోలుదారులపై వసతుల భారం

వాడినా, వాడకున్నా అమినిటీస్ చార్జీలు కట్టాల్సిందే..	అపార్ట్‌మెంట్లలో 20-25 శాతం వరకు వసతుల బాదుడు	స్క్వాష్ కోర్ట్, క్లబ్‌హౌస్, టేబుల్ టెన్నిస్.. అన్నింటికీ వసూళ్లే..
ఓపెన్ ప్లాట్‌లోనూ.. వసతులు కల్పిస్తామని మాయమాటలు	వీకెండ్ రిసార్ట్, క్లబ్ హౌస్ సభ్యత్వం అంటూ రూ.లక్షల్లో చార్జీలు	ఓసీ రాకముందు వసూలు చేయవద్దనే నిబంధనలు

నివాసితులకు భారంగా మారిన క్లబ్‌హౌస్‌ల నిర్వహణ

సాక్షి, సిటీబ్యూరో

పదేళ్ల క్రితం కాప్రాలో అపార్ట్‌మెంట్ కొన్న.. చ.అ.కు రూ.3 వేల చొప్పున 1,100 చ.అ.లకు రూ.33 లక్షలు అయ్యింది. ఆ సమయంలో కార్పస్ ఫండ్, వసతుల నిర్వహణ కోసమని రూ.5 లక్షలు వసూలు చేశారు. ప్రతి నెలా అపార్ట్‌మెంట్ నిర్వహణ ఖర్చు కోసం నెలకు రూ.2 వేలు చెల్లిస్తున్నా. అయితే ప్రస్తుతం వ్యక్తి గత అవసరాల కోసం ఆ ఫ్లాట్‌ను అమ్మేద్దామని నిర్ణయించుకున్నా. కొనడానికి ఎవరొచ్చినా సరే అపార్ట్‌మెంట్ ధరనే లెక్కిస్తున్నారే తప్ప.. నేను చెల్లించిన కార్పస్ ఫండ్ పరిగణలోకి తీసుకోవటం లేదు.

– ఓ రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి ఆవేదన ఇదీ..

నగరంలోని ఓ ఐటీ కంపెనీలో హెడ్‌గా పనిచేశాను. స్విమ్మింగ్ పూల్, జిమ్, పిల్లలకు ప్లే ఏరియా వంటివి ఉన్నాయని కూకట్‌పల్లిలో ఓ గేటెడ్ కమ్యూనిటీలో రూ.80 లక్షలకు ఫ్లాట్ కొన్నా. వీటి కోసం డెవలపర్‌కు అదనంగా రూ.10 లక్షలు చెల్లించాను. అందులో ఉన్నంత వరకూ బాగానే ఉంది. ప్రస్తుతం వృత్తిరీత్యా బెంగళూరుకు బదిలీ అయ్యింది. ఎప్పుడైతే సొసైటీకి అపార్ట్‌మెంట్ అప్పగించారో రెండేళ్ల తర్వాత సరైన నిర్వహణ లేక స్విమ్మింగ్ పూల్ పాడైపోయింది. జిమ్‌లోని వస్తువులు మూలనపడ్డాయి.

– ఓ ఐటీ ఉద్యోగి వ్యథ ఇదీ..



...వీళ్లిద్దరే కాదు గృహ కొనుగోలుదారుల అందరిపైనా వసతుల భారం పడుతుంది. సామాన్యుడి సొంతింటి కలకు నిర్మాణ వ్యయం, స్థలాల ధరలు ఎంత భారం అవుతున్నాయో.. అదే స్థాయిలో వసతుల చార్జీలు భారంగా మారిపోయాయి. క్లబ్‌హౌస్, పార్కింగ్, సెలబ్రిటీ జిమ్, స్విమ్మింగ్ పూల్, స్క్వాష్ కోర్ట్, టేబుల్ టెన్నిస్, క్రికెట్ పిచ్, బ్యాడ్మింటన్ కోర్ట్, ఇండోర్ గేమ్స్, చిల్డ్రన్ పార్క్, జాగింగ్ అండ్ వాకింగ్ ట్రాక్స్, యోగా, మెడిటేషన్ హాల్, గెస్ట్ రూమ్స్, 7 స్టార్ రెస్టారెంట్.. ఇలా బోలెడన్నీ వసతులను ప్రకటిస్తున్నారు. అన్నింటికీ రూ.లక్షల్లోనే చార్జీలను వసూలు చేస్తున్నారు. రెరా నిబంధనల ప్రకారం అపార్ట్‌మెంట్ ధరలోనే వసతుల చార్జీలు కలిపి ఉండాలి. కానీ, నిర్మాణ సంస్థలు వేర్వేరుగా వసూలు చేస్తున్నాయి. ఎలక్ట్రిక్ చార్జింగ్ పాయింట్స్, గ్రీనరీ, పైప్‌డ్ గ్యాస్, విద్యుత్, తాగునీరు ఇలా కనీస మౌలిక వసతులకు రూ.లక్షలలో వసూలు చేస్తున్నారు. రెండేళ్ల పాటు క్లబ్‌హౌస్ నిర్వహణ బాధ్యత నిర్మాణ సంస్థదేనని ప్రకటిస్తూనే.. మరోవైపు సభ్యత్వ రుసుము రూ.2-3 లక్షల వరకూ బాదుతున్నారు.

ఓసీ రాకముందే వసూళ్లు..

ఆక్యుపెన్సీ సర్టిఫికెట్(ఓసీ) రాకముందు వసతుల ఏర్పాటు, నిర్వహణకు చార్జీలు వసూలు చేయకూడదనేది నిబంధన. కానీ, నిర్మాణ సంస్థలు పట్టించుకోవటం లేదు. పోనీ, ఆయా ప్రభుత్వ విభాగాలైనే నియంత్రిస్తున్నాయా అంటే పట్టించుకునే నాథుడే లేడు. మౌలిక వసతులను కల్పించిన తర్వాతే మున్సిపల్ విభాగం ఓసీని విడుదల చేయాల్సి ఉంటుంది. స్విమ్మింగ్ పూల్, జిమ్, ఇండోర్ గేమ్స్, జాగింగ్, వాకింగ్ ట్రాక్స్.. అంటూ కొనుగోలుదారుడికి ఇచ్చిన హామీ ప్రకారం అన్ని రకాల వసతులను కల్పించాడా లేదా అని పర్యవేక్షించే వారే కరువయ్యారు. కానీ, భౌతికంగా ఆయా వసతులను డెవలపర్ కల్పించాడా లేదా అని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించే వారే లేరు. ఒక్కసారి ఓసీ రిలీజ్ అయ్యాక ఇక ఆ అపార్ట్‌మెంట్‌కు డెవలపర్‌కు సంబంధం ఉండదు.

వెంచర్లలో రిసార్ట్ అని వసూళ్లు..

ఓపెన్ ప్లాట్లు చేసే బిల్డర్లు కూడా మేము ఏం తక్కువ తిన్నామా అన్నట్లు అపార్ట్‌మెంట్లలో కల్పించే వసతులను వెంచర్లలో కూడా కల్పిస్తామని మాయమాటలు చెబుతున్నారు. మున్సిపల్ నిబంధనల ప్రకారం వెంచర్లలో రహదారులు, భూగర్భ మురుగునీటి వ్యవస్థ, విద్యుత్ వ్యవస్థ వంటివి కల్పించాల్సిన బాధ్యత డెవలపర్లదే.. కానీ, బిల్డర్లు వీటికి కూడా వసతుల ఏర్పాటు పేరిట చార్జీలు వసూలు చేస్తున్నారు. వీకెండ్ రిసార్ట్, ఫార్మింగ్, గోల్ఫ్ కోర్స్, క్లబ్‌హౌస్ సభ్యత్వం అని రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారు. శామీర్‌పేట, షాద్‌నగర్, తుక్కుగూడ, యాదాద్రి, చేవెళ్ల, శ్రీశైలం జాతీయ రహదారి వంటి పలు ప్రాంతాల్లోని వెంచర్లలో ఆధునిక వసతులు కల్పిస్తున్నామని తెగ ప్రచారం చేస్తూ కొనుగోలుదారులను ఆకర్షిస్తున్నారు.

ఇలా చేస్తే బెటర్..

- వసతుల కల్పనకు అయ్యే వ్యయాన్ని కొనుగోలుదారుల నుంచి వసూలు చేయడం సరైంది కాదు. నిర్మాణ సంస్థలు కల్పించే వసతులతో సగానికి పైగా అమినిటీస్ నివాసితులు వినియోగించరు. పైగా ప్రతినెలా నిర్వహణ ఖర్చులు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో గేటెడ్ కమ్యూనిటీల్లోని నివాసితులకు అపార్ట్‌మెంట్ కొనుగోలు భారంగా మారుతుంది. నిర్మాణం పూర్తయ్యాక ఎలాంటి చార్జీలు వసూలు చేయకుండా రెండేళ్ల పాటు వసతుల నిర్వహణ నిర్మాణ సంస్థే చేయాలి.
- ప్రాజెక్ట్‌లో విక్రయాలు పూర్తయ్యాక డెవలపర్ కమ్యూనిటీని హౌసింగ్ సొసైటీకి అప్పగిస్తారు. అక్కడి నుంచి అందులోని వసతులను నివాసితులే నిర్వహించుకోవాల్సి ఉంటుంది. మొదట్లో బాగానే ఉన్నా రోజులు గడుస్తున్న కొద్దీ ఆయా వసతుల నిర్వహణ పట్టించుకునే వారే ఉండరు. స్విమ్మింగ్ పూల్ ఎండిపోతుంది. నిర్వహణ లేక జిమ్, ఇతర వసతులు మూలనపడిపోతాయి.
- అపార్ట్‌మెంట్ నిర్వహణ ఖర్చులు చ.అ.ల చొప్పున కాకుండా నివాసితుందరికీ ఒకటే విధంగా ఉండాలి. పెద్ద సైజు గృహాలకు ఎక్కువ రహదారి, డ్రైనేజీ ఎక్కువ నీళ్లు, ఎక్కువ కాంతి వాడుకోలేరు కదా. అందుకే ఎన్ని ఫ్లాట్ల సంఖ్యను బట్టి చార్జీలను విభజించాలి.
- హౌసింగ్ సొసైటీల్లోని క్లబ్‌హౌస్‌లను థర్డ్ పార్టీకి అప్పగించాలి. రెస్టారెంట్, సూపర్ మార్కెట్, మెడికల్ వంటి ఇతరత్రా వాటికి అప్పగించాలి. ఆ అద్దెతో కమ్యూనిటీలో ఇతరత్రా ఖర్చులను వినియోగించుకోవచ్చు.
- ఒకటే ఏరియాలో ఉండే 3-4 ప్రాజెక్ట్‌లకు ఒకటే క్లబ్‌హౌస్ కట్టుకోవటం ఉత్తమం. దీంతో నిర్మాణ సంస్థకు ఖర్చు ఆదా అవటంతో పాటు నివాసితులకు నిర్వహణ భారం కాదు.

ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఓ నిర్మాణ సంస్థ అపార్ట్‌మెంట్ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తుంది. ఇందులో ధర చదరపు అడుగు(చ.అ.) రూ.9 వేలకు విక్రయిస్తుంది. 2,050 చ.అ.అపార్ట్‌మెంట్‌కు రూ.1,84,50,000 అవుతుంది. ఇక, ఈ అపార్ట్‌మెంట్‌లో వసతుల చార్జీలు కింది పట్టికలో చూద్దాం!

వసతులు	ధర (రూ.లలో)
కార్ పార్కింగ్	4,00,000
కరెంట్, వాటర్, గ్యాస్	2,00,000
క్లబ్‌హౌస్ సభ్యత్వం	1,50,000
ఫ్లోర్ రైజ్ చార్జీలు/చ.అ. (రూ.150)	3,07,500
ఈస్ట్ ఫేసింగ్/చ.అ.(రూ.50)	1,02,500
కార్నర్ వ్యూ/చ.అ.(రూ.50)	1,02,500
అడ్వాన్స్ కార్పస్ ఫండ్/చ.అ. (రూ.50)	1,02,500
అడ్వాన్స్ మెయింటనెన్స్/చ.అ. (రూ.50)	1,02,500
రిజిస్ట్రేషన్ చార్జీలు(7 శాతం)	14,54,968
మొత్తం	29,22,468

అపార్ట్‌మెంట్‌కు రూ.1,84,50,000 అయితే, వసతులకు చెల్లించాల్సింది రూ.2,92,22,468. వసతులు, అపార్ట్‌మెంట్ ధర రెండూ కలిపితే రూ.2,13,72,468 అయ్యిందన్నమాట.



వీకెండ్ హోమ్స్

- వారాంత గృహాలకు డిమాండ్
- పచ్చని వాతావరణమే ఆదరణకు కారణం

సాక్షి, సిటీబ్యూరో: వీకెండ్ వస్తే చాలు పబ్‌కో.. సినిమాలు, షికార్లకో వెళ్లే నగరవాసులు.. క్రమంగా ఇంటి వద్దే ఉంటున్నారు. అయితే ఈ ఇళ్లు కాస్త ప్రత్యేకమైనవండోయ్! కాలుష్యం, రణగొణ ధ్వనులకు దూరంగా, ప్రశాంతమైన పచ్చని వాతావరణంలో ఉంటే వీకెండ్ లేదా హాలిడే హోమ్స్‌కు పరుగులు పెడుతున్నారు. ఎంచక్కా కుటుంబంతో కలిసి వారాంతాన్ని అక్కడే గడిపేస్తున్నారు. కరోనాతో వీకెండ్ హోమ్స్‌కు ఆదరణ పెరిగింది.

పెట్టుబడులు పెరిగాయి..

29 శాతం మంది హెచ్‌ఎన్‌ఐలు హాలిడే హోమ్స్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు. లగ్జరీ హాలిడే హోమ్‌కు రూ.5-10 కోట్ల వరకు ఇన్వెస్ట్ చేయాలని 71 శాతం మంది భావిస్తున్నారని లగ్జరీ రియల్ ఎస్టేట్ బ్రోకరేజీ సంస్థ ఇండియా సోథెబీ ఇంటర్నేషనల్ రియల్టీ ఒక నివేదిక విడుదల చేసింది. 29 శాతం మంది రూ.10 కోట్ల పైన ధర ఉన్నా పర్వాలేదని చెప్పారు. లగ్జరీ అపార్ట్‌మెంట్ లేదా విల్లా అయితే రూ.10-25 కోట్ల వరకు పెట్టుబడికి సుముఖంగా ఉన్నట్లు 69 శాతం మంది చెప్పారు. 21 శాతం మంది రూ.5-10 కోట్ల బడ్జెట్‌లో, మిగిలిన 10 శాతం మంది రూ.25 కోట్లకు పైగా బడ్జెట్‌లో ఇల్లు తీసుకోవాలని అనుకుంటున్నారు.

వచ్చే రెండేళ్లలో రెట్టింపు..

- 200 హెచ్‌ఎన్‌ఐల అభిప్రాయాల ఆధారంగా దేశంలోని 8 ప్రధాన పట్టణాల్లో(హైదరాబాద్ సహా) రియల్ ఎస్టేట్ ధోరణులపై ఈ సంస్థ నివేదిక రూపొందించింది. సంపన్నుల్లో రియల్ ఎస్టేట్ పట్ల ధోరణి మారిందనడానికి ఈ ఫలితాలే నిదర్శనమని పేర్కొంది. వచ్చే రెండేళ్లలో కొనుగోళ్లకు సముఖంగా ఉన్నామని చెప్పిన 75 శాతం మంది ప్రాధాన్యతలు గమనిస్తే.. 89 శాతం మంది ఖరీదైన ఇళ్ల(సిటీ అపార్ట్‌మెంట్లు, బంగళాలు, హాలిడే హోమ్స్)పట్ల ఆసక్తిగా ఉన్నారు. 11 శాతం మంది ఖరీదైన వాణిజ్య ఆస్తులను కొనుగోలు చేయాలనుకుంటున్నారు.
- ముఖ్యంగా గడిచిన 18 నెలల్లో ఇల్లు కొనుగోలు చేసినట్లు 26% మంది చెప్పారు. వారి జీవనశైలిని మెరుగు పరుచుకోవడం, మంచి పెట్టుబడులను సొంతం చేసుకునే ఆలోచనతోనే వారు కొన్నారు. రెండు మూడేళ్లలో హెచ్‌ఎన్‌ఐలు, అల్ట్రా హెచ్‌ఎన్‌ఐలు ఖరీదైన ఇళ్లను సొంత వినియోగానికే కొనుగోలు చేశారు. మంచి పెట్టుబడి అవకాశం కోసం కొనుగోలు చేయడం అంటే అది బుల్లిష్ ధోరణికి సంకేతమని ఓ సంస్థ తెలిపింది.

వాక్ టు వర్క్

కార్యాలయానికి చేరువలోనే గృహాలు

ఈ తరహా ఇళ్లకే కొనుగోలుదారుల ఆసక్తి

కరోనాతో కస్టమర్ల అభిరుచిలో మార్పులు



సాక్షి, సిటీబ్యూరో: కరోనా తర్వాతి నుంచి గృహ కొనుగోలుదారుల అభిరుచిలో మార్పులు వచ్చాయి. కోవిడ్‌తో వర్క్ ఫ్రం హోమ్ అలవాటైన ఉద్యోగస్తులు తిరిగి కార్యాలయానికి వచ్చేందుకు ఆసక్తి చూపించడం లేదు. గంటల కొద్దీ ప్రయాణం చేస్తూ.. కాలుష్యం, ట్రాఫిక్ ఇబ్బందులతో ఆఫీసుకు వెళ్లేందుకు ఇష్టపడటం లేదు. ఈ నేపథ్యంలో వాక్ టు వర్క్ ప్రాజెక్ట్‌లకు డెవలపర్లు శ్రీకారం చుట్టారు. ఆఫీసులకు చేరువలోనే గృహాలతో పాటు స్కూల్, ఆస్పత్రి, షాపింగ్ మాల్, పార్కు వంటి అన్ని రకాల వాణిజ్య ఏర్పాట్లు ఉండటం వీటి ప్రత్యేకత. దీంతో ఈ తరహా ప్రాజెక్ట్‌లకు డిమాండ్ పెరిగింది. పనిచేసే కార్యాలయానికి చేరుకోవడానికి అత్యధిక శాతం మంది తక్కువలో తక్కువ గంటసేపు బస్సుల్లోనో లేదా ఇతరత్రా వ్యక్తిగత వాహనాల్లోనో గడిపేస్తున్నారు. దీంతో విలువైన సమయం వృథా అవుతోంది. కుటుంబానికి ఎక్కువ సమయం కేటాయించలేకపోతున్నారు. అయితే ఈ వాక్ టు వర్క్ ప్రాజెక్ట్స్‌లో ఇల్లు, ఆఫీసు, మాల్, పార్కులు, స్కూల్, ఆస్పత్రి.. ఇలా సమస్త అవసరాలూ ఒకే చోట ఉంటాయి.

ఈ ప్రాజెక్ట్‌లతో వేగంగా అభివృద్ధి

నడిచి వెళ్లేందుకు అనువైన దూరంలో కార్యాలయం, షాపింగ్ మాల్స్ ఉండాలని కోరుకునే వారి సంఖ్య నగరంలో రోజురోజుకూ పెరుగుతోంది. 'ఈ మధ్యకాలంలో మా వద్దకు వచ్చే ఐటీ నిపుణులు చాలా మంది ఇలాంటి ఫ్లాట్లే కావాలని అడుగుతున్నారు. అయితే ఈ వాక్ టు వర్క్ ప్రాజెక్ట్‌ల్లో కేవలం అన్ని సౌకర్యాలు ఒకే చోట ఉంటే సరిపోదు. ఆ ప్రాంతం కూడా అభివృద్ధికి చిరునామాగా నిలవాలి. అందుకే ఐటీ, బీపీఓ వంటి వాటితో గచ్చిబౌలి, మాదాపూర్‌లు ఎలా అయితే వృద్ధి చెందాయో అంతకు రెట్టింపు అభివృద్ధి జరుగుతుంది.

నగరం నలువైపులా..

గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్ వంటి కొన్ని ప్రాంతాలకే పరిమితమైన వాక్ టు వర్క్ ప్రాజెక్టులు ఇప్పుడు నగరం చుట్టూ విస్తరిస్తున్నాయి. ఐటీఐఆర్ ప్రాజెక్ట్‌తో వాక్ టు వర్క్ ప్రాజెక్ట్‌లకు మరింత ఊపొచ్చింది. ఆదిభట్ల, ఉప్పల్, పోచారం, మహేశ్వరం వంటి శివారు ప్రాంతాల్లోనూ ఐటీ సంస్థలు రానున్నాయి. దీంతో ఈ ప్రాంతాలకు చుట్టూ 4 కి.మీ. పరిధిలో వాక్ టు వర్క్ ప్రాజెక్టులు నిర్మించేందుకు బిల్డర్లు ముందుకొస్తున్నారు. నగరంలోని మొత్తం రెండు లక్షల మందికి పైగా ఐటీ ఉద్యోగుల్లో అత్యధికులు మాదాపూర్, గచ్చిబౌలి ప్రాంతాల్లోనే విధులు నిర్వహిస్తుంటారు. ఇక్కడికి సిటీ నలువైపుల నుంచి వచ్చే వారు కొందరైతే, ఐదారు కిలోమీటర్ల దూరం నుంచి వచ్చిపోయేవారు మరి కొందరు. వాక్ టు వర్క్ ప్రాజెక్ట్‌లతో ఇప్పుడు ఈ దూరం కూడా తగ్గిపోతుంది. ఒకవైపు కార్యాలయాలు, మరోవైపు గృహ నిర్మాణాలు.. ఇంకేం ఎంచక్కా నడుచుకుంటూ ఆఫీసుకు వెళ్లిపోవచ్చు. ఉదయం నడకకు బద్ధకించేవారికి ఇదొక వాకింగ్ గానూ ఉపయోగపడుతోంది. ఆరోగ్యం దృష్ట్యా సైకిల్‌పైనా ఆఫీసులకు కూడా వెళ్లొచ్చు.

కాస్ట్‌లీ సిటీ

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ కాస్ట్‌లీ సిటీగా అభివృద్ధి చెందింది. ఇప్పటి వరకు దేశంలోని ఏ ఇతర మెట్రో నగరాలతో పోల్చినా భాగ్య నగరంలో గృహాల ధరలు అందుబాటులో ఉండగా.. ఇప్పుడు దేశంలోనే రెండో అత్యంత ఖరీదైన నగరంగా మారిపోయింది. వార్షిక ప్రాతిపదికన హైదరాబాద్‌లో ప్రాపర్టీల విలువ 6 శాతం వృద్ధి చెంది.. చ.అ. ధర సగటున రూ.5,800 నుంచి రూ.6,000 వేలకు పెరిగింది. ముంబైలో ఏడాదిలో 3 శాతం పెరిగి.. రూ.9,600 నుంచి రూ.9,800లకు చేరిందని ఓ సంస్థ నివేదిక వెల్లడించింది. దాదాపు పదేళ్ల కాలంలో అతి తక్కువ గృహ రుణ వడ్డీ రేట్లు ఉండటం, స్టాంప్ డ్యూటీలను తగ్గించడం, సర్కిల్ ధరలలో సవరణలతో పాటు గృహ కొనుగోళ్లలో కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాలతో అందుబాటు ధరలలోని ఇళ్ల విక్రయాలలో అత్యధిక వృద్ధి నమోదైంది. ఒకవైపు సిమెంట్, స్టీలు వంటి నిర్మాణ సామగ్రి ధరలు విపరీతంగా పెరుగుతున్నప్పటికీ.. నిర్మాణ సంస్థలు కొనుగోలుదారులకు రాయితీలను అందిస్తున్నారు. లేదంటే ఆయా నగరాలలో ధరలు విపరీతంగా పెరిగే ప్రమాదముంది.

సరఫరా, డిమాండ్‌లలో వృద్ధి రేటు..

దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాలలో గృహాల విక్రయాలలో హైదరాబాద్‌లో అత్యధిక వృద్ధి నమోదైంది. బాచుపల్లి, తెల్లాపూర్, గండిపేట, దుండిగల్, మియాపూర్ ప్రాంతాలలో గృహ విక్రయాలకు డిమాండ్ విపరీతంగా ఉంది. ఆయా ప్రాంతాలలో ఇళ్ల ధరలు పెరుగుతున్నప్పటికీ.. డిమాండ్ ఏ మాత్రం తగ్గడం లేదు. లాంచింగ్ అయిన ప్రాజెక్ట్‌లలో రూ.కోటి కంటే ఎక్కువ ధర ఉన్న గృహాల వాటా 36 శాతంగా ఉంది. దుండిగల్, తెల్లాపూర్, గోపనపల్లి, బాచుపల్లి, బండ్లగూడ జాగీర్ ప్రాంతాలలో ఇళ్ల సరఫరా ఎక్కువగా ఉంది.



రియల్టీకి.. ఐటీ బూస్ట్

గ్రేడ్-ఏ ఆఫీస్ స్పేస్ లావాదేవీల్లో సిటీ టాప్

గ్రేడ్-ఏ ఆఫీస్ స్పేస్ లావాదేవీల్లో హైదరాబాద్ దూసుకువెళ్తోంది. దేశంలోని ఇతర మెట్రో నగరాల కంటే గణనీయమైన వృద్ధి రేటును నమోదు చేస్తోంది. ఈ క్రమంలో ప్రస్తుతం 9.04 కోట్ల చ.అ. ఆఫీస్ స్పేస్ ఉన్న హైదరాబాద్.. ఈ ఏడాది ముగింపు నాటికి 10 కోట్ల చ.అ. మైలురాయిని దాటనుందని ఓ సంస్థ సర్వేలో తేలింది. ఆఫీస్ స్పేస్ మార్కెట్‌లో బెంగళూరు, ముంబై, ఢిల్లీ-ఎన్‌సీఆర్ తర్వాత హైదరాబాద్ నాల్గో స్థానంలో నిలిచింది. కొంతకాలంగా కొంపల్లి, బాచుపల్లి, మేడ్చల్ వంటి ఉత్తరాది ప్రాంతాలు, ఎల్బీనగర్, ఉప్పల్, పోచారం వంటి తూర్పు ప్రాంతాలలో నివాస క్రయవిక్రయాలు జోరందుకున్నాయి. ఆయా ప్రాంతాలలోని అందుబాటు గృహాలను ఐటీ ఉద్యోగులు కొనుగోలు చేస్తున్నారు.



81 శాతం వృద్ధి రేటు..

కొన్నేళ్లుగా గ్రేడ్-ఏ ఆఫీస్ స్పేస్ మార్కెట్లో మన నగరం మెరుగైన స్థానాన్ని నమోదు చేస్తోంది. 2016 నుంచి 2021 వరకు పరిశీలిస్తే.. ఏకంగా 81 శాతం వృద్ధి రేటు నమోదు చేయడం విశేషం. దేశంలోని ఇతర మెట్రో నగరాలతో పోలిస్తే ఇదెంతో మెరుగైన స్థానం. మన నగరం తర్వాత రెండో స్థానంలో ఉన్న బెంగళూరు ఈ ఆరేళ్లలో 47 శాతం వృద్ధిని నమోదు చేసింది. కాగా దేశవ్యాప్తంగా అన్ని నగరాల్లోని గ్రేడ్-ఏ ఆఫీస్ స్పేస్ మార్కెట్ విభాగంలో మన నగర భాగస్వామ్యం ఇటీవలి వరకు 12.7 శాతంగా ఉండగా.. కొత్తగా అందుబాటులోకి వచ్చిన స్పేస్‌తో 25 శాతానికి పెరిగింది.

గ్రిడ్ పాలసీ అమలుతో..

గ్రిడ్ పాలసీతో నగరం నలువైపులా ఐటీ విస్తరించింది. డెవలపర్లకు ప్రభుత్వం ప్రోత్సాహకాలను కూడా అమలు చేస్తోంది. మూడు సంవత్సరాల వ్యవధిలో 500 లేదా అంతకంటే ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్న ఐటీ, ఐటీఈఎస్ యూనిట్లకు యాంకర్ యూనిట్ ప్రోత్సాహకాలను అందిస్తోంది. ఇందులో సంబంధిత భూమిని 50 శాతం ఐటీ, ఐటీఈఎస్ ప్రయోజనాల కోసం వినియోగించగా.. మిగిలిన సగంలో నివాస, వాణిజ్య ప్రయోజనాలకు వినియోగించవచ్చనే వెసులుబాటు కల్పించింది. హైదరాబాద్ ఆఫీస్ స్పేస్ మార్కెట్ అనేది కేవలం రెండు ప్రధాన కారిడార్లలోనే కేంద్రీకృతమై ఉంది. హైటెక్‌సిటీ, గచ్చిబౌలి ప్రాంతాలు గ్రేడ్-ఏ ఆఫీస్ స్పేస్ మార్కెట్ ఇంజిన్లుగా పనిచేస్తున్నాయి. 96 శాతం స్పేస్ ఈ ప్రాంతాల నుంచే ఉంది.

రియల్ ఎస్టేట్‌లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ) రంగం కీలకమైంది. హైదరాబాద్ స్థిరాస్తికి ఐటీ బూస్ట్‌లా మారింది. ఐటీ ఉద్యోగులపై ఆధారపడి గృహ విక్రయాలు జరుగుతాయో.. అంతకు రెట్టింపు స్థాయిలో ఐటీ సంస్థల లావాదేవీలు జరుగుతున్నాయి. గచ్చిబౌలి, మాదాపూర్ వంటి పశ్చిమాది ప్రాంతాలకే పరిమితమైన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ) ఆఫీస్ స్పేస్.. గ్రోత్ ఇన్ డిస్పర్షన్(గ్రిడ్) పాలసీతో నగరం నలువైపులా విస్తరించింది. ఈ పాలసీలో భాగంగా ప్రభుత్వం ఔటర్ వెంబడి ఉత్తర, తూర్పు ప్రాంతాల్లో ఉన్న 11 పారిశ్రామిక పార్క్‌లను ఐటీ పార్క్‌లుగా మార్చింది. దీంతో పాటు కొంపల్లిలో ఐటీ టవర్, కొల్లూరులో ఐటీ పార్క్‌లను నిర్మిస్తోంది. ఫలితంగా పశ్చిమం వైపు కాకుండా ఇతర ప్రాంతాలలో కొత్తగా 3.5-4 కోట్ల చ.అ. ఐటీ ఆఫీస్ స్పేస్ అందుబాటులోకి రానుందని ఓ సంస్థ తెలిపింది.

– సాక్షి, సిటీబ్యూరో



ఇది మన.. నారీ శక్తి

త్రివిధ దళాల్లో రాణిస్తున్న ధీరవనితలు

2024 నాటికి ఆర్మీలో **4.12%**

ఎయిర్‌ఫోర్స్‌లో **13.40%**

నేవీలో **6.81%**

రక్షణ పరిశోధన రంగంలో **15.53%**

పోలీసు విభాగంలో **9.74%** అతివలే

కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్.. ఇప్పుడు యావత్ భారతదేశం మారుమోగుతున్న పేర్లు. ఆపరేషన్ సిందూర్ వివరాలు తెలిపేందుకు ఏర్పాటుచేసిన అధికారిక విలేకరుల సమావేశానికి ఇద్దరు మహిళా అధికారులు నాయకత్వం వహించడం ఒక చరిత్ర. వీరిద్దరూ దేశంలో మన నారీ శక్తికి ప్రతిబింబాలు. అంతేకాదు, సాయుధ దళాల్లో పెరుగుతున్న మహిళల బలానికి ప్రతీక. దీంతో ఇప్పుడు అందరి దృష్టి... మన మహిళా శక్తిపై పడింది. అసలు మన దేశంలో త్రివిధ దళాల్లో ఎంతమంది సివంగులు ఉన్నారు.. రక్షణ పరిశోధన రంగంలో ఎందరు మహిళా మేధావులు మన కీర్తి పతాకను అంతర్జాతీయ యవనికపై రెపరెపలాడేలా చేస్తున్నారు... పోలీసు విభాగంలో రాణిస్తున్న అతివలు ఎందరు... ఇవిగో ఆ ఆసక్తికర వివరాలు..

- సాక్షి, స్పెషల్ డెస్క్



కల్నల్ సోఫియా ఖురేషీ



వింగ్ కమాండర్ వ్యోమికా

రక్షణ దళాల్లో రుద్రమలు

మనదేశంలోని త్రివిధ దళాల్లో అత్యధిక శాతం మహిళలు ఉన్నది ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో. అందులో 2024 నాటికి 13.40 శాతం అతివలే. ఆ తరువాత.. ఇండియన్ నేవీలో అత్యధిక శాతం మహిళలు ఉన్నారు. 2020లో 5.53 శాతం నారీ శక్తి ఉంటే.. 2024 నాటికి అది 6.81 శాతానికి పెరిగింది. ఇక, ఆర్మీలో 2020లో 3.84 శాతం వీరనారీమణులు ఉంటే.. 2024కి అది 4.12 శాతానికి పెరిగింది.

రక్షణ పరిశోధన రంగంలోనూ...

రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ.. డీఆర్‌డీఓలో మహిళా ప్రాతినిధ్యం చాలా ఎక్కువగా ఉంది. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థిని అయిన జే.మంజుల.. డీఆర్‌డీఓలో శాస్త్రవేత్తగా అడుగుపెట్టి అంచెలంచెలుగా ఏకంగా ఆ సంస్థ డైరెక్టర్ పదవినే చేపట్టారు. ఇలా శాస్త్రవేత్తలుగా, వివిధ విభాగాల్లో రాణిస్తున్న మహిళలు డీఆర్‌డీఓలో అత్యధిక శాతంలో ఉన్నారు. 2020 నుంచి చూస్తే సగటున 3,000 మంది.. అంటే మొత్తం ఉద్యోగుల్లో సగటున 15 శాతానికిపైగా మహిళలే ఉన్నారు.

సంవత్సరాల వారీగా — మొత్తం సిబ్బంది / మహిళలు / మహిళల శాతం

సంవత్సరం	ఆర్మీ మొత్తం సిబ్బంది	ఆర్మీ మహిళలు	ఆర్మీ మహిళల శాతం	ఎయిర్‌ఫోర్స్ మొత్తం సిబ్బంది	ఎయిర్‌ఫోర్స్ మహిళలు	ఎయిర్‌ఫోర్స్ మహిళల శాతం	నేవీ మొత్తం సిబ్బంది	నేవీ మహిళలు	నేవీ మహిళల శాతం	రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) మొత్తం సిబ్బంది	డీఆర్‌డీఓ మహిళలు	డీఆర్‌డీఓ మహిళల శాతం
2020	42,946	1,648	3.84	12,232	1,625	13.28	11,630	643	5.53	21,057	3,361	15.96
2021	43,004	1,705	3.97	12,107	1,607	13.27	11,702	663	5.67	20,513	2,922	14.24
2022	42,953	1,709	3.97	12,142	1,632	13.44	11,735	686	5.85	19,971	3,159	15.82
2023	42,428	1,733	4.08	11,951	1,625	13.60	11,815	730	6.18	18,921	3,005	15.88
2024	42,141	1,735	4.12	12,049	1,614	13.40	11,719	798	6.81	20,583	3,196	15.53

కొన్ని ప్రధాన విభాగాల్లో ఎంతెంత శాతం మహిళలు ఉన్నారంటే..

విభాగం	మొత్తం సిబ్బంది	మహిళలు	మహిళల శాతం
సివిల్ పోలీస్	14,30,910	2,14,187	14.97
డీఏఆర్‌పీ	2,38,848	27,010	11.31
ఆర్పీఎఫ్	64,370	5,938	9.22
సీఐఎస్ఎఫ్	1,42,136	10,001	7.04
ఇండియన్ రిజర్వ్ బెటాలియన్ పోలీస్	1,39,705	8,162	5.84
స్పెషల్ ఆర్మ్‌డ్ పోలీస్ బెటాలియన్	3,31,842	14,403	4.34
సశస్త్ర సీమా బల్	88,363	3,667	4.15
సరిహద్దు భద్రతా దళం	2,45,290	8,442	3.44
సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్	2,95,371	9,425	3.19

పోలీసు బలగం

దేశంలో 2023 జనవరి 1 నాటికి 31,50,331 మంది పోలీసు సిబ్బంది ఉంటే.. అందులో మహిళలు 3,06,748. అంటే మొత్తం సిబ్బందిలో 9.74 శాతం. ఇందులో కూడా సివిల్ పోలీస్ విభాగంలో అత్యధికంగా 14.97 శాతం ఉన్నారు. డిస్ట్రిక్ట్ ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ (డీఏఆర్‌పీ) విభాగంలో 11.31 శాతం, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్)లో 9.22 శాతం, కేంద్ర పారిశ్రామిక భద్రతా దళంలో (సీఐఎస్ఎఫ్) 7.04 శాతం అతివలే.

ఆధారం: కేంద్ర గణాంక శాఖ రూపొందించిన 'విమెన్ అండ్ మెన్ ఇన్ ఇండియా 2024' పుస్తకం

క్లుప్తంగా...

రుణాల చెల్లింపులకు రూ. 2,962 కోట్లు విడుదల

నీటిపారుదల శాఖ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ జలవనరుల మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(టీడబ్ల్యూఆర్డీసీఎల్) తీసుకున్న రుణాల కింద అసలుతో వడ్డీ చెల్లింపు కోసం రూ.2,962.47 కోట్లను విడుదల చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ సంస్థ ఇందిరమ్మ ఫ్లడ్ ఫ్లో కెనాల్ కోసం రూ.3,669.34 కోట్లు, జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకానికి రూ.3,590.86 కోట్లు, సమ్మక్కసాగర్ బరాజ్ (తుపాకులగూడెం) కోసం రూ.1,621.35 కోట్లు, సీతారామ ఎత్తిపోతల పథకంకోసం రూ.5,386.50 కోట్లు, సీతమ్మసాగర్ కోసం రూ.1,016.27 కోట్ల రుణాలను తీసుకుంది. మొత్తం రూ. 15,284.32 కోట్ల రుణాలు విడుదల కాగా... ఇప్పటిదాకా రూ.2,428 కోట్లను కట్టారు. మిగిలిన రూ.12,856 కోట్ల రుణానికి అసలు, వడ్డీ కింద రూ.2,962.47 కోట్లను విడుదల చేస్తూ నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా శుక్రవారం ఉత్తర్వులిచ్చారు.

కోట్‌పల్లి వాగు ప్రాజెక్టు ఆధునీకరణకు రూ. 89.90 కోట్లు

పరిపాలనాపరమైన అనుమతినిచ్చిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం కోటిపల్లి గ్రామంలో ఉన్న కోట్‌పల్లి వాగు మధ్యతరహా ప్రాజెక్టు ఆధునీకరణకు ప్రభుత్వం రూ.89.30 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు పరిపాలనాపరమైన అనుమతినిస్తూ నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులతో ప్రాజెక్టులో పేరుకుపోయిన పూడికను తొలగించడంతోపాటు కాల్వలకు లైనింగ్, దెబ్బతిన్న నిర్మాణాల మరమ్మతులు చేపడతారు. జలాశయంలో ప్రయోగాత్మకంగా ప్రతి 50 మీటర్లు లేదా 100 మీటర్ల నిడివితో గుంతలు తవ్వి.. పూడికను తొలగించాల్సి ఉంటుంది.

సాగర్ ఎడమ కాలువ మరమ్మతులకు రూ.13.82 కోట్లు

ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జుజ్జులరావుపేట వద్ద నాగార్జునసాగర్ ఎడమ కాలువ 133.600 కిలోమీటర్ల నుంచి 141.208 కిలోమీటర్ల మధ్య మరమ్మతులు, కరకట్టల నిర్మాణం కోసం రూ.13.82 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది.

నక్సలైట్ల చర్యలపై మంత్రి సీతక్క నోరెత్తరేం?

బీజేపీ ఎస్టీ మోర్చా అధ్యక్షుడు కల్యాణ్ నాయక్

సాక్షి, హైదరాబాద్: కగార్ ఆపరేషన్ వద్దు, శాంతి చర్చలు జరపాలి అని చెప్పే మంత్రి సీతక్క అమాయక పోలీసుల ప్రాణాలు తీస్తున్న నక్సలైట్ల ఘాతుకాలపై నోరెందుకు మెదపడం లేదని బీజేపీ ఎస్టీ మోర్చా అధ్యక్షుడు కల్యాణ్ నాయక్ ప్రశ్నించారు. ములుగు జిల్లాలో నక్సలైట్ల మందుపాతరకు బలైన పోలీసులకి శ్రద్ధాంజలి అర్పించిన సీతక్క వాస్తవ వైఖరి దేనికి సంకేతమని ఒక ప్రకటనలో ప్రశ్నించారు. నక్సలైట్లకు పరోక్షంగా మద్దతు తెలుపుతూ, మరోవైపు మౌనం పాటించి ప్రజల్ని మభ్యపెట్టే నాటకం ఇదా? అని నిలదీశారు. 'మీరు ప్రభుత్వ మంత్రి కాదా? లేదా నక్సలైట్ల దూతలా వ్యవహరిస్తున్నారా?'అని మండిపడ్డారు. ఇటీవల సీతక్క భర్త సంస్మరణ సభలో తన భర్త ఆశయాలను సాధిస్తామన్న వ్యాఖ్యల ద్వారా నక్సలైట్లకు మద్దతు ఇవ్వడమే కాక, ప్రభుత్వం మీదే ప్రజల్లో అపోహలు కలిగించేలా ఉన్నాయని కల్యాణ్ ఆరోపించారు. ములుగు ప్రాంతంలో ఇసుక దందాలు, ఆదివాసీల భూముల సమస్యలు, అధికార దుర్వినియోగం వంటి వాటిపై మంత్రి మౌనం వహించడం అనుమానాస్పదంగా ఉందన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, పువ్వాడ అజయ్, సండ్ర వెంకటవీరయ్య తదితరులు

ఒక ఓటుకు ఐదేళ్ల శిక్ష!

తప్పు పార్టీకి ఓటేస్తే అనుభవించాలి కదా

- కేసీఆర్ చెప్పినా వినకపోవడం వల్లే మోసకారి ప్రభుత్వం వచ్చింది
- ఖమ్మం జిల్లా పర్యటనలో కేటీఆర్ వ్యాఖ్యలు

సత్తుపల్లి: 'రాష్ట్రమంతా బర్బాద్ అయింది.. ఏమైనా ఉపాయం ఉంటే ఆలోచించండి అన్నా అని ఓ ఆటోడ్రైవర్ ఈ మధ్య సిగ్నల్ దగ్గర నన్ను గుర్తుపట్టి అడిగారు.. ఒక ఓటుకు ఐదేళ్ల శిక్ష.. తప్పు పార్టీకి ఓటేస్తే అనుభవించాలి కదా.. రీకాల్ వ్యవస్థ మనకు లేదు..'అని చెప్పానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మిట్టపల్లిలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రాయల శేషగిరిరావు కాంస్య విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో కలిసి శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో కేటీఆర్ మాట్లాడారు. ఇటువంటి దుర్మార్గులు అధికారంలోకి వస్తారని ప్రపంచ మేధావి బీఆర్ అంబేడ్కర్ ఊహించక పోవడంతోనే వారిని ఐదేళ్లు భరించాల్సి వస్తోందని వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్ నుంచి కేసీఆర్ వరకు పలువురు సీఎంలను చూసిన తాను, రేవంత్‌రెడ్డి వంటి దివాలాకోరు సీఎంను మాత్రం చూడలేదని పేర్కొన్నారు. ఢిల్లీకి వెళ్తే తమ మాటలు నమ్మడం లేదని, దొంగల్లా చూస్తున్నారని, అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వటం లేదని సీఎం హోదాలో ఉన్న వ్యక్తి మాట్లాడొచ్చా అని ప్రశ్నించారు.

వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఆశీర్వదించండి

ఢిల్లీ పార్టీలను నమ్మొద్దని కేసీఆర్ మీటింగ్‌లు పెట్టి మరీ చెప్పారని.. మోసపోతే గోస పడతామని చెప్పినా ప్రజలు వినకపోవడం వల్లే మోసకారి ప్రభుత్వం వచ్చిందని కేటీఆర్ అన్నారు. ప్రజలకు అండగా ఉంటున్న బీఆర్ఎస్ పార్టీని భవిష్యత్ ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ప్రతి ఒక్కరూ ప్రజా సమస్యలపై కాంగ్రెస్ నేతలను నిలదీయాలని సూచించారు. తొలుత పహల్గాం మృతులతో పాటు యుద్ధంలో అమరులైన జవాన్లకు కేటీఆర్ సహా నేతలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు.

తాజా పరిణామాలతో మనసు గర్వపడుతోంది

- దత్తాత్రేయ రచించిన 'జనతా కీ కహానీ మేరీ ఆత్మకథ' ఆవిష్కరణలో జగదీప్ ధన్‌ఖడ్
- హాజరైన హరియాణా సీఎం, బిహార్ గవర్నర్, కేంద్రమంత్రులు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్. చిత్రంలో బండారు దత్తాత్రేయ, కిషన్‌రెడ్డి, మనోహర్‌లాల్ ఖట్టర్ తదితరులు

సాక్షి, న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి తర్వాత దేశంలో జరుగుతున్న పరిణామాలు మనసు గర్వపడేలా చేస్తున్నాయని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అన్నారు. ఈ పరిణామాలతో శాసనం బలమేంటి? దాని దృష్టి కోణం ఏంటి.. ఆలోచన ఏంటనేది అందరూ అనుభూతి చెందుతున్నారన్నారు. శుక్రవారం మహారాష్ట్ర సదన్‌లో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ రచించిన 'జనతా కీ కహానీ మేరీ ఆత్మకథ'హిందీ అనువాద పుస్తకాన్ని ధన్‌ఖడ్ ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'పహల్గాం ఉగ్రదాడి ఘటన తర్వాత దేశంలో మౌనం ఆవహించింది. ఈ విషయంలో మనం ఏ దేశానికి తీసిపోము. జరుగుతున్న పరిణామాలు ప్రతి భారతీయుడి మనసు గర్వపడేలా చేస్తోంది. ఈ మౌనం నేపథ్యంలో ప్రతి ఒక్కరూ సంకల్పం తీసుకోవాలి. మనం భారతీయులం, భారతీయతే మన గుర్తింపు. జాతీయ వాదమే మన ధర్మం. దీనికి నిదర్శనమే 'జనతా కీ కహానీ మేరీ ఆత్మకథ'. ఇది దత్తాత్రేయ జీవిత సారం. ఒక వ్యక్తి జీవితం ఇన్ని సంఘర్షణల తర్వాత కూడా విజయవంతంగా ముందుకు సాగిందని పుస్తకం చదివాక నేను ఆశ్చర్యపోయాను'అని అన్నారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ... తన జీవిత అనుభవాలను పంచుకున్నారు. ప్రస్తుత కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమానికి హరియాణా సీఎం నాయబ్ సింగ్ సైనీ, బిహార్ గవర్నర్ ఆరీఫ్ మహ్మద్, కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, మనోహర్‌లాల్ ఖట్టర్, కల్‌రాజ్ మిశ్రా, అర్జున్‌రామ్ మేఘ్వాల్, మాజీ కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్, పలువురు ఎంపీలు, బీజేపీ నేతలు, పలువురు ప్రముఖులు హాజరయ్యారు. అంతకుముందు దత్తాత్రేయ కుటుంబ సభ్యులు జగదీప్ ధన్‌ఖడ్‌ను శాలువాతో సన్మానించారు.



జర్నలిస్టుల కుటుంబ సభ్యులకు చెక్ అందజేస్తున్న పొంగులేటి. చిత్రంలో ఎంపీ రఘురాంరెడ్డి, ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి

అర్హులైన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

పాత్రికేయులను ఆదుకోవడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తాం: మంత్రి పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం ప్రెస్ అకాడమీ కార్యాలయంలో వివిధ కారణాలతో మృతి చెందిన, ప్రమాదాలకు గురైన జర్నలిస్టుల కుటుంబాలకు మంత్రి పొంగులేటి చెక్కులు పంపిణీ చేశారు. జర్నలిస్టుల పునశ్చరణ తరగతుల నిర్వహణకు అకాడమీ రూపొందించిన చిరు పుస్తకాన్ని మంత్రి పొంగులేటి, ఖమ్మం ఎంపీ రఘురామిరెడ్డి, ప్రెస్ అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్‌రెడ్డి, సమాచారశాఖ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి, సమాచార అడిషనల్ డైరెక్టర్ జగన్, శ్రీనివాస్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలైన జర్నలిస్టులు, వృత్తి నిర్వహణలో చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామన్నారు. మండల, నియోజకవర్గ స్థాయిలో పనిచేస్తున్న జర్నలిస్టులను ఆదుకోవడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. నాటి ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన ప్రెస్ అకాడమీ భవనానికి చిన్నచిన్న మరమ్మతులు పూర్తి చేసి ఈ నెలాఖరులోగా ప్రారంభిస్తామని తెలిపారు.

- ఖమ్మం ఎంపీ రఘురామిరెడ్డి మాట్లాడుతూ ఈ సమాజంలో జర్నలిస్టు వృత్తి అత్యంత కీలకమైనదని తమ ప్రాణాలను లెక్క చేయకుండా సమాచారాన్ని ప్రజలకు అందిస్తున్నారన్నారు.
- ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇళ్లు, ఇవ్వాలని, జర్నలిస్టుల సంక్షేమానికి నిధులను పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రూ. 42 కోట్లకు వచ్చే వడ్డీ జర్నలిస్టుల సంక్షేమానికే

విడతల వారీగా ప్రభుత్వం మంజూరు చేసిన రూ.42 కోట్లను ఎఫ్‌డీ చేసి, దానిపై వచ్చే వడ్డీని జర్నలిస్టుల సంక్షేమానికి అకాడమీ ఖర్చు పెడుతుందని మంత్రి పొంగులేటి అన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై వచ్చిన వడ్డీ ఆధారంగా ఇప్పటివరకు రూ.22 కోట్లు ఖర్చు చేశారన్నారు. వివిధ కారణాలతో మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు చెందిన 597 మందికి లక్ష చొప్పున చెక్కులు పంపిణీ చేశారు. వీరికి నెలకు రూ. 3 వేల చొప్పున పెన్షన్, నెలకు స్కూల్ ఫీజు రూ. వేయి చొప్పున ఒకటో తరగతి నుంచి టెన్త్ వరకు ఇస్తామన్నారు.

త్వరలోనే 5 వేల మంది సర్వేయర్లు

రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రైతాంగానికి మెరుగైన సేవలందించడంతో పాటు వ్యవసాయ భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో పనిచేస్తున్నామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో సర్వే, సెటిల్‌మెంట్, ల్యాండ్ రికార్డ్స్ విభాగాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. శుక్రవారం సచివాలయం నుంచి ఆ విభాగంపై మంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని ప్రతి మండలం, పట్టణంలో భూమి విస్తరణ, లావాదేవీల సంఖ్యను బట్టి రాష్ట్రవ్యాప్తంగా 5 వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను త్వరలోనే అందుబాటులోకి తెస్తామని తెలిపారు. భూభారతి చట్టంలో భాగంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సర్వే మ్యాప్‌ను జతపర్చాల్సిన నేపథ్యంలో సర్వే విభాగం క్రియాశీలం కావాల్సి ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 402 మంది సర్వేయర్లు సరిపోరని, అందుకే ఓ వైపు లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించుకోవడంతో పాటు ఖాళీగా ఉన్న సర్వేయర్ పోస్టులను భర్తీ చేస్తామని పొంగులేటి వెల్లడించారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, ఎంపికైన వారికి 50 పనిదినాల్లో శిక్షణ ఇస్తామని చెప్పారు. సమావేశంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, సర్వే శాఖ కమిషనర్ జ్యోతి బుద్ధప్రకాశ్, సీసీఎల్ఏ ప్రాజెక్టు డైరెక్టర్ మకరందు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీల సౌర విద్యుత్ కోసం జిల్లా కమిటీలు

జిల్లా కలెక్టర్ నేతృత్వంలో ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్: ఇందిరా మహిళా శక్తి పథకం కింద స్వయం సహాయక సంఘాలతో పీఎం కుసుమ్‌లో కాంపోనెంట్-ఏ కింద సోలార్ ప్లాంట్లు పెట్టించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే ఈ ప్లాంట్లు పెట్టడానికి వీలుగా స్వయం సహాయక సంఘాలకు సాంకేతిక సహాయం అందించేందుకు జిల్లా స్థాయిలో కలెక్టర్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా శుక్రవారం జీవో జారీచేశారు. పొదుపు సంఘాలతో భారీగా సోలార్ ప్లాంట్లు పెట్టించాలని ప్రభుత్వం ఇప్పటికే యోచిస్తోంది. ఈ నేపథ్యంలో అనుమతులు పొందిన పొదుపు సంఘాలు సోలార్ ప్లాంట్లు పెట్టడానికి అవసరమైన సహకారాన్ని జిల్లా కమిటీలు అందించనున్నాయి. జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఉండే కమిటీలో మెంబర్ కన్వీనర్‌గా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్, డిస్కంలకు చెందిన ఎస్ఈ (ఆపరేషన్స్), తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (రెడ్కో) జిల్లా మేనేజర్ సభ్యులుగా ఉంటారు.

నాది లేటెస్ట్ మోడల్

▶ మొదటి పేజీ తరువాయి

బోనస్ కూడా ఇస్తున్నాం. బీజేపీ రిజర్వేషన్లకు వ్యతిరేకం. మేం రిజర్వేషన్ల పెంపును సమర్థిస్తాం. కేంద్ర ప్రభుత్వం, గుజరాత్ మోడల్‌లో మీడియాకు స్వేచ్ఛ లేదు. మా మోడల్‌లో ఈ స్వేచ్ఛ ఉంది. అందుకే మోదీ మోడల్ అవుట్ డేటెడ్. నాది అప్ టు డేట్ మోడల్. అందుకే తెలంగాణను కేంద్రం అనుసరిస్తోంది..' అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. శుక్రవారం బెంగళూరు వేదికగా జాతీయ దినపత్రిక ది హిందూ నిర్వహించిన 'ది హిందూ హడిల్' చర్చాగోష్ఠిలో ఆయన హైదరాబాద్ నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. 'ముందుగా ఈ దేశాన్ని రక్షిస్తున్న భారత ఆర్మీకి సెల్యూట్ చేస్తున్నా. సైనికులకు సంఘీభావం ప్రకటించే సమయం ఇది..' అని సీఎం అన్నారు. అనంతరం పలు అంశాలపై తన అభిప్రాయాలను వెలిబుచ్చారు.

కులగణన భవిష్యత్ తరాలకు దారి చూపిస్తుంది

'సామాజిక న్యాయం అనేది కాంగ్రెస్ పార్టీ పేటెంట్. దేశంలో లేదా ఏ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా కులగణన చేపడతామని ప్రజలకు రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారు. ఆ మేరకు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సర్వే చేపట్టింది. మేము చేసిన తర్వాతే కేంద్ర ప్రభుత్వం కూడా దీన్ని చేపట్టింది. కులగణన చేయడం మినహా కేంద్రానికి మరో మార్గం లేదు. ఈ కులగణన భవిష్యత్ తరాలకు దారి చూపిస్తుంది. నాలుగు దశాబ్దాలుగా ఎస్సీల వర్గీకరణ కోసం పోరాటం జరుగుతోంది. ఎస్సీల్లో 59 కులాలున్నాయి. వీటిలో కొన్ని కులాలు విద్య, ఉపాధి రంగాల్లో లబ్ధి పొందుతున్నాయి. కొన్ని వర్గాలకు న్యాయం జరగడం లేదు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాలకు మార్గదర్శనం చేసింది. మేం వెంటనే రంగంలోకి దిగాం. కేబినెట్ సబ్ కమిటీ సిఫారసు మేరకు ఏకసభ్య కమిషన్ నియమించాం. ఈ కమిషన్ మూడు కేటగిరీల్లో ఎస్సీలను వర్గీకరించాలని చెప్పింది. ఆ సిఫారసుకు అనుగుణంగా ఎస్సీల వర్గీకరణను తెలంగాణ ప్రభుత్వం చేపట్టింది..' అని ముఖ్యమంత్రి చెప్పారు.

విద్యార్థి దశలోనే కులం సమస్య గుర్తించా

'గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన నాయకుడిగా సమాజంపై కులం ఎంత ప్రభావం చూపిస్తుందో నాకు బాగా తెలుసు. విద్యార్థి దశలో ఉన్నప్పటి నుంచే ఆ సామాజిక వర్గాలకు చెందిన వారితోనే కలిసి ఉండడం ద్వారా సమాజం వారిని విస్మరిస్తోందని, దూరంగా ఉంచుతోందని గుర్తించా. 75 ఏళ్ల స్వాతంత్య్రం తర్వాత కూడా కులాల పేరుతో విభజించి చదివించడం మంచిది కాదు. అందుకే నా కేబినెట్ సహచరులకు, అధికారులకు చెప్పా. అన్ని వర్గాల ప్రజలకు మంచి విద్యా సదుపాయాలు కల్పించాలని, మంచి వాతావరణంలో వారికి విద్యాబుద్ధులు నేర్పాలని. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు అగ్రవర్ణాలకు చెందిన విద్యార్థులందరినీ కలిపి చదివించాలని వారు సూచించారు. అందులో భాగంగానే యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. మొత్తంగా రూ.25 వేల కోట్ల పెట్టుబడి భవిష్యత్ కోసం పెడుతున్నాం. కేంద్ర ప్రభుత్వం కూడా ఇలాంటి చర్యలను చేపట్టాలి..' అని రేవంత్ అన్నారు.

రైతుల కోసం ఎన్నో చేస్తున్నాం..

'సంక్షేమం విషయంలో తెలంగాణ దేశంలోనే మంచి మోడల్. అయితే సంక్షేమానికి సమాంతరంగా అభివృద్ధి జరగాలి. సంక్షేమం, అభివృద్ధి కలిసి ముందుకెళ్లాలి. నేను ఈ విధంగానే రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నా. రుణమాఫీ, పెట్టుబడి సాయం, మద్దతు ధర కోసం రైతులు ఇప్పుడు కూడా పోరాడుతున్నారు. మేం తొలి ఏడాదిలోనే 25.30 లక్షల మంది రైతులకు రూ.20,617 కోట్ల రుణమాఫీ చేశాం. ప్రతి యేటా రూ.18 వేల కోట్ల పెట్టుబడి సాయం చేస్తున్నాం. 24 గంటల పాటు రైతులకు నాణ్యమైన విద్యుత్ ఇస్తున్నాం. సోనియాగాంధీ నేతృత్వంలో దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి తీసుకొచ్చిన పథకమిది. ఈ పథకం కింద ఏడాదికి రూ.12 వేల కోట్లు వెచ్చిస్తున్నాం. ధాన్యానికి మద్దతు ధర, బోనస్ కలిపి క్వింటాల్‌కు రూ.2,800 ఇస్తున్నాం..' అని సీఎం వెల్లడించారు.

నా పోటీ మన దేశ నగరాలతో కాదు..

'స్వయం సహాయక సంఘాల (67 లక్షల మంది) మహిళలకు సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసే అవకాశం కల్పించాం. రాష్ట్రంలోని 10 వేల ఆర్టీసీ బస్సుల్లో వెయ్యి బస్సులు మహిళలకు కేటాయించాం. విద్యార్థుల డ్రెస్సులు కుట్టే కాంట్రాక్టు మహిళలకు ఇచ్చాం. యువకుల కోసం యంగ్ ఇండియా స్కిల్స్, స్పోర్ట్స్ యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తున్నాం. దావోస్ వేదికగా రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చాం. రాష్ట్రంలో డ్రైపోర్టు, నెట్‌జీరో సిటీ ఏర్పాటు చేయాలనుకుంటున్నాం. దీనికి భారత్ ఫ్యూచర్ సిటీగా నామకరణం చేశాం. నా పోటీ బెంగళూరు, అమరావతి, ముంబై, ఢిల్లీలతో కాదు. న్యూయార్క్, టోక్యో, దుబాయ్, సింగపూర్‌లు నా లక్ష్యం..' అని రేవంత్ పేర్కొన్నారు.

వన్ పర్సన్-వన్ పార్టీ విధానం అంగీకరించం

'లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనకు మేం వ్యతిరేకం కాదు. అయితే ముందు అన్ని రాజకీయ పార్టీలను పిలిచి మాట్లాడి నిబంధనలు రూపొందించాలని అడుగుతున్నాం. జనాభా ప్రాతిపదికన ముందుకెళితే దక్షిణాది రాష్ట్రాలతో పాటు పంజాబ్ కూడా నష్టపోతుంది. మీరు నియోజకవర్గాలను ఎలా పెంచినా మాకు 33 శాతం సీట్లు ఇవ్వాలని అడుగుతున్నాం. లేనిపక్షంలో అది నియోజకవర్గాల పునర్విభజన కాదు. వన్ పర్సన్-వన్ పార్టీ విధానం ఇది. దీన్ని మేం అంగీకరించేది లేదు..' అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. జాతీయ భద్రతా సలహాదారుడిగా పనిచేసిన ఎం.కె.నారాయణన్ చర్చాగోష్ఠిలో సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశంసించారు. ఉన్నది ఉన్నట్టు కుండబద్దలు కొట్టి చెపుతున్నారంటూ అభినందించారు. ఈ కార్యక్రమానికి హిందూ తెలంగాణ పొలిటికల్ ఎడిటర్ ఆర్.రవికాంత్‌రెడ్డి సమన్వయకర్తగా వ్యవహరించారు.

మిస్ వరల్డ్ 2025





‘దేవుడే దిగొచ్చి మిమ్మల్నేమైనా కోరుకోమంటే ఏం కోరుకుంటారు?’

‘పిల్లలు అమాయకులు.. పువ్వులాంటి వారు. దేవుడికి అత్యంత ఇష్టమైన వారు. అందుకే సమాజం చేసే తప్పులకు వాళ్లు బలి కాకూడదు.. వాళ్లు మంచి వాతావరణం లోనే పెరగాలని కోరుతాను!’ అని సమాధానమిచ్చింది కె. అభిమానికా యాదవ్! ఈ జవాబుతో ఆమె ‘2016 మిసెస్ ఇండియా’ పోటీలో నెగ్గారు. తర్వాత మిసెస్ ఆసియా పసిఫిక్ యూనివర్స్ కిరీటాన్ని పొందారు. ‘2017.. మిసెస్ యూనివర్స్ పోటీ’కీ వెళ్లారు. అక్కడ ఆమెను జడ్జెస్ మూడు నిమిషాల్లో డొమెస్టిక్ వయొలెన్స్ గురించి మాట్లాడమన్నారు. దానిమీద మూడు నిమిషాల్లో ఆమె పవర్ పాయింట్ ప్రెజెంటేషనే ఇచ్చారు. జడ్జెస్ ఇంప్రెస్ అయ్యి.. ‘2017.. మిసెస్ యూనివర్స్ ఇంటెలిజెన్స్’ సబ్‌టైటిల్ నిచ్చారు. హైదరాబాద్ వాసి అయిన ఆమె.. సెలబ్రిటీ ఫిట్‌నెస్ కోచ్, పాజెంట్ గ్రూమర్, మోటివేషనల్ స్పీకర్, ఫ్యాషన్ స్టయిలిస్ట్! ఇప్పుడు తెలంగాణలో జరగనున్న మిస్ వరల్డ్ పోటీల నేపథ్యంలో అసలు బ్యూటీ పాజెంట్స్ ఎలా జరుగుతాయి, ఎలాంటి రౌండ్స్ ఉంటాయి, ఎలా గ్రూమ్ అవుతారు వంటి విషయాలను ‘ఫ్యామిలీ’తో పంచుకున్నారు.

● బ్యూటీ విత్ పర్పస్

అభిమానికా యాదవ్

అందమూ.. అంతకుమించి...



‘2016లో జరిగిన మిసెస్ ఇండియా పోటీల టైమ్‌కి నేను డివోర్సీని. అప్పుడు మా బాబుకు అయిదేళ్లు. నా పెంపకం లోనే ఉన్నాడు. బీటెక్ చదివి, కొన్నాళ్లు కార్పొరేట్ జాబ్ చేసి వదిలేసి.. జుంబా ట్రైనర్‌గా మారాను. క్లాసికల్ డాన్సర్ (ఆంధ్రనాట్యం)ని కూడా! ఫిట్‌నెస్‌లోనూ ట్రైనింగ్ తీసుకుని ఫిట్‌నెస్ కోచ్‌గానూ ఉన్నాను. డివోర్స్ మీద సమాజంలో ఉన్న అప్రకటిత నిషేధాలు, సంకోచాలను కాదని దానిమీద చాలా మాట్లాడేదాన్ని, విరివిగా చర్చించి దాన్ని నార్మలైజ్ చేయడానికి ప్రయత్నించాను. దాంతో అందరికీ సుపరిచితురాలనయ్యా. బ్యూటీ పాజెంట్‌లో పాల్గొనాలనేది మాత్రం అప్పటికప్పుడు తీసుకున్న డెసిషనే. దీనికి సంబంధించి అప్పుడిక్కడ గ్రూమింగ్ సెంటర్స్ లేవు. ముంబై, లేదంటే ఢిల్లీ వెళ్లాలి. నేను ఢిల్లీ వెళ్లాను. లక్కీగా మంచి కోచ్ దొరికారు. కాన్ఫిడెంట్‌గా నన్ను నేను ప్రెజెంట్ చేసుకున్నాను. టైటిల్ గెలుచుకున్నాను. ఆ ఉత్సాహంతోనే మిసెస్ యూనివర్స్ పాజెంట్‌కీ వెళ్లాను. అయితే మిసెస్ ఇండియా, మిసెస్ యూనివర్స్ పాజెంట్స్ మధ్య సంవత్సరం టైమ్ ఉండింది. అయినా గ్రూమింగ్ కోసం బాబును వదిలిపెట్టి వేరే సిటీకి వెళ్లే పరిస్థితి లేదు. దాంతో అంతకుముందు కోచ్ దగ్గర్నుంచే కొన్ని టిప్స్, యూట్యూబ్‌లో మిస్ యూనివర్స్, మిస్ వరల్డ్ పాజెంట్స్‌కి సంబంధించిన వీడియోలు, అందులోని పార్టిసిపెంట్స్ ఇంటర్వ్యూలు చూసి నన్ను నేను గ్రూమ్ చేసుకున్నాను.

■ **ఆ పోటీలు ఎలా ఉంటాయంటే..**

మిస్ యూనివర్స్, మిస్ వరల్డ్, మిసెస్ యూనివర్స్.. ఇలా ఏ అందాల పోటీలైనా దాదాపుగా ఒకేరకంగా ఉంటాయి. నెల రోజులు జరుగుతాయి. అయితే నెలంతా పోటీలుండవు. ఈ పోటీలను ఏ దేశం హోస్ట్ చేసినా దాని ప్రధాన లక్ష్యం.. అక్కడి టూరిజాన్ని ప్రపంచానికి పరిచయం చేయడమే! సో.. మా పోటీలు దక్షిణాఫ్రికాలో జరిగాయి. 86 దేశాల నుంచి కంటెస్టెంట్స్ వచ్చారు. పోటీల షెడ్యూల్ అంతా కంటెస్టెంట్స్‌కి ముందే ఇచ్చేస్తారు. పోటీలు లేని రోజుల్లో ఆ దేశంలోని చారిత్రక ప్రాంతాల పర్యటన ఉంటుంది. వాళ్ల ఫుడ్, కల్చర్‌ను తెలుసుకునే పర్యటనలుంటాయి. పోటీల విషయానికి వస్తే.. ఏ రోజు ఏ ఈవెంట్ ఉంటుందో దానికి సంబంధించిన కాస్ట్యూమ్ ఉంటుంది.

ఈ కాస్ట్యూమ్స్ కోసం కొంతమంది కంటెస్టెంట్స్ స్పాన్సర్స్‌ని వెదుక్కుంటారు. స్విమ్ వేర్ రౌండ్ ఉంటుంది. స్విమ్ సూట్‌తో స్టేజ్ మీద కనిపించాలి. దానికి ఫొటో షూట్ ఉంటుంది. ఆ కాస్ట్యూమ్‌ని మనమెంత కాన్ఫిడెంట్‌గా క్యారీ చేస్తున్నాం, బాడీలాంగ్వేజ్ వంటివన్నీ అసెస్ చేస్తారు. ఇంటెలిజెన్స్ రౌండ్ ఉంటుంది. ఇందులో క్విజ్ ఉండొచ్చు, సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాల మీద చర్చలు, మహిళల సమస్యలకు సంబంధించిన టాపిక్స్ ఉంటాయి. పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ కూడా ఇవ్వచ్చు. వాళ్లిచ్చిన టాపిక్‌ని వాళ్లిచ్చిన వ్యవధిలో ఎంత చక్కగా మాట్లాడామనేది చూస్తారు. బ్యూటీ విత్ పర్పస్ రౌండ్ ఉంటుంది. కంటెస్టెంట్స్ ఏదైనా స్వచ్ఛంద సేవా కార్యక్రమంలో భాగస్వాములై ఉండాలి. ఆ పోటీ కోసం దరఖాస్తు చేసుకునేప్పుడు అందులో దానిగురించి పొందుపరచాలి. ఈ రౌండ్‌లో దాని గురించి అడుగుతారు. మనం చేసిన పనిని ఎంత స్మార్ట్‌గా ప్రెజెంట్ చేశామనేదాన్ని బట్టి పాయింట్స్ ఉంటాయి. దీనిమీద ఆన్‌లైన్ ఓటింగ్ ఉంటుంది. మాగ్జిమమ్ ఓట్లు వచ్చిన వాళ్లకు మిస్ పాపులర్ అనే సబ్ టైటిల్ ఇస్తారు. ఫిట్‌నెస్ రౌండ్ ఉంటుంది. అలాగే టాలెంట్ రౌండ్ ఉంటుంది. మనకొచ్చిన కళలను ప్రదర్శించాలి. ఇందులో ది బెస్ట్ పెర్‌ఫార్మర్‌కు మిస్ టాలెంటెడ్ సబ్ టైటిల్ ఇస్తారు. ట్రెడిషనల్ రౌండ్ కూడా ఉంటుంది. ఇందులో మనం దేన్ని, ఎంత క్రియేటివ్‌గా రిప్రెజెంట్ చేస్తున్నామనేది ఫోకస్ అవుతుంది.

■ **తలపై బోనంతో....**

నేను లంగా, ఓణీ వేసుకుని, తల మీద బోనం పెట్టుకుని ర్యాంప్ వాక్ చేసి, బోనం గురించి వర్ణించాను! గౌన్ రౌండ్, ఇంట్రడక్షన్ రౌండ్, వన్ టు వన్ పర్సనల్ ఇంటర్వ్యూ రౌండ్, ప్రిలిమినరీ రౌండ్స్ ఉంటాయి. ఇవేకాక ఫినాలే రోజు.. టైమ్ లేకుంటే అంతకంటే ముందు రోజు మిస్ బ్యూటిఫుల్ స్కిన్,హెయిర్, ఫొటోజెనిక్, స్మైల్, బెస్ట్ స్విమ్ సూట్ లాంటి సబ్‌టైటిల్స్‌నిస్తారు. ర్యాంప్ వాక్ ఉంటుంది. ఫినాలే రోజు అందరూ తప్పకుండా గౌనే వేసుకోవాలి. కొన్నిసార్లు ఏ దేశం హోస్ట్ చేస్తుందో ఆ దేశానికి సంబంధించిన ట్రెడిషనల్ వేర్‌ని ఇస్తారు. మాకు సౌత్ ఆఫ్రికన్ ప్రింట్స్, యాక్ససరీస్‌తో డిఫరెంట్ అవుట్‌ఫిట్స్ ఇచ్చారు. కిందటిసారి ముంబైలో జరిగిన మిస్‌వరల్డ్ పోటీల్లో అందరికీ లెహెంగాలు ఇచ్చారు. ఫినాలే రోజు టాప్ టెన్,




లేదా టాప్ ఫైవ్ స్టేజ్ మీద ఉంటారు. వాళ్లందరికీ ఒక క్వశ్చన్ ఇస్తారు. ఒకవేళ మల్టిపుల్ జడ్జెస్ ఉంటే డిఫరెంట్ క్వశ్చన్స్ ఉంటాయి. వాటికి ఎంత వేగంగా స్పందించి.. ఎంత కాన్ఫిడెంట్‌గా.. ఎంత కూల్‌గా ఆన్సర్ చేస్తారో దాన్ని బట్టి టైటిల్ విన్నర్‌ని, ఫస్ట్ అండ్ సెకండ్ రన్నరప్స్‌ని అనౌన్స్ చేస్తారు.

■ **కొరియోగ్రఫీ..**

గ్రూమింగ్ అవుతున్నప్పుడు ఆర్గనైజర్స్ వస్తారు.. ఎవరు ఎలా పెర్‌ఫార్మ్ చేస్తున్నారో చూస్తుంటారు. ఈ పోటీలకు కొరియోగ్రఫీ ఉంటుంది. ఎవరు ఎక్కడ నిలబడాలి, ఎలా నడవాలి.. ఎలా ప్రెజెంట్ చేసుకోవాలి వంటివన్నీ ట్రైన్ చేస్తారు. దీనికి పాజెంట్ కోచ్ ఉంటారు. వాళ్లే నేర్పిస్తారు. మిసెస్ ఇండియా మొదలు మిసెస్ యూనివర్స్ వరకు గ్రూమింగ్‌కి కాస్ట్యూమ్స్, ఫుట్‌వేర్,యాక్ససరీస్ సహా నాకు రూ. 12 లక్షల వరకు ఖర్చయింది. పాజెంట్‌లో పార్టిసిపేట్ అవడమనేది చివరి నిమిషంలో తీసుకున్న నిర్ణయం. ఏమైనా నాకు ఫిట్‌నెస్ కోచ్‌గా కొనసాగడమే ఇష్టం. పదేళ్లుగా అదే రంగంలో కొనసాగుతున్నాను. పాజెంట్స్‌కి సంబంధించి వర్క్‌షాప్స్ పెట్టాను. త్వరలోనే ఇక్కడొక గ్రూమింగ్ సెంటర్ పెట్టాలని ప్లాన్ చేస్తున్నాను.

– సరస్వతి రమ



ఆమె... బ్రేవ్ మిస్‌వరల్డ్

- ప్రపంచ సుందరి కిరీటాన్ని గెలుచుకున్న తొలి మిస్ జిబ్రాల్టర్‌గా డిసెంబర్ 2009లో కైనే చరిత్ర సృష్టించింది. రాజకీయాల్లోకి వచ్చిన కైనే డిప్యూటీ మేయర్‌గా, మేయర్‌గా పనిచేసింది.
- మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ నుంచి అందుకున్న 10,000 డాలర్‌లను దాతృత్వ కార్యక్రమాలకు విరాళంగా ఇచ్చింది.
- ఇజ్రాయెల్‌కు చెందిన లినోర్ అబార్గిల్ 1998లో ప్రపంచ సుందరి కిరీటాన్ని గెలుచుకుంది. ‘మిస్ వరల్డ్’ గెలిచిన తరువాత లినోర్ మోడలింగ్‌ను కొనసాగించింది. కొన్ని చిత్రాల్లో నటించింది. కొంత కాలం తరువాత మోడలింగ్‌ను విడిచిపెట్టి లా స్కూల్‌లో చేరింది.
- ‘మిస్ వరల్డ్’ కిరీటాన్ని గెలుచుకోవడానికి ముందు లినోర్ అత్యాచారానికి గురైంది. అప్పటి నుంచి ఆమె లైంగిక హింసపై వ్యతిరేక పోరాటంలో భాగంగా గ్లోబల్ అడ్వకేట్‌గా మారింది. తనపై జరిగిన అత్యాచారం, ఆ తరువాత జరిగిన పరిణామాలపై ‘బ్రేవ్ మిస్‌వరల్డ్’ పేరుతో ఒక డాక్యుమెంటరీ చిత్రాన్ని తీసింది.
- నైజీరియన్ ‘అగ్బానీ’ డారేగో మిస్ వరల్డ్ కిరీటాన్ని గెలుచుకున్న తొలి బ్లాక్ ఆఫ్రికన్ మహిళ. కిరీటాన్ని గెలవడానికి ముందు తరువాత కూడా మోడలింగ్ చేసింది. ‘మిస్ వరల్డ్-2014’తో పాటు ఎన్నో అందాల పోటీలకు జడ్జీగా వ్యవహరించింది. నైజీరియన్ టెలివిజన్‌లో ‘స్టైలోజెనిక్’ పేరుతో రియాలిటీ షో చేసింది. ఎంటర్‌ప్రెన్యూర్‌గా కూడా రాణించింది.

వంటిల్లు

ఇన్‌స్టంట్ వడియాలు

నంజుకోవడానికి కరకరలాడే వడియాలుంటే చారన్నమైనా సూపర్‌గా వుంటుందంటారు ఆహార ప్రియులు. అలాంటి వారికోసమే ఈ ఇన్‌స్టంట్ వడియాలు. ప్రయత్నించండి.

అటుకుల వడియాలు



కావలసినవి: అటుకులు – ఒక కప్పు; నీళ్లు – 2 కప్పులు; ఉప్పు – తగినంత; కారం, పసుపు – కొద్దికొద్దిగా; జీలకర్ర – అర టీస్పూన్; ఇంగువ – చిటికెడు; నెయ్యి – కొద్దిగా.

తయారీ: అటుకులను ముందుగా శుభ్రం చేసుకుని, 5 నిమిషాల పాటు కొద్దిగా నీళ్ల పోసి నానబెట్టుకోవాలి. అనంతరం ఆ నీళ్లతో సహా మిక్సీ పట్టుకుని మెత్తటి ముద్దలా చేసుకోవాలి. ఇప్పుడు ఆ మిశ్రమాన్ని ఒక గిన్నెలోకి తీసుకుని, ఉప్పు, జీలకర్ర, ఇంగువ, కారం, పసుపు వేసి బాగా కలపాలి. కాస్త పలుచగా ఉంటే బియ్యప్పిండి కలుపుకోవచ్చు. అనంతరం ఒక ప్లేట్‌కి నెయ్యి రాసి, అటుకుల మిశ్రమాన్ని జంతికల మేకర్‌లో వేసుకుని, ఒకదాని పక్కన ఒకటి జంతికల ఆకారంలో ఒత్తుకోవాలి. వీటిని ఒక రోజు లేదా రెండు రోజులు ఎండలో ఆరబెడితే సరిపోతాయి. బాగా ఎండిన తర్వాత నూనెలో వేయించుకుని తినొచ్చు.

రవ్వ వడియాలు



కావలసినవి: బొంబాయి రవ్వ – కప్పు; నీళ్లు – 3 కప్పులు; ఉప్పు – తగినంత; జీలకర్ర – అర టీస్పూన్; పచ్చిమిర్చి – 1 (చిన్నగా కట్ చేసుకోవాలి); నూనె – కొద్దిగా.

తయారీ: ముందుగా ఒక గిన్నెలో నీళ్ల పోసి, వేడి చేసుకోవాలి. అందులో ఉప్పు, జీలకర్ర, పచ్చిమిర్చి వేసుకోవాలి. నీళ్ల మరుగుతున్నప్పుడు, రవ్వను కొద్ది కొద్దిగా వేస్తూ ఉండలు కట్టకుండా గరిటెతో తిప్పుతూ ఉండాలి. రవ్వ ఉడికి దగ్గరగా అయ్యాక స్టవ్ ఆఫ్ చేసుకోవాలి.కొద్దిగా చల్లారాక, నూనె రాసిన ప్లేట్‌పై.. రవ్వ మిశ్రమాన్ని కొద్దికొద్దిగా తీసుకుని, చిన్న చిన్న వడియాలుగా ఒత్తుకోవాలి. ఈ వడియాలను ఒక రోజు ఎండలో ఆరబెట్టి, నూనెలో వేయించుకుని లాగించేయొచ్చు.

పెసరపప్పు వడియాలు




కావలసినవి: పెసరపప్పు – 2 కప్పులు (15 నిమిషాలు నానబెట్టుకోవాలి); పచ్చిమిర్చి – 5; జీలకర్ర – ఒక టీ స్పూన్; అల్లం ముక్క – 1; ఉప్పు – తగినంత; నూనె – 2 టీ స్పూన్లు;

తయారీ: ముందుగా పచ్చిమిర్చి, అల్లం ముక్క, జీలకర్ర అన్నీ మిక్సీ బౌల్‌లో వేసుకుని కచ్చాపచ్చాగా గ్రైండ్ చేసుకోవాలి. అనంతరం అదే మిక్సీ బౌల్‌లో పెసరపప్పు వేసుకుని మెత్తగా పిండిలా చేసుకుని ఒక గిన్నెలోకి తీసుకోవాలి. అనంతరం దానిలో జీలకర్ర మిశ్రమం, తగినంత ఉప్పు, నూనె వేసుకుని బాగా కలిపి.. డైరెక్ట్‌గా ఎండలో చిన్న చిన్న వడియాలుగా పెట్టుకుని, ఎండబెట్టుకోవాలి. బాగా ఎండిన తర్వాత నూనెలో దోరగా వేయించుకోవచ్చు.

మైదా-మసాలా వడియాలు

కావలసినవి: మైదా – కప్పు; నీళ్లు – ఒకటిన్నర కప్పులు; ఉప్పు – తగినంత; కారం – అర టీస్పూన్; పసుపు – చిటికెడు; మసాలా పొడి – 2 టేబుల్ స్పూన్ల పైనే; నూనె – కొద్దిగా;

తయారీ: ముందుగా ఒక గిన్నెలో మైదా, ఉప్పు, కారం, పసుపు వేసి బాగా కలుపుకోవాలి. ఇప్పుడు కొద్ది కొద్దిగా నీళ్ల పోస్తూ ఉండలు లేకుండా పిండిని జారుగా కలుపుకోండి. అనంతరం స్టవ్ మీద ఆ గిన్నె పెట్టి, పిండిని దగ్గరపడే వరకూ ఉడికించాలి. చల్లారాక, నూనె రాసిన ప్లేట్‌పై చిన్న చిన్న వడియాలుగా వేసుకుని, ఎండలో పెట్టుకోవాలి. బాగా ఆరిన తర్వాత నూనెలో వేయించుకుంటే భలే రుచిగా ఉంటాయి. వీటిలో మసాలా వేసుకోకుండా కూడా వడియాలు చేసుకోవచ్చు.



– సంహిత నిమ్మన

సోషల్ మీడియా

ఆడపిల్ల పుట్టింది అని... హాస్పిటల్‌లోనే వదిలేశారు!



‘మీకు ఆడపిల్ల పుట్టింది’ అనే వార్త తెలియగానే ఆ తండ్రి జరగరానిదేదో జరిగినట్లుగా బాధ పడిపోయాడు. భార్యా,బిడ్డలను చూడడానికి కూడా వెళ్లలేదు. హాస్పిటల్ బెడ్ మీద ఉన్న ఆ తల్లీబిడ్డలను చూడడానికి ఎవరూ రాలేదు. ఈ సంఘటన గురించి డాక్టర్ సుష్మ ఎమోషన్ మాటలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఈ వీడియోను 30 లక్షల మందికి పైగా చూశారు,

‘మనం 21వ శతాబ్దంలో జీవిస్తున్నప్పటికీ కొందరు తండ్రులు తమ ఆడబిడ్డలను రెండో ఆలోచన లేకుండా వదిలేస్తున్నారు’ అని సుష్మ ఆవేదన వ్యక్తం చేసింది. ఆ తల్లి ముగ్గురు ఆడబిడ్డలకు జన్మనిచ్చింది. మూడోసారి ఆడబిడ్డ పుట్టింది అని తెలియగానే భర్త, అత్తమామలు, బంధువులు ఆ తల్లిని చూడడానికి కూడా రాలేదు.

‘తల్లిగా, కూతురిగా, వైద్యురాలిగా, మహిళగా చాలా బాధ పడ్డాను. మన దేశానికి మహిళ అధ్యక్షురాలిగా ఉంది, సునీతా విలియమ్స్ తొమ్మిది నెలలకు పైగా అంతరిక్షంలో గడిపింది....ఇలా చెప్పుకుంటే మహిళా శక్తి గురించి చెప్పడానికి ఎంతో ఉంది’ అంటూ తన వీడియోలో మాట్లాడింది డా.సుష్మ.

కదిలించే ఈ వీడియోను చూసిన చాలామంది ‘చిన్నారిని దత్తత తీసుకుంటాం’ అంటూ స్పందించారు.



చెట్టు నీడ ప్రాజెక్ట్ చేద్దామా?



పిల్లలూ.... ఇంటి నీడ, క్లాస్‌రూమ్ నీడ కాకుండా వేరే ముఖ్యమైన నీడ ఉంది. అదే.. చెట్టు నీడ. మన సంస్కృతిలో చెట్లు విడదీయలేనివి. ఒక నోట్‌బుక్ మీద ఈ 12 చెట్ల పేర్లు రాసుకోండి. వేప, మామిడి, రావి, మర్రి, కానుగ, బాదం, చింత, కొబ్బరి, నేరేడు, సపోటా, జామ, ఉసిరి... సెలవులు ముగిసేలోపు ఈ చెట్లన్నింటి నీడను ఎంజాయ్ చేసి ఆ చెట్ల గురించి తెలుసుకుంటే లెవల్ 2 పర్యావరణ పరీక్ష పాసైనట్టే. పెద్దల సాయంతో ఈ ప్రాజెక్ట్ పూర్తి చేయండి.

పిల్లలూ... ఒకప్పుడు ఇల్లు నేల మీద ఉండేది. ఇప్పుడు అపార్ట్‌మెంట్‌ల వల్ల ఆకాశంలోకి వచ్చింది. ఇల్లు నేల మీద ఉంటే ఆ అందమే వేరు. ఎందుకంటే ఇల్లంటే చెట్లు కూడా. పాత రోజుల్లో ఎలా ఉండేదో తెలుసా? ఇంటి ముందు వేప చెట్టు ఉండేది. ఇంటి వెనుక అరటి చెట్టు ఉండేది. ఊరి మధ్యలో రావి చెట్టు గాని, చింత చెట్టు గానీ ఉండేది. ఊరి చివర మర్రిచెట్లు చాలా ఉండేవి.

అశోకుడు చెట్లు నాటించాడని చరిత్ర పాఠాల్లో చదివాం. చెట్లు ఎందుకు నాటించాడు? బాటసారులు ప్రయాణాలు చేస్తూ నీడన ఆగుతారని. ఇవాళ మనం కారు పార్క్ చేయాలంటే చెట్టు నీడ కోసం ఎంత వెతికినా ఒక్క చెట్టు కూడా కనపడటం లేదు. పాత రోజుల్లో అలా కాదు... అడుగడుక్కి చెట్లే.

ఉన్న నేలలోనే చిన్న పెంకుటిల్లు కట్టుకుని మిగిలిన జాగాలో అందరూ చెట్లు పెంచేవారు. అవి పెద్దపెద్దవై ఇంటిని కప్పేసేవి. చల్లగా ఉంచేవి. జామచెట్టు, మావిడి చెట్టు కొందరిళ్లల్లో ఉంటే సపోటా చెట్టు, బూరుగ చెట్టు, బొప్పాయి చెట్టు, బాదం చెట్టు కొందరిళ్లల్లో ఉండేది. మునగచెట్లు కొందరు పెంచేవారు. కొందరు కొబ్బరి చెట్లు వేస్తే మరికొందరు అశోక చెట్లు వేసేవారు. పెద్దవాళ్లు, పిల్లలు ఇళ్లలో కంటే చెట్ల కిందే ఉండేవారు. వేసవి వస్తే మంచి కొమ్మ చూసి తాడు కట్టి ఊయలలు ఊగేవారు.

మీకు ర్యాంకులు తెలుసు. చెట్లు తెలుసా? ఏది కాయలు కాసే చెట్టు, ఏది పండ్ల చెట్టు, ఏవి తినే కాయలు.. ఏవి తినని కాయలు.. ఏ చెట్టు కొమ్మలు గట్టిగా ఉంటాయి.. ఏ చెట్టు కాండం కోసి ఇంటికి ఉడ్‌వర్క్ కోసం వాడొచ్చు... ఏ చెట్టు ఆకులు దట్టంగా ఉంటాయి... ఏ చెట్టు గాలికి గట్టిగా నిలబడగలదు... ఇవన్నీ తెలియకుండా పెద్దయిపోయి బాధ్యత గల పౌరులుగా సమాజాన్ని తీర్చి దిద్దుతారా?



మన పెద్దలు కొన్ని చెట్లను పూజిస్తారు. కొన్ని చెట్లు వైద్యానికి పనికొస్తాయి. కొన్ని చెట్లు డబ్బు సంపాదించడానికి హెల్ప్ చేస్తాయి. ఊరి బయట పొలాల్లో తాటి చెట్లు ఉంటాయి. తాటి ఆకులతో, కాండంతో చక్కటి ఇల్లు కట్టుకోవచ్చు తెలుసా? టేకు చెట్టును చూశారా ఎప్పుడైనా? దాని ఉడ్‌నే ఇంటి తలుపులకు వాడుతారు. కొన్ని చెట్లను యూస్‌లెస్ అని ఎవరూ పట్టించుకోరు, పెంచరు. తుమ్మచెట్లు అలాంటివే. కాని కరువు కాలంలో కూడా అవి బతికి, వంట చెరుకు ఇస్తాయి. మేకలకు ఆకులు ఇస్తాయి. కాబట్టి ఏ మనిషి, ఏ స్టూడెంట్, ఏ చెట్టూ యూస్‌లెస్ కాదు. అందరికీ వారి స్పెషాలిటీ ఉంటుంది.

చెట్లను తెలుసుకుంటే ఇలాంటివి తెలుస్తాయి. చెట్ల తొర్రల్లో చిలుకలు ఉంటాయి. మీ మమ్మీని, డాడీని ఈ సెలవుల్లో అన్ని చెట్లను చూపించమనండి. వాటితో ఫొటోలు దిగండి. ట్రీ బోయ్/ట్రీ గర్ల్‌గా మార్కులు కొట్టేయండి. కనీసం 12 చెట్ల కింద నిలబడి మీరు ఫొటోలు దిగితే పాసైన సర్టిఫికెట్ వచ్చేసినట్టే.

– కె

జపాన్ వారి జ్ఞాపక శక్తి వెనక...

తెలివితేటలు, క్రమశిక్షణ వంటి పదాలు చెప్పగానే ముందుగా గుర్తొచ్చేది జపాన్ దేశమే. వీరి ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించి చేసే తయారు చేసే టెక్నాలజీకి ప్రపంచవ్యాప్తంగా పేరుంది. అయితే, వీరు ఏ విషయాన్నైనా మర్చిపోకుండా ఎలా గుర్తుపెట్టుకుంటారు అనేది అంతుచిక్కని విషయం. అందుకోసం వీరు కొన్ని టెక్నిక్స్‌ను ఉపయోగిస్తారట. వీటివల్లే వారు అంత తెలివిగా ఉంటారంటారు. అవేంటో చూద్దాం..



పెరటి చెట్టు వైద్యానికి పనికిరాదన్నట్టు మనం ప్రతిదానికీ కొత్తరకమైన విధానాన్ని వెదుక్కుంటున్నాం కానీ నిజానికి ఇవన్నీ మన దేశంలో వేదకాలం నుంచి అనుసరిస్తున్నవే. అందుకే వేదమంత్రాలలో తప్పులు దొర్లవు సాధారణంగా. ఎంతో పెద్దగా ఉండే విష్ణు సహస్ర నామాలు, లలితా సహస్ర నామాలు వంటి వాటిని మన వాళ్లు సులువుగా ధారణ చేసినట్టే వారికి కూడా కొన్ని పద్ధతులున్నాయి. అవేంటో జపాన్ భాషలో చూద్దాం. మన సనాతన విధానంలో వాటిని అనుసరిద్దాం.

ఫురుసాటో టెక్నిక్ (జ్ఞాపకం కోసం)...

ఈ టెక్నిక్ సమాచారాన్ని మనకు సుపరిచితమైన స్థలాలు లేదా మనకే సొంతమైన కొన్ని జ్ఞాపకాలతో అనుసంధానించే సులువైన విధానం. అంటే మన స్వగ్రామంలోని ఒక ప్రదేశంతో సమాచారాన్ని లింకప్ చేయడం ద్వారా ఆ మేటర్‌తో భావోద్వేగ సంబంధం... అదేనండీ... ఎమోషనల్ బాండేజీని ఏర్పరచుకోవచ్చు. ఈ ఎమోషనల్ బాండేజ్ మన మెదడులో సమాచారాన్ని ఎక్కువ కాలం నిలిపి ఉంచడంలో సహాయపడుతుంది.

షిచిడా మెథడ్..

జపనీయులకు మెదడులో సమాచారాన్ని ఎక్కువ కాలం నిలిపి ఉంచేందుకు సాయం చేసే పద్ధతులలో షిచిడా మెథడ్ కీలకమైనది. దీనిని వారికి పాఠశాల రోజులనుంచే బోధిస్తారు. ఈ విధానంలో సమాచారాన్ని రంగుల బొమ్మలు లేదా కథల రూపంలో ఊహించుకోవాలన్నమాట. ఉదాహరణకు, ఏదైనా ఒక సుదీర్ఘమైన జాబితాను ఒకదానిని గుర్తుంచుకోవాలంటే, దానిని ఒక కథగా మార్చి, మెదడు సృజనాత్మక భాగాన్ని ఉత్తేజపరచడం ద్వారా ఆ జాబితాను గుర్తుంచుకోవడం సులభమవుతుంది. ఈ విధానాన్ని జపాన్ విద్యా విధానాల్లో విస్తృతంగా ఉపయోగిస్తుంటారు.



చంకింగ్ స్టైల్!

సంక్షిప్త సమాచారాన్ని చిన్న, సులభమైన భాగాలుగా విభజించడం ఈ చంకింగ్ విధానం ముఖ్యోద్దేశం. జపాన్ కాంజీ అక్షరాలను నేర్చుకునే విధానం నుంచి ఈ టెక్నిక్ పుట్టింది. ఉదాహరణకు, ఒక పెద్ద సంఖ్యను గుర్తుంచుకోవాలంటే, దానిని చిన్న సమూహాలుగా విభజించి నేర్చుకోవడం ద్వారా మెదడుకు మెమరీ సులభం అవుతుంది. ఈ విధానం సమాచారాన్ని వ్యవస్థీకరించడంలో సహాయపడుతుంది.

స్పేస్డ్ రిపిటీషన్ (వల్లెవేయడం లేదా పునశ్చరణ)...

సమాచారాన్ని దీర్ఘ కాలం గుర్తుంచుకోవడానికి స్పేస్డ్ రిపిటీషన్ అనేది శక్తిమంతమైన పద్ధతి. ఈ టెక్నిక్‌లో సమాచారాన్ని నిర్దిష్ట వ్యవధులలో... ఉదాహరణకు, ఒకటి, మూడు, ఐదురోజుల వరకు పునరావృతం చేయడం జరుగుతుంది. భాషను బోధించడంలో ఈ పద్ధతిని వారు ఎక్కువగా ఉపయోగిస్తారన్నమాట. మన పద్ధతిలో దానినే వల్లెవేయడం అంటారు. అంటే చదివిన దానిని క్రమంతప్పకుండా పునరావృతం చేయడం వల్ల మెదడు సమాచారాన్ని బలంగా నిలుపుకుంటుందన్నమాట.



బూజన్ స్టైల్ అనే మైండ్ మ్యాపింగ్...

మైండ్ మ్యాపింగ్ అనేది సమాచారాన్ని దృశ్య రూపంలో రూపొందించే పద్ధతి. ఒక కేంద్ర ఆలోచన చుట్టూ సంబంధిత విషయాలను చిత్రం లేదా రేఖాచిత్రం రూపంలో అనుసంధానం చేయడం ఈ టెక్నిక్ ప్రధాన ఉద్దేశ్యం. దీనిద్వారా సమాచారాన్ని వ్యవస్థీకరించడంతో పాటు, దానిని సులభంగా గుర్తుంచుకోవచ్చునన్నమాట. జపాన్ విద్యార్థులు ఉగ్గుపాల నుంచే అంటే మరీ నిజంగానే ఉగ్గుపాలు అని కాదు... ఎలిమెంటరీ స్థాయినుంచే ఈ పద్ధతిని ఉపయోగిస్తారు.

ఎన్-బ్యాక్ టెక్నిక్

ఎన్-బ్యాక్ టెక్నిక్ మెదడు గుర్తుంచుకునే సామర్థ్యాన్ని, ఏకాగ్రతను పెంచే మానసిక వ్యాయామం. ఈ పద్ధతిలో ఒక వరుసలోని అంశాలను కొన్ని దశల ముందు నుంచి గుర్తుచేసుకోవాలి. ఉదాహరణకు, రెండు లేదా మూడు అంశాల ముందు ఉన్న వాటిని గుర్తుంచుకోవడం. ఈ విధానం ద్వారా క్రమంగా మెదడు పనితీరు మెరుగుపడి, సమాచారాన్ని త్వరగా గ్రహించే సామర్థ్యం పెరుగుతుంది.



లైఫ్@360

పచ్చదనమే కాదు... చల్లదనం కూడా!





చాలామంది ఇళ్లలో రకరకాల మొక్కలను పెంచుకుంటారు. ఒక్కో సీజన్‌లో ఒక్కో మొక్కలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుంది. ఒక సీజన్లో కొన్ని పూలు పూస్తాయి మరో సీజన్లో మరికొన్ని మొక్కలు పూలు పూస్తాయి. కొన్ని ఇండోర్ మొక్కలు, ఔట్‌డోర్ మొక్కలు ఉంటాయి. కొన్ని రకాల మొక్కలని మనం పూజిస్తాం. మరికొన్ని మొక్కలు మనకు ఆక్సిజన్‌ను అధికంగా అందిస్తాయి. ఇవి చుట్టుపక్కల ప్రదేశాల్లో కూడా గాలిని శుభ్రం చేస్తాయి. అంతేకాదు, ఈ మండే ఎండలకు కొన్ని రకాల మొక్కలను పెంచుకుంటే ఇంటికి చల్లదనాన్ని ఇస్తాయి.



మల్లె...

ఇది ఎంతో పరిమళ భరితంగా ఉంటుంది. ఈ మొక్క మన భారతదేశంలో విస్తృతంగా ఉపయోగిస్తారు. ఈ పూలమొక్కను పెంచుకుంటే మీ ఇంటి తోటతో పాటు పరిసర ప్రాంతాలు కూడా పరిమళభరితంగా మారిపోతాయి. మల్లె ఇంట్లోని వేడిని గ్రహిస్తుంది. గది ఉష్ణోగ్రతను తగ్గిస్తుంది. ఇంటి పరిసర ప్రాంతాలను చల్లబరిచి గాలిని కూడా శుభ్రపరిచే శక్తి మల్లె చెట్టుకు ఉంది.



మందార మొక్క..

మందార చెట్టును దేవతావృక్షంగా పరిగణిస్తారు. దీని పూలను పూజలో ఉపయోగిస్తారు. దీనిపూలు ముఖ్యంగా కాళీమాతకి, దుర్గా మాతకి ఎంతో ఇష్టం. ఇది హైబిస్కస్ జాతికి చెందిన మొక్క. దీనికి పెద్దగా నిర్వహణ అవసరం ఉండదు. ఇంటి పరిసర ప్రాంతాల్లో పెంచుకుంటే పరిసర ప్రాంతాలను చల్లబరిచి గాలిని ప్యూరిఫై చేస్తుంది అనారోగ్యంతో ఉన్న వ్యక్తులు ఈ మొక్క నుంచి వచ్చే గాలిని పీల్చుకుంటే త్వరగా కోలుకుంటారు.

జెరెనియం...

ఈ మొక్క కూడా రూమ్ టెంపరేచర్ను తగ్గిస్తుంది ఎక్కువ అధిక ఉష్ణోగ్రత ఉండే దేశాల్లో ఈ మొక్క ఎక్కువగా కనిపిస్తుంది. ఈ పువ్వుకు ఐదు రెక్కలు ఉండి తెలుపు, పర్పుల్ కలర్‌లో కనిపిస్తుంది ఇది మంచి ఇండోర్ ప్లాంట్. ఇది సంవత్సరం అంతా పూలు పూస్తుంది.

లావెండర్...

లావెండర్ మొక్క మంచి ఇండోర్ ప్లాంట్. దీంతో అనేక ఉపయోగాలు ఉన్నాయి. నిద్రలేమి, యాంగ్జైటీ, స్ట్రెస్ నుంచి రిలీవ్ చేస్తుంది. ఈ మొక్కను ఇంటి పరిసర ప్రాంతాల్లో పెట్టుకుంటే ఇంటికి చల్లదనాన్ని ఇస్తుంది.

పీస్ లిల్లీ...

ఈ మొక్క కూడా మంచి ఇండోర్ ప్లాంట్. చూడటానికి ఆహ్లాదకరంగా తెలుపు పువ్వులతో కనిపించే ఈ మొక్కను పెంచుకుంటే గాలిని శుభ్రం చేయడమే కాదు... చల్లదనాన్నీ అందిస్తుంది.

ఎండినా... నిమ్మ అమ్మే



నిమ్మ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని అందరికీ తెలుసు. అయితే ఏనుగు చచ్చినా పదివేలే అన్నట్టు... పచ్చి లేదా పండు నిమ్మలోనే కాదు... ఎండిన నిమ్మలో కూడా ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అజీర్ణం, పేగు సంబంధిత రుగ్మతలు వంటి సమస్యలను తగ్గిస్తుంది. ఎండిన నిమ్మకాయలోని విటమిన్ సి శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతుంది తద్వారా వాతావరణంలోని మార్పులను తట్టుకునే సామర్థ్యాన్ని కూడా అందిస్తుంది. ఎండిన నిమ్మకాయల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి మన చర్మానికి మంచివి. కాబట్టి వీటిని క్రమం తప్పకుండా ఉపయోగించడం వల్ల చర్మంపై ఉన్న మచ్చలు తగ్గి సహాయ చర్మం శుభ్రంగా, ప్రకాశవంతంగా మారుతుంది.

ఎండిన నిమ్మకాయలలో ఉండే పొటాషియం రక్తపోటును నియంత్రిస్తుంది. గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది. ఎండిన నిమ్మకాయలు నేచురల్‌గానే శరీరంలోని వ్యర్థాలను, విషాలను తొలగించి, కాలేయ ఆరోగ్యానికి అవసరమైన విటమిన్లు, జీర్ణ రసాయనాలను కూడా అందిస్తాయి.

దీన్ని ఎలా తినాలి?

ఎండిన నిమ్మకాయలను నేరుగా తినవచ్చు లేదా చాట్స్‌లో లేదా ఇతర వంటకాలకు జోడించడం ద్వారా తినవచ్చు. వీటిని మీ రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా, మీ ఆరోగ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవచ్చు.

సాక్షి సినిమా

ఇది వేడుకలకు సమయం కాదు


- కమల్‌హాసన్



కమల్‌హాసన్ హీరోగా నటించిన 'థగ్ లైఫ్' సినిమా ఆడియో విడుదల వేడుక వాయిదా పడింది. మణిరత్నం దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో శింబు, త్రిష, అశోక్ సెల్వన్, ఐశ్వర్యా లక్ష్మి, జోజు జార్జ్ తదితరులు ఇతర ప్రధాన పాత్రలు పోషించారు. కమల్‌హాసన్, మణిరత్నం, ఆర్. మహేంద్రన్, శివ అనంత్ నిర్మించిన ఈ చిత్రం జూన్ 5న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. తెలుగులో శ్రేష్ఠ మూవీస్ రిలీజ్ చేస్తోంది. ఈ నెల 16న 'థగ్ లైఫ్' ఆడియో విడుదల వేడుకని ఘనంగా నిర్వహించాలని చిత్రయూనిట్ ప్లాన్ చేసింది. అయితే ప్రస్తుతం భారత్-పాకిస్తాన్ సరిహద్దుల్లో ఏర్పడిన పరిస్థితుల నేపథ్యంలో ఈ వేడుక వాయిదా వేసినట్లు చిత్రబృందం తెలియజేసింది. ఈ మేరకు 'ఆర్ట్ కెన్ వెయిట్-ఇండియా కమ్స్ ఫస్ట్' అంటూ కమల్‌హాసన్ ఓ ప్రకటన విడుదల చేశారు. ''మన దేశ సరిహద్దుల్లో చోటు చేసుకున్న పరిణామాలు, ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ నెల 16న నిర్వహించాల్సిన 'థగ్ లైఫ్' ఆడియో లాంచ్ కార్యక్రమాన్ని వాయిదా వేయాలని నిర్ణయం తీసుకున్నాం. మన దేశాన్ని రక్షించడంలో మన సైనికులు అప్రతిహత ధైర్యంతో ముందుండి పోరాడుతున్న వేళ వేడుకలకు సమయం కాదని భావిస్తున్నాం. ఇది సంఘీభావానికి సమయం అని నమ్ముతున్నాను. ఈ సమయంలో మన దేశాన్ని కాపాడుతూ అప్రమత్తంగా ఉన్న మన సైనికుల గురించి మనం ఆలోచించాలి. పౌరులుగా మనం సంయమనంతో, సంఘీభావంతో స్పందించాలి. ఆడియో రిలీజ్ కొత్త తేదీని త్వరలో ప్రకటిస్తాం'' అని కమల్‌హాసన్ పేర్కొన్నారు.

పుట్టినరోజు ప్రత్యేకం

హీరో విజయ్ దేవరకొండ పుట్టినరోజు (మే 9) సందర్భంగా ఆయన ఫ్యాన్స్‌కు డబుల్ అప్‌డేట్స్ ఇచ్చారు మేకర్స్. విజయ్ నటించనున్న 'వీడీ 14', 'ఎస్‌వీసీ 59' సినిమాల కొత్త పోస్టర్స్ రిలీజ్ చేశారు. విజయ్ దేవరకొండ హీరోగా రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వం వహించనున్న చిత్రం 'వీడీ 14' (వర్కింగ్ టైటిల్). ఈ సినిమాలో రష్మికా మందన్నా హీరోయిన్. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్, భూషణ్ కుమార్, క్రిషణ్ కుమార్ నిర్మించనున్నారు. ఈ సినిమాకి సంబంధించి ధ్యానముద్రలో ఉన్న విజయ్ దేవరకొండ పోస్టర్‌ని రిలీజ్ చేశారు. ''బ్రిటిష్ కాలం నేపథ్యంతో పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందనున్న చిత్రం 'వీడీ 14'. 1854 నుంచి 1878 మధ్య కాలంలో జరిగిన వాస్తవ చారిత్రక ఘటనల ఆధారంగా పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా ఈ సినిమా ఉంటుంది. త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తాం'' అని మేకర్స్ తెలిపారు.



విజయ్ దేవరకొండ

ఇదిలా ఉంటే... విజయ్ దేవరకొండ హీరోగా రవికిరణ్ కోలా దర్శకత్వంలో 'దిల్' రాజు, శిరీష్ ఓ సినిమా నిర్మించనున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై రూపొందనున్న 59వ చిత్రం ఇది. అందుకే 'ఎస్‌వీసీ 59' అనే వర్కింగ్ టైటిల్ పెట్టారు. విజయ్ దేవరకొండ బర్త్‌డే సందర్భంగా ఓ పోస్టర్ రిలీజ్ చేశారు. ''రూరల్ యాక్షన్ డ్రామా నేపథ్యంతో ఈ పాన్ ఇండియా సినిమాని రూపొందించనున్నాం. త్వరలో షూటింగ్ ప్రారంభిస్తాం'' అని యూనిట్ తెలిపింది.

రౌడీ వేర్ లాభాల్లో సైన్యానికి విరాళం

విజయ్ దేవరకొండకి క్లాత్ బ్రాండ్ 'రౌడీ వేర్' ఉన్న విషయం తెలిసిందే. 'మేడ్ ఇన్ ఇండియా మాత్రమే కాదు మేడ్ ఫర్ ఇండియా' అంటూ రాబోయే కొన్ని వారాల పాటు ఈ రౌడీ వేర్ అమ్మకాల ద్వారా వచ్చే లాభాల్లో కొంత భారత సైన్యానికి విరాళంగా ఇవ్వనున్నట్లు విజయ్ దేవరకొండ తెలిపారు.

వసూళ్లలో కొంత భాగాన్ని సైనికులకి అందజేస్తాం

- అల్లు అరవింద్



కేతిక, ఇవానా, విద్య, అల్లు అరవింద్, శ్రీవిష్ణు, 'వెన్నెల' కిశోర్, కార్తీక్ రాజు

''మన సైనికులు దేశం కోసం పోరాడుతుంటే మేము సినిమా సెలబ్రేషన్స్ చేసుకోవడం సరికాదనిపించింది. 'సింగిల్'ని ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపేందుకే ఈ ప్రెస్‌మీట్ పెట్టాం. మా సినిమా నుంచి వచ్చే వసూళ్లలో కొంత భాగం మన కోసం పోరాడుతున్న సైనికులకి అందజేస్తాం'' అని నిర్మాత అల్లు అరవింద్ చెప్పారు. శ్రీవిష్ణు హీరోగా, కేతికా శర్మ, ఇవాన హీరోయిన్లుగా, 'వెన్నెల' కిశోర్ కీలక పాత్ర పోషించిన చిత్రం 'సింగిల్'. కార్తీక్ రాజు దర్శకత్వం వహించారు. అల్లు అరవింద్ సమర్పణలో విద్య కొప్పినీడి, భాను ప్రతాప, రియాజ్ చౌదరి నిర్మించిన ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో అల్లు అరవింద్ మాట్లాడుతూ– ''ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితుల్లో సినిమాని వాయిదా వేయడం మంచిదా? కాదా అని చర్చించాం. సినిమా కోసం వందల మంది పని చేయడమే కాదు.. థియేటర్లపై వందల కుటుంబాలు ఆధారపడి ఉంటాయి. అందుకే ఎవరూ తప్పుగా అర్థం చేసుకోరనే ధైర్యంతో సినిమాని విడుదల చేశాం. మా సినిమాని గొప్పగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు'' అన్నారు. శ్రీ విష్ణు మాట్లాడుతూ– ''మా సినిమా చూసి పగలబడి నవ్వుతున్నామని ప్రేక్షకులు చెప్పడం చాలా ఆనందాన్నిచ్చింది'' అని తెలిపారు. ''మా సినిమాకి చాలా మంచి స్పందన వస్తోంది'' అని విద్య కొప్పినీడి పేర్కొన్నారు. ''మా చిత్రానికి ఇంత మంచి ఆదరణ ఇచ్చిన ప్రేక్షకులకు ధన్యవాదాలు'' అని కార్తీక్ రాజు చెప్పారు. ''నేను హీరోగా నటించిన ఫస్ట్ సినిమా 'సింగిల్' (నవ్వుతూ). నాకు మంచి పాత్ర ఇచ్చిన కార్తీక్ రాజుగారికి థ్యాంక్స్'' అన్నారు 'వెన్నెల' కిశోర్.

ఓటీటీ ఇది చూడొచ్చు

బాగా ఖరీదైన దొంగ

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హిందీ చిత్రం 'జువెల్ థీఫ్ - ది హీస్ట్ బిగిన్స్' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

దొంగతనం... అరవై నాలుగు కళల్లో ఇది కూడా ఒకటి. అందుకేనేమో చాలా మంది సినీ దర్శకుల కథకు ఇదో ఆయువుపట్టు. దొంగలు ఎందరున్నా వెరైటీ దొంగ వేరయా అన్నట్టు బాలీవుడ్ దర్శకులు కూకి గులాటీ, రాబి గ్రెవాల్ తమ కథలో దొంగని బాగా వెరైటీగా డిజైన్ చేశారు. వారు తీసిన సినిమానే 'జువెల్ థీఫ్ – ది హీస్ట్ బిగిన్స్'. ఈ చిత్రం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతోంది. ఈ సినిమాకి తెలుగు డబ్బింగ్ వెర్షన్ కూడా లభ్యమవుతోంది. ప్రముఖ వర్ధమాన బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్ కథానాయకుడిగా ఈ సినిమాని వేరే లెవెల్‌కు తీసుకెళ్లారు. మామూలుగా దొంగతనం చేసే దొంగలకు రెండు పాయింట్ల మీద ఫోకస్ ఉండాలి. మొదటిది దొంగతనానికి ఎలా ఎంట్రీ ఇవ్వాలి? రెండోది దొంగతనం అయ్యాక ఎగ్జిట్ ఎలా అవ్వాలి? ఈ రెండూ గనక క్లియర్‌గా ఉంటే దొంగ దొంగతనం ఈజీగా చేసేస్తాడు. అయితే ఈ మూవీలో దొంగ నేల మీద కాదు, నీటిలో కాదు గాలిలో ఎగ్జిట్ ఇస్తాడు. అదే ఈ సినిమాలో హైలైట్. ఈ సినిమా కథ ఆద్యంతం థ్రిల్లింగ్‌గా ఉంటుంది. అంతలా ఏముందీ కథలో అంటే... కథ ప్రకారం రేహాన్ రాయ్ వృత్తిపరంగా పెద్ద దొంగ. తన ఐడెంటిటీని కాపాడుకోవడం కోసం బుడాపెస్ట్‌లో చిన్న చిన్న దొంగతనాలు చేసుకుంటూ బతుకుతూ ఉంటాడు. ఇండియాలో విక్రమ్ పటేల్ అనే పోలీస్ ఈ రేహాన్ కోసం తీవ్రంగా వెతుకుతూ ఉంటాడు. ఇంతలో ప్రపంచంలోనే అత్యంత విలువైన రెడ్ సన్ అనబడే వజ్రం ఇండియాకి వస్తుందన్న విషయం స్మగ్లర్ రాజన్‌కు తెలుస్తుంది. రాజన్ ఈ వజ్రాన్ని దొంగతనం చేయాలని రేహాన్‌ని డిమాండ్ చేస్తాడు. కొన్ని అనుకోని పరిస్థితులలో రేహాన్ తప్పక ఈ ఆపరేషన్‌ని ఒప్పుకోవాల్సి వస్తుంది. మరి... రెడ్ సన్ వజ్రాన్ని రేహాన్ దొంగిలిస్తాడా? లేదా అన్నది మాత్రం 'జువెల్ థీఫ్ – ది హీస్ట్ బిగిన్స్' సినిమాలోనే చూడాలి. దొంగతనం బేస్ చేసుకుని ఇప్పటివరకు ఎన్నో సినిమాలు వచ్చాయి. కానీ ఈ సినిమా వాటన్నిటికీ కాస్త భిన్నం అని చెప్పవచ్చు. అందులోనూ బాగా ఖర్చు పెట్టిన, పెట్టించిన సినిమా. థ్రిల్లింగ్ జోనర్ ఎంజాయ్ చేసేవాళ్ళకి ఈ సినిమా పెద్ద పండగే. వర్త్‌ఫుల్ మూవీ ఫర్ వీకెండ్.



– హరికృష్ణ ఇంటూరు

డేట్ ఫిక్స్



సాయి శ్రీనివాస్, నారా రోహిత్, మంచు మనోజ్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ హీరోలుగా, అదితీ శంకర్, ఆనంది, దివ్య పిళ్లై హీరోయిన్లుగా నటించిన యాక్షన్ థ్రిల్లర్ చిత్రం 'భైరవం'. విజయ్ కనకమేడల దర్శకత్వంలో డా. జయంతిలాల్ గడా సమర్పణలో కేకే రాధామోహన్ నిర్మించారు. ఈ సినిమాని ఈ నెల 30న విడుదల చేయనున్నట్లు ప్రకటించి, సాయి శ్రీనివాస్, మనోజ్, రోహిత్ పోస్టర్‌ని రిలీజ్ చేశారు. ఈ చిత్రానికి కెమేరా: హరి కె. వేదాంతం, సంగీతం: శ్రీచరణ్ పాకాల.

అలా చేస్తే శత్రువుకు సాయం చేసినట్టే

- రాజమౌళి

''మన ఇండియన్ ఆర్మీకి అందరం మద్దతుగా నిలబడాలి. ప్రస్తుత పరిస్థితుల్లో ఎవరైనా సైనికుల కదలికలు, వాళ్ల చర్యలు చూస్తే ఫొటోలు, వీడియోలు తీయొద్దు. వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ సోషల్ మీడియాలో పోస్ట్ చేయొద్దు. అలా చేస్తే శత్రువుకు (పాకిస్తాన్‌ని ఉద్దేశించి) సాయం చేసినట్టు అవుతుంది. వాళ్లకు ఆ అవకాశం ఇవ్వొద్దు'' అని డైరెక్టర్ రాజమౌళి పేర్కొన్నారు. కశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా 'ఆపరేషన్ సిందూర్' పేరుతో ఇండియన్ ఆర్మీ.. పాకిస్తాన్‌లోని ఉగ్ర స్థావరాలపై దాడులు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పలువురు సినిమా ప్రముఖులు ఇండియన్ ఆర్మీకి మద్దతు ప్రకటిస్తూ, పోస్టులు పెడుతున్నారు. తాజాగా దర్శకుడు రాజమౌళి 'ఎక్స్' వేదికగా స్పందించారు. ''ప్రస్తుత పరిస్థితుల్లో అనధికారిక ప్రకటనలు, అసత్య ప్రచారాలను నమ్మకండి. అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించొద్దు. పాజిటివ్‌గా, అప్రమత్తంగా ఉంటే విజయం మనదే'' అని పోస్ట్ చేశారు రాజమౌళి.



ప్రతీకారం తీర్చుకోవడం బాధ్యత

- రష్మికా మందన్నా

'ఆపరేషన్ సిందూర్'పై హీరోయిన్ రష్మిక మందన్నా ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందించారు. ''ఉగ్రవాదం నుంచి మనల్ని రక్షించుకునేందుకు చేసే పోరాటం యుద్ధం కాదు. ఈ పోరాటానికి మద్దతిచ్చే వారిని యుద్ధం కోరుకునేవారిగా చిత్రీకరించొద్దు. దేశ భద్రత, న్యాయం కోసం ఆరాటపడే పౌరులు వారు. దూకుడు ధోరణి, అత్యవసర ఆత్మరక్షణకు మధ్య నైతిక భేదం చాలా ఉంటుంది. కుట్రపూరితంగా జరిగిన ఉగ్రవాద చర్యలో అమాయకులు ప్రాణాలు కోల్పోయినప్పుడు... దానికి ప్రతీకారం తీర్చుకోవడం బాధ్యతే అవుతుంది తప్ప.. అవకాశం కాదు. శాంతిని కోరుకోవడమంటే అర్థం.. జరిగిన హానిని మౌనంగా అంగీకరించడం కాదు. జరిగిన అన్యాయానికి బదులు తీర్చుకుంటున్న దేశాన్ని ప్రశ్నించొద్దు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నవారిని ప్రశ్నించండి'' అని పోస్ట్ చేశారు రష్మిక.



స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▼	నిఫ్టీ ▼
880	266
79,454	24,008

విదేశీ సూచీలు

నాస్‌డాక్	17,944	▲	16
డోజోన్స్	41,311	▽	57
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,555	▲	23
డాక్స్	23,499	▲	147
షాంఘై	3,342	▽	10
నికాయ్	37,503	▲	574


•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భాగమేనుక	83.54	87.22
£	బ్రిటన్ పౌండ్	భాగమేనుక	116.15	111.23
€	యూరో	భాగమేనుక	94.18	98.62
¥	జపాన్ యెన్ (100)	భాగమేనుక	47.00	69.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	భాగమేనుక	53.87	56.06
S$	సింగపూర్ డాలర్	భాగమేనుక	63.55	68.22
SAR	సౌదీ రియాల్	భాగమేనుక	21.87	23.38
UAE D	యూఏఈ దిర్హామ్	భాగమేనుక	22.35	24.13
¥	చైనా యువాన్	భాగమేనుక	10.92	12.74

వాట్సాప్ నుంచే ప్రీమియం చెల్లింపు

ఎల్ఐసీ కొత్త సర్వీసు



న్యూఢిల్లీ: ఎల్ఐసీ ప్రీమియం చెల్లింపులు మరింత సులభతరంగా మారాయి. పాలసీల ప్రీమియంను వాట్సాప్ నుంచే సులభంగా చెల్లించే సదుపాయాన్ని ఎల్ఐసీ ప్రారంభించింది. ఎల్ఐసీ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకున్న పాలసీదారులు.. 8976862090 వాట్సాప్ నంబర్ ద్వారా తమ పాలసీలకు సంబంధించి చెల్లించాల్సిన ప్రీమియం వివరాలు తెలుసుకోవచ్చు. అక్కడి నుంచే నేరుగా యూపీఐ/నెట్‌బ్యాంకింగ్/కార్డు ద్వారా ప్రీమియం చెల్లింపులు చేయొచ్చని ఎల్ఐసీ ప్రకటించింది. రశీదును సైతం పొందొచ్చని పేర్కొంది. కొత్త సదుపాయం ద్వారా పాలసీదారులు ఉన్న చోట నుంచే చెల్లింపులు చేసుకోవడానికి వీలు కల్పిస్తుందని ఎల్ఐసీ ఎండీ, సీఈవో సిద్ధార్థ మహంతి తెలిపారు. ఎల్ఐసీ పోర్టల్‌పై ఇప్పటి వరకు 2.2 కోట్ల మంది పాలసీదారులు రిజిస్టర్ చేసుకుని ఉండగా, వీరందరికీ నూతన సేవ సౌకర్యాన్ని ఇవ్వనుంది.

వాటా విక్రయానికి యస్

మరో 7 బ్యాంకులు 6.8 శాతం విక్రయం

- జపాన్ సంస్థ ఎస్ఎంబీసీ చేతికి 20 శాతం వాటా
- షేరుకి రూ. 21.5 ధరలో డీల్
- డీల్ విలువ రూ. 13,483 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం స్టేట్‌బ్యాంక్(ఎస్‌బీఐ)సహా పలు ప్రయివేట్ రంగ బ్యాంకులు సంక్షోభ పరిస్థితులు ఎదుర్కొంటున్న యస్ బ్యాంక్‌లో కొంతమేర వాటా విక్రయించనున్నాయి. తద్వారా జపనీస్ దిగ్గజం సుమితోమో మిత్సుయి బ్యాంకింగ్ కార్పొరేషన్(ఎస్ఎంబీసీ) మొత్తం 20 శాతం వాటా సొంతం చేసుకోనుంది. ఒక్కో షేరుకి రూ. 21.50 ధరలో ఇందుకు రూ. 1,483 కోట్లు వెచ్చించనుంది. వెరసి దేశీ బ్యాంకింగ్ రంగంలో అతిపెద్ద లావాదేవీగా ఈ వాటా విక్రయం నమోదుకానున్నట్లు యస్ బ్యాంక్ పేర్కొంది. ఎస్ఎంబీసీకి యస్ బ్యాంక్‌లో 13.19 శాతం వాటా ఎస్‌బీఐ విక్రయించనుంది. డీల్ విలువ రూ. 8,889 కోట్లు. ఈ బాటలో ఇతర బ్యాంకులు యాక్సిస్, బంధన్, ఫెడరల్, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ, ఐడీఎఫ్‌సీ ఫస్ట్, కొటక్ మహీంద్రా ఉమ్మడిగా 6.81 శాతం వాటా అమ్మనున్నాయి. వీటి విలువ రూ. 4,594 కోట్లు. ఫలితంగా యస్ బ్యాంక్‌లో అతిపెద్ద వాటాదారుగా ఎస్ఎంబీసీ అవతరించనుంది.

యస్ బ్యాంక్‌లో 13.2 శాతం అమ్మనున్న ఎస్‌బీఐ



2020 మార్చిలో

యస్ బ్యాంక్ పునర్‌నిర్మాణ పథకంలో భాగంగా 2020 మార్చిలో ఎస్‌బీఐసహా 7 ప్రయివేట్ రంగ బ్యాంకులు ఇన్వెస్ట్ చేశాయి. సెంట్రల్ బోర్డ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ(ఈసీసీబీ) యస్ బ్యాంక్‌లో 13.19 శాతం వాటాకు సమానమైన 413.44 కోట్ల షేర్లను విక్రయించేందుకు అనుమతించినట్లు ఎస్‌బీఐ పేర్కొంది. యస్ బ్యాంక్‌లో ప్రస్తుతం ఎస్‌బీఐ 24 శాతం వాటా కలిగి ఉంది. 13 శాతంపైగా వాటా అమ్మకం ద్వారా రూ. 8,889 కోట్లు అందుకోనుంది. ఇతర బ్యాంకులలో హెచ్‌డీఎఫ్‌సీ 2.75 శాతం, ఐసీఐసీఐ 2.39 శాతం, కొటక్ మహీంద్రా 1.21 శాతం, యాక్సిస్ 1.01 శాతం, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ 0.92 శాతం, ఫెడరల్ 0.76 శాతం, బంధన్ 0.7 శాతం చొప్పున వాటా కలిగి ఉన్నాయి. తదుపరి దశ వృద్ధికి తాజా లావాదేవీ దోహదపడనున్నట్లు యస్ బ్యాంక్ ఈ సందర్భంగా పేర్కొంది. కాగా.. ఇందుకు ఆర్‌బీఐ, సీసీఐ తదితర నియంత్రణ సంస్థల నుంచి అనుమతులు లభించవలసి ఉంది.

టాప్-2లో

జపనీస్ దిగ్గజం సుమితోమో మిత్సుయి ఫైనాన్షియల్ గ్రూప్ అనుబంధ సంస్థ ఎస్ఎంబీసీ 2 ట్రిలియన్ డాలర్ల ఆస్తులను కలిగి ఉంది. తద్వారా జపాన్‌లో రెండో పెద్ద బ్యాంకింగ్ కార్పొరేషన్‌గా నిలుస్తోంది. దేశీయంగా ప్రధాన విదేశీ బ్యాంకులలో ఒకటిగా గుర్తింపు పొందింది. అంతేకాకుండా సొంత అనుబంధ సంస్థ, డైవర్సిఫైడ్ ఎన్‌బీఎఫ్‌సీ.. ఎస్ఎంఎఫ్‌జీ ఇండియా క్రెడిట్ కంపెనీని నిర్వహిస్తోంది.

వాటా చేతులు మారుతున్న వార్తలతో యస్ బ్యాంక్ షేరు బీఎస్‌ఈలో 10 శాతం జంప్‌చేసి రూ. 20 వద్ద ముగిసింది.

ఏటీఎంలన్నీ పూర్తి స్థాయిలో పని చేస్తున్నాయ్

వదంతులు నమ్మొద్దు: బ్యాంకులు

న్యూఢిల్లీ: భారత్–పాకిస్తాన్ మధ్య యుద్ధ వాతావరణం కారణంగా ఏటీఎంలను మూసివేయబోతున్నారంటూ సోషల్ మీడియాలో **వస్తున్న వార్తలను** ప్రభుత్వ రంగ బ్యాంకులు **ఖండించాయి. ఏటీఎం**లన్నీ పూర్తి స్థాయిలో సజావుగానే పని చేస్తున్నాయని, వాటిలో తగినన్ని నగదు నిల్వలు ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశాయి. డిజిటల్ సేవలు కూడా సజావుగా సాగుతున్నాయని పేర్కొన్నాయి. 'మా ఏటీఎంలు, క్యాష్ డిపాజిట్ మెషీన్లు, డిజిటల్ సేవలు అన్నీ పూర్తి స్థాయిలో పని చేస్తున్నాయి. ప్రజలకు అందుబాటులోనే ఉన్నాయి' అని ఎస్‌బీఐ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ధ్రువీకరించుకోకుండా ఏ వార్తలను విశ్వసించొద్దంటూ కస్టమర్లకు సూచించింది. బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ మొదలైనవి కూడా ఇదే తరహా మెసేజీలను పోస్ట్ చేశాయి.



డాక్టర్ రెడ్డీస్ లాభం రూ. 1,594 కోట్లు

- క్యూ4లో 22 శాతం అప్
- ఆదాయం రూ. 8,506 కోట్లు
- రూ. 8 తుది డివిడెండ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ లాభం రూ. 1,594 కోట్లుగా నమోదైంది. క్రితం క్యూ4లో నమోదైన రూ. 1,307 కోట్లతో పోలిస్తే సుమారు 22 శాతం పెరిగింది. మరోవైపు, ఆదాయం రూ. 7,083 కోట్ల నుంచి రూ. 8,506 కోట్లకు పెరిగింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 1 ముఖ విలువ చేసే ప్రతి షేరుపై కంపెనీ రూ. 8 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. దీనికి జూలై 10 రికార్డు తేదీగా ఉంటుంది. హోల్-టైమ్ డైరెక్టరుగా కో-చైర్మన్, ఎండీ జీవీ ప్రసాద్ పునర్నియామకానికి బోర్డు ఆమోదముద్ర వేసింది. పలు ఉత్పత్తుల ఆవిష్కరణతో వివిధ విభాగాలవ్యాప్తంగా రెండంకెల స్థాయిలో వృద్ధి సాధించినట్లు ప్రసాద్ తెలిపారు. అమెరికాలో కీలక ఉత్పత్తుల నుంచి ఆదాయం పెరగడం, ఎన్ఆర్‌టీ (నికోటిన్ రిప్లేస్‌మెంట్ థెరపీ) వ్యాపార అనుసంధానం పూర్తి కావడం తదితర అంశాలు ఆదాయ వృద్ధికి దోహదపడినట్లు వివరించారు. పూర్తి ఆర్థిక సంవత్సరానికి కంపెనీ ఆదాయం రూ.27,916 కోట్ల నుంచి రూ.32,553 కోట్లకు పెరిగింది. లాభం రూ. 5,568 కోట్ల నుంచి రూ.5,654 కోట్లకు చేరింది.

→ సెగ్మెంట్లవారీగా చూస్తే కీలకమైన గ్లోబల్ జనరిక్స్ ఆదాయం 23 శాతం వృద్ధితో రూ. 6,119 కోట్ల నుంచి రూ. 7,536 కోట్లకు పెరిగింది. అటు ఫార్మా సర్వీసెస్, యాక్టివ్ ఇంగ్రీడియెంట్స్ (పీఎస్ఏఐ) విభాగం ఆదాయం 16 శాతం పెరిగి రూ. 822 కోట్ల నుంచి రూ. 956 కోట్లకు చేరింది.

→ గ్లోబల్ జనరిక్స్‌కి సంబంధించి కీలకమైన ఉత్తర అమెరికా మార్కెట్లో క్యూ4లో ఆదాయం 9 శాతం పెరిగి రూ. 3,560 కోట్లకు చేరింది. కొత్తగా ఏడు ఉత్పత్తులను కంపెనీ ప్రవేశపెట్టింది.

బీఎస్‌ఈలో శుక్రవారం కంపెనీ షేరు స్వల్పంగా పెరిగి రూ. 1,156 వద్ద క్లోజయ్యింది.

యూనియన్ బ్యాంక్ లాభం జూమ్

క్యూ4లో రూ. 4,985 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ యూనియన్ బ్యాంక్ గతేడాది (2024-25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి (క్యూ4)లో నికర లాభం 50% జంప్‌చేసి రూ. 4,985 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది (2023-24) ఇదే కాలంలో రూ. 3,311 కోట్లు మాత్రమే ఆర్జించింది. నికర వడ్డీ ఆదాయం రూ. 9,514 కోట్లకు పరిమితమైంది. వడ్డీయేతర ఆదాయం 18% ఎగసి రూ. 5,559 కోట్లను తాకింది. నికర వడ్డీ మార్జిన్లు 2.91%గా నమోదయ్యాయి. మొత్తం ఆదాయం రూ. 31,058 కోట్ల నుంచి రూ. 33,254 కోట్లకు బలపడింది.

ఫలితాల నేపథ్యంలో బ్యాంక్ షేరు 6.4% జంప్‌చేసి రూ. 123 వద్ద ముగిసింది.

కొనసాగిన యుద్ధ భయాలు

- 80 వేల దిగువకు సెన్సెక్స్
- నిఫ్టీకి నష్టం 266 పాయింట్లు
- 2 రోజుల్లో రూ.7 లక్షల కోట్లు ఆవిరి



ముంబై: భారత్–పాకిస్తాన్ సరిహద్దుల్లో యుద్ధ ఉద్రిక్త పరిస్థితులు కొనసాగడంతో శుక్రవారం దేశీయ స్టాక్ సూచీలు ఒకశాతానికి పైగా నష్టపోయాయి. రియల్టీ, ఫైనాన్స్, వినిమయ రంగాల షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఫలితంగా సెన్సెక్స్ 880 పాయింట్లు క్షీణించి 80వేల స్థాయి దిగువన 79,454 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 266 పాయింట్లు పతనమై 24,008 వద్ద నిలిచింది. సరిహద్దుల్లో సైనిక ఘర్షణల ప్రభావంతో ఉదయం సూచీలు భారీ నష్టాలతో మొదలయ్యాయి. సెన్సెక్స్ 1,367 పాయింట్ల క్షీణతతో 78,968 వద్ద, నిఫ్టీ 338 పాయింట్ల నష్టంతో 23,936 వద్ద మొదలయ్యాయి. అయితే ఆసియా, యూరప్ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు ఇన్వెస్టర్లకు విశ్వాసాన్నిచ్చాయి. కనిష్టాలకు దిగివచ్చిన నాణ్యమైన షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీల నష్టాలు కొంత తగ్గాయి. అమెరికా మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి. కాగా, నాలుగురోజుల వరుస పతనం తర్వాత పాకిస్తాన్ స్టాక్ ఎక్స్ఛేంజీ ప్రామాణిక కేఎస్ఈ 100 ఇండెక్సు శుక్రవారం 3.50% లాభపడి 1,07,175 వద్ద స్థిరపడింది.

➤ అధిక వెయిటేజీ షేర్ల క్షీణత మన సూచీల పతనానికి మరో ప్రధాన కారణమైంది. ఐసీఐసీఐ 3%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు 2%, రిలయన్స్ 2%, ఎయిర్‌టెల్, ఐటీసీ 1.5% నష్టపోయాయి.

➤ మార్చి క్వార్టర్ నికరలాభం 13% వృద్ధితో టైటాన్ కంపెనీ షేరు బీఎస్‌ఈలో 4% పెరిగి రూ.3,511 వద్ద స్థిరపడింది.

➤ స్టాక్ మార్కెట్ వరుస పతనంతో గడిచిన రెండు ట్రేడింగ్ సెషన్‌లో రూ.7 లక్షల కోట్ల సంపద ఆవిరైంది. బీఎస్‌ఈలో ఇన్వెస్టర్ల సంపదగా భావించే నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.416 లక్షల కోట్ల(4.86 ట్రిలియన్ డాలర్లు)కు దిగివచ్చింది.

➤ భారత్–పాక్ మధ్య ఉద్రిక్తతలు తార స్థాయికి చేరిన తరుణంలో డిఫెన్స్ సంబంధిత షేర్లకు డిమాండ్ నెలకొంది. పారాస్ డిఫెన్స్ అండ్ స్పేస్ టెక్నాలజీ 7%, భారత్ డైనమిక్స్ 5%, భారత్ ఎలక్ట్రానిక్స్ 3%, హిందుస్తాన్ ఏరోనాటిక్స్ 2%, గార్డెన్ రీచ్ షిప్‌యార్డ్స్ 1.38% లాభపడ్డాయి. డ్రోన్ల తయారీ సంస్థ ఐడియాఫోర్జ్ టెక్నాలజీ 20%, ద్రోణాచార్య ఏరియల్ ఇన్నోవేషన్స్ 5% ర్యాలీ చేశాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ఈక్విటీ ఫండ్స్‌లోకి రూ.24,269 కోట్లు | స్టార్టప్‌లకు కేంద్రం మరింత సాయం



'నీరజ్ చోప్రా క్లాసిక్' ఈవెంట్ వాయిదా

న్యూఢిల్లీ: భారతదేశంలో తొలిసారి నిర్వహించ తలపెట్టిన అంతర్జాతీయ జావెలిన్ టోర్నమెంట్ 'నీరజ్ చోప్రా క్లాసిక్' ఈవెంట్ వాయిదా పడింది. భారత్, పాకిస్తాన్ మధ్య సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ ఈవెంట్‌ను వాయిదా వేశారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 24న బెంగళూరు వేదికగా ఈ మీట్ జరగాల్సి ఉండగా... భారత్, పాక్ దాడుల నేపథ్యంలో టోర్నమెంట్‌ను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు శుక్రవారం నీరజ్ చోప్రా వెల్లడించాడు. 'ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా 'నీరజ్ చోప్రా క్లాసిక్' తొలి ఎడిషన్‌ను వాయిదా వేశాం. ఈవెంట్‌లో పాల్గొనే అథ్లెట్లు, భాగస్వాముల క్షేమం కోసం ఈ నిర్ణయం తీసుకున్నాం. సుదీర్ఘ చర్చల అనంతరం ఈ నిర్ణయానికి వచ్చాం. త్వరలోనే తదుపరి కార్యాచరణ వెల్లడిస్తాం. ఈ క్లిష్ట సమయంలో దేశంతో దృఢంగా నిలబడటం చాలా ముఖ్యం. ప్రజల రక్షణ కోసం సరిహద్దుల్లో భద్రతా బలగాలు పోరాడుతున్నాయి. మేమంతా వారి వెంటే. జై హింద్' అని నీరజ్ చోప్రా పేర్కొన్నాడు.

వారం రోజుల విరామం

ఐపీఎల్ మ్యాచ్‌లను నిలిపివేసిన బీసీసీఐ

కొనసాగించడంపై త్వరలో నిర్ణయం ● ఆటకంటే దేశం ముఖ్యమని బోర్డు ప్రకటన

న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)–2025 మ్యాచ్‌లకు బ్రేక్ పడింది. భారత్, పాకిస్తాన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం, ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో లీగ్‌ను వెంటనే నిలిపివేయాలని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) నిర్ణయించింది. లీగ్‌ను 'వారం రోజుల పాటు' ఆపేస్తున్నట్లు బోర్డు ప్రకటించింది. గురువారం ధర్మశాలలో ఢిల్లీ, పంజాబ్ మధ్య మ్యాచ్‌ను అకస్మాత్తుగా ఆపేసినప్పుడే లీగ్ కొనసాగడంపై సందేహాలు వచ్చాయి. శుక్రవారం దీనిని బీసీసీఐ అధికారికంగా ప్రకటించింది. ఒకవైపు యుద్ధం సాగుతుండగా, మరోవైపు ఐపీఎల్ రూపంలో వినోదం కొనసాగడం సరైంది కాదని బోర్డు భావించింది. ఫ్రాంచైజీలు, ప్రసారకర్తలు, స్పాన్సర్లతో పాటు లీగ్‌తో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సంబంధం ఉన్నవారందరితో చర్చించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు బోర్డు వెల్లడించింది. 'ఐపీఎల్ భాగస్వాములందరితో మాట్లాడిన తర్వాతే ఈ నిర్ణయానికి వచ్చాం. ప్రస్తుత స్థితిలో మేం దేశం వెంట ఉన్నాం. ప్రభుత్వానికి, సైన్యానికి మా సంఘీభావం తెలియజేస్తున్నాం. ఆపరేషన్ సిందూర్ ద్వారా దేశాన్ని రక్షిస్తున్న ఆర్మీ ధైర్యసాహసాలకు మేం సెల్యూట్ చేస్తున్నాం. మన దేశంలో క్రికెట్ పట్ల అపరిమిత ప్రేమ ఉందనేది వాస్తవం. అయితే దేశంకంటే, దేశం సార్వభౌమత్వం, భద్రత కంటే ఏదీ ఎక్కువ కాదు. జాతి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొనే బీసీసీఐ ఏ నిర్ణయమైనా తీసుకుంటుంది. మాకు మద్దతుగా నిలిచిన ఐపీఎల్ భాగస్వాములందరికీ కృతజ్ఞతలు' అని బీసీసీఐ ప్రకటన విడుదల చేసింది. లీగ్ కొనసాగించడం, కొత్త తేదీలు, వేదికలపై అన్ని వర్గాలతో చర్చించిన తర్వాత పరిస్థితులను బట్టి త్వరలో నిర్ణయం తీసుకుంటామని కూడా బోర్డు స్పష్టం చేసింది.

క్రికెటర్లు స్వస్థలాలకు...

ఐపీఎల్ వాయిదాపై ప్రకటన వచ్చిన వెంటనే అన్ని జట్లలోని క్రికెటర్లు తమ సొంత నగరాలకు బయలుదేరేలా ఆయా ఫ్రాంచైజీలు ఏర్పాట్లు చేశాయి. స్వదేశానికి వెళ్లిపోవాలనుకునే విదేశీ క్రికెటర్లకు ఏర్పాట్లపరంగా 'ప్లేయర్స్ అసోసియేషన్' సహకరిస్తోంది. గురువారం ధర్మశాలలో మ్యాచ్ రద్దయ్యాక ఢిల్లీ, పంజాబ్ క్రికెటర్లు, సహాయక సిబ్బందిని ముందుగా బస్సు ద్వారా జలంధర్‌కు తరలించారు. అక్కడి నుంచి వారంతా ప్రత్యేక వందేభారత్ రైలులో ఢిల్లీకి పయనమయ్యారు.

విమర్శల బారిన పడరాదనే...

ఐపీఎల్ సీజన్ లీగ్ దశలో 58 మ్యాచ్‌లు ముగియగా... మరో 12 మ్యాచ్‌లు మాత్రమే మిగిలాయి. వీటిలో అహ్మదాబాద్‌లో మూడు... లక్నో, బెంగళూరులలో రెండు చొప్పున...హైదరాబాద్, ఢిల్లీ, చెన్నై, ముంబై, జైపూర్‌లలో ఒక్కో మ్యాచ్ జరగాల్సి ఉంది. ఇవి కాకుండా 4 ప్లే ఆఫ్స్‌లలో రెండేసి మ్యాచ్‌లకు హైదరాబాద్, కోల్‌కతా వేదికగా నిర్వహించాల్సి ఉంది. వాస్తవికంగా చూస్తే సరిహద్దులో ఉద్రిక్త వాతావరణం ఉన్నా... ఉత్తరాదిలోని కొన్ని నగరాలు మినహా ఈశాన్యం, దక్షిణం వైపు సాధారణ పరిస్థితులే ఉన్నాయి. బీసీసీఐ స్థాయి, దానికి ఉన్న సాధన సంపత్తిని దృష్టిలో పెట్టుకొని చూస్తే కేవలం వేదికలు మార్చి చకచకా ఈ 16 మ్యాచ్‌లు నిర్వహించడం ఏమాత్రం సమస్య కాదు. అయితే ఒకవైపు యుద్ధం సాగుతుంటే, మన సైనికులు పోరాడుతుంటే మీకు ఆటలు కావాలా అని సగటు భారతీయుడు ఆగ్రహిస్తున్నాడు. ఇంత సంకట స్థితిలో ఎన్నో విషయాల్లో ప్రభుత్వం నుంచి ఆంక్షలు, హెచ్చరికలు వస్తుండగా ఐపీఎల్ మాత్రం కొనసాగడం ఏంటనే ప్రశ్నలు వస్తున్నాయి. దాంతో బీసీసీఐ కూడా పునరాలోచనలో పడింది. అయితే పూర్తిగా సీజన్‌ను రద్దు చేయకుండా, లేక సుదీర్ఘ సమయం వాయిదా వేయకుండా 'ఒక వారం వాయిదా' అంటూ సన్నాయి నొక్కులు చూపిస్తోంది. బహుశా వచ్చే వారం రోజుల్లో పరిస్థితులు మెరుగుపడవచ్చని, అప్పుడు మళ్లీ ఆడించవచ్చనే ఆలోచన కనిపిస్తోంది!



ఐపీఎల్ ట్రోఫీతో పది జట్ల కెప్టెన్‌లు (ఫైల్)

ప్రత్యామ్నాయ తేదీలు ఏవి?

బీసీసీఐ 'వారం' విరామం ప్రకటనను బట్టి చూస్తే వెంటనే కొనసాగించాలని భావిస్తున్నట్లుగా ఉంది. షెడ్యూల్ ప్రకారం మే 25న ఐపీఎల్ ముగియాలి. ఇప్పుడు మరో వారం దీనికి జోడిస్తే జూన్ 1న ముగిసేలా కొత్త షెడ్యూల్ ఇవ్వవచ్చు. సరిగ్గా చెప్పాలంటే టోర్నీని ముగించేందుకు బోర్డుకు 10 రోజులు చాలు. 'డబుల్ హెడర్'లుగా రోజుకు రెండు లీగ్ మ్యాచ్‌ల చొప్పున 6 రోజులు... ప్లే ఆఫ్స్‌కు మరో 4 రోజులు సరిపోతాయి. జూన్ మొదటి వారంలో భారత జట్టు ఇంగ్లండ్ పర్యటనకు బయలుదేరాల్సి ఉంది కాబట్టి కష్టమనే చర్చ ఉన్నా... తొలి టెస్టు జూన్ 20న మొదలవుతుంది. ఐపీఎల్‌లో ఆడుతున్న టెస్టు జట్టు సభ్యులు జూన్ 10 వరకు చేరుకున్నా సమస్య లేదు.

ఇప్పటికిప్పుడు మ్యాచ్‌లు నిర్వహించకుండా ఆగిపోతే ఇంగ్లండ్ సిరీస్ తర్వాత ఆగస్టు, సెప్టెంబర్ వరకు లీగ్ వెళుతుంది. అయితే ఆగస్టులో భారత జట్టు బంగ్లాదేశ్‌తో వన్డే, టి20 సిరీస్‌లను ఆడనుంది. దీనిని వాయిదా వేసినా ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మధ్య సిరీస్, ఇంగ్లండ్ బోర్డు నిర్వహించే 'హండ్రెడ్' టోర్నీలు ఉన్నాయి. 'హండ్రెడ్'లో సగం జట్లను ఐపీఎల్ యజమానులే కొన్నారు కాబట్టి ఇది అసాధ్యం. సెప్టెంబర్‌లో 19 రోజులు 'ఆసియా కప్' టోర్నీకి కేటాయించారు. దీనికి భారత్ ఆతిథ్యం ఇస్తోంది. అయితే ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో పాకిస్తాన్ ఇక్కడ ఆడకపోవడమే కాదు... భారత్, పాక్ మధ్య మ్యాచ్‌లు జరగడం కూడా అసాధ్యమే! కాబట్టి ఈ ఒక్క టోర్నీని రద్దు చేస్తే ఐపీఎల్‌కు కావాల్సిన సమయం లభిస్తుంది.

మేమంతా మీ వెంటే...

భారత సైన్యానికి క్రీడా స్టార్లు సలామ్

న్యూఢిల్లీ: పాకిస్తాన్ సైన్యం దుశ్చర్యలను తమ ప్రాణాలు పణంగా పెట్టి ఎదుర్కొంటున్న భారత త్రివిధ దళాలకు క్రీడా దిగ్గజాలు మద్దతు పలికారు. క్రికెట్ స్టార్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి సహా చాంపియన్ అథ్లెట్ నీరజ్ చోప్రా, బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధులు దేశ ప్రజల సంరక్షణ కోసం పగలనక... రాత్రనక శ్రమిస్తున్న సాయుధ బలగాల ధైర్యానికి సెల్యూట్ చేశారు. ప్రాణాలొడ్డి పోరాడుతున్న భారత సేనల ధైర్య సాహసాల్ని స్టార్లంతా కొనియాడారు. సోషల్ మీడియా వేదికగా తామంతా సైన్యం వెంటే అని స్థయిర్యం పెంచారు.



దేశ రక్షణే లక్ష్యంగా శ్రమిస్తోన్న భారత ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లను చూసి గర్వపడుతున్నా. త్రివిధ దళాలు తీసుకునే ప్రతీ నిర్ణయాన్ని గౌరవిస్తున్నా. ఈ పోరాటయోధుల వల్లే భారత్ తలెత్తుకొని నిలబడుతోంది. దేశం కోసం అహర్నిశలు శ్రమించే మీ వెంటే జాతి మొత్తం నడుస్తుంది. ఇలాంటి సందర్భంలో ప్రతి భారతీయుడు బాధ్యతగా మెలగాలి. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాన్ని ఎక్కడికక్కడ కట్టడి చేయాలని విజ్ఞప్తి. –భారత కెప్టెన్ రోహిత్ శర్మ

సాయుధ బలగాలకు నా సలామ్. ఎలాంటి విపత్కర పరిస్థితులకైనా ఎదురునిలిచి దేశాన్ని కాపాడే మన వీరుల ధైర్యసాహసాలకు జేజేలు పలుకుతున్నాం. భారత్ కోసం మీరు, మీ కుటుంబ సభ్యులు చేసే త్యాగాలకు మేమంతా రుణపడే ఉంటాం. –విరాట్ కోహ్లి

ఉగ్రవాదులను హతమార్చితే మౌనంగా ఉండాల్సిన చోట పాక్ యుద్ధాన్ని ఎంచుకొని తమ వక్రబుద్ధిని మరోమారు చూపింది. దీనికి తగిన గుణపాఠం మా సైన్యం మీకు నేర్పుతుంది. ఆ పాఠమెలా ఉంటుందంటే జీవితంలో మీరెప్పుడు మర్చిపోరు. –వీరేంద్ర సెహ్వాగ్

టెర్రరిజంపై పోరాటం... దేశ రక్షణకోసం మీరు కనబరిచే సాహసాలు మాకెంతో గర్వకారణం. సరిహద్దుల్లో మీరున్నారనే ధైర్యమే దేశాన్ని ధీమాగా నడిపిస్తోంది. –నీరజ్ చోప్రా

భారత దళాలు చూపే ధైర్యం, క్రమశిక్షణ, త్యాగాలే దేశానికి బలం. ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా నిర్వహించి మన పతకాన్ని రెపరెపలాడించిన మీ నిస్వార్థసేవల్ని ఎప్పటికీ గుర్తుంచుకుంటాం. జై హింద్. –పీవీ సింధు

సెమీఫైనల్లో ఉన్నతి, ఆయుశ్



ఉన్నతి

న్యూఢిల్లీ: చైనీస్ తైపీ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత రైజింగ్ స్టార్స్ ఉన్నతి హుడా, ఆయుశ్ శెట్టి సెమీఫైనల్లోకి దూసుకెళ్లారు. శుక్రవారం తైపీ సిటీలో జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 53వ ర్యాంకర్, 17 ఏళ్ల ఉన్నతి 21–8, 19–21, 21–19తో హుంగ్ యి టింగ్ (చైనీస్ తైపీ)పై గెలుపొందింది. అంతకుముందు ప్రిక్వార్టర్ ఫైనల్లో ఉన్నతి 21–12, 21–17తో ప్రపంచ 65వ ర్యాంకర్ లిన్ సియున్ (చైనీస్ తైపీ)ని ఓడించింది. మరోవైపు పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో 20 ఏళ్ల ఆయుశ్ 16–21, 21–19, 21–14తో ఏడో సీడ్ బ్రియన్ యాంగ్ (కెనడా)పై విజయం సాధించాడు. నేడు జరిగే సెమీఫైనల్స్‌లో టాప్ సీడ్ టొమోకా మియజకి (జపాన్)తో ఉన్నతి; టాప్ సీడ్ చౌ టియెన్ చెన్ (చైనీస్ తైపీ)తో ఆయుశ్ శెట్టి తలపడతారు.



ఆయుశ్

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

క్లుప్తంగా...

ఏఐపీఏకి కేంద్రం నుంచి సంపూర్ణ మద్దతు

వెబ్‌సైట్‌ను ప్రారంభించిన కేంద్రమంత్రి బండి సంజయ్



సాక్షి, న్యూఢిల్లీ: జాతీయ ప్రయోజనాల కోసం ఆల్ ఇండియా ప్రాసిక్యూటర్స్ అసోసియేషన్ (ఏఐపీఏ) చేపట్టే నిర్మాణాత్మక కార్యక్రమాలకు భారత ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు ఉంటుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. శుక్రవారం న్యూఢిల్లీ నార్త్ బ్లాక్‌లోని తన కార్యాలయంలో ఏఐపీఏ అధికారిక వెబ్‌సైట్‌ను అధికారికంగా ప్రారంభించారు. దేశంలో త్వరలో నిర్వహించనున్న ఆసియా–పసిఫిక్ ప్రాసిక్యూటర్ల సదస్సు పట్ల హర్షం వ్యక్తంచేశారు. ప్రాసిక్యూటర్ల సంక్షేమం కోసం వారిని ఏకం చేయడం, చట్టపరమైన అవగాహన, ఉత్తమ పద్ధతుల మార్పిడిని పెంపొందించడంలో అసోసియేషన్ చేస్తున్న ప్రయత్నాలను బండి సంజయ్ ప్రశంసించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా ప్రాసిక్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మంగళ్ చంద్ మీనా, జాతీయ ఉపాధ్యక్షుడు పద్మారావు లక్కరాజు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాల కోసం కృషి చేయాలి

ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఇంటర్ కాలేజీల్లో మెరుగైన ఫలితాలు సాధించే దిశగా కృషి చేయాలని ఇంటర్ కాలేజీల అధ్యాపకులకు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య సూచించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి గుణాత్మక విద్యా బోధన అందించాలన్నారు. కాలేజీల్లో అన్ని వసతులు అందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని తెలిపారు. ఇటీవల జరిగిన ఇంటర్ పరీక్షల ఫలితాలపై ఆయన జిల్లా ఇంటర్ అధికారులు, చీఫ్ కోడింగ్, స్ట్రాంగ్ రూం అధికారులతో కలిసి సమీక్షించారు. బయోమెట్రిక్ హాజరును పరీక్షల్లో తీసుకురావడం మంచి ఫలితాలను ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో ఇంటర్ బోర్డు అధికారులు జయప్రదబాయ్, వసుంధర తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్ యాప్ కేసులపై సిట్ ఆరా

- కేసుల్లో దర్యాప్తుపై ఇప్పటికే ఎస్‌ఓపీ జారీ
- క్షేత్రస్థాయి ఇబ్బందులపై సిబ్బందికి ఆన్‌లైన్ శిక్షణ ఇచ్చే యోచన

సాక్షి, హైదరాబాద్: ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల మోసాలకు సంబంధించిన కేసుల దర్యాప్తు పర్యవేక్షణకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేకంగా ఏర్పాటైన సిట్ (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం) బెట్టింగ్ యాప్ కేసులపై ఆరా తీస్తోంది. సిట్ ఏర్పాటైన తర్వాత బెట్టింగ్ యాప్ కేసుల దర్యాప్తులో అనుసరించాల్సిన వ్యూహాలపై స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్‌ఓపీ)ను విడుదల చేశారు. బెట్టింగ్ యాప్‌లకు సంబంధించిన కేసులలో ప్రధానంగా ఆయా కంపెనీల వివరాలు తీసుకోవడం, వాటి ప్రతినిధులకు లేఖలు రాసి.. తగిన వివరాలు కోరడం సహా అనేక సాంకేతిక అంశాలు ముడిపడి ఉంటాయి. వీటి ఆధారంగానే కేసుల దర్యాప్తు ముందుకు వెళుతుంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ తరహా కేసుల దర్యాప్తు ఒకే తరహాలో ఉండేలా ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఈ క్రమంలో ఎస్‌ఓపీల ప్రకారం దర్యాప్తులో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులపై అవగాహన కల్పించేలా రాష్ట్రస్థాయిలో అధికారులకు ఆన్‌లైన్‌లో తరగతులు నిర్వహించే యోచనలో పోలీస్ ఉన్నతాధికారులు ఉన్నారు. మూడు కమిషనరేట్ల పరిధిలో నమోదైన కొన్ని కేసులను సిట్ అధికారులు ప్రత్యేకంగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో దర్యాప్తులో ఎదురైన సాంకేతిక అంశాలతోపాటు ఆయా పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓ (స్టేషన్ హౌస్ ఆఫీసర్ల)ల నుంచి వచ్చే సందేహాలను నివృత్తి చేసి, దర్యాప్తులో పురోగతి సాధించేలా ఈ శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిసింది.

మెటా గ్లాస్.. మొబైల్‌కి లాస్?

ఒక్క మాటతో ఫొటోలు, వీడియోలు తీసిపెట్టే స్మార్ట్ గ్లాసెస్

- ఫోన్ అవసరం లేకుండానే కాల్స్ మాట్లాడే అవకాశం
- సంగీతం, పాడ్‌కాస్ట్‌లు వినేందుకు హెడ్‌ఫోన్లతో పనేలేదు
- ఇటీవల సంయుక్తంగా ఆవిష్కరించిన మెటా- రేబాన్
- అదే బాటలో మరికొన్ని దిగ్గజ మొబైల్ కంపెనీలు

ఇవి ఇప్పటికిప్పుడు స్మార్ట్‌ఫోన్‌కు ప్రత్యామ్నాయం కాబోవంటున్న నిపుణులు

ఒక్క మాట చెబితే ఫొటో క్లిక్‌మనిపిస్తుంది.. వాయిస్ కమాండ్ వినగానే వీడియో రికార్డ్ అయిపోతుంది. ఏ భాషలోని అక్షరాలైనా క్షణాల్లో మన భాషలోకి మారిపోయి కనిపిస్తాయి. చేతిలో ఫోన్ లేకుండానే ఎవరితోనైనా ఫోన్ మాట్లాడేయొచ్చు.. త్వరలో అందుబాటులోకి రానున్న స్మార్ట్ కళ్లజోళ్లు చేసే పనులివన్నీ. స్టైలిష్ కళ్లజోళ్లకు పేరు గాంచిన రే–బాన్ కంపెనీ.. మార్క్ జుకర్‌బర్గ్‌కు చెందిన మెటా సంయుక్తంగా అత్యాధునిక స్మార్ట్ గ్లాసెస్‌ను విడుదల చేశాయి. ఇవి త్వరలోనే భారత్‌లోనూ విడుదల కానున్నాయి. అత్యాధునిక స్మార్ట్ ఫోన్లు చేసే పనులన్నీ ఈ స్మార్ట్ కళ్లద్దాలు చేసిపెడతాయి. కంటెంట్ క్రియేటర్లు, వ్యాపారవేత్తలు, వేగవంతమైన కమ్యూనికేషన్‌పై ఆధారపడే వారికి ఈ గ్లాసెస్ గేమ్–ఛేంజర్‌గా నిలుస్తాయని టెక్ నిపుణులు అంటున్నారు. 2024 నాటికి ప్రపంచ స్మార్ట్ గ్లాసెస్ మార్కెట్ విలువ 18.6 బిలియన్ అమెరికన్ డాలర్లకు చేరింది. 2033 నాటికి అది 53.6 బిలియన్ డాలర్లకు చేరుతుందని ఐఎమ్‌ఏఆర్‌సీ గ్రూప్ అంచనా వేస్తోంది. మెటా, ఆపిల్, గూగుల్, షావోమీ, సోనీ, అమెజాన్, లెన్స్‌కార్ట్ వంటి దిగ్గజ సంస్థలు ఇప్పటికే ఈ రంగంలో పెట్టుబడులు పెడుతున్నాయి. - సాక్షి, హైదరాబాద్



- వాయిస్ అసిస్టెంట్: మెటా ఏఐతో సంభాషించి రియల్ టైమ్ సమాధానాలు పొందవచ్చు.
- ఫొటో, వీడియో క్యాప్చర్: వాయిస్ కమాండ్‌తో ఫొటోలు తీయవచ్చు. వీడియోలు కూడా రికార్డ్ చేయవచ్చు.
- లైవ్ స్ట్రీమింగ్: ఏదైనా కార్యక్రమానికి ఇన్‌స్టాగ్రామ్ లేదా ఫేస్‌బుక్‌లో నేరుగా ప్రసారం చేయవచ్చు.
- సంగీతం, పాడ్‌కాస్ట్‌లు: ఇయర్‌బడ్స్ లేకుండానే సంగీతం లేదా పాడ్‌కాస్ట్‌లు వినవచ్చు.
- ఫోన్ కాల్స్: బిల్ట్–ఇన్ మైక్రోఫోన్లు, స్పీకర్లు ఈ అద్దాల్లో ఉంటాయి కాబట్టి ఫోన్ కాల్స్ చేయవచ్చు. కాల్స్ స్వీకరించవచ్చు.
- లైవ్ ట్రాన్స్‌లేషన్: విదేశీ భాషల సైన్‌బోర్డ్‌లను తక్షణం మనకు తెలిసిన భాషలోకి అనువదించగలవు.
- ఆబ్జెక్ట్ రికగ్నిషన్: మనం చూసే వస్తువులను గుర్తించి, వాటికి సంబంధించిన సమాచారాన్ని ఆ అద్దాలు అందిస్తాయి.
- ఈ కళ్లజోళ్లకు రోజువారీ ఫోన్ ఉపయోగాన్ని పూర్తిగా భర్తీ చేసే ఫీచర్లను జోడించే దిశగా మెటా పనిచేస్తోంది. వీటి ద్వారా యాప్‌లు, సేవలను నోటి మాటతో నియంత్రించవచ్చు.
- స్క్రీన్ లేని అనుభవం: ఫోన్, ఇతర ఏ రకమైన డిజిటల్ తెర అవసరం లేకుండానే సమాచారం మన దృష్టి క్షేత్రంలో నేరుగా కనిపిస్తుంది.

స్మార్ట్ గ్లాసెస్ ప్రయోజనాలు..

- సహజ కదలిక: స్క్రీన్ వైపు చూడాల్సిన అవసరం లేదు.
- మల్టీ టాస్కింగ్: నడుస్తూ, వంట చేస్తూ లేదా ప్రయాణిస్తూనే స్మార్ట్ ఫోన్ ద్వారా చేసే అన్ని పనులు వీటితో చేసుకోవచ్చు.
- తక్కువ స్క్రీన్ టైమ్: నిరంతర ఫోన్‌ను చూస్తూ స్క్రోలింగ్ చేయాల్సిన అవసరం లేదు.

ఎదురయ్యే సవాళ్లు..

- బ్యాటరీ లైఫ్: రోజంతా గ్లాసెస్‌ను చార్జ్‌లో ఉంచడం కష్టం.
- వ్యక్తిగత గోప్యత: ఎదుటివారికి తెలియకుండానే మనం వారి ఫొటోలు, వీడియోలను ఈ స్మార్ట్ గ్లాసెస్‌తో తీయొచ్చు. దీంతో వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగే ప్రమాదం ఉంది.
- ధర: ఈ హై-టెక్ కళ్లద్దాల ధర సామాన్య ఫోన్ల కంటే చాలా ఎక్కువ.

అయితే, ఇవి ఇప్పటికిప్పుడు స్మార్ట్‌ఫోన్లకు పూర్తిగా ప్రత్యామ్నాయంగా మారే అవకాశం లేదని నిపుణులు అంటున్నారు. స్మార్ట్ వాచ్‌ల మాదిరిగా మొదట ఫోన్లకు సహాయక పరికరాలుగా ఉపయోగపడతాయి. పూర్తి స్థాయిలో ఫోన్ స్థానాన్ని దక్కించుకోవాలంటే మరో 10-20 ఏళ్లు పట్టే అవకాశముందని చెబుతున్నారు.

స్మార్ట్‌ఫోన్‌కంటే బెటర్..

త్వరలోనే ఈ గ్లాసెస్ స్మార్ట్‌ఫోన్లను భర్తీ చేయగలవు. కళ్ల ముందే డేటా కనిపించడం, వాయిస్ ఆధారంగా నడిచే విధానం వల్ల ఫోన్ అవసరం తగ్గుతుందనేది నా అంచనా. స్మార్ట్‌ఫోన్లతో మనం చేసే అన్ని పనులు ఇవి చేయగలవు. ఫోన్‌ను పట్టుకోవడం కంటే ముఖంపై గ్లాసెస్ ధరించడం సహజంగా అనిపిస్తుంది. టచ్, స్క్రోల్‌కు బదులుగా వాయిస్ కమాండ్స్, విజువల్స్‌తో టెక్నాలజీని ఉపయోగించే రోజు దగ్గరలోనే ఉంది.'

– మార్క్ జుకర్‌బర్గ్, మెటా సీఈఓ

అందాల పండుగ నేడే షురూ

- గచ్చిబౌలి స్టేడియంలో ప్రపంచ సుందరి పోటీల ప్రారంభ వేడుకలు
- హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి
- ఘనంగా ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం
- ఇప్పటివరకు 111 మంది సుందరీమణుల రాక


గచ్చిబౌలి స్టేడియం

సాక్షి, హైదరాబాద్: అందాల పండుగకు అంతా సిద్ధమైంది. 22 రోజుల పాటు హైదరాబాద్ కేంద్రంగా జరిగే ప్రపంచసుందరి పోటీలు శనివారం ప్రారంభం కాబోతున్నాయి. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ప్రారంభ వేడుకలను అట్టహాసంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా ఏర్పాట్లు చేసింది. హైదరాబాద్.. తొలిసారి మిస్ వరల్డ్ పోటీలకు ఆతిథ్యమిస్తోంది. పోటీల్లో 120 దేశాలకు చెందిన సుందరీమణులు పాల్గొంటారని భావించగా, ఇప్పటివరకు 111 మంది నగరానికి చేరుకున్నారు. శనివారం మరికొందరు వస్తారని అంచనా వేస్తున్నారు.

'మిస్ వరల్డ్'కనుసన్నల్లో కార్యక్రమాలు

మిస్ వరల్డ్ లిమిటెడ్ కనుసన్నల్లో కార్యక్రమాలు జరగనున్నాయి. ఇందుకోసం గత రెండు నెలల్లో పలుమార్లు నగరానికి వచ్చి ఇక్కడి పరిస్థితులు, వసతులను పరిశీలించిన మిస్ వరల్డ్ లిమిటెడ్ చైర్‌పర్సన్ జూలియా మోర్లే, పోటీల నిర్వహణపై సానుకూలంగా స్పందించారు. ఈ నెల 2న తేదీన.. నగరానికి చేరుకున్న ఆమె బృందం హైటెక్ సిటీలోని ట్రైడెంట్ హోటల్‌లో కార్యాలయాన్ని ప్రారంభించి.. రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

ప్రారంభ వేడుకలకు సీఎం

అందాల పోటీల ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు ప్రముఖులు హాజరు కానున్నారు. పాకిస్తాన్‌తో యుద్ధం కొనసాగుతున్నా, పోటీ దారులు ఉత్సాహంగా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు నగరానికి చేరుకోవటం విశేషం. పదో తేదీతో ప్రారంభమయ్యే పోటీలు ఈనెల 31 వరకు కొనసాగనున్నాయి. 31న హైటెక్స్‌లో గ్రాండ్ ఫినాలే జరుగుతుంది. మొదటి 3, 4 స్థానాల్లో నిలిచిన సుందరీమణులు జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాల్లో పాల్గొంటారు. పరేడ్ మైదానంలో జరిగే వేడుకల్లో కూడా పాల్గొంటారా, లేదా.. సాయంత్రం రాజ్‌భవన్‌లో గవర్నర్ ఆధ్వర్యంలో జరిగే ఎట్ హోమ్ వరకే పరిమితమవుతారా అన్నది తేలాల్సి ఉంది. మిస్ వరల్డ్ 71వ ఎడిషన్ (2024) ఫైనల్ పోటీలు ముంబైలో జరిగాయి. వరుసగా రెండోసారి పోటీలు ఇండియాలోనే జరుగుతుండటం విశేషం.

రాష్ట్ర గీతం ఆలాపనతో..

రాష్ట్ర గీతం ఆలాపనతో వేడుకలు ప్రారంభమవుతాయి. ప్రముఖ గాయకుడు, శిక్షకుడు కొమాండూరి రామాచారి శిష్య బృందం 50 మంది బృంద గీతంగా దీన్ని ప్రత్యక్షంగా ఆలపిస్తారు. అనంతరం కాకతీయుల కాలంలో రూపొందించిన సంప్రదాయ నృత్యరీతి పేరిణి నాట్య ప్రదర్శన ఉంటుంది. 250 మంది మహిళా కళాకారిణులు పేరిణి లాస్య సంప్రదాయాన్ని అనుసరించి ఈ నృత్యాన్ని ప్రదర్శించబోతున్నారు. దీనికి పేరిణి సందీప్ నృత్య దర్శకత్వం వహిస్తున్నారు. ఫణి నారాయణ స్వరాలు సమకూర్చనున్నారు. పది నిమిషాల పాటు ఈ నృత్య కార్యక్రమం కొనసాగనుంది. కళాకారులు అందరూ కలిసి తమ విన్యాసాలలో భాగంగా నక్షత్రం, సీతాకోకచిలుక, మిస్ వరల్డ్ లోగో ఆకృతులను ప్రదర్శిస్తారు.

కళారూపాల ప్రదర్శనతో కంటెస్టెంట్ల పరిచయం

ప్రపంచ దేశాల నుంచి విచ్చేసిన సుందరీమణుల పరిచయ కార్యక్రమం ఖండాల వారీగా నిర్వహిస్తారు. ఆ సమయంలో తెలంగాణ జానపద, గిరిజన కళారూపాల ప్రదర్శనలు ఉంటాయి. తొలుత భద్రాచలం గోదావరి పరీవాహక ప్రాంతానికి పట్టుగొమ్మగా నిలిచిన కొమ్ము కోయ కళాకారులు రామకృష్ణ బృందం ప్రదర్శన ఉంటుంది. ఆ తర్వాత కత్లే శ్రీధర్ బృందం నేతృత్వంలో ఆదిలాబాద్ గోండు జాతి ప్రజల విశిష్ట కళారూపం గుస్సాడీ కళా ప్రదర్శన ఉంటుంది. అప్పుడు మరొక ఖండానికి సంబంధించిన సుందరీమణులు వేదిక పైకి వస్తారు. తెలంగాణ జానపద సంప్రదాయానికి నిలువెత్తు నిర్వచనంగా నిలిచే డప్పు వాయిద్య కార్యక్రమాన్ని ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కార గ్రహీత అందె భాస్కర్ బృందం, తెలంగాణ గిరిజన వైభవానికి ప్రతీకగా నిలిచే బంజారా మహిళల విన్యాసాలను స్వప్న బృందం ప్రదర్శిస్తారు. ఈ సందర్భంగా కూడా పోటీదారులను పరిచయం చేస్తారు. ఆ తర్వాత తెలంగాణ గ్రామీణ పల్లె జీవన ప్రతీకగా నిలిచిన ఒగ్గుడోలు కళా విన్యాసాలు ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కార గ్రహీత చౌదరపల్లి రవి కుమార్ బృందం ఆధ్వర్యంలో ప్రదర్శిస్తారు. ఈ కళారూపాల అన్నింటి మేళవింపుతో ముగింపు ఉంటుంది.

సంప్రదాయ స్వాగతానికి మురిసిపోతూ..

ఈనెల మూడో తేదీ మొదలు నిత్యం సుందరీమణులు నగరానికి వస్తూనే ఉన్నారు. వచ్చిన ప్రతి ఒక్కరికీ తిలకం దిద్ది, హారతి ఇస్తూ, కూచిపూడి, భరతనాట్యం, పేరిణి, కథక్ నృత్యరీతులు ప్రదర్శిస్తూ.. డప్పు వాయిద్యాలు, బాజాభజంత్రీలు, మంగళ వాయిద్యాలతో కూడిన బృందాలతో స్వాగతం పలుకుతున్నారు. ఈకార్యక్రమాలు 24 గంటల పాటు కొనసాగుతున్నాయి. దీనిని విదేశీ అతిథులు సంభ్రమాశ్చర్యాలతో తిలకిస్తుండటం గమనార్హం.

బీసీ రిజర్వేషన్ బిల్లులను 9వ షెడ్యూల్‌లో చేర్చాలి

బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్



సాక్షి, హైదరాబాద్: బీసీలకు విద్య, ఉద్యోగం, రాజకీయ ప్రాతినిధ్యంలో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్న సంకల్పాన్ని ప్రకటనలకే పరిమితం చేయకుండా రాష్ట్రప్రభుత్వం న్యాయ, రాజ్యాంగ పరంగా తీసుకోవాల్సిన చర్యలు ప్రారంభించాలని బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ డిమాండ్ చేశారు. ఆర్టికల్ 31–బీ ప్రకారం తొమ్మిదో షెడ్యూల్‌లో బీసీ రిజర్వేషన్ బిల్లులను చేర్చేలా కేంద్ర ప్రభుత్వానికి అధికారికంగా అభ్యర్థిస్తూ రాష్ట్ర కేబినెట్ వెంటనే తీర్మానించాలని శుక్రవారం ఒక ప్రకటనలో కృష్ణమోహన్ పేర్కొన్నారు. అలాగే ప్రధాని నరేంద్రమోదీని కలిసేందుకు అన్ని పార్టీలతో కూడిన ప్రతినిధి బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలని, బీసీ బిల్లు రాజ్యాంగ సవరణకు పార్లమెంట్‌లో అన్ని పార్టీల మద్దతు కూడగట్టాలని కోరారు. బిల్లుల ఉద్దేశం, న్యాయపరమైన అంశాలు ప్రజలకు తెలిసేలా అధికార ప్రకటన చేయాలన్నారు. బిల్లులు రాష్ట్రపతికి పంపిన తర్వాత ప్రభుత్వం తీసుకున్న మౌన దశ గమనార్హమని, ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన సమయం ఆసన్నమైందని కృష్ణమోహన్ తెలిపారు.

సైన్యం పిలిస్తే వెళతా

- యుద్ధం కొనసాగితే పాక్ పతనమవడమే కాదు.. విచ్ఛిన్నమవుతుంది
- మన విమానాలు పాక్ భూభాగంలోకి వెళ్లకుండానే దాడి చేశాయి
- మీడియాతో ఇష్టాగోష్టిలో మిగ్–23 మాజీ పైలట్, రాష్ట్ర మంత్రి కెప్టెన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: మాజీ సైనికుడిగా, అధునాతన మిగ్–23 యుద్ధ విమానం నడిపిన పైలట్‌గా తన అవసరముందని భారత సైన్యం పిలిస్తే యుద్ధానికి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నానని రాష్ట్ర మంత్రి కెప్టెన్ నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి వెల్లడించారు. త్రివిధ దళాలు దేశరక్షణ కోసం పరితపిస్తున్న తీరుకు భారతీయులందరూ గర్వించాలన్నారు. మన ఇంట్లోకి వచ్చి మనల్ని కొట్టిపోయిన వారికి బుద్ధి చెప్పడం తప్పనిసరి అని, అందులో భాగంగానే పాకిస్తాన్‌లోని ఉగ్ర స్థావరాలపై భారత సైన్యం సమర్థవంతంగా, విజయవంతంగా దాడి చేసిందని చెప్పారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో ఇష్టాగోష్టి మాట్లాడారు. పాక్ పౌరులెవరికీ ఇబ్బంది కలగకుండా, వారి భూభాగంలోకి మన విమానాలు ప్రవేశించకుండా 9 ఉగ్ర స్థావరాలపై దాడి చేయడం అభినందనీయమని ఉత్తమ్ అభిప్రాయపడ్డారు. ఈ దాడుల్లో రఫేల్ విమానాలు, కామికాజ్ డ్రోన్లు, హ్యామర్ బాంబులను ఉపయోగించి ఉంటారని చెప్పారు.

అదంతా అబద్ధం: మన రఫేల్ విమానాన్ని పాకిస్తాన్ కూల్చివేసిందనడం అవాస్తవమని, అసలు రఫేల్ విమానాలు పాక్ భూభాగంలోకే వెళ్లలేదని కెప్టెన్ ఉత్తమ్ చెప్పారు. ఇప్పటికే పాకిస్తాన్‌లో ఆర్థిక అస్థిరత, అశాంతి ఉన్నాయని, పేరుకే ప్రజాస్వామ్య దేశమైనా అక్కడ ఆర్మీ చీఫ్ దేశాన్ని నడిపిస్తారని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ యుద్ధాన్ని పాకిస్తాన్ ఎక్కువ కాలం కొనసాగించలేదని చెప్పారు. ఈ యుద్ధం తర్వాత పాకిస్తాన్ పతనమవడంతో పాటు, విచ్ఛిన్నమయ్యే సంకేతాలు కూడా స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. ఈ యుద్ధంలో మూడో దేశమేదీ పాలుపంచుకోదని, ఇందుకు ముందుకు రాదనే తాను భావిస్తున్నానన్నారు. ఈ యుద్ధంలో భాగంగా పాకిస్తాన్ ఎక్కడ దాడి చేస్తుందనేది ముందే చెప్పలేమని, హైదరాబాద్‌పై దాడి జరుగుతుందా లేదా అన్నది కూడా స్పష్టంగా ఊహించలేమని, యుద్ధ పరిస్థితులు నెలకొన్న వాతావరణంలో దేశంలో ఎక్కడ ఉండే ప్రజలైనా అప్రమత్తంగా ఉండాల్సిందేనని ఉత్తమ్ చెప్పారు. కశ్మీర్ పూర్తిగా భారతదేశానికి చెందినదే అని, ఆ సంస్థానం రాజు కూడా ఇందుకు సంతకం చేశారని చెప్పిన కెప్టెన్ ఉత్తమ్.. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను భారత దేశం తిరిగి ఆక్రమించుకోవడమే ఇందుకు శాశ్వత పరిష్కారమనేది తన వ్యక్తిగత అభిప్రాయమని చెప్పారు.

వచ్చే ఐదేళ్లకు విద్యుత్ ప్రణాళికలు

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశం
- భవిష్యత్ విద్యుత్ అవసరాలు, కార్యాచరణపై సమీక్ష
- నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుబాటులో ఉండేలా చూడాలని సూచన
- ఐదేళ్లలో 24,215 మెగావాట్లకు చేరనున్న గరిష్ట విద్యుత్ డిమాండ్



సాక్షి, హైదరాబాద్: పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యంగా రానున్న ఐదేళ్ల కాలానికి విద్యుత్ ప్రణాళికలు సిద్ధం చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రాష్ట్రంలోని విద్యుత్ సంస్థలను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులు, భవిష్యత్తు అంచనాలు, అందుకు అవసరమైన కార్యాచరణ గురించి ఉన్నతాధికారులతో చర్చించారు. రానున్న ఐదేళ్లలో నమోదయ్యే విద్యుత్ డిమాండ్ అంచనాలు, సంస్థలు చేపట్టాలనుకుంటున్న కార్యాచరణను భట్టికి అధికారులు వివరించారు. అనంతరం భట్టి మాట్లాడుతూ.. గతేడాదితో పోల్చుకుంటే గరిష్ట డిమాండ్ 10 శాతం కంటే ఎక్కువ పెరిగినా ఎలాంటి ఇబ్బంది రాకుండా ఉద్యోగులందరూ అహర్నిశలు కృషి చేస్తున్నారని అభినందించారు. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో మాత్రమే అందుబాటులో ఉండే విద్యుత్ సామాగ్రి స్టోర్‌లను కొత్తగా ఏర్పాటైన జిల్లాలకు కూడా విస్తరించాలని డిప్యూటీ సీఎం సూచించారు.

పరిస్థితి వివరించిన సీఎండీలు

విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ సీఎండీలు, రెడ్‌కో ఎండీలు రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్, సంస్థల పనితీరు, కార్యాచరణ గురించి వివరించారు. ఈ నెల ఒకటో తేదీన 20,883 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైందని, 2030 నాటికి గరిష్ట విద్యుత్ డిమాండ్ 24,215 మెగావాట్లకు చేరుతుందని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ అంచనా వేసిందని చెప్పారు. రెడ్‌కో వీసీఎండీ అనిల మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలోని 23 గ్రామాలు, రెండు మండలాలను పూర్తిగా సౌర విద్యుదీకరణ ప్రాంతాలుగా తీర్చిదిద్దుతామని, ప్రభుత్వ భవనాలు, పాఠశాలలను పూర్తిగా సోలరైజేషన్ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. సమీక్షలో ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, దక్షిణ డిస్కం సీఎండీ ముషారఫ్ ఫారూఖీ, ఉత్తర డిస్కం సీఎండీ వరుణ్‌రెడ్డి, ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాసరావుతో పాటు విద్యుత్ సంస్థల ఇన్‌చార్జి డైరెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జూన్ 2న 'యువ వికాసం' మంజూరు పత్రాలు పంపిణీ చేయాలి

ప్రభుత్వం నిర్దేశించిన గడువు ప్రకారంగా రాజీవ్ యువవికాసం లబ్ధిదారులను ఎంపిక ప్రక్రియను పూర్తిచేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో రాజీవ్ యువవికాసం పురోగతిపై సంబంధిత ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈనెల 15 నుంచి 25లోగా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరగాలన్నారు. 25 నుంచి 30లోగా ఎంపికైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను సిద్ధం చేయాలని, జూన్ 2 నుంచి మంజూరు పత్రాలను పంపిణీ చేయాలన్నారు.

ఖనిజాల అన్వేషణలో రాణించాలి

గ్రాఫేట్, లిథియం, కాపర్ తదితర ఖనిజాలకు రానున్న రోజుల్లో మంచి డిమాండ్ ఉన్న నేపథ్యంలో వాటి అన్వేషణ కోసం ఉన్న అవకాశాల్ని అందిపుచ్చుకొని సింగరేణి ముందుకెళ్లాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాష్ట్ర సచివాలయంలో సింగరేణి భవిష్యత్తు విస్తరణ ప్రాజెక్టులపై ఆయన సమీక్షించారు. రాజస్తాన్‌తో చేసుకున్న అవగాహన ఒప్పందం మేరకు విద్యుత్, సోలార్ ప్లాంట్ ఏర్పాట్లపై కార్యాచరణ సిద్ధం చేయాలని భట్టి ఆదేశించారు.


Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



నాడు చీర్లవంచ బస్టాండు



నేడు చీర్లవంచ బస్టాండు



చీర్లవంచలోని పాత శివాలయం.. ఇటీవల సున్నం వేశారు.

మునిగి‘తేలిన’ జ్ఞాపకాలు

ఈ శిథిలాలు.. ఒకనాటి పల్లెల ఆనవాళ్లు ● కూలిన ఇళ్లు.. మట్టి దిబ్బలు..

నీరెండిన మధ్యమానేరు.. తేలిన ఊళ్లు ● జ్ఞాపకాలతో గుండె బరువెక్కిన నిర్వాసితులు

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద 26.50 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మించిన మధ్యమానేరు (శ్రీరాజరాజేశ్వర) జలాశయంలో నీరు అడుగంటిపోవడంతో.. ఆ ప్రాజెక్టులో మునిగిన ఊళ్లు తేలాయి. ప్రస్తుతం ప్రాజెక్టులో ఆరు టీఎంసీల నీరుంది. మధ్యమానేరు జలాశయాన్ని 2019లో పూర్తిస్థాయి నీటితో నింపారు. అప్పటి నుంచి ఆ ప్రాజెక్టులో ముంపునకు గురైన ఊళ్లన్నీ నీరుంటే మునుగుతూ.. ఎండితే తేలుతూ కనిపిస్తున్నాయి. మధ్యమానేరు జలాశయంలో ముంపు ప్రాంతం ఎలా ఉందో ‘సాక్షి’క్షేత్రస్థాయిలో పరిశీలించగా.. కనిపించిన దృశ్యాలివి.

పసిడి పంటల ఊళ్లు

ఒకప్పుడవి చుట్టూ పచ్చటి పొలాలతో కళకళ్లాడిన పల్లెలు. ఊరు సమీపంలో మానేరు, మూల వాగులు. ఆ వాగుల్లో పారే నీరు.. బర్రెలు... ఆవులు.. గొర్రెలు.. సబ్బండ వర్ణాల పల్లెలవి. గ్రామపంచాయతీ కార్యాలయం.. ఆలయాలు.. దర్గాలు.. చర్చిలు.. బడి.. గుడితో సందడి చేసిన ఆ పల్లెలు ఇప్పుడు శిథిలాలతో దర్శనమిస్తున్నాయి. మధ్యమానేరు జలాశయంలో మునిగిన పల్లెల్లో అతి పెద్ద ఊరు చీర్లవంచ. ఆ ఊరి శిథిలాలను చూడగానే.. అది బస్టాండు.. ఇది వల్లంపట్ల రోడ్డు.. ఇది రుద్రవరం వెళ్లే దారి.. సిరిసిల్లకు వెళ్లే తారు రోడ్డు అంటూ.. ఇప్పుడు ఆనాటి ఆనవాళ్లను స్థానికులు గుర్తు చేసుకుంటున్నారు. మధ్యమానేరులో ఒక్క చీర్లవంచ మాత్రమే కాదు.. చింతలఠాణా, రుద్రవరం, కొడుముంజ, అనుపురం, విలాసాగర్, నీలోజిపల్లె, కొదురుపాక, శభాష్‌పల్లి గ్రామాలు పూర్తిగా జలసమాధి అయ్యాయి.

గూడు చెదిరిన పక్షుల్లా..

ఆ పల్లెలు మధ్యమానేరులో మునిగిపోవడంతో గూడు చెదిరిన పక్షుల్లా ఆ ఊరి జనం చెదిరిపోయారు. ప్రభుత్వం నిర్మించిన పునరావాస కాలనీల్లో కొందరు.. సమీప బంధువుల ఊళ్లలో కొందరు.. సిరిసిల్ల, వేములవాడ, కరీంనగర్, సిద్దిపేట, హైదరాబాద్ ఇలా ఆ తొమ్మిది ఊళ్ల జనం తలోదిక్కు వెళ్లిపోయారు. ఆ ఊళ్లలో ఇప్పుడు కూలిన గోడల మధ్య ఇళ్ల ఆనవాళ్లు.. శిథిలాలు కనిపిస్తున్నాయి. ఆయా గ్రామాల్లో సుమారు 15 వేల ఇళ్ల మట్టి దిబ్బలున్నాయి. నిర్వాసితులు పునరావాస కాలనీల్లో ఉపాధి లేక.. దిక్కులు చూస్తున్నారు. మళ్లీ వర్షాలు బాగా పడితే.. ఎగువ మానేరు పొంగితే.. వరద కాల్వ పారితే.. మధ్యమానేరు నిండే అవకాశం ఉంది. ప్రస్తుతం ముంపు గ్రామాలు తేలడంతో నివాసాలను చూస్తున్న నిర్వాసితుల గుండెలు బరువెక్కుతున్నాయి.



కొదురుపాక వద్ద ఎండిన మధ్యమానేరు, పక్కనే వంతెన



మధ్యమానేరులో తేలిన శభాష్‌పల్లి ఊరు, నీళ్ల ట్యాంకు



చీర్లవంచలో నాటి గ్రామ పంచాయతీ కార్యాలయ భవనం, జెండా గద్దె



మాన్వాడ వద్ద నీరెండిన మధ్యమానేరు జలాశయం



చీర్లవంచలోని నాటి బస్‌షెల్టర్

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తాం: పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సచివాలయంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.విరాహత్ అలీ, కె.రాంనారాయణ నేతృత్వంలోని యూనియన్ బృందం మంత్రిని కలిసి జర్నలిస్టుల సమస్యలపై చర్చించింది. అక్రెడిటేషన్ల నియమావళి రూపకల్పనకు ప్రభుత్వం కమిటీ వేసిందని, ఆ కమిటీ నివేదిక సమర్పించి నెల రోజులు గడుస్తున్నా, ఇంకా జీవో జారీ కాలేదన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలకు వ్యతిరేకంగా ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు కేవలం అర్బన్ ప్రాంతాల్లో సొసైటీలకే వర్తిస్తుందని, గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న జర్నలిస్టులకు కాదని వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. జర్నలిస్టులపై దాడుల నిరోధక హైపవర్ కమిటీ, వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ ఫండ్ కమిటీ, వేజ్ బోర్డు సిఫారసులను పర్యవేక్షించే త్రైపాక్షిక కమిటీని ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా వారు మంత్రికి విజ్ఞప్తి చేశారు. టీయూడబ్ల్యూజే విన్నవించిన ఆయా సమస్యలపై సానుకూలంగా స్పందించిన మంత్రి పొంగులేటి.. త్వరలోనే వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో శ్రీకాంత్‌రెడ్డి, మధుగౌడ్, రాజేష్, యూసుఫ్‌బాబు, మాతంగి దాస్, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందజేసిన టీయూడబ్ల్యూజే నేతలు

అర్హులైన జర్నలిస్టులకు తెల్లరేషన్ కార్డులు: మంత్రి ఉత్తమ్ హామీ

అర్హులైన జర్నలిస్టులందరికీ తెల్లరేషన్ కార్డు జారీ చేసేందుకు సత్వర చర్యలు చేపడతామని పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. మంత్రిని శుక్రవారం టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ కలిశారు. గతంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి జర్నలిస్టులకు తెల్ల రేషన్ కార్డుల జారీకి ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారని గుర్తు చేశారు. దీనిపై మంత్రి ఉత్తమ్ సానుకూలంగా స్పందిస్తూ.. తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.



విద్యుత్ దీపాల వెలుగుల్లో వెలిగిపోతున్న కోటలోని శిల్పాల ప్రాంగణం

ఖిలా.. మెరిసెనిలా..

ప్రపంచ సుందరీమణుల రాక నేపథ్యంలో కాకతీయుల రాజధాని అయిన ఖిలా వరంగల్ కోట శిల్పాల ప్రాంగణం విద్యుత్ వెలుగుల్లో తళుక్కుమంటోంది. ఈ నెల 14న సుందరీమణులు విద్యుద్దీపాల వెలుగుల్లో కోట శిల్ప కళా వైభవాన్ని వీక్షించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం రాత్రి శిల్పాల ప్రాంగణంలో ట్రయల్ రన్ నిర్వహించారు. దీంతో విద్యుత్ వెలుగుల్లో కోట మరింత వెలిగిపోయింది.

– ఖిలా వరంగల్

నాణేల శ్రీనివాస్!

అరుదైన నాణేల సేకర్త

ఈస్ట్ ఇండియా, బ్రిటిష్, నిజాం కాలం నాటి నాణేల సేకరణ

రామగిరి(మంథని): ఆ యువకుడికి చిన్నప్పటి నుంచే నాణేల సేకరణ అంటే ఎంతో మక్కువ. వ్యవసాయ విస్తరణాధికారిగా పనిచేస్తూనే.. సేంద్రియ సాగు పద్ధతులు అవలంబిస్తూనే నాణేల సేకరణను అభిరుచిగా మలచుకున్నారు. డిజిటల్ యుగంలో తేలియాడుతున్న నేటితరానికి మన ఘనచరితను అందించడమే లక్ష్యంగా ప్రత్యేకత చాటుకుంటున్నారు. ఆయనే పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన యాదగిరి శ్రీనివాస్. స్వాతంత్ర్యం రాకముందు.. వచ్చిన తర్వాత చలామణిలో ఉన్న పలు నాణేలను ఆయన సేకరించి భద్రపరిచారు. ఎవరి వద్ద ఏదైనా పాత నాణేం ఉందని తెలిస్తే చాలు.. వారివద్దకు వెళ్లి మరీ దానిని సేకరించి భద్రపరుస్తున్నారు. ఏడో తరగతి చదువుతున్నప్పుడు.. తండ్రి యాదగిరి రాయమల్లుకు చెందిన గొలిసోడా బండి వద్ద ఉండేవారు. ఈ సందర్భంగా కొనుగోలుదారులు ఇచ్చే నాణేలను చూసిన శ్రీనివాస్.. అప్పుడే వాటి సేకరణపై అభిరుచి పెంచుకున్నారు. అప్పుడు తన నానమ్మ యాదగిరి బొందమ్మ వద్ద గల తూటు (రంధ్రం) నాణెంతో సేకరణ ప్రారంభించారు. అప్పట్నుంచి పలు రకాల నాణేల గురించి తెలుసుకుంటూ వాటి సేకరణను అభిరుచిగా మార్చుకున్నారు. వ్యవసాయ విస్తరణాధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే.. నాణేల సేకరణ చేస్తున్నారు. ఆయన వద్ద స్వాతంత్ర్యం రాకముందు అణా.. అంత కన్నా.. చిన్నవి 22 నాణేలు, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత వినియోగించిన 1 పైసా-2, 2 పైసలు-3, 3 పైసలు-1, 5 పైసలు-8, 10 పైసలు-16, 20 పైసలు-7, 25 పైసలు-13, 50 పైసలు-19, రూపాయి-38, రూ.2-25, రూ.5-64, రూ.10-30, రూ.20-2 నాణేలు, రూపాయి, రూ.2, రూ.5, రూ.10, రూ.20, రూ.50, రూ.100 నోట్లు ఉన్నాయి. వీటిలో స్వాతంత్ర్యం రాకముందు ఈస్ట్ ఇండియా, బ్రిటిష్, నిజాం, గ్వాలియర్ రాజుల కాలం నాటి నాణేలు, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రిపబ్లిక్ ఇండియా ముద్రించిన నాణేలున్నాయి. ఆధునిక డిజిటల్ సేవలైన (ఫోన్ పే, గూగుల్ పే) నడుస్తున్నందున.. ఇప్పటి పిల్లలకు వీటిపై అవగాహన కల్పించడం కోసం తనవంతు ప్రయత్నం చేస్తున్నారు. త్వరలో ఆయా ప్రభుత్వ పాఠశాలలో వీటిపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేసే ఆలోచనలో శ్రీనివాస్ ఉన్నారు. తద్వారా పిల్లలకు అవగాహన కలగడమే కాకుండా.. వారికి ఇది ఒక అభిరుచిగా మారే అవకాశం ఉంటుంది. అప్పటి తరంలో సమాజానికి వ్యవసాయం ప్రాధాన్యాన్ని నాణేల్లో తెలిపారని శ్రీనివాస్ వెల్లడించారు. భవిష్యత్ తరాలకు చరిత్ర గురించి తెలపాలన్న చిరు ప్రయత్నమే.. తన నాణేల సేకరణ అభిరుచికి కారణమని పేర్కొన్నారు.



శ్రీనివాస్ సేకరించిన నాణేలు



యాదగిరి శ్రీనివాస్



తూటు నాణెం



గ్వాలియర్ రాజుల కాలంలో చలామణిలో ఉన్న నాణెం



శ్రీనివాస్ సేకరించిన నాణేలు



బ్రిటిష్ కాలంలో చలామణిలో ఉన్న నాణెం



నిజాం కాలంలో చలామణిలో ఉన్న నాణెం



విహంగాల విహారం

సుదూర తీరాల నుంచి వచ్చిన ఈ విదేశీ విహంగాలు తమ ప్రయాణంలో భాగంగా కర్నూలు మండలం గార్గేయపురం చెరువును ఆనుకుని ఉన్న దీవిలో కొంతసేపు సేదతీరుతున్నాయి. పెద్ద ఎత్తున వచ్చిన ఈ విదేశీ పక్షులను చూసి స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



నీటికోసం వేట

ఎండలు మండిపోతున్నాయి, చెరువులూ కుంటలూ ఎండిపోయాయి. గుక్కెడు నీటికోసం వన్యప్రాణులు ఇలా జనావాసాల బాట పట్టాయి. అనంతపురం జిల్లా బుక్కారాయసముద్రంలో రెండు వానరాలు తమ పిల్లలతో కలిసి నీటికోసం వెతుకులాడుతున్న దృశ్యం – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



మీవెంటే మేమంతా..

దేశ సరిహద్దుల్లో శత్రువుల తూటాలకు ఎదురొడ్డి పోరాడుతున్న వీర జవాన్లకు మద్దతుగా విజయవాడ బెంజ్ సర్కిల్ సమీపంలో లయోలా వాకర్స్ అసోసియేషన్, ఇతర అసోసియేషన్ల ఆధ్వర్యంలో శుక్రవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

క్లుప్తంగా...

ఏఐపీఏకి కేంద్రం నుంచి సంపూర్ణ మద్దతు

వెబ్‌సైట్‌ను ప్రారంభించిన కేంద్రమంత్రి బండి సంజయ్

సాక్షి, న్యూఢిల్లీ: జాతీయ ప్రయోజనాల కోసం ఆల్ ఇండియా ప్రాసిక్యూటర్స్ అసోసియేషన్ (ఏఐపీఏ) చేపట్టే నిర్మాణాత్మక కార్యక్రమాలకు భారత ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు ఉంటుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. శుక్రవారం న్యూఢిల్లీ నార్త్ బ్లాక్‌లోని తన కార్యాలయంలో ఏఐపీఏ అధికారిక వెబ్‌సైట్‌ను అధికారికంగా ప్రారంభించారు. దేశంలో త్వరలో నిర్వహించనున్న ఆసియా–పసిఫిక్ ప్రాసిక్యూటర్ల సదస్సు పట్ల హర్షం వ్యక్తంచేశారు. ప్రాసిక్యూటర్ల సంక్షేమం కోసం వారిని ఏకం చేయడం, చట్టపరమైన అవగాహన, ఉత్తమ పద్ధతుల మార్పిడిని పెంపొందించడంలో అసోసియేషన్ చేస్తున్న ప్రయత్నాలను బండి సంజయ్ ప్రశంసించారు.

విద్యాశాఖ సమావేశం బహిష్కరిస్తున్నాం

పీఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జమాల్‌రెడ్డి

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయ బదిలీలు, రేషనలైజేషన్, పదోన్నతులపై రిజిస్టర్డ్ ఉపాధ్యాయ సంఘాలతో శనివారం విద్యాశాఖ ఏర్పాటు చేసిన సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్టు ప్రగతిశీల ఉపాధ్యాయ సంఘం (పీఎస్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎ.సి.వి.గురువారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో ఓసారి రిజిస్టర్డ్ సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో రేషనలైజేషన్, ఉపాధ్యాయ బదిలీలపై కమిషనర్‌ను ప్రశ్నించినందుకు తర్వాత జరిగిన సమావేశాలకు తమను పిలవలేదని వారు గుర్తు చేశారు. ప్రస్తుతం బదిలీలు, రేషనలైజేషన్, పదోన్నతులకు జీవోలు సిద్ధం చేసుకుని ఇప్పుడు రిజిస్టర్డ్ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయడంలో మతలబు ఏంటో అర్థం కాలేదన్నారు.

వ్యవసాయ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

బాపట్ల: వ్యవసాయ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని వి.హెచ్.ఆగ్రో ప్రైవేటు లిమిటెడ్ డైరెక్టర్ వి.కె.వి.ప్రసాద్ పేర్కొన్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాల 80వ వసతి గృహ దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు నేరుగా సేవలు చేసేందుకు వ్యవసాయ విద్యార్థులకే అవకాశం ఉండటం గొప్పవరంగా పేర్కొన్నారు. భవిష్యత్‌లో వ్యవసాయ విద్యకు మరింత ఆదరణ ఉంటుందని తెలిపారు.

పాఠశాల విద్యపై ప్రభుత్వం నిర్లక్ష్యం

గుంటూరు వెస్ట్: ప్రభుత్వ పాఠశాలలను పటిష్టం చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా పని చేయడం లేదని ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాదరావు విమర్శించారు. సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ విధానాలతో ప్రాథమిక పాఠశాల వ్యవస్థ మనుగడ కష్టసాధ్యంగా మారిందని తెలిపారు. గత ప్రభుత్వం ఇచ్చిన జీఓ 117ను మంత్రి లోకేష్ రద్దు చేస్తానని చెప్పినా, దానిని పూర్తిగా అమలు చేయలేదని విమర్శించారు. గత ప్రభుత్వం ఆరు రకాల పాఠశాలల వ్యవస్థను ఏర్పాటు చేస్తే, ఈ ప్రభుత్వం తొమ్మిది రకాల పాఠశాలల వ్యవస్థను ఏర్పాటు చేసి మరింత గందరగోళం సృష్టిస్తుందని చెప్పారు.

తెలుగు సాహిత్యానికి అన్నమయ్య కృషి అసామాన్యం

గుంటూరు ఎడ్యుకేషన్: తెలుగు సాహిత్యం, సంగీతం, కవితా వికాసానికి తాళ్లపాక అన్నమాచార్యుల కృషి అసామాన్యమని గుంటూరు జిల్లా అటవీ శాఖ అధికారి హిమ శైలజ అన్నారు. కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యాభవన్‌లో శుక్రవారం అన్నమయ్య జయంతి సందర్భంగా నిర్వహించిన కీర్తనల రాష్ట్ర స్థాయి పోటీల బహుమతి ప్రదానోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలుగు తొలి వాగ్గేయకారునిగా 32 వేలకు పైగా కీర్తనలను స్వరపరిచి, తెలుగు భాషా వైభవానికి విశేష కృషి చేశారని కొనియాడారు. గొప్ప వైష్ణవ భక్తునిగా శ్రీ వేంకటేశ్వరస్వామి వారి సాక్షాత్కారం పొందిన మహా భక్తుడు అన్నమాచార్యులు అని కీర్తించారు.

భారతీయుల రూటే.. సపరేటు

పెరుగుతున్న నాయకత్వ లక్షణాలు

కష్టపడితేనే.. కలదు సుఖం అని నమ్ముతున్న ప్రజలు

ఆమ్రోప్ పరిశోధనా సంస్థ అధ్యయనంలో వెల్లడి



సాక్షి, అమరావతి

ఋగ్వేదంలోనే యోగా గురించి ప్రస్తావించాం. సింధు లోయ నాగరికతలోనే టాయిలెట్లను వినియోగించాం. గూస్బెర్రీ వంటి మొక్కల సారాన్ని వినియోగించి షాంపూలు తయారు చేశాం.. 'సున్నా'కు విలువ కనిపెట్టి ప్రపంచానికి అందించాం. ఇలా విశ్వజగతికి భారతీయులు ఆది నుంచి నాయకులుగానే పరిచయమయ్యారు. నేటికీ అదే విధంగా ఉండేందుకు, గ్లోబల్ లీడర్లుగా పిలిపించుకునేందుకు భారతీయులు ఇష్టపడుతున్నారు. అందుకోసమే కష్టాన్నీ సంతోషంగా స్వీకరిస్తున్నారు. ప్రపంచ ప్రముఖ కార్యనిర్వాహక పరిశోధన సంస్థ అయిన అమ్రోప్ నిర్వహించిన అధ్యయనంలో భారత్ ప్రజల తాజా మనోగతం ఆవిష్కృతమైంది. గ్లోబల్ సౌత్ దేశాలైన భారత్, చైనా, బ్రెజిల్‌తోపాటు పాశ్చాత్య దేశాలైన అమెరికా, బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్, పోలాండ్‌లో పని వైఖరిపై అమ్రోప్ తాజాగా అధ్యయనం జరిపింది. కష్టించి పనిచేయడం వల్లనే గుర్తింపు లభిస్తుందని, జీవితం సంతృప్తికరంగా ఉంటుందని, ఆశయం నెరవేరుతుందని భారతీయులు నమ్ముతున్నట్లు ఈ అధ్యయనంలో తేలింది. ఈ సర్వేలో 20 ఏళ్ల నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు గల బ్యాచిలర్ డిగ్రీ, అంతకంటే ఎక్కువ విద్యార్హత ఉన్న 8 వేల మంది నిపుణులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ప్రతి దేశం నుంచి వెయ్యి మంది సర్వేలో పాల్గొన్నారు.



అధ్యయనంలోని ముఖ్యాంశాలు:

- భారతీయుల్లో నాయకత్వ లక్షణాలు పెరుగుతున్నాయి. 92 శాతం మంది పని చేయడంలోనే సంతోషం ఉందని అంటున్నారు.
- 73% మంది మంచి ఉద్యోగం, జీవితం ఉండాలని కోరుకుంటున్నారు.
- 75% మంది కష్టపడి పని చేయడం సాధారణంగా మనిషి ధర్మమని నమ్ముతున్నారు.
- 42% మంది వారానికి 40 గంటలకు మించి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారు. ఇది ఫ్రాన్స్‌లో 16 శాతంగా ఉంది.
- 76 శాతం మంది భారతీయ నిపుణులు ఒక కంపెనీని నడిపించాలని లేదా తామే సొంతంగా ఒక సంస్థను నిర్వహించాలని కోరుకుంటున్నారు. జర్మనీలో ఇలాంటి వారు 36% కాగా, అమెరికాలో 49% మంది ఉన్నారు.
- తామేంటో నిరూపించుకునేలా పనిచేయాలని 73% మంది భారతీయులు అనుకుంటున్నారు. జర్మనీలో ఇలాంటి వారి సంఖ్య 41 శాతం మాత్రమే ఉంది.
- మన దేశంలో 84 శాతం మందికి చదువు, వ్యాపారం, ఉద్యోగం వంటి మంచి కెరీర్ ముఖ్యంగా భావిస్తున్నారు.
- పాశ్చాత్య దేశాల్లో మాత్రం 62% మంది తాము కుటుంబానికే ప్రాధాన్యత ఇస్తామని పేర్కొనడం గమనార్హం.
- రాజకీయ నాయకుడిగా ఉండేందుకు మాత్రం ప్రపంచ వ్యాప్తంగా 40 శాతం మంది ఇష్టపడటం లేదు.

అడ్డంగా బుక్కయిన బాబు!

'సాక్షి' కథనాలతో యాక్సిస్ ఎనర్జీ కుంభకోణం బట్టబయలు

- సెకీ, యాక్సిస్ ఒప్పందాల్లో ఎవరిది నీతి, ఎవరిది అవినీతి?
- అప్పుడు యూనిట్ విద్యుత్ రూ.2.49తో కొంటే తప్పన్నారు..
- ఇప్పుడు ఏకంగా రూ.4.60తో ఎందుకు కొంటున్నారు?
- సీఎం చంద్రబాబు, కూటమి సర్కార్‌పై విరుచుకు పడుతున్న సోషల్ మీడియా



సోషల్ మీడియాలో ఇలాంటి పోస్టులెన్నో..

సాక్షి, అమరావతి: చంద్రబాబు, కూటమి ప్రభుత్వం అడ్డగోలు కుంభకోణానికి పాల్పడి అడ్డంగా బుక్కయ్యింది. యాక్సిస్ రెన్యూవబుల్ ఎనర్జీ పార్క్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి యూనిట్ విద్యుత్‌కు ఏకంగా రూ.4.60 చెల్లించి కొనుగోలు చేయడానికి పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ (పీపీఏ) కుదుర్చుకుంది. 400 మెగావాట్ల పవన సౌర హైబ్రీడ్ పైలట్ ప్రాజెక్టు నుంచి పునరుత్పాదక విద్యుత్‌ను పాతికేళ్ల పాటు అధిక ధరకు తీసుకోవడం వెనుక ఉన్న అవినీతి బాగోతాన్ని 'సాక్షి' వరుస కథనాలతో వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సోలార్ ఎనర్జీ కార్పొరేషన్(సెకీ) నుంచి యూనిట్ రూ.2.49కే గత ప్రభుత్వం కొనుగోలు ఒప్పందం కుదుర్చుకుంటే, ఇప్పుడు కూటమి ప్రభుత్వం యూనిట్ ఏకంగా రూ.4.60కి కొంటోందనే వాస్తవాన్ని 'సాక్షి' బయటపెట్టింది. దీంతో రాష్ట్రం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. ప్రతిపక్షాలు, సామాన్య ప్రజలు విస్మయానికి గురయ్యారు. వారూ వీరనే తేడా లేకుండా ముక్త కంఠంతో చంద్రబాబుపై దుమ్మెత్తి పోయడం మొదలైంది. ప్రతిపక్ష పార్టీల నేతలు వరుసగా ప్రెస్‌మీట్లు పెట్టి బాబు తీరును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించారు. వామపక్ష పార్టీల నేతలు సంతకాల సేకరణ చేపట్టి తమ నిరసన వ్యక్తం చేశారు. విపక్షాలన్నీ రాష్ట్ర వ్యాప్తంగా రోడ్ల మీదకు వచ్చి ఆందోళనలు, విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టాయి. విద్యుత్ చార్జీల భారాలు, అవినీతి పీపీఏలను రద్దు చేయాలంటూ అధికారులను కలిసి వినతిపత్రాలు సమర్పించాయి.

దుమ్మెత్తి పోస్తున్న సోషల్ మీడియా

ఈ చర్యలన్నీ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే, మరోవైపు సామాజిక మాధ్యమాల్లో సామాన్యులు చంద్రబాబుపై, కూటమిపై ముప్పేట దాడి మొదలుపెట్టారు. గత ప్రభుత్వం యూనిట్ రూ.2.49తో ఒప్పందం చేసుకుంటే తప్పంటూ ఇదే చంద్రబాబు, కూటమి నేతలు గగ్గోలు పెట్టారు.. మరి అలాంటి వారే ఇప్పుడు ఏకంగా రూ.4.60కి ఎందుకు కొంటున్నారంటూ నిలదీస్తున్నారు. సెకీ ధరతో పోల్చితే యూనిట్‌కు రూ.2.11 అదనంగా ఎలా చెల్లిస్తున్నారని సూటిగా ప్రశ్నిస్తున్నారు. సెకీ, యాక్సిస్ ఒప్పందాలను బేరీజు వేస్తూ, తక్కువ రేటుతో విద్యుత్ కొనడం తప్పా.. ఎక్కువ ధరకు కొనడం తప్పా.. జగన్, చంద్రబాబులో ఎవరిది నీతి, ఎవరిది అవినీతి? అనే విశ్లేషణలతో యూ ట్యూబర్స్ విరుచుకు పడుతున్నారు. అప్పుడు సెకీని ఎందుకు వద్దన్నారు.. ఇప్పుడు యాక్సిస్‌ను ఎందుకు కావాలంటున్నారు..? అనే దానిపై సీఎం చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్, ఎక్స్, వాట్సప్ వంటి సామాజిక మాధ్యమాల్లో పోస్టులు వెల్లువలా పెడుతున్నారు. సెకీపై విషం చిమ్మిన ఎల్లో మీడియా ఎందుకు మౌనంగా ఉందని, అప్పుడు అరిచి గోలపెట్టిన మేధావులంతా ఇప్పుడు ఎక్కడికి పోయారని నిలదీస్తున్నారు. ఈ కుంభకోణాన్ని అనేక మంది షార్ట్ వీడియోలతో ఛీకొడుతుంటే, సెకీ ధరను, యాక్సిస్ ధరతో సరిపోలుస్తూ చంద్రబాబును, కూటమి ప్రభుత్వాన్ని మీమ్స్‌తో ఆడుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కనీసం ఖండించలేని విధంగా సాక్షి ఆధారాలను బయట పెట్టడంతో చేసిన తప్పును సమర్థించుకోవడానికి చంద్రబాబుకు, కూటమి ప్రభుత్వానికి అవకాశం లేకుండా పోయిందని ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వం, ఎల్లో మీడియా తేలు కుట్టిన దొంగల్లా మిన్నకుండిపోయిందంటున్నారు.

పచ్చిరొట్ట విత్తనం కొరతతో రైతన్న పాట్లు

డిమాండ్, సరఫరా మధ్య అగాధం

సాక్షి, అమరావతి: టీడీపీ కూటమి ప్రభుత్వంలో అన్నదాతల పాట్లు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు భూమిని సారవంతం చేయడంసహా వ్యవసాయోత్పత్తిలో పలు ప్రయోజనాలు సమకూర్చే పచ్చిరొట్ట విత్తనాలు కూడా లభించక నానా అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వం ఏటా ఈ సీజన్‌లో లక్ష క్వింటాళ్లకు తక్కువ కాకుండా పచ్చిరొట్ట విత్తనాలను సిద్ధం చేసేవారు. 80 వేల క్వింటాళ్లకు పైగా పంపిణీ చేసేవారు. పైగా కోరుకున్న విత్తనం.. కోరుకున్నంత పరిమాణంలో సరఫరా చేసేవారు. ఇందుకోసం ఏటా మార్చిలోనే టెండర్లు పిలిచి విత్తన సరఫరా కంపెనీలను ఎంపిక చేసేవారు. జిల్లాల నుంచి వచ్చే ఇండెంట్ మేరకు కంపెనీలకు కేటాయింపులు జరిపే వారు. చివరికి ఎన్నికల ఏడాది 2024–25 సీజన్‌లో సైతం 99 వేల క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాన్ని సిద్ధం చేయగా, రికార్డు స్థాయిలో 82 వేల క్వింటాళ్ల విత్తనం పంపిణీ చేశారు. అలాంటిది ఈ ఏడాది పచ్చిరొట్ట విత్తనం దొరకని పరిస్థితి నెలకొంది. పైగా వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో 70 శాతం సబ్సిడీపై ఇవ్వగా, ప్రస్తుతం 50 శాతం సబ్సిడీనే ఇస్తుండడం రైతుకు మరో ప్రతికూల అంశం.

లక్ష్యానికి ఎంతోదూరం

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో కేవలం 69 వేల క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా లక్ష్యంగా నిర్దేశించగా, ఇప్పటి వరకు 21 వేల క్వింటాళ్లను మాత్రమే సిద్ధం చేశామని చెబుతున్నారు. వాస్తవానికి కనీసం 10 వేల క్వింటాళ్లు కూడా జిల్లాలకు చేరలేదు. ఓ వైపు తొలకరి పంట జూన్‌లోనే వేయాలని చెబుతున్న ప్రభుత్వం, అందుకనుగుణంగా భూమిని సిద్ధం చేసుకునేందుకు ఏప్రిల్‌లో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీని పూర్తిగా విస్మరించడం విస్మయానికి గురిచేస్తోంది.



వీర జవాన్లకు మద్దతుగా..



సాక్షి, అమరావతి: పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకార చర్యగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'కు మద్దతుగా శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో పలు శాఖల అధికారులు, ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. సచివాలయం మొదటి భవనం నుంచి ప్రధాన గేటు వరకు ర్యాలీ చేపట్టారు. త్రివిధ దళాలకు మద్దతుగా 'జయహో ఆపరేషన్ సిందూర్, జై జవాన్, జై భారత్, భారత్ మాతాకీ జై' అంటూ నినాదాలు చేశారు. దేశ రక్షణలో అమరుడైన రాష్ట్రానికి చెందిన యువ సైనికుడు మురళీ నాయక్ ప్రాణత్యాగాన్ని స్మరించారు. 'మురళీ నాయక్ అమర్ రహే' అంటూ నినదించారు.

ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయుల ధర్నా

భీమవరం: ప్రభుత్వం పాఠశాల విద్యా రంగంలో అవలంబిస్తున్న అసంబద్ధ విధానాలకు వ్యతిరేకంగా శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని కలెక్టరేట్ వద్ద ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి.ప్రకాశం మాట్లాడుతూ ఒకటి నుంచి 5వ తరగతి వరకు ప్రతి ప్రాథమిక పాఠశాలను బేసిక్ ప్రాథమిక పాఠశాల లేదా మోడల్ ప్రాథమిక పాఠశాలగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రతి ప్రాథమికోన్నత పాఠశాలలో ఆరు, ఏడు తరగతులకు నాలుగు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు చేయాలని 6, 7, 8 తరగతులకు ఆరు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు చేయాలని కోరారు. ఉన్నత పాఠశాలలకు 6 నుంచి 10వ తరగతి వరకు స్కూల్ అసిస్టెంట్లతో పాటు ప్రధానోపాధ్యాయుడు, వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేయాలని, ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంతో పాటు సమాంతరంగా తెలుగు మీడియం కొనసాగించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయులకు బకాయి ఉన్న మూడు డీఏలను రిలీజ్ చేయాలని, 11వ పీఆర్సీ పూర్తయి రెండేళ్లు కావస్తున్నందున 12వ పీఆర్సీ కమిషనర్‌ను నియమించి మధ్యంతర భృతి కింద 30 శాతం ఇవ్వాలని కోరారు.



శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 22 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 64,850 మంది స్వామివారిని దర్శించుకోగా 28,816 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.7 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది.

వైభవంగా శ్రీ సాక్షి భావన్నారాయణస్వామి బ్రహ్మోత్సవాలు

పొన్నూరు: పట్టణంలోని శ్రీ సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత సాక్షి భావన్నారాయణస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం విష్ణుమూర్తి అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి రాజాధిరాజ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు.



నేటి నుంచి మీసాల వెంకన్న బ్రహ్మోత్సవాలు



కైకలూరు: ఏలూరు జిల్లా కైకలూరులో శ్రీ భూసమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామికి బొడ్డులో కత్తి, ముఖంపై మొనతేలిన మీసాలు ఉండటం ఓ వింత. అందుకే స్వామిని మీసాల వెంకన్నగా పిలుస్తారు. పౌరుషానికి ప్రతీకగా వెలిసిన స్వామివారి దేవాలయం అత్యంత పురాతనమైనది. ఈ నెల 10 నుంచి 12 వరకు స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. త్రయోహ్నిక దీక్షతో వైఖానస ఆగమోక్తం పద్ధతిలో స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు.



రేపటితో ఏపీ పీజీసెట్ దరఖాస్తుకు ఆఖరు

తిరుపతి సిటీ: ఏపీ పీజీసెట్-2025 దరఖాస్తుల స్వీకరణ గడువు ఆదివారంతో ముగియనుంది. ఈనెల 5వ తేదీతో ముగిసిన గడువును విద్యార్థుల అభ్యర్థన మేరకు ఆ నెల 11 వరకు పొడిగించారు. రూ.1000 అపరాధరుసుముతో ఈనెల 15వరకు, రూ.2 వేలు అపరాధ రుసుముతో 20 వరకు, రూ.4వేల అపరాధ రుసుముతో 24వ తేదీ వరకు, రూ.5 వేల అపరాధ రుసుముతో 25వ తేదీవరకు అవకాశం ఉంటుంది.

లాసెట్‌కు 25 వరకు గడువు



తిరుపతి సిటీ: ఉన్నత విద్యా మండలి ఆదేశాల మేరకు లాసెట్–2025–26 పరీక్ష నిర్వహణ పద్మావతి మహిళా వర్సిటీ ఆధ్వర్యంలో జరగనుందని, ఇప్పటి వరకు 26,341 దరఖాస్తులు అందాయని లాసెట్ చైర్మన్, వీసీ ప్రొఫెసర్ ఉమ తెలిపారు. లాసెట్ పరీక్ష నిర్వహణ, దరఖాస్తుల స్వీకరణపై ఆమె ×సాక్షి×తో మాట్లాడుతూ లాసెట్ దరఖాస్తుల గడువు ముగిసిందని, రూ.2వేలు అపరాధ రుసుముతో ఈనెల 11వ తేదీ వరకు, 12వ తేదీ నుంచి రూ.4 వేలు ఫైన్‌తో ఈనెల 18 వరకు, రూ.10 వేల అపరాధ రుసుముతో ఈనెల 19 నుంచి 25 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఐసెట్ పరీక్షను జూన్ 5వ తేదీన నిర్వహించనున్నట్టు తెలిపారు. అలాగే మహిళా వర్సిటీలో ఈ ఏడాది 59 కోర్సుల వరకు అందుబాటులో ఉంటాయని, వర్సిటీలో ఎన్ఈపీ విధానాన్ని అమలు చేస్తూ నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందిస్తున్నామని తెలిపారు. వర్సిటీ అందిస్తున్న అన్ని కోర్సుల్లోనూ స్కిల్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యతనిస్తూ విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు.







• వండర్ కిడ్



డీజే రినోకా... వయసు తొమ్మిదేళ్లు

క్లబ్‌లు, పబ్‌లు, వేడుకలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో డీజే (డిస్క్ జాకీ)ల పాత్ర ప్రధానం. అక్కడున్నవారి మూడ్‌కు తగ్గట్టు పాటల్ని ప్లే చేస్తూ, వారిలో జోష్ నింపడం, వారిని ఉత్సాహపరచడం డీజేల పని. కేవలం పాటలతోనే కాకుండా వారి ఆహార్యం, మాటలతో చుట్టూ ఉన్నవారిలో ఉల్లాసాన్ని నింపుతుంటారు డీజేలు. డీజే కావాలనుకునేవారికి వయోపరిమితి ఏమీ లేదు. కానీ యువతీయువకులే ఎక్కువగా డీజేలుగా ఉంటారు. జపాన్‌కు చెందిన రినోకా మాత్రం వాళ్లందరికీ భిన్నం. డీజే అయ్యేనాటికి తన వయసు ఆరేళ్లు. ప్రపంచవ్యాప్తంగా చిన్నవయసులో మహిళా డీజే అయిన ఘనత తనకే దక్కింది. డీజే అవ్వాలన్న ఆలోచన తనకెలా వచ్చింది? ఒకసారి ఆన్‌లైన్‌లో ఓ వ్యక్తి డీజేగా వ్యవహరిస్తున్న వీడియో చూసింది. అది తనకు ఆసక్తిగా అనిపించింది. తను అలా కావాలంటే ఏం చేయాలో కనుక్కుంది. అందుకు తగ్గట్టు రిసెర్చ్ చేసి అనేక విషయాలు తెలుసుకుంది. క్రిస్మస్ వేడుకల్లో తొలిసారి డీజేగా వ్యవహరించింది. అప్పటికి తన వయసు ఆరేళ్లు. తన ప్రతిభను గుర్తించి గిన్నిస్ ప్రతినిధులు 'అతి చిన్నవయసు మహిళా డీజే' అని తనకు ధ్రువపత్రం అందించారు.

• పక్షి ప్రపంచం

ప్రపంచంలోనే వేగవంతమైన పక్షులు

పక్షులు ప్రకృతి యొక్క అద్భుత సృష్టి. వాటి రంగురంగుల ఈకలు, కిలకిల శబ్దాలు మనల్ని ఎప్పుడూ ఆకర్షిస్తాయి. కానీ కొన్ని పక్షులు తమ అసాధారణ వేగంతో కూడా ఆశ్చర్యం కలిగిస్తాయి. ఆకాశంలో రాకెట్లలా దూసుకెళ్లే ఈ పక్షులు: వేటాడటం, ప్రయాణించడం లేదా ప్రమాదాల నుండి తప్పించుకోవడం కోసం తమ వేగాన్ని ఉపయోగిస్తాయి. అలాంటి వేగవంతమైన పక్షుల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.



పెరెగ్రిన్ ఫాల్కన్ (Peregrine Falcon)

ఈ పక్షి ఆకాశంలో రాజు. గంటకు 240-380 కి.మీ. వేగంతో డైవ్ చేసే పెరెగ్రిన్ ఫాల్కన్ ప్రపంచంలోనే వేగవంతమైన జీవి. వేట సమయంలో ఇది గాలిలో సైనిక విమానంలా దూసుకెళ్తుంది. దీని శరీర నిర్మాణం, పదునైన కళ్లు, బలమైన రెక్కలు దీన్ని అసాధారణ వేగంతో ఎగిరేలా చేస్తాయి.



గోల్డెన్ ఈగిల్ (Golden Eagle)

గోల్డెన్ ఈగిల్ గంటకు 128-192 కి.మీ. వేగంతో డైవ్ చేస్తుంది. దీని బలమైన రెక్కలు, శక్తివంతమైన పంజాలు వేటలో దీనికి సహాయపడతాయి. ఉత్తర అమెరికా, యూరప్లో కనిపించే ఈ పక్షి ఆకాశంలో గంభీరంగా ఎగురుతుంది.



వైట్-త్రోటెడ్ నీడిల్టైల్ (White & Throated Needletail)

ఈ చిన్న పక్షి గంటకు 170 కి.మీ. వేగంతో ఎగురుతుంది. దీని సన్నని శరీరం, పొడవైన రెక్కలు దీనికి అధిక వేగాన్ని అందిస్తాయి. ఆసియా, ఆస్ట్రేలియా ప్రాంతాల్లో ఎక్కువగా కనిపించే ఈ పక్షి తన వేగంతో కీటకాలను వేటాడుతుంది.



కామన్ స్విఫ్ట్ (Common Swift)

కామన్ స్విఫ్ట్ గంటకు 112 కి.మీ. వేగంతో ఎగరగలదు. ఈ పక్షి దాదాపు తన జీవితమంతా గాలిలోనే గడుపుతుంది. తినడం, నిద్రపోవడం,పక్షులతో జతకట్టడం కూడా ఎగురుతూ చేస్తుంది. దీని వేగం, శక్తి దీన్ని దీర్ఘ దూర ప్రయాణాలకు అనువైన పక్షిగా ఉంచుతాయి.



ఆస్ట్రేలియన్ హాబీ (Australian Hobby)

గంటకు 100 కి.మీ. వేగంతో ఎగిరే ఈ చిన్న ఫాల్కన్ ఆస్ట్రేలియా ప్రాంతాల్లో సాధారణం. ఇది చిన్న పక్షులను, కీటకాలను వేగంగా వేటాడుతుంది. దీని చురుకైన కదలికలు దీన్ని వేగవంతమైన వేటగాడిగా చేస్తాయి.

• మహనీయులు

అష్ఫఖుల్లా ఖాన్



స్వరాజ్యాన్ని కాంక్షించి

27 ఏళ్లకే నేలకొరిగాడు


భారత దేశ స్వాతంత్య్రం కోసం ఎంతోమంది ప్రాణాలు అర్పించారు. జీవితాలు త్యాగం చేశారు. అలాంటి వారిలో ఒకరు అష్ఫఖుల్లా ఖాన్. దేశం కోసం పోరాడి, 27 ఏళ్లకే తనువు చాలించిన ఆయన జీవితం అందరూ తెలుసుకోదగ్గది. 1900 అక్టోబరు 22న ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని షాజహాన్‌పూర్ జిల్లాలో ధనవంతుల కుటుంబంలో జన్మించారు అష్ఫఖుల్లాఖాన్. తల్లిదండ్రులు షఫిఖ్ ఉల్లాఖాన్, మజహరున్నీసా. అతను ఏడో తరగతి చదువుతున్న సమయంలో బ్రిటిష్ పోలీసులు అతని స్కూల్ మీద దాడి చేసి ఓ విద్యార్థిని అరెస్టు చేశారు. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పని చేయడమే అరెస్టుకు కారణమని అష్ఫఖుల్లా గుర్తించాడు. మన దేశాన్ని మరెవరో పాలించడం, వారి అధీనంలో ప్రజలు ఉండాల్సి రావడం దారుణమైన విషయమని అర్థం చేసుకున్నాడు. దీంతో రామ్‌ప్రసాద్ బిస్మిల్ అనే విప్లవకారుడిని కలిసి అతని ద్వారా సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్నాడు. ఆ సమయంలోనే మొదలైన 'హిందుస్థాన్ రిపబ్లిక్ అసోసియేషన్'లో కీలక పాత్ర పోషించాడు. 'హిందుస్థాన్ రిపబ్లిక్ అసోసియేషన్'ను నడిపేందుకు నిధుల కోసం బ్రిటిష్ వారి డబ్బును రవాణా చేస్తున్న రైలును దోపిడీ చేయాలని అసోసియేషన్ సభ్యులు నిర్ణయించారు. 1925లో అష్ఫఖుల్లాఖాన్, రామ్ ప్రసాద్ బిస్మిల్‌తోపాటు మరికొందరు కలిసి లఖ్‌నవూ వద్ద రైలు దోపిడీ చేశారు. అనంతరం బ్రిటిష్ పోలీసుల నిఘా పెరగడంతో ఖాన్ నేపాల్ వెళ్లిపోయారు. ఆపై దేశంలోని పలు ప్రాంతాలు తిరిగారు. 1926 డిసెంబరులో ఢిల్లీ పోలీసులు ఆయన్ని పట్టుకున్నారు. కేసు నమోదు చేసి ఫైజాబాద్ జైల్లో ఉంచారు. కోర్టులో కేసు విచారణ జరిగింది. బిస్మిల్, లహిరి, రోషన్‌లతోపాటు అష్ఫఖుల్లా ఖాన్‌కు కోర్టు ఉరిశిక్ష వేసింది. 1927 డిసెంబర్ 19న ఖాన్‌కు అధికారులు ఉరితీశారు. దేశానికి స్వాతంత్య్రం రావాలని కాంక్షించిన ఖాన్ 27 ఏళ్లకే ఉరికంబం ఎక్కి అసువులు బాసారు. మరో 20 ఏళ్ల తర్వాత దేశానికి స్వాతంత్య్రం సిద్ధించి ఆయన కోరిక నెరవేరింది.

తేనెలూరే తెలుగు గేయాలు



గేయాలంటే చిన్నారులకు చాలా ఇష్టం. అలతి మాటలతో సాగే గేయాలను వారు పాడుతుంటే వినేందుకు ఎంతో ముచ్చటగా ఉంటుంది. అలాంటి వారికోసం ప్రముఖ కథకుడు, నాటకకర్త, బాలసాహిత్యకారుడు నార్ల చిరంజీవి రాసిన పుస్తకం 'తెలుగుపూలు'. 1946లో తొలిసారి ప్రచురితమైన ఈ పుస్తకం నేటికీ చిన్నారులను అలరిస్తోంది. ఇందులోని గేయాలు తేటతెలుగులో తేనెలూరుతూ ఉంటాయి.

మాయలు, మంత్రాలతో అలరించే ప్రపంచం



The Lion, the Witch and the Wardrobe 'ది లయన్, ది విచ్ అండ్ ది వార్డ్‌రోబ్' అనే ఈ నవలను 1950లో సి.ఎస్.లెవిస్ అనే బ్రిటిష్ రచయిత రాశారు. ప్రపంచవ్యాప్తంగా అనేక మంది లైబ్రరీల్లో ఉండే పుస్తకం ఇది. నలుగురు చిన్నారులు కొత్తగా ఓ పాతింటికి వస్తారు. అక్కడున్న ఓ వార్డ్‌రోబ్ తలుపు తెరిస్తే ఓ కొత్త ప్రపంచానికి దారి కనిపిస్తుంది. అదే 'నార్నియా' ప్రపంచం. అక్కడ జరిగే వింతలు, విశేషాలే ఈ నవలలోని కథ.

• ఫేవరెట్ క్యారెక్టర్

హ్యారీ పోటర్ ఆఫ్ ద స్క్రీన్

మీలో ఎంతమందికి హ్యారీ పోటర్ తెలుసు? హ్యారీ పోటర్ తెలియని వాళ్ళు ఎవరున్నారు అంటారా! అవును జే.కే. రౌలింగ్ సృష్టించిన ఆ మాయా ప్రపంచాన్ని మర్చిపోగలమా! అయితే ఇక్కడ హ్యారీ పోటర్ సినిమా సీరీస్ గురించి కాకుండా ముందుగా వచ్చిన పుస్తకాల సీరీస్ గురించి కొన్ని ఆసక్తికరమైన విషయాలు తెలుసుకుందాం. 1990లో మాంచెస్టర్ నుండి రైలులో లండన్ వెళ్తున్నప్పుడు జే. కేరౌలింగ్‌కి వచ్చిన ఆలోచనే ఈ పుస్తకాలకి పునాది. మొదటి పుస్తకం మొదలు పెడుతూనే మొత్తం ఏడు పుస్తకాలుగా ఈ కథను చెప్పాలని నిర్ణయించుకుంది రచయిత్రి. అలా అనుకుని రాసిన తర్వాత మొత్తం 12 మంది ప్రచురణకర్తలు తిరస్కరించారు. ఆమె మాత్రం నిరుత్సాహపడకుండా 13వ సారి ప్రయత్నించగా బ్లూమ్స్బరీ అనే చిన్న ప్రచురణ సంస్థ దీన్ని ఆమోదించింది. అలా చిన్నగా ఒక 1000 కాపీలతో ప్రారంభమై, ప్రపంచవ్యాప్తంగా మన తెలుగుతో సహా మొత్తం 80కి పైగా భాషలలోకి అనువదింపబడి, 50 కోట్లకు పైగా అమ్ముడుపోయాయి ఈ పుస్తకాల సీరీస్. ఈ సిరీస్ పిల్లలలో పుస్తకాలు చదివే అలవాటును తిరిగి తీసుకొచ్చిన ఘనత పొందింది. ఇప్పుడు మనం 'నైంటీస్ కిడ్స్' అని పిలుస్తున్న కుర్రాళ్ళకి హ్యారీ పోటర్ అంటే ఒక ఎమోషన్.



• కథ

గొర్రె పెంపకం



అనగనగా ఓ ఊరిలో సోమయ్య అనే రైతు ఉండేవాడు. అతనికున్న రెండు ఎడ్లలో ఒకదాని పేరు రాముడు, మరొకదాని పేరు భీముడు. రాముడు తెలివి, ఓపిక కలిగిన ఎద్దు. భీముడు దూకుడు స్వభావం కలిగిన ఎద్దు. సోమయ్య ఒక్కాగానొక్క కూతురికి పెళ్లి సంబంధం కుదిరింది. మరో నెలలో పెళ్లి. ఒక రోజు సోమయ్య సంతకు వెళ్లి ఓ గొర్రె పిల్లను తీసుకొచ్చాడు. దాన్ని ఇంట్లో ఉంచి ప్రేమగా పెంచడం మొదలుపెట్టాడు. దాన్ని ఒడిలో ఉంచుకొని దాణా తినిపించడం, మాటిమాటికీ నిమురడం చేసేవాడు. ఇదంతా చూసి భీముడు ఆవేశపడేవాడు. పొలం కోసం తాము కష్టపడి రోజంతా పని చేసినా యజమాని ఏ రోజూ అలా ప్రేమగా దగ్గరకు తీయలేదని భీముడికి కోపం పెరిగింది. అసూయ పడింది. రాముడు మాత్రం ఏమీ అనకుండా మౌనంగా ఉండిపోయింది.

సోమయ్యకు ఆ గొర్రెపిల్ల రోజురోజుకూ బరువు పెరుగుతూ లావుగా మారడం చూసి సంతోషంగా ఉంది. అది గమనించిన భీముడు మరింత కోపంతో రగిలిపోయింది. రాముడు మాత్రం 'ముందు ముందు జరిగేది చూడు' అంటూ శాంతపరిచింది.

సోమయ్య కూతురి పెళ్లి రోజు



రానే వచ్చింది.

ఆరోజు సోమయ్య పెంచిన గొర్రెను కోసి, వచ్చినవారికి విందు చేశాడు. అందరూ లొట్టలేసుకుంటూ తిన్నారు. ఆ విషయాన్ని భీముడికి రాముడు చెప్పింది. ఇన్నాళ్లు ఆ గొర్రెను సోమయ్య పెంచింది ప్రేమతో కాదని, దాన్ని కోసి విందు చేయాలన్న ఆలోచనతోనే అని వివరించింది. ఊరికే కూర్చుని తిండి తినేకన్నా, పని చేస్తూ కడుపు నింపుకోవడం ఎంతో గౌరవమని వివరించింది. దీంతో భీముడు బుద్ధి తెచ్చుకుంది.

నీతి: ఎవరైనా మన మీద కారణం లేకుండా ప్రేమ చూపిస్తే అందులోని ప్రమాదాన్ని గుర్తించాలి.

• సినిమా చూద్దామా! | సోనిక్ హెడ్జ్‌హాగ్-3

సోనిక్ ని పట్టుకోగలరా..?

హాయ్ కిడ్స్.... సోనిక్ సిరీస్‌లో థర్డ్ పార్ట్ మన ముందుకొచ్చేసింది. ప్రైమ్ వీడియోలో స్ట్రీమ్ అవుతోంది. ఇది వరకు సోనిక్ సిరీస్ చూసిన వాళ్ళకు ఇదో సూపర్ సినిమా అని చెప్పవచ్చు. సోనిక్ హెడ్జ్‌హాగ్ 3 అనేది సోనిక్ వీడియో గేమ్ సిరీస్. అలాగే ఓ యాక్షన్ అడ్వెంచర్ కామెడీ మూవీ. జిమ్ క్యారీ విలన్‌గా ఈ సినిమాలో సూపర్‌గా ఉంటాడు. అందులోను జిమ్ క్యారీ ఈసారి డ్యూయల్ రోల్‌లో కనిపించబోతున్నాడు. హెడ్జ్ హాగ్‌కు సూపర్ పవర్స్ ఉంటాయి. మూవీ ఫస్ట్ షాట్‌లో ఓ ఐలాండ్ నుంచి హెడ్జ్ హాగ్ ఎలా ఎస్కేప్ అవుతుందో చూస్తే తెలుస్తుంది దాని పవర్. అలాగే ఈసారి సోనిక్ చేసే ఫైట్స్ సూపర్‌గా ఉంటాయి. జిమ్ క్యారీ డబుల్ రోల్‌తో సోనిక్ చేసే ఫీట్స్‌తో అలాగే హెడ్జ్ హాగ్ చేసే అల్లరితో మూవీ మొత్తం ఎక్సెలెంట్‌గా ఉంటుంది.

– హరికృష్ణ ఇంటూరు



• తెలుసుకుందాం

పలకా.. పలకా... నువ్వెప్పుడు పుట్టావ్?



పిల్లలకు అక్షరాభ్యాసం చేయించేటప్పుడు పలక మీద అక్షరాలు దిద్దిస్తాం. వాళ్లని బడిలో వేసేటప్పుడు తప్పకుండా పలక ఇచ్చి పంపుతాం. ఎన్ని పెద్ద పెద్ద చదువులు చదువుకున్నా మొదట అక్షరాలు దిద్దాల్సింది పలక మీదే. మరి ఆ పలక పుట్టిందెక్కడో, ఎప్పుడో తెలుసా?

నిజానికి పలక పుట్టిన కాలం ఏదనేది చరిత్రకారులు కచ్చితంగా తేల్చలేకపోయారు. అయితే 14వ శతాబ్దంలో పలక తయారై ఉండొచ్చని, 15, 16వ శతాబ్దాల నుంచి పలకలు విరివిగా వాడుతున్నట్లు అంచనా వేస్తున్నారు. 18వ శతాబ్దం నుంచి పలకల వాడుక గురించి స్పష్టమైన ఆధారాలున్నాయి. పలకలు ప్రధానంగా బంకమట్టి, పింగాణీ, చెక్క నుండి తయారు చేస్తారు. బంకమట్టిని పలక ఆకృతిగా చేసి దాన్ని కాలుస్తారు. చెక్కను పలక ఆకారంతో కోత కోసి పలకలు తయారు చేస్తారు. మన రాష్ట్రంలో ప్రకాశం జిల్లా మార్కాపురం పలకల తయారీకి ప్రసిద్ధి చెందింది. అయితే ఆధునిక కాలంలో ప్లాస్టిక్ పలకలు, ఇతర రకాల పలకలు రావడంతో చెక్క, మట్టి పలకలకు ఆదరణ తగ్గుతోంది.



బిజినెస్ రీల్

డివిడెండ్ లీడర్స్ ఇండెక్స్ షురూ
50 షేర్లతో ఏర్పాటు చేసిన బీఎస్ఈ



న్యూఢిల్లీ: స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం బీఎస్ఈ తాజాగా డివిడెండ్ లీడర్స్ 50 పేరుతో ఇండెక్స్‌ను ప్రారంభించింది. అనుబంధ సంస్థ ఆసియా ఇండెక్స్ కొత్త ఇండెక్స్‌ను ప్రవేశపెట్టింది. బీఎస్ఈ 500 ఇండెక్స్‌లో భాగమైన 50 కంపెనీలకు దీనిలో చోటు కల్పించింది. అయితే గత 10ఏళ్లలో నిరవధికంగా డివిడెండ్లు చెల్లించిన దిగ్గజాలను మాత్రమే ఇందుకు ఎంపిక చేస్తారు. ప్రతీ ఏటా డిసెంబర్‌లో ఇండెక్స్‌ను సమీక్షించనున్నట్లు ఆసియా ఇండెక్స్ వెల్లడించింది. ఈ ఇండెక్స్‌ను ఈటీఎఫ్‌లు, ఇండెక్స్ ఫండ్స్‌తోపాటు.. దేశీయంగా విభిన్న రంగాల పనితీరును మదింపు చేయవచ్చని పేర్కొంది.

జోయాలుక్కాస్ 'ద బిగ్ గోల్డ్ ఎక్స్ఛేంజ్ మేళా'



హైదరాబాద్: ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్ జోయాలుక్కాస్ 'ద బిగ్ గోల్డ్ ఎక్స్ఛేంజ్ మేళా' ప్రకటించింది. ఇందులో భాగంగా పాత బంగారం మార్పిడి(ఎక్స్ఛేంజ్)పై ప్రతి గ్రాముకు రూ.100 అదనంగా పొందవచ్చు. ఇప్పటికే ప్రారంభమైన ఈ ఆఫర్ మే 25 వరకు అందుబాటులో ఉంటుంది. 'కస్టమర్లకు మరింత విలువ సృష్టించేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తాము. దగ్గర్లో ఉన్న జోయాలుక్కాస్ షోరూంను సందర్శించి బంగారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకొండి' అని కంపెనీ ఎండీ చైర్మన్ జాయ్ అలుక్కాస్ తెలిపారు.

భారత్ రేటింగ్ అప్
అప్‌గ్రేడ్ చేసిన మార్నింగ్‌స్టార్ డీబీఆర్ఎస్

న్యూఢిల్లీ: భారత సావరీన్ రేటింగ్‌ను స్థిరమైన అంచనాలతో 'బీబీబీ' (కనిష్ట) స్థాయి నుంచి 'బీబీబీ' స్థాయికి అప్‌గ్రేడ్ చేసినట్లు గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీ మార్నింగ్‌స్టార్ డీబీఆర్ఎస్ వెల్లడించింది. మౌలిక సదుపాయాలపై పెట్టుబడులు, డిజిటైజేషన్, స్థూల ఆర్థిక స్థిరత్వం తదితర నిర్మాణాత్మక సంస్కరణలు ఇందుకు కారణమని తెలిపింది. అమెరికా టారిఫ్‌లు వంటి వెలుపలి రిస్కులు పెరగడం వల్ల రాబోయే త్రైమాసికాల్లో వృద్ధిపై ప్రభావం పడినా, కేవలం వాణిజ్యంపైనే ఆధారపడకపోవడం వల్ల భారత ఎకానమీ మెరుగ్గానే ఉండగలదని పేర్కొంది. అధిక స్థాయి పొదుపు, సానుకూల ప్రజా గణాంకాలు, సాంకేతికతను సత్వరమే అందిపుచ్చుకోగలిగే సామర్థ్యాలు మొదలైన వాటి దన్నుతో మధ్యకాలికంగా భారత్ వృద్ధి అవకాశాలు పటిష్టంగానే ఉన్నాయని వివరించింది. ఇప్పటికే ఫిచ్, ఎస్అండ్‌పీ రేటింగ్ స్థాయుల తరహాలోనే మార్నింగ్‌స్టార్ డీబీఆర్ఎస్ నుంచి కూడా రేటింగ్ లభించినట్లు ఆర్థిక శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)
10-5-2025

విశాఖ	505-00
చిత్తూరు	573-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	500-00
విజయవాడ	500-00
రిటైల్ ధర (డజను)	66.00
హైదరాబాద్	495-00
వరంగల్	497-00
రిటైల్ ధర	5.55

నిఫ్టీ 50
టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TITAN	3,509.90	4.17
LT	3,451.40	3.84
TATAMOTORS	709	3.83
BEL	316.15	2.93
SBIN	780.5	1.5

నిఫ్టీ 50
టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ICICIBANK	1,389.00	-3.24
POWERGRID	299.8	-2.74
GRASIM	2,638.90	-2.22
ULTRACEMCO	11,373.00	-2.22
SHRIRAMFIN	603	-2.08

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,336
ఎన్ఎస్ఈ	94,551
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,98,316
ఎఫ్ఐఐ	- 3,799
డీఐఐ	+ 7,278

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	60.96	$ 59.91
బ్రెంట్	63.88	$ 62.84

ఈక్విటీ ఫండ్స్‌లోకి రూ.24,269 కోట్లు

- అల్‌టైమ్ గరిష్టానికి సిప్ పెట్టుబడులు
- డెట్ ఫండ్స్‌కు మళ్లీ ఆదరణ
- యాంఫి గణాంకాలు విడుదల

ఏప్రిల్ నెలలో స్వల్ప క్షీణత



న్యూఢిల్లీ: ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లోకి పెట్టుబడుల రాక ఏప్రిల్ నెలలో స్వల్పంగా క్షీణించింది. మార్చి నెలలో వచ్చిన పెట్టుబడులు రూ.25,082 కోట్లతో పోల్చి చూస్తే 3 శాతం క్షీణించి రూ.24,269 కోట్లుగా ఉన్నాయి. ఏప్రిల్‌లో ఈక్విటీ మార్కెట్లు నష్టాల నుంచి కోలుకున్నప్పటికీ పెట్టుబడులు తగ్గడం గమనార్హం. ఏప్రిల్‌లో బీఎస్ఈ సెన్సెక్స్ 3.65 శాతం, ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 సూచీ 3.46 శాతం చొప్పున పెరిగాయి. మరోవైపు సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) ద్వారా ఏప్రిల్ నెలలో వచ్చిన పెట్టుబడులు ఆల్‌టైమ్ గరిష్టానికి చేరాయి. ఈ మేరకు ఏప్రిల్ నెల గణాంకాలను మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) విడుదల చేసింది. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లోకి నెలవారీ పెట్టుబడుల రాక తగ్గడం వరుసగా నాలుగో నెలలోనూ నమోదైంది. అయినప్పటికీ ఈక్విటీ పథకాల్లోకి వరుసగా 50వ నెలలోనూ నికర సానుకూల పెట్టుబడులు వచ్చాయి. ఈక్విటీ ఫండ్స్‌లోకి పెట్టుబడులు రాక తగ్గడం అన్నది యూఎస్ టారిఫ్‌ల పట్ల అనిశ్చితి, డెట్, హైబ్రిడ్ పెట్టుబడులకు ఇన్వెస్టర్లు ప్రాధాన్యం ఇవ్వడం కారణమని ఈక్విరస్ వెల్త్ ఎండీ అంకుర్ పుంజ్ తెలిపారు.

సిప్ పెట్టుబడులు రూ.26,632 కోట్లు

ఇన్వెస్టర్లు దీర్ఘకాల లక్ష్యాల కోసం చేసే సిప్ పెట్టుబడులు ఏప్రిల్ నెలలో రూ.26,632 కోట్లుగా ఉన్నాయి. ఒక నెలలో సిప్ గరిష్ఠ పెట్టుబడులు ఇదే ప్రథమం. మార్చి నెలలో సిప్ పెట్టుబడులు రూ.25,926 కోట్లతో పోల్చి చూస్తే 3 శాతం పెరిగాయి. ఏప్రిల్‌లో కొత్తగా 46.01 లక్షల సిప్ ఖాతాలు ప్రారంభమయ్యాయి. మార్చిలో కొత్త సిప్ ఖాతాలు 40.18 లక్షలుగా ఉన్నాయి. మొత్తం సిప్ ఖాతాలు 8.38 కోట్లకు చేరాయి. సిప్ నిర్వహణ ఆస్తుల విలువ మార్చి చివరికి రూ.13.35 లక్షల కోట్లుగా ఉంటే, ఏప్రిల్ చివరికి రూ.13.89 లక్షల కోట్లకు పెరిగింది. ''ఏప్రిల్‌లో సిప్ పెట్టుబడులు ఆల్‌టైమ్ గరిష్ఠం అయిన రూ.26,632 కోట్లకు చేరాయి. మ్యూచువల్ ఫండ్స్‌ను క్రమశిక్షణతో కూడిన దీర్ఘకాల పొదుపు సాధనంగా ఇన్వెస్టర్లు పరిగణిస్తుండడం వల్లే పెట్టుబడులు ఇలా క్రమంగా పెరుగుతున్నాయి''అని యాంఫి సీఈవో వెంకట్ చలసాని పేర్కొన్నారు. అన్ని మార్కెట్ సైకిల్స్‌లోనూ పెట్టుబడులు కొనసాగించడానికి ఉన్న ప్రాధాన్యం పట్ల ఇన్వెస్టర్లలో అవగాహన పెరుగుతున్నట్టు చెప్పారు.

విభాగాల వారీ పెట్టుబడులు

- ఏప్రిల్‌లో డెట్ ఫండ్స్‌లోకి మొత్తంగా రూ.2.19 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. మార్చిలో రూ.2.02 లక్షల కోట్లను ఉపసంహరణతో పోలిస్తే సీన్ రివర్స్ అయింది.
- డెట్‌లోని మొత్తం 16 విభాగాలకు గాను 12 రకాల పథకాల్లోకి పెట్టుబడులు సానుకూలంగా ఉన్నాయి. అత్యధికంగా రూ.1.18 లక్షల కోట్లు లిక్విడ్ ఫండ్స్‌లోకే వచ్చాయి.
- మొత్తం మీద అన్ని రకాల మ్యూచువల్ ఫండ్స్‌లోకి ఏప్రిల్‌లో రూ.2.77 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. మార్చిలో రూ.1.64 లక్షల కోట్లు బయటకు వెళ్లిపోవడం గమనార్హం.
- దీంతో మ్యూచువల్ ఫండ్స్ సంస్థల నిర్వహణలోని మొత్తం ఆస్తుల (అన్ని విభాగాలు సహా) విలువ ఏప్రిల్ చివరికి రూ.70 లక్షల కోట్లకు చేరింది. మార్చి చివరికి ఇది రూ.65.74 లక్షల కోట్లుగా ఉంది.
- ఈక్విటీ పథకాల్లోకి ఈ ఏడాది ఫిబ్రవరిలో రూ.29,303 కోట్లు, జనవరిలో రూ.39,688 కోట్లు, 2024 డిసెంబర్‌లో రూ.41,156 కోట్ల చొప్పున వచ్చాయి.
- ఈక్విటీ విభాగంలో ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ అత్యధికంగా రూ.5,542 కోట్ల పెట్టుబడులను ఏప్రిల్‌లో ఆకర్షించాయి.
- మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఫండ్స్‌కు ఆదరణ కొనసాగింది. మిడ్‌క్యాప్ ఫండ్స్‌లోకి రూ.3,314 కోట్లు, స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లోకి రూ.4,000 కోట్ల చొప్పున పెట్టుబడులు వచ్చాయి.
- లార్జ్‌క్యాప్ ఫండ్స్‌లోకి రూ.2,671 కోట్లు వచ్చాయి. మార్చి నెలలో ఈ విభాగంలోకి వచ్చిన పెట్టుబడులు రూ.2,479 కోట్లుగా ఉన్నాయి.
- హైబ్రిడ్ ఫండ్స్ రూ.14,247 కోట్లను ఆకర్షించాయి. మార్చి నెలలో ఈ పథకాల నుంచి ఇన్వెస్టర్లు రూ.946 కోట్లను ఉపసంహరించుకున్నారు.

గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో అమ్మకాలు

గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (గోల్డ్ ఈటీఎఫ్‌లు) నుంచి ఇన్వెస్టర్లు రూ.6 కోట్లను ఉపసంహరించుకున్నారు. మార్చిలోనూ గోల్డ్ ఈటీఎఫ్‌ల నుంచి రూ.77 కోట్లకు వెనక్కి తీసుకోవడం గమనార్హం. బంగారం ధరలు ఆల్‌టైమ్ గరిష్టానికి చేరుకోవడంతో ఇన్వెస్టర్లు తాజా పెట్టుబడులు నిలిపివేయడంతోపాటు లాభాల స్వీకరణకు మొగ్గు చూపించినట్టు తెలుస్తోంది.

స్టార్టప్‌లకు మరింత సాయం

- క్రెడిట్ గ్యారంటీ పథకం సవరణ
- రుణ పరిమితి రూ.20 కోట్లకు పెంపు
- ప్రకటించిన డీపీఐఐటీ



న్యూఢిల్లీ: 'క్రెడిట్ గ్యారంటీ స్కీమ్' (సీజీఎస్ఎస్) సవరణతో స్టార్టప్‌లకు రుణ వితరణ సులభతరం అవుతుందని.. పరిశోధన, అభివృద్ధికి (ఆర్అండ్‌డీ) మరింత ఆర్థిక సాయం లభిస్తుందని, గొప్ప టెక్నాలజీ ఆవిష్కరణకు ఊతం లభిస్తుందని కేంద్ర పారిశ్రామిక ప్రోత్సాహక, అంతర్గత వాణిజ్య విభాగం (డీపీఐఐటీ) పేర్కొంది. సవరించిన సీజీఎస్ఎస్‌కు గురువారం కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపడం గమనార్హం. దీంతో ఒక్కో స్టార్టప్‌కు హామీతో కూడిన రుణ వితరణ పరిమితి రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్లకు పెరిగింది. ఇదంతా కూడా హామీలేని రుణమే. ''ఈ పథకం విస్తరణతో స్టార్టప్‌లకు రుణ వితరణ రిస్కులు మరింత తగ్గుతాయి. ఆర్అండ్‌డీ, ప్రయోగాలు, అత్యాధునిక ఆవిష్కరణలు, సాంకేతికతలను సృష్టించడానికి కావాల్సిన ఆర్థిక మద్దతు లభిస్తుంది''అని డీపీఐఐటీ ప్రకటించింది. స్టార్టప్‌కు ఇచ్చే రుణాలు రూ.10 కోట్ల వరకు ఉంటే వాటికి ప్రభుత్వ హామీ 85 శాతంగా, అంతకుమించిన రుణాలకు 75 శాతంగా ఉంటుందని తెలిపింది. దేశంలో స్టార్టప్‌లకు అనుకూలమైన వాతావరణం కల్పించేందుకు వీలుగా 2016 జనవరి 16న కేంద్రం స్టార్టప్ ఇండియా కార్యక్రమాన్ని చేపట్టడం తెలిసిందే. ఇందులో భాగంగానే 2022 అక్టోబర్ 6న సీజీఎస్ఎస్ పథకాన్ని తీసుకొచ్చింది. స్టార్టప్‌లకు షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంక్‌లు, ఆల్ ఇండియా ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూషన్లు, ఎన్‌బీఎఫ్‌సీలు మంజూరు చేసే రుణ సదుపాయాలకు నిర్దేశిత మేర ప్రభుత్వం హామీ కల్పించింది. ఈ ఏడాది జనవరి నాటికి 1.61 లక్షల స్టార్టప్‌లను ప్రభుత్వం గుర్తించడం గమనార్హం.

స్పెక్ట్రం చార్జీ @ 4 శాతం ఆదాయం

శాట్‌కామ్ సంస్థలపై ట్రాయ్ సిఫార్సులు



న్యూఢిల్లీ: స్టార్‌లింక్‌లాంటి శాటిలైట్ కమ్యూనికేషన్ (శాట్‌కామ్) కంపెనీలు అడుగుతున్న దానికంటే అధిక స్థాయిలో స్పెక్ట్రం చార్జీలు విధించేలా కేంద్రానికి టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ సిఫార్సులు చేసింది. కంపెనీల సవరించిన ఆదాయాల్లో (ఏజీఆర్) 4 శాతాన్ని చార్జీగా నిర్ణయించాలని పేర్కొంది. ప్రతి మెగాహెట్జ్‌కి వార్షికంగా విధించే రూ. 3,500 స్పెక్ట్రం చార్జీకి ఇది అదనంగా ఉంటుంది. ఇక, పట్టణ ప్రాంతాల్లో ఉపగ్రహ ఆధారిత బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ సర్వీసులు అందించే ఆపరేటర్లు, ప్రతి యూజరుపై అదనంగా ఏటా రూ. 500 చెల్లించాల్సి ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో సేవలకు మాత్రం అదనంగా చార్జీలేమీ ఉండవు. టెలికం శాఖకు (డాట్) ట్రాయ్ ఈ మేరకు సిఫార్సులు చేసింది. స్పెక్ట్రంను కంపెనీలకు అయిదేళ్ల పాటు కేటాయించాలని, ఆ తర్వాత మరో రెండేళ్లు పొడిగించాలని ట్రాయ్ సూచించింది. శాట్‌కామ్ సర్వీసులు ప్రారంభమైతే టెలికం నెట్‌వర్క్‌లు లేని మారుమూల ప్రాంతాల్లో కూడా కనెక్టివిటీని అందుబాటులోకి తెచ్చేందుకు వీలవుతుందని ట్రాయ్ చైర్మన్ అనిల్ కుమార్ లాహోటీ తెలిపారు.

శాట్‌కామ్ కంపెనీలు అభ్యర్థిస్తున్న రేటు కంటే ట్రాయ్ సిఫార్సు చేసిన చార్జీలు గణనీయంగా అధికంగా ఉండటం గమనార్హం. స్పెక్ట్రం చార్జీని ఏజీఆర్‌లో 1 శాతం కన్నా తక్కువగానే ఉంచాలని, అదనంగా చార్జీలేమీ విధించొద్దని ట్రాయ్‌తో సంప్రదింపుల సందర్భంగా స్టార్‌లింక్, అమెజాన్‌కి చెందిన క్విపర్ సిస్టమ్స్ కోరాయి. ఎయిర్‌టెల్ భాగస్వామిగా ఉన్న యూటెల్‌శాట్ వన్‌వెబ్, జియో ప్లాట్‌ఫామ్స్‌కు ఇప్పటికే శాట్‌కామ్ సేవల లైసెన్సులు లభించాయి. స్టార్‌లింక్ తుది లైసెన్సు తీసుకునే దశలో ఉంది.

సాయుధ బలగాలకు కార్పొరేట్ల మద్దతు
అంబానీ, అదానీ తదితర దిగ్గజాల ప్రకటనలు

న్యూఢిల్లీ: పాకిస్తాన్‌తో పోరాడుతున్న భారత సాయుధ బలగాలకు దేశీ కార్పొరేట్ దిగ్గజాలు మద్దతు పలికారు. ముకేశ్ అంబానీ, గౌతమ్ అదానీ, అనిల్ అగర్వాల్ తదితరులు ఈ మేరకు ప్రకటనలు చేశారు. 'ఆపరేషన్ సిందూర్‌ను నిర్వహిస్తున్న భారత సాయుధ బలగాలు మనకు ఎంతో గర్వకారణం. అన్ని రకాల ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు జరుగుతున్న పోరులో యావద్దేశం ఒక్కతాటిపై ఉంది.'అని రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత అంబానీ ఒక ప్రకటనలో తెలిపారు. 'భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శనంగా ఉండే భారతదేశ ప్రజల ఐక్యత, సామర్థ్యాలను ఇలాంటి సందర్భాలు ప్రపంచానికి చాటి చెబుతాయి. సాయుధ బలగాలకు యావద్దేశం సంఘీభావం ప్రకటిస్తోంది' అని అదానీ గ్రూప్ చీఫ్ గౌతం అదానీ మైక్రోబ్లాగింగ్ సైట్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'దేశ నాయకత్వానికి, వీర సాయుధ బలగాలకు మనస్ఫూర్తిగా సంఘీభావం ప్రకటిస్తున్నాను. న్యాయబద్ధంగా ఉండే భారతదేశం ఎప్పట్లాగే విజేతగా నిలుస్తుంది' అని మైనింగ్ దిగ్గజం అనిల్ అగర్వాల్ పోస్ట్ చేశారు.

అంచనాలు మించిన చైనా ఎగుమతులు

- ఏప్రిల్‌లో 8 శాతం పెరుగుదల
- అమెరికాకు మాత్రం 21 శాతం డౌన్
- భారత్‌కు 16 శాతం అధికం



బీజింగ్: అమెరికా భారీ టారిఫ్‌లతో బాదేసినా, ఎగుమతుల పరంగా చైనా తన బలాన్ని చాటుకుంది. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో అంచనాలకు మించి ఎగుమతులు నమోదు చేసింది. ఏప్రిల్ నెలలో ఎగుమతులు క్రితం ఏడాది ఇదే నెలతో పోల్చి చూస్తే 8.1 శాతం వృద్ధితో 315.69 బిలియన్ డాలర్లుగా ఉన్నట్టు చైనా ప్రభుత్వం ప్రకటించింది. అమెరికాకు ఎగుమతులు 21 శాతం తగ్గినప్పటికీ, చైనా ఎగుమతుల్లో సానుకూల వృద్ధిని నమోదు చేయడం విశేషం. ఏప్రిల్ నెలలో చైనా ఎగుమతులు కేవలం 2 శాతమే పెరగొచ్చన్నది విశ్లేషకుల అంచనాగా ఉంది. ఇక ఈ ఏడాది మార్చి నెలలో చైనా ఎగుమతుల్లో వృద్ధి 12.4 శాతంతో పోల్చి చూసినప్పుడు ఏప్రిల్‌లో కొంత నిదానించినట్టు తెలుస్తోంది. చైనా దిగుమతులు 0.2 శాతం తగ్గాయి. చైనా ఉత్పత్తులపై టారిఫ్‌లను అమెరికా 145 శాతానికి పెంచడం తెలిసిందే. దీనికి ప్రతిగా అమెరికా ఎగుమతి చేసే వాటిపై 125 శాతం టారిఫ్‌లను చైనా అమలు చేస్తోంది. స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో యూఎస్, చైనా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యంపై చర్చలు జరగడానికి సరిగ్గా ఒక రోజు ముందు ఈ డేటా విడుదల కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

యూఎస్‌తో తగ్గిన వాణిజ్య మిగులు

అమెరికాతో చైనాకి వాణిజ్య మిగులు 2024 ఏప్రిల్ నాటికి 27.2 బిలియన్ డాలర్లుగా ఉంటే, 2025 ఏప్రిల్ నాటికి 20.5 బిలియన్ డాలర్లకు తగ్గింది. గడిచిన నాలుగు నెలల్లో అమెరికాకు చైనా ఎగుమతులు 2.5 శాతం క్షీణించాయి. అదే సమయంలో యూఎస్ నుంచి దిగుమతులు 4.7 శాతం తగ్గాయి. అమెరికాకు ఎగుమతులు తగ్గిన నేపథ్యంలో ఇతర దేశాలకు ఎగుమతులను పెంచుకోవడం ద్వారా ఏప్రిల్‌లో వృద్ధి నమోదైనట్టు తెలుస్తోంది. దక్షిణాసియా దేశాలకు చైనా ఎగుమతులు ఏప్రిల్‌లో 11.5 శాతం పెరిగాయి. లాటిన్ అమెరికాకు 11.5 శాతం, భారత్‌కు విలువ పరంగా 16 శాతం చొప్పున పెరిగాయి. ఆఫ్రికాకు సైతం 15 శాతం, వియత్నాంకు 18 శాతం, థాయిలాండ్‌కు 20 శాతం చొప్పున ఎగిశాయి. చైనా ఎగుమతుల వృద్ధి ఆర్థిక విశ్లేషకులను సైతం ఆశ్చర్యపరిచింది. ఎగుమతుల డేటా ఆశ్చర్యకరంగా ఉందని, తన అంచనా 2-3 శాతం మించి వృద్ధి నమోదైనట్టు సీనియర్ చైనా ఆర్థికవేత్త (ఎకనామిక్స్ ఇంటెలిజెన్స్ యూనిట్) షు టియాంచెన్ తెలిపారు. యూఎస్ టారిఫ్‌ల పూర్తి ప్రభావం డేటాలో ఇంకా ప్రతిఫలించనట్టు ఉందన్నారు. యూరేషియా గ్రూప్‌లో చైనా డైరెక్టర్‌గా ఉన్న డాన్ వాంగ్ సైతం బలమైన ఎగుమతుల వృద్ధిని ఊహించలేదన్నారు.

చైనా సోలార్ గ్లాస్‌పై యాంటీ డంపింగ్ సుంకాలు

అయిదేళ్ల పాటు అమల్లో

న్యూఢిల్లీ: చైనా, వియత్నాం నుంచి దిగుమతయ్యే నిర్దిష్ట రకం సోలార్ గ్లాస్‌పై టన్నుకు 570 డాలర్ల నుంచి 664 డాలర్ల వరకు యాంటీ-డంపింగ్ సుంకాలు విధిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఇవి అయిదేళ్ల పాటు అమల్లో ఉంటాయని ఆర్థిక శాఖ ఒక నోటిఫికేషన్‌లో వెల్లడించింది. ఈ రెండు దేశాల నుంచి చౌకగా దిగుమతయ్యే ఉత్పత్తుల నుంచి దేశీ తయారీ సంస్థలకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. సాధారణంగా సోలార్ ప్యానెల్స్‌లో ఉపయోగించే ఈ తరహా గాజును సోలార్ గ్లాస్, సోలార్ పీవీ గ్లాస్ తదితర పేర్లతో వ్యవహరిస్తారు. ఇటీవలి కాలంలో చైనా, వియత్నాం నుంచి ఈ గ్లాస్ దిగుమతులు గణనీయంగా పెరిగినట్లు వాణిజ్య శాఖలో భాగమైన డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ట్రేడ్ రెమెడీస్ (డీజీటీఆర్), దేశీ పరిశ్రమ తరఫున నిర్వహించిన విచారణలో వెల్లడైంది. డీజీటీఆర్ సిఫార్సుల మేరకు ప్రభుత్వం సుంకాల విధింపు నిర్ణయం తీసుకుంది.

మార్చి త్రైమాసిక ఫలితాలు

బ్రిటానియా లాభం ప్లస్

- క్యూ4లో రూ. 559 కోట్లు
- షేరుకి రూ. 75 డివిడెండ్



న్యూఢిల్లీ: బ్యాకరీ ఫుడ్ దిగ్గజం బ్రిటానియా ఇండస్ట్రీస్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 4 శాతం వృద్ధితో రూ. 559 కోట్లను అధిగమించింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 537 కోట్లు ఆర్జించింది. డిమాండ్ మందగమనం ప్రభావం చూపింది. కంపెనీ బోర్డు వాటాదారులకు ఒక్కో షేరుకి రూ. 75 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. అయితే మొత్తం ఆదాయం 9 శాతం ఎగసి రూ. 4,432 కోట్లను తాకింది. 2023-24 క్యూ4లో రూ. 4,069 కోట్ల టర్నోవర్ అందుకుంది. మొత్తం వ్యయాలు 10 శాతంపైగా పెరిగి రూ. 3,739 కోట్లకు చేరాయి. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 2 శాతం పుంజుకుని రూ. 2,178 కోట్లను తాకింది. 2023-24లో రూ. 2,134 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం 7 శాతం బలపడి రూ. 18,170 కోట్లుగా నమోదైంది. కంపెనీ సీఈవోగా వరుణ్ బెర్రీ 2025 మే 8 నుంచి బాధ్యతలు చేపట్టినట్లు బ్రిటానియా బోర్డు పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో బ్రిటానియా షేరు బీఎస్ఈలో 0.6 శాతం బలపడి రూ. 5,425 వద్ద ముగిసింది.

ఏబీబీ లాభం ఫ్లాట్

క్యూ1లో రూ. 474 కోట్లు



న్యూఢిల్లీ: ఆటోమేషన్, ఎలక్ట్రిఫికేషన్ దిగ్గజం ఏబీబీ ఇండియా ప్రస్తుత ఏడాది(2025) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ1)లో నికర లాభం 3 శాతం వృద్ధితో రూ. 474 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2024) ఇదే కాలంలో రూ. 460 కోట్లు ఆర్జించింది. కంపెనీ జనవరి-డిసెంబర్ కాలాన్ని ఆర్థిక సంవత్సరంగా పరిగణిస్తుంది. మొత్తం ఆదాయం సైతం రూ. 3,080 కోట్ల నుంచి రూ. 3,160 కోట్లకు బలపడింది. 2025 మార్చికల్లా రూ. 5,756 కోట్ల నగదు నిల్వ ఉన్నట్లు కంపెనీ వెల్లడించింది. దేశీయంగా 75వ వసంతంలో అడుగుపెట్టిన సందర్భంలో పటిష్ట పనితీరు చూపడం గర్వించదగ్గ విషయమని కంపెనీ ఎండీ సంజీవ్ శర్మ పేర్కొన్నారు. తాజా సమీక్షా కాలంలో రూ. 3,751 కోట్ల విలువైన ఆర్డర్లు అందుకున్నట్లు తెలియజేశారు. డేటా సెంటర్లు, పీఎస్‌యూ ఎనర్జీ, ఎలక్ట్రిసిటీ కంపెనీల నుంచి భారీ కాంట్రాక్టులు లభించినట్లు వెల్లడించారు. వెరసి పూర్తి చేయవలసిన ఆర్డర్ల విలువ రూ. 9,958 కోట్లకు చేరినట్లు తెలియజేశారు.

ఫలితాల నేపథ్యంలో ఏబీబీ షేరు బీఎస్ఈలో 3.2 శాతం బలపడి రూ. 5,443 వద్ద ముగిసింది.

చోళమండలం ఫైనాన్షియల్ పటిష్ట పనితీరు

మార్చి త్రైమాసికంలో రూ.1,362 కోట్ల లాభం



చెన్నై: ఎన్‌బీఎఫ్‌సీ సంస్థ చోళమండలం ఫైనాన్షియల్ హోల్డింగ్స్ లిమిటెడ్ మార్చితో ముగిసిన త్రైమాసికంలో పటిష్ట పనితీరు సాధించింది. కన్సాలిడేటెడ్ లాభం రూ.1,362 కోట్లకు వృద్ధి చెందింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో లాభం రూ.1,144 కోట్లుగానే ఉంది. మొత్తం ఆదాయం ఇదే కాలంలో రూ.7,157 కోట్ల నుంచి రూ.9,009 కోట్లకు పెరిగింది. 2024-25 పూర్తి ఆర్థిక సంవత్సరానికి రూ.4,740 కోట్ల లాభాన్ని కంపెనీ ప్రకటించింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.3,850 కోట్లుగా ఉంది. ఆదాయం రూ.26,087 కోట్ల నుంచి రూ.33,460 కోట్లకు పెరిగింది. అనుబంధ సంస్థ చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ లిమిటెడ్ నిర్వహణలోని ఆస్తుల విలువ 30 శాతం పెరిగి రూ.1,99,876 కోట్లుగా నమోదైంది. చోళమండలం ఎంఎస్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ గ్రాస్ రిటర్న్ ప్రీమియం రూ.8,564 కోట్లకు చేరింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం చివరికి ఉన్న రూ.7,542 కోట్లతో పోల్చి చూస్తే 14 శాతం పెరిగింది. వాటాదారుల వద్దనున్న ప్రతీ షేరుకు రూ.1.30 చొప్పున డివిడెండ్ పంపిణీకి కంపెనీ బోర్డు నిర్ణయించింది.

ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో కంపెనీ షేరు 6 శాతం నష్టపోయి రూ.1,716 వద్ద స్థిరపడింది.

రాణించిన ఐఐఎఫ్‌సీఎల్

2024-25లో రూ.2,165 కోట్ల లాభం



న్యూఢిల్లీ: ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ (ఐఐఎఫ్‌సీఎల్) 2024-25 ఆర్థిక సంవత్సరంలో బలమైన పనితీరు నమోదు చేసింది. లాభం అంతక్రితం ఆర్థిక సంవత్సరం (2023-24)తో పోల్చి చూస్తే 39 శాతం వృద్ధితో రూ.2,165 కోట్లుగా నమోదైంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో లాభం రూ.1,552 కోట్లుగా ఉంది. నికర విలువ 15 శాతం పెరిగి రూ.16,395 కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా రూ.51,124 కోట్ల రుణాలు మంజూరు చేసింది. దీంతో కలిపితే మొత్తం రుణాలు రూ.3.06 లక్షల కోట్లకు చేరాయి. వ్యాపార వృద్ధి అవసరాలకు అనుగుణంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.30,000 కోట్ల నిధులు సమీకరించాలనే ప్రణాళికతో ఉన్నట్టు కంపెనీ ప్రకటించింది. కంపెనీ రుణ ఆస్తుల నాణ్యత బలపడింది. స్థూల ఎన్‌పీఏలు అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో ఉన్న 1.61 శాతం నుంచి 1.11 శాతానికి దిగొచ్చాయి. నికర ఎన్‌పీఏలు సైతం 0.46 శాతం నుంచి 0.35 శాతానికి పరిమితమయ్యాయి.

సాక్షి ప్లస్
శనివారం। 10-5-2025

ధనాధన్‌గా దూసుకొచ్చారు

ఐపీఎల్‌లో
యువ క్రికెటర్ల మెరుపులు
భవిష్యత్తుపై భరోసా పెంచుతున్న ఆయుశ్, ప్రియాన్ష్, వైభవ్
నిలకడగా రాణిస్తున్న అభిషేక్ పొరెల్, ప్రభ్‌సిమ్రన్ సింగ్




14 ఏళ్ల వయసులోనే ఐపీఎల్‌లో కోట్లు కొల్లగొట్టిన బిహార్ బుడ్డోడు వైభవ్ సూర్యవంశీ... బరిలోకి దిగిన మూడో మ్యాచ్‌లోనే రికార్డు సెంచరీతో తన పేరు మారుమోగేలా చేసుకున్నాడు!

ప్రధాన ఆటగాళ్లంతా విఫలమవుతున్న చోట... నేనున్నానంటూ బాధ్యతలు భుజానికెత్తుకున్న 17 ఏళ్ల ఆయుశ్ మాత్రే ఆడింది తక్కువ మ్యాచ్‌లే అయినా... చెన్నై భవిష్యత్తు ఆశాకిరణంలా కనిపిస్తున్నాడు!

పంజాబ్ కింగ్స్ ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్ సింగ్ ధాటిగా ఆడుతూ ప్రత్యర్థి బౌలర్లకు గుబులు పుట్టిస్తుంటే... ఢిల్లీ క్యాపిటల్స్ ఓపెనర్ అభిషేక్ పొరెల్ తన నిలకడతో ఆకట్టుకున్నాడు. తాజా ఐపీఎల్ సీజన్‌లో మంచి ప్రదర్శనతో ఆకట్టుకున్న అన్‌క్యాప్డ్ ఓపెనర్లపై కథనం...

–సాక్షి, క్రీడా విభాగం

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ సీజన్ వారం రోజులపాటు వాయిదా పడింది. ఇప్పటి వరకు 58 మ్యాచ్‌లు జరిగాయి. మరో 12 లీగ్ మ్యాచ్‌లు... ఆ తర్వాత 4 ప్లే ఆఫ్ మ్యాచ్‌లు జరగాల్సి ఉన్నాయి. వారం రోజుల తర్వాత అప్పటి పరిస్థితులను బట్టి ఐపీఎల్ టోర్నీ ఎప్పుడు నిర్వహించాలనే విషయంపై బీసీసీఐ తుది నిర్ణయం తీసుకోనుంది. ఇప్పటి వరకు జరిగిన మ్యాచ్‌ల్లో స్టార్ ఆటగాళ్లకంటే ఏమాత్రం అంచనాలు లేని యువ ఆటగాళ్లు ఆకట్టుకున్నారు. హేమాహేమీలతో పోటీపడుతూ... తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ ఏడాది ముఖ్యంగా యువ ఓపెనర్ల జోరు ఎక్కువ కనిపిస్తోంది. వైభవ్ సూర్యవంశీ (రాజస్తాన్ రాయల్స్), ఆయుశ్ మాత్రే (చెన్నై సూపర్ కింగ్స్), అభిషేక్ పొరెల్ (ఢిల్లీ క్యాపిటల్స్)... ప్రియాన్ష్ ఆర్య, ప్రభ్ సిమ్రన్ సింగ్ (పంజాబ్ కింగ్స్) ఈ కోవలోకే వస్తారు. టీమిండియా గడప తొక్కాలంటే... ఐపీఎల్‌లో రాణించడం తప్పనిసరిలా మారిపోయిన ప్రస్తుతం తరుణంలో ఈ సీజన్‌లో ఈ ఐదుగురు ఆటగాళ్లు తమదైన ముద్ర వేస్తున్నారు. ఇందులో ఒక్కొక్కరి శైలి ఒక్కో రకం కాగా... అందరి లక్ష్యం భారీగా పరుగులు సాధించడమే. తాజా సీజన్‌లో అన్‌క్యాప్డ్ (జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించని ఆటగాళ్లు) ప్లేయర్లుగా బరిలోకి దిగి పేసర్లు, స్పిన్నర్లు అనే తేడా లేకుండా విరుచుకుపడుతున్న ఈ యువతరం... భారత క్రికెట్ భవిష్యత్తుపై మరింత భరోసా పెంచుతోంది.



ఆహో... ఆయుశ్

ముంబైకి చెందిన 17 ఏళ్ల ఆయుశ్ మాత్రేకు అనూహ్యంగా ఐపీఎల్‌లో ఆడే అవకాశం దక్కింది. చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ గాయం కారణంగా జట్టుకు దూరం కావడంతో ఈ యువ ఓపెనర్‌ను రూ. 30 లక్షలు ఇచ్చి జట్టులోకి తీసుకుంది. ఐపీఎల్ తొలి మ్యాచ్‌లోనే 15 బంతుల్లో 32 పరుగులు చేసిన ఈ కుడిచేతి వాటం ఓపెనర్... బెంగళూరుతో మ్యాచ్‌లో 48 బంతుల్లో 94 పరుగులు చేసి అందరి దృష్టిని ఆకర్షించాడు. బౌలర్ ఎవరైనా లెక్కచేయకపోవడం... బంతి తన పరిధిలో ఉంటే చాలు విరుచుకుపడటం ఆయుశ్ ప్రధాన అస్త్రాలు. ఈ సీజన్‌లో చెన్నై జట్టు పేలవ ప్రదర్శన కనబర్చడంతో ఆయుశ్ మెరుపులు పెద్దగా వెలుగులోకి రాలేదు. అయితే సాధారణ ఆటగాళ్లను సైతం మ్యాచ్ విన్నర్లుగా తీర్చిదిద్దగల ధోని సారథ్యంలో మాత్రే భవిష్యత్తులో మరింత రాటుదేలడం ఖాయమే.

మ్యాచ్‌లు	పరుగులు	అత్యధిక స్కోరు	స్ట్రయిక్ రేట్
5	163	94	181.11

అభిషేక్ అదుర్స్

ఈ ఏడాది అంచనాలకు మించి రాణిస్తున్న ఆటగాళ్లలో అభిషేక్ పొరెల్ ఒకడు. గతేడాది ప్రదర్శనతో ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్యం అతడిపై నమ్మకం ఉంచగా... దాన్ని పొరెల్ నిలబెట్టుకుంటున్నాడు. తాజా సీజన్‌లో సహచర ఓపెనర్లు నిలకడ కనబర్చలేకపోయినా... పొరెల్ మాత్రం ప్రభావం చూపాడు. 22 ఏళ్ల ఈ ఎడం చేతి వికెట్ కీపర్... కేఎల్ రాహుల్ తర్వాత ప్రస్తుతం ఢిల్లీ జట్టులో రెండో అత్యధిక స్కోరర్‌గా కొనసాగుతున్నాడు. పేస్‌తో పాటు స్పిన్‌ను కూడా సమర్థవంతంగా ఎదుర్కోగల పొరెల్ నైపుణ్యం అతడిని క్లాస్ ప్లేయర్ల జాబితాలో చేర్చుతుంది. బంతిపై మరీ పగబడినట్లు కాకుండా... సుతారాంగా అతడు కొట్టే షాట్లు క్రీడాభిమానులను ఎంతగానో అలరిస్తున్నాయి. బ్యాటింగ్‌లో భళా అనిపించుకుంటున్న పొరెల్... స్ట్రయిక్ రొటేషన్ ప్రాధాన్యతను అర్థం చేసుకుంటూ ఇన్నింగ్స్‌ను నడిపిస్తున్న తీరు ముచ్చటేస్తోంది.



మ్యాచ్‌లు	పరుగులు	అత్యధిక స్కోరు	స్ట్రయిక్ రేట్
12	265	51	149.71



వైభవ్ జ్వాల

ఐపీఎల్‌లో ఎదుర్కొన్న తొలి బంతికే సిక్స్ బాది... తన ఆగమనాన్ని ఘనంగా చాటుకున్న 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ మూడో మ్యాచ్‌లోనే రికార్డు సెంచరీ తన పేరిట లిఖించుకున్నాడు. చిన్నప్పటి నుంచి క్రికెటే శ్వాసగా పెరిగిన ఈ బిహార్ ఎడంచేతి వాటం ఓపెనర్... గుజరాత్ టైటాన్స్ బౌలర్లను చెడుగుడు ఆడుకున్నాడు. జైపూర్ వేదికగా జరిగిన పోరులో 7 ఫోర్లు, 11 సిక్స్‌లతో చెలరేగిపోయాడు. రెండొందల పైచిలుకు లక్ష్యం కళ్ల ముందు కనిపిస్తున్నా ఏమాత్రం వెరవకుండా విరుచుకుపడి టి20ల్లో సెంచరీ చేసిన పిన్న వయస్కుడిగా రికార్డుల్లోకి ఎక్కాడు. 94 పరుగుల వద్ద ఉండి కూడా ధైర్యంగా సిక్స్ కొట్టి మూడంకెల స్కోరు అందుకున్న ఈ కుర్రాడు. ఆ తర్వాత పెద్ద ఇన్నింగ్స్ ఆడకపోయినా... అతడిలో ప్రతిభకు కొదవలేదని మాత్రం నిరూపితమైంది. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ మాదిరిగా వైభవ్‌క కూడా చిన్న వయసులోనే అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంచనాల ఒత్తిడి దరిచేరనివ్వకుండా... నిలకడ కొనసాగిస్తే వీరిలో కొందరు ఆటగాళ్లు టీమిండియా తరఫున ప్రాతినిధ్యం వహించడం పెద్ద కష్టం కాకపోవచ్చు.

మ్యాచ్‌లు	పరుగులు	అత్యధిక స్కోరు	స్ట్రయిక్ రేట్
5	155	101	209.45

ఫటాఫట్.. ప్రభ్‌సిమ్రన్

ఈ ఏడాది పంజాబ్ కింగ్స్ మంచి ప్రదర్శన చేస్తోంది అంటే... దాని ప్రధాన కారణాల్లో ఓపెనింగ్ జోడీ ప్రదర్శన ముఖ్యమైంది. ఒక ఎండ్‌లో ఆర్య అదరగొడుతుంటే... మరో ఎండ్ నుంచి 'పిట్ట కొంచం కూత ఘనం'లాగా ప్రభ్‌సిమ్రన్ చెలరేగిపోతున్నాడు. ఫలితంగానే చాన్నాళ్ల తర్వాత పంజాబ్ జట్టు ప్లే ఆఫ్స్ దిశగా సజావుగా సాగుతోంది. హెడ్ కోచ్ రికీ పాంటింగ్ శిక్షణ, శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో భయం లేకుండా ఆడుతున్న 24 ఏళ్ల ప్రభ్‌సిమ్రన్ సింగ్... జట్టు నమ్మదగ్గ ఆటగాళ్లలో ఒకడిగా మారిపోయాడు. లక్నోపై 48 బంతుల్లోనే 91 పరుగులు చేసిన ప్రభ్‌సిమ్రన్... స్లో పిచ్‌పై కోల్‌కతా స్పిన్నర్లను ఎదుర్కొని 83 పరుగులు చేశాడు. పవర్‌ప్లేను పూర్తిగా వినియోగించుకుంటూ భారీగా పరుగులు రాబడుతున్న ఈ కుడి చేతి వాటం బ్యాటర్... భవిష్యత్తుపై భరోసా పెంచుతున్నాడు.

మ్యాచ్‌లు	పరుగులు	అత్యధిక స్కోరు	స్ట్రయిక్ రేట్
12	487	91	170.87




ప్రియాన్ష్ 'స్పెషల్ టాలెంట్'

ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్‌తో 'స్పెషల్ టాలెంట్' అని ప్రశంసలు అందుకున్న 23 ఏళ్ల ప్రియాన్ష్ ఆర్య... చెన్నైపై సెంచరీ బాది ప్రకంపనలు సృష్టించాడు. బంతిని నిశితంగా గమనించడంతో పాటు దాని వేగానికి అనుగుణంగా షాట్లను ఎంపిక చేసుకొని అప్పటికప్పుడు వాటిని అమలు చేయడంలో ప్రియాన్ష్ దిట్ట. ముల్లాన్‌పూర్ వేదికగా చెన్నైతో జరిగిన మ్యాచ్‌లో ప్రియాన్ష్... ఇన్నింగ్స్‌ను పరిశీలిస్తే ఇది అవగతమవుతుంది. బ్యాటింగ్‌కు అంతగా అనుకూలంగా లేని పిచ్‌పై ఆర్య అదరగొట్టి ఐపీఎల్‌లో ఐదో వేగవంతమైన శతకం (39 బంతుల్లో) చేసిన ప్లేయర్‌గా నిలిచాడు. ఢిల్లీకి చెందిన ఈ ఎడం చేతివాటం బ్యాటర్... ఫోర్ల కంటే ఎక్కువ సిక్స్‌లు కొట్టడంలో సిద్ధహస్తుడు. అభిమానులు ముద్దుగా 'లెఫ్ట్ హ్యాండ్ సెహ్వాగ్' అని పిలుచుకుంటున్న ఆర్య... ఈ సీజన్‌లో పంజాబ్ విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. మరో ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్‌తో కలిసి జట్టుకు మెరుగైన ఆరంభాలు అందించడం... పవర్ ప్లేలో వీలైనన్ని ఎక్కువ పరుగులు రాబడుతుండటంతో... మిడిలార్డర్ స్వేచ్ఛగా బ్యాటింగ్ చేయగలుగుతోంది.

మ్యాచ్‌లు	పరుగులు	అత్యధిక స్కోరు	స్ట్రయిక్ రేట్
12	417	103	194.85

ముంబైతోనే యశస్వి జైస్వాల్

అనుమతి కోరుతూ ఎంసీఏకు లేఖ



ముంబై: భారత యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్... దేశవాళీ క్రికెట్‌లో ముంబై జట్టు తరఫునే కొనసాగాలని ఆశిస్తున్నాడు. గతంలో రంజీ ట్రోఫీ అనంతరం ముంబై నుంచి గోవా జట్టుకు మారాలని అనుకున్న యశస్వి జైస్వాల్... అందుకోసం ముంబై క్రికెట్ సంఘం (ఎంసీఏ) నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) కోరాడు. దీనికి అంగీకరించిన ఎంసీఏ జైస్వాల్‌కు ఎన్‌ఓసీ ఇచ్చింది. అయితే ఇప్పుడు మనసు మార్చుకున్న జైస్వాల్ ఈ సీజన్‌లో ముంబై జట్టుకే ప్రాతినిధ్యం వహించాలని అనుకుంటున్నట్లు వెల్లడించాడు. ఈ మేరకు ఎమ్‌సీఏకు లేఖ రాశాడు. 'గోవా జట్టుకు మారేందుకు కొన్ని కుటుంబ ప్రణాళికలు మధ్యలో ఉన్నాయి. అందుకే ఆ దిశగా ఆలోచించడం లేదు. నాకు ఇచ్చిన ఎన్‌ఓసీని ఉపసంహరించుకోవాలని ఎంసీఏను కోరుతున్నా. కాబట్టి ఈ సీజన్‌లో ముంబై తరఫున ఆడేందుకు అనుమతించమని ఎంసీఏను అభ్యర్థిస్తున్నా. నేను ఎన్‌ఓసీని బీసీసీఐకి కానీ గోవా క్రికెట్ సంఘానికి గానీ సమర్పించలేదు' అని యశస్వి పేర్కొన్నాడు. మూడు ఫార్మాట్లలో టీమిండియాకు ప్రాతినిధ్యం వహిస్తున్న 23 ఏళ్ల యశస్వి .. సారథ్య బాధ్యతలు చేపట్టాలనే ఉద్దేశంతోనే ముంబై నుంచి గోవాకు మారుతున్నట్లు వార్తలు వచ్చాయి.

మెక్‌గిల్‌కు ఊరట

కొకైన్ కేసులో తప్పిన జైలు శిక్ష



సిడ్నీ: డ్రగ్స్ సరఫరా చేసిన కేసులో ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ స్టువర్ట్ మెక్‌గిల్ శిక్ష నుంచి తప్పించుకున్నాడు. ఈ కేసులో మెక్‌గిల్‌కు ఒక ఏడాది 10 నెలల పాటు సమాజ సేవ చేయాల్సిందిగా న్యాయస్థానం శుక్రవారం ఆదేశాలు జారీచేసింది. 2021 ఏప్రిల్‌లో మెక్‌గిల్ అతడి బంధువులతో కలిసి డ్రగ్స్ సరఫరా చేసినట్లు నిర్ధారణ అయింది. కాగా... ఆస్ట్రేలియా డౌనింగ్ సెంటర్ జిల్లా కోర్టులో వాదనలు పూర్తికాగా... ఆసీస్ మాజీ కెప్టెన్ స్టీవ్ వా తన సహచరుడికి మద్దతుగా నిలిచాడు. దీంతో అతడికి జైలు శిక్షకు బదులుగా... 495 గంటల పాటు సమాజ సేవలో గడపాలని న్యాయస్థానం ఆదేశించింది. దీంతో పాటు ఈ సమయంలో అతడు మాదకద్రవ్యాల పరీక్ష చేయించుకోవాలని పేర్కొంది. 1998 నుంచి 2008 వరకు ఆస్ట్రేలియా జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన మెక్‌గిల్... 44 టెస్టులు ఆడి 208 వికెట్లు పడగొట్టాడు. కెరీర్‌లో ఎక్కువ శాతం ఆసీస్ దిగ్గజ స్పిన్నర్ షేన్ వార్న్‌తో కలిసి మ్యాచ్‌లు ఆడటంతో అతడికి తగినంత పేరు రాలేదు. ఆటకు వీడ్కోలు పలికిన అనంతరం మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన 54 ఏళ్ల మెక్‌గిల్... తన నేరాన్ని అంగీకరించడంతో న్యాయస్థానం స్వల్ప శిక్షతో వదిలేసింది.

దక్షిణాఫ్రికా అన్ని ఫార్మాట్‌ల కోచ్‌గా కాన్రాడ్

జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా టెస్టు జట్టు కోచ్ షుక్రి కాన్రాడ్‌కు పరిమిత ఓవర్ల కోచింగ్ బాధ్యతలు కూడా అప్పగించారు. 2023 నుంచి టెస్టు జట్టుకు శిక్షణ ఇస్తున్న కాన్రాడ్... ఇకపై వన్డే, టి20లకు కూడా హెడ్ కోచ్‌గా వ్యవహరించనున్నాడు. 2027 వన్డే ప్రపంచకప్ వరకు అతడు ఈ పదవిలో కొనసాగుతాడని క్రికెట్ దక్షిణాఫ్రికా (సీఎస్‌ఏ) శుక్రవారం వెల్లడించింది. 58 ఏళ్ల కాన్రాడ్ జింబాబ్వేతో టి20 సిరీస్ నుంచి పరిమిత ఓవర్ల కోచ్‌గా బాధ్యతలు చేపట్టనున్నాడు. 'సుదీర్ఘ ఫార్మాట్‌లో కాన్రాడ్ పనితీరు బాగుంది. టెస్టు ఫార్మాట్‌లో అతడు మంచి పునాది వేసి జట్టుకు చక్కటి గుర్తింపు తెచ్చాడు.



పరిమిత ఓవర్లలోనూ అదే కొనసాగిస్తాడని ఆశిస్తున్నాం' అని సీఎస్‌ఏ హై పెర్ఫార్మెన్స్ డైరెక్టర్ ఎనోచ్ పేర్కొన్నారు. కాన్రాడ్ శిక్షణలో దక్షిణాఫ్రికా జట్టు తొలిసారి ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌కు అర్హత సాధించింది. వచ్చే నెల 11 నుంచి లండన్ వేదికగా ఆస్ట్రేలియాతో జరగనున్న తుదిపోరులో దక్షిణాఫ్రికా బరిలోకి దిగనుంది. మూడు ఫార్మాట్లలో దక్షిణాఫ్రికా జట్టుకు శిక్షణ ఇవ్వడాన్ని గౌరవంగా భావిస్తున్నానని కాన్రాడ్ పేర్కొన్నాడు. 2026 టి20 ప్రపంచకప్, 2027 వన్డే ప్రపంచకప్‌లో జట్టును మెరుగైన స్థితిలో నిలిపేందుకు కృషి చేస్తానని వెల్లడించాడు.

పాకిస్తాన్ సూపర్ లీగ్ కూడా వాయిదా

లాహోర్: భారత్‌లో ఐపీఎల్ జరుగుతున్న సమయంలోనే దాయాది దేశంలో పాకిస్తాన్ సూపర్ లీగ్ (పీఎస్‌ఎల్) నిర్వహిస్తుండగా... ఇప్పుడు ఇరుదేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులతో ఈ రెండు లీగ్‌లు వాయిదా పడ్డాయి. ముందుగా బీసీసీఐ ఐపీఎల్‌ను వాయిదా వేసింది. కొన్ని గంటల తర్వాత పీఎస్‌ఎల్‌ను వాయిదా వేస్తున్నట్లు పాక్ క్రికెట్ బోర్డు (పీసీబీ) వెల్లడించింది. పాక్ ప్రధాని సూచన మేరకే వాయిదా నిర్ణయమని పీసీబీ తెలిపింది. 'భారత సాయుధ బలగాలతో పాక్ ఆర్మీ పోరాడుతున్న ఈ సమయంలో లీగ్ నిర్వహణ సముచితం కాదని మా ప్రధాని షాబాద్ షరీఫ్ సూచించారు. దాంతో ఈ వాయిదా నిర్ణయం తీసుకున్నాం' అని పీసీబీ చెప్పుకొచ్చింది. కానీ అసలు కారణం వేరే ఉంది. ఐపీఎల్‌ను వాయిదా వేసినా మేం గొప్పగా నిర్వహించామని చెప్పుకునేందుకు యూఏఈలో నిర్వహించాలనుకున్న పీసీబీకి ఎమిరేట్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) నుంచి చుక్కెదురైంది. ఈసీబీకి మాటమాత్రమైనా చెప్పకుండానే పీసీబీ వేదికగా యూఏఈని ఖరారు చేయడం ఎమిరేట్స్‌కు ఆగ్రహం తెప్పించింది. దీంతో ప్రతిపాదనదశలోనే పీసీబీకి కుదరదని చెప్పేసినట్లు తెలిసింది. దీంతో ఇప్పుడు తమ ప్రధాని సూచన, ఆర్మీకి సంఘీభావంగా వాయిదా అంటూ పీసీబీ బీరాలు పలుకుతుంది. నిజానికి కొన్నేళ్లుగా బీసీసీఐతో ఈసీబీ బలమైన బంధాన్ని ఏర్పర్చుకుంది. కోవిడ్ మహమ్మారి వల్ల ఐపీఎల్ మ్యాచ్‌లను యూఏఈలో నిర్వహించడంతో పాటు భారత్ ఆతిథ్యమివ్వాల్సిన టి20 ప్రపంచకప్ (2021)కూ యూఏఈనే వేదికగా నిలిచింది. ఇటీవల పాక్ ఆతిథ్యమిచ్చిన ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి సంబంధించిన భారత్ మ్యాచ్‌ల్ని కూడా యూఏఈలోనే ఆడింది.



దీపిక

మూడు పతకాలకు విజయం దూరంలో

సెమీస్‌లో దీపిక కుమారి, పార్థ్ సాలుంఖే • కాంస్యం బరిలో అభిషేక్ వర్మ–మధుర జోడీ

షాంఘై: ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్–2 టోర్నమెంట్‌లో భారత ఆర్చర్లు మూడు విజయాలు సాధిస్తే మూడు పతకాలను ఖరారు చేసుకుంటారు. కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో అభిషేక్ వర్మ (ఢిల్లీ)–మధుర (మహారాష్ట్ర) జోడీ కాంస్య పతకం కోసం పోటీపడనుండగా... మహిళల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో దీపిక కుమారి... పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో పార్థ్ సాలుంఖే సెమీఫైనల్లోకి దూసుకెళ్లారు. సెమీఫైనల్లో గెలిస్తే దీపిక, పార్థ్ స్వర్ణ, రజత పతకాల కోసం రేసులో నిలుస్తారు. సెమీఫైనల్లో ఓడిపోతే కాంస్య పతకం కోసం పోటీపడతారు. కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ సెమీఫైనల్లో అభిషేక్–మధుర ద్వయం 156–158తో ఎల్లా గిబ్సన్–అజయ్ స్కాట్ (బ్రిటన్) జంట చేతిలో ఓడిపోయింది. నేడు జరిగే కాంస్య పతక మ్యాచ్‌లో ఫాటిన్ నూర్‌ఫతే–మొహమ్మద్ జుమైదీ (అమెరికా)లతో అభిషేక్, మధుర తలపడతారు.



పార్థ్

పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో ఒలింపియన్, ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ ధీరజ్ బొమ్మదేవర, తరుణ్‌దీప్ రాయ్ తొలి రౌండ్‌లో, అతాను దాస్ క్వార్టర్ ఫైనల్లో నిష్క్రమించారు. ధీరజ్ 5–6తో అబ్దుల్లా (టర్కీ) చేతిలో, తరుణ్‌దీప్ 5–6తో తెత్సుయ (జపాన్) చేతిలో, అతాను దాస్ 2–6తో కిమ్ వూజిన్ (కొరియా) చేతిలో ఓడిపోయారు. పార్థ్ సాలుంఖే తొలి రౌండ్‌లో 6–5తో 2020 టోక్యో ఒలింపిక్స్ స్వర్ణపతక విజేత మెటీ గాజోజ్ (టర్కీ)పై, రెండో రౌండ్‌లో 6–5తో తెత్సుయ (జపాన్)పై, మూడో రౌండ్‌లో 6–2తో రియాన్ ట్యాక్ (ఆస్ట్రేలియా)పై, క్వార్టర్ ఫైనల్లో 6–2తో కిమ్ జె డియోక్ (కొరియా)పై గెలుపొందాడు.

మహిళల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో 'ట్రిపుల్ ఒలింపియన్' దీపిక కుమారి తొలి రౌండ్‌లో 6–4తో లూసియా (స్పెయిన్)పై, రెండో రౌండ్‌లో 6–0తో దయానా (కజకిస్తాన్)పై, మూడో రౌండ్‌లో 6–4తో విక్టోరియా (ఫ్రాన్స్)పై, క్వార్టర్ ఫైనల్లో 6–2తో లీ జియామన్ (చైనా)పై విజయం సాధించింది. భారత్‌కే చెందిన అంకిత మూడో రౌండ్‌లో 3–7తో లిమ్ సిహైన్ (కొరియా) చేతిలో, అన్షిక తొలి రౌండ్‌లో 5–6తో ఎలీసా టార్టలెర్ (జర్మనీ) చేతిలో, సిమ్రన్‌జిత్ తొలి రౌండ్‌లో 3–7తో యుహెరా రుకా (జపాన్) చేతిలో ఓటమి చవిచూశారు.





శుక్రవారం మాస్కోలో జరిగిన విక్టరీ డే పరేడ్‌లో పాల్గొన్న ఆర్మీ వాహనాలు ● కవాతు చేస్తున్న సైనిక బలగాలు ● వేదికపై మాట్లాడుకుంటున్న చైనా అధ్యక్షుడు జిన్ పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్

దైవం పట్ల విశ్వాసం కలిగి ఉండాలి

మొదటి ప్రార్థనలో కొత్త పోప్ లియో 14

వాటికన్ సిటీ: కొత్తగా ఎన్నికైన పోప్ లియో 14 తన మొదటి ప్రార్థనను నిర్వహించారు. ప్రతి ఒక్కరిలో దైవం పట్ల విశ్వాసాన్ని కలిగించాలని, విశ్వాసం లేకపోవడాన్ని తీవ్రంగా ఎదుర్కోవాలని కాథలిక్ చర్చికి పిలుపునిచ్చారు. చర్చిలు ఈ ప్రపంచంలోని చీకటి రాత్రులను ప్రకాశవంతం చేసే దీపస్తంభాలని, నిర్వహణలో విశ్వసనీయంగా ఉంటానని చెప్పారు. 267వ పోప్‌గా ఎన్నికైన మరుసటి రోజు ఆయన కార్డినల్స్‌ను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రజలు విశ్వాసానికి దూరమై, సాంకేతికత, డబ్బు, విజయం, అధికారం, ఆనందం వైపు మొగ్గచూపుతున్న ఈ సమయంలో విశ్వాసాన్ని అసంబద్ధంగా భావించే ప్రమాదముందని హెచ్చరించారు. ఇందుకు ప్రచారం అవసరమని గుర్తు చేశారు. 'విశ్వాసం లేకపోవడమంటే జీవితం అర్థాన్ని కోల్పోవడం, దయను విస్మరించడం, మానవ గౌరవాన్ని ఉల్లంఘించడం, కుటుంబ సంక్షోభమని.. ఇది సమాజానికి చెడు గాయాలను చేస్తుందని ఇటాలియన్‌లో ప్రసంగించారు. 69 ఏళ్ల పోప్ లియో బంగారంతో అలంకరించిన తెల్లటి పాపల్ వస్త్రాన్ని ధరించి ఉన్నారు. ఈ కార్యక్రమాన్ని వాటికన్ ప్రత్యక్ష ప్రసారం చేసింది.



ప్రార్థన అనంతరం సిస్టిన్ చాపెల్ నుంచి కార్డినల్స్‌తోపాటు వస్తున్న నూతన పోప్ లియో-14

మే 18న అధికారిక ప్రమాణ స్వీకారం

నూతన పోప్ లియో14 మే 18న అధికారికంగా పోప్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ సందర్భంగా ఆయన సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో మొదటి బహిరంగ ప్రార్థన నిర్వహిస్తారు. ఆ తరువాత మొదటి సాధారణ సమావేశం మే 21న జరగనుంది. అయితే.. పోప్ ఫ్రాన్సిస్ మరణంతో సాంకేతికంగా ఉద్యోగాలు కోల్పోయిన వాటికన్ సంస్థల అధిపతులు, సభ్యులందరూ తదుపరి నోటీసు వచ్చేవరకు పదవిలో ఉండాలని లియో కోరారు.

పోప్‌కు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోదీ

పోప్ లియో 14కు భారత ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. 'పోప్ లియో 14కు భారత ప్రజల నుంచి హృదయపూర్వక అభినందనలు. శుభాకాంక్షలు. శాంతి, సామరస్యం, సంఘీభావం, సేవ ఆదర్శాలను ముందుకు తీసుకెళ్లడంలో కాథలిక్ చర్చి నాయకత్వం చాలా ప్రాముఖ్యతను కలిగి ఉంది. మన భాగస్వామ్య విలువలను పెంపొందించడానికి హోలీ సీతో నిరంతర చర్చలకు భారతదేశం కట్టుబడి ఉంది'' అని మోదీ ఎక్స్‌లో పేర్కొన్నారు.

పోప్‌కు రాహుల్‌గాంధీ అభినందనలు

2వేల ఏళ్ల చరిత్ర కలిగిన కాథలిక్ చర్చికి మొట్టమొదటి అమెరికన్ పోప్‌గా ఎన్నికైన కార్డినల్ రాబర్ట్ ప్రెవోస్ట్‌ను కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ శుక్రవారం అభినందించారు. 'పోప్ లియో 14కు అభినందనలు. ఆయన నాయకత్వంలో శాంతిని, కరుణను, మానవాళికి సేవను పెంపొందించాలి. ఈ సంతోషకరమైన సందర్భంలో ప్రపంచ కాథలిక్ కమ్యూనిటీకి నా శుభాకాంక్షలు'' అని రాహుల్ గాంధీ తన ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు.

మాస్కోలో అట్టహాసంగా విక్టరీ డే

మాస్కో: నాజీ జర్మనీపై సాధించిన విజయాన్ని గుర్తు చేసుకుంటూ రష్యా శుక్రవారం 80వ వార్షికోత్సవాలను ఘనంగా జరుపుకుంది. మాస్కోలోని రెడ్ స్క్వేర్‌లో జరిగిన భారీ పరేడ్‌లో అధ్యక్షుడు పుతిన్‌తోపాటు, చైనా అధ్యక్షుడు జిన్ పింగ్, బ్రెజిల్ అధ్యక్షుడు లులా డ సిల్వా తదితరులు పాల్గొన్నారు. సుమారు 11,500 బలగాలు, ట్యాంకులు, శతఘ్ని వాహనాలు తదితర 180కి పైగా మిలటరీ వాహనాలు పరేడ్‌లో పాల్గొన్నాయి. ఖండాంతర అణు బాలిస్టిక్ క్షిపణులతో కూడిన యార్స్ లాంచర్లు రెడ్ స్క్వేర్ పరేడ్‌లో ప్రత్యేకార్షణగా మారాయి. గగనతలంలో యుద్ధ విమానాలు చేసిన ఏరోబిక్ విన్యాసాలు ఆహూతులను అలరించాయి. నాలుగేళ్లుగా ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధంతో ప్రపంచ శక్తిగా తన స్థానాన్ని పదిలం చేసుకునేందుకు, మిత్ర దేశాలతో బంధాన్ని బలోపేతం చేసుకునేందుకు పుతిన్ ఈ కార్యక్రమాన్ని వేదికగా మార్చుకున్నారని పరిశీలకులు అంటున్నారు.

ఉద్రిక్తతల వల్ల పాకిస్తాన్‌కే నష్టం

- తగ్గించడంపై దృష్టి పెడితే మంచిది
- పాక్‌కు జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా సూచన

జమ్మూ: సరిహద్దు వెంబడి ఉద్రిక్తతలు కొనసాగడం పాకిస్తాన్‌నే దెబ్బతీస్తుందని జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అన్నారు. ఉద్రిక్తతలు తగ్గించడంపై దృష్టి పెట్టాలని పాక్‌కు సూచించారు. లేదంటే వారికి ఎక్కువ నష్టమని హెచ్చరించారు. గురువారం రాత్రి పాకిస్తాన్ చేసిన దాడుల్లో ఒక్క డ్రోన్ కూడా లక్ష్యాన్ని చేరుకోకుండా వేగంగా స్పందించిన సాయుధ దళాలను ఒమర్ ప్రశంసించారు. జమ్మూ, సాంబా జిల్లాల్లోని సహాయ శిబిరాలను, సరిహద్దు రేఖ వెంబడి పాక్ షెల్లింగ్‌లో గాయపడిన వారున్న ఆసుపత్రులను సందర్శించిన సీఎం.. విజయ్‌పూర్‌లో మీడియాతో మాట్లాడారు. ''1971 యుద్ధం పాక్ చేసిన అత్యంత తీవ్రమైన దాడులివే.. జమ్మూలోని పలు ప్రాంతాలు, అనంత్‌నాగ్‌లోని మందుగుండు సామగ్రి డిపోను లక్ష్యంగా చేసుకున్నారు. కానీ వారి ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. సరిహద్దు వెంబడి ఉద్రిక్తతలు కొనసాగడం పాక్‌ను దెబ్బతీస్తుంది. దీనివల్ల పాకిస్తాన్‌కు ఒరిగేదేమీ లేదు. ఆ దేశం విజయం సాధించలేదు. కాబట్టి వారు తుపాకులను పక్కన పెట్టి సాధారణ స్థితిని తీసుకురావడానికి సహకరిస్తే మంచిది. గురువారం రాత్రి తరువాత జరిగిన సంఘటనలు ఉద్రిక్తతను పెంచే ప్రయత్నాన్ని స్పష్టంగా చెబుతున్నాయి. దీని వల్ల వారే ఎక్కువగా బాధపడతారు'' అని ఒమర్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు.

పూంచ్‌లో పరిస్థితి క్లిష్టంగా ఉంది

పాక్ షెల్లింగ్ వల్ల పూంచ్ నగరానికి భారీ నష్టం వాటిల్లిందని, పరిస్థితి అత్యంత క్లిష్టంగా ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మృతులు, క్షతగాత్రుల్లో ఎక్కువ మంది అక్కడి వారేనన్నారు. తాను జమ్మూలోని ఆస్పత్రిని సందర్శించానని, గాయాలతో అక్కడ అడ్మిట్ అయిన వారంతా పూంచ్‌కు చెందిన వారేనని చెప్పారు. తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తిని శస్త్రచికిత్స కోసం పీజీఐ చండీగఢ్‌కు తరలించామన్నారు. జమ్మూ జిల్లాలోని మిశ్రీవాలా, నాగ్బానీ, కోట్ భల్వాల్, సాంబాలోని విజయపూర్ పునరావాస శిబిరాలను సందర్శించిన ఆయన నిర్వాసిత కుటుంబాలతో మాట్లాడి, వారికి ప్రభుత్వ సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. శిబిరాల్లో అసౌకర్యాన్ని తగ్గించడానికి కృషి చేస్తానని చెప్పారు. ఆట సామగ్రి కావాలని అడిగిన పిల్లలకు.. తన సొంత వాహనంలో తెచ్చి అప్పగించిన మంత్రికి సీఎం కృతజ్ఞతలు తెలిపారు. జమ్మూలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఉన్న క్షతగాత్రులను కూడా పరామర్శించారు.



తాత్కాలిక శిబిరంలో తలదాచుకుంటున్న వారిని పరామర్శిస్తున్న సీఎం ఒమర్ అబ్దుల్లా



రాజకీయ జోక్యమే శాంతిని నెలకొల్పుతుంది

- సరిహద్దు ఉద్రిక్తతపై మెహబూబా ముఫ్తీ
- ఇరుదేశాలు సంయమనం పాటించాలని పిలుపు

శ్రీనగర్: భారత్– పాక్ మధ్య నెలకొన్న సమస్యలను రాజకీయ జోక్యమే పరిష్కరిస్తుందని పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ వ్యాఖ్యానించారు. సైనిక చర్య సరికాదని, ఇరు దేశాల నాయకత్వాలు సంయమనం పాటించి, దాడులను తక్షణమే నిలిపివేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. 'పుల్వామా, పహల్గాం ఘటనలు రెండు దేశాలను విపత్తు అంచులకు చేర్చాయి. ఇది ఇలాగే కొనసాగితే యావత్ ప్రపంచానికే ప్రమాదం పొంచి ఉంది. కార్గిల్ అయినా, పుల్వామా అయినా, పహల్గాం అయినా, పఠాన్ కోట్ అయినా సైనిక చర్య జరిగినప్పుడల్లా అది లక్షణాలకు మాత్రమే చికిత్స చేస్తుంది. మూల సమస్యకు పరిష్కారం చూపదు. శాశ్వతంగా శాంతిని నెలకొల్పేందుకు సహాయపడదు'అని ముఫ్తీ అన్నారు. ఉద్రిక్తతల వల్ల జమ్ముకశ్మీర్‌కు ఇరువైపులా పౌరులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ యుద్ధాన్ని వారు ప్రారంభించలేదని, తమ ప్రమేయం లేకుండా జరుగుతున్న యుద్ధానికి వారు భారీ మూల్యం చెల్లించుకుంటున్నారని ఆమె అన్నారు. జమ్మూకశ్మీర్ ప్రజలు ఎన్నాళ్లు ఈ భారాన్ని భరించాలంటూ ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. ఈ దాడుల్లో ఇరు దేశాలు తమ లక్ష్యాన్ని నెరవేర్చినట్లు కనిపిస్తోందని, పిల్లల రక్తం ఎందుకు చిమ్ముతున్నారని ఆమె ప్రశ్నించారు. ఇరు దేశాల ప్రధానులు మాట్లాడి దాడులను ఆపాలని ఆమె విజ్ఞప్తి చేశారు. నాయకత్వం జమ్మూకశ్మీర్ ప్రజల గొంతుకను వింటుందని తాను ఆశిస్తున్నానన్నారు. రెండు వైపులా మీడియా నిజాలు మాట్లాడాలని, వారి ప్రచారాలతో ప్రజలకు భయాందోళనలు కలిగించొద్దని విజ్ఞప్తి చేశారు.

పిటిషన్ల డ్రాఫ్టింగ్ సూటిగా ఉండాలి

వీడ్కోలు సమావేశంలో సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా

న్యూఢిల్లీ: న్యాయ విచారణలో ప్రక్రియలో సంక్షిప్తంగా, సూటిగా ఉండే పిటిషన్ల అవసరం ఎంతో ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నొక్కిచెప్పారు. డ్రాఫ్టింగ్ కళపై పట్టు సాధించేందుకు ఎంతో కృషి చేయాల్సి ఉంటుందని తెలిపారు. పిటిషన్లు స్పష్టంగా సంక్షిప్తంగా ఉండటం లాయర్లేకాదు, జడ్జీలకు కూడా ప్రయోజనకరమని చెప్పారు. ఈ నెల 13వ తేదీన పదవీ విరమణ చేయనున్న జస్టిస్ సంజీవ్ ఖన్నా శుక్రవారం తనకు సుప్రీంకోర్టు అడ్వొకేట్స్ ఆన్ రికార్డ్ అసోసియేషన్(ఎస్‌సీఏవోఆర్ఏ) ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో మాట్లాడారు. 14వ తేదీన సీజేఐగా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ బీఆర్ గవాయ్ కూడా కార్యక్రమానికి హాజరయ్యారు. సీజేఐ జస్టిస్ ఖన్నా తన పదవీ కాలంలో పారదర్శకతను, సమ్మిళితత్వాన్ని తీసుకువచ్చారని ప్రశంసించారు. సుప్రీంకోర్టులో అడ్వొకేట్స్ ఆన్ రికార్డు ఎంతో కీలకమైనవారని, అత్యున్నత న్యాయస్థానానికే కాదు, దేశంలోని పౌరులందరికీ ప్రతినిధులంటూ జస్టిస్ సంజీవ్ ఖన్నా కొనియాడారు.

అయితే, తక్కువ మాటల్లో ఎక్కువ విషయాన్ని చెప్పగలిగే డ్రాఫ్టింగ్ కళపై పట్టు సాధించలేకపోవడం ఇంకా తనకు లోటుగానే అనిపిస్తోందని చెప్పారు. క్లిష్టంగా ఉండే ఫైళ్లను చదవడం కూడా చాలా తేలికని చెప్పారు. ఫైల్ చదివిన తర్వాత ఆకేసుపై సగం వరకు పట్టు దొరుకుతుందని జస్టిస్ ఖన్నా అన్నారు. సీనియర్లపై ఆధారపడకుండా కోర్టుల్లో కేసులను వాదించాలని న్యాయవాదులకు సూచించారు. 'కక్షిదారులతో మాట్లాడేది మీరు. కక్షిదారులు మాట్లాడేది కూడా మీతోనే. నోట్స్ తయారు చేసేదీ మీరే. ఆ సారాంశాన్ని సీనియర్లకు వివరిస్తారు. కోర్టులో మీరే ఎందుకు వాదించరు?'అని జస్టిస్ ఖన్నా తెలిపారు. సంబంధిత విషయ పరిజ్ఞానం కలిగి ఉండటం లాయర్లకు ఎంతో ముఖ్యమైన విషయమని చెప్పారు. సుప్రీంకోర్టు కాకున్నా, మిగతా కోర్టుల్లో కేసుల పరిష్కారంలో మధ్యవర్తిత్వం ప్రస్తుతం ముఖ్యమైన విధానంగా మారిందని ఆయన పేర్కొన్నారు. ఆన్‌లైన్ మీడియేషన్ ట్రెయినింగ్ కోర్సుకు ఎంతో ఆదరణ లభిస్తోందని వివరించారు. దీని వల్ల అమూల్యమైన సమయం ఆదా అవుతుందని తెలిపారు. రిటైరయ్యాక సాయం కావాల్సిన వారు మొహమాటం లేకుండా తన వద్దకు రావచ్చని, సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని పిలుపునిచ్చారు.

జనాభా ఆధారిత పునర్విభజనతో దక్షిణాదికి అన్యాయమే

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.వి.నాగరత్న వ్యాఖ్య

న్యూఢిల్లీ: జనాభా గణాంకాల ఆధారంగా పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న వాదనను సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.వి.నాగరత్న పరోక్షంగా సమర్థించారు. ఈ విషయంలో దక్షిణ భారత ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నట్లు గుర్తుచేశారు. సరోగసీ(క్రమబద్ధీకరణ) చట్టానికి సంబంధించిన దాఖలైన పిటిషన్లపై న్యాయమూర్తులు జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ సతీష్‌చంద్ర శర్మతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. సరోగసీ ద్వారా రెండో సంతానం పొందడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ ఓ జంట ఈ పిటిషన్లు దాఖలు చేసింది. ఈ సందర్భంగా జస్టిస్ బి.వి.నాగరత్న స్పందిస్తూ... ''దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా తగ్గిపోతోంది. కుటుంబాలు కుదించుకుపోతున్నాయి. జననాల సంఖ్య నానాటికీ పడిపోతోంది. దక్షిణాదికి భిన్నంగా ఉత్తరాది రాష్ట్రాల్లో జనాభా పెరిగిపోతోంది. పిల్లలను కంటూనే ఉన్నారు. జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేస్తే తమకు అన్యాయం జరుగుతుందని దక్షిణాది ప్రజలకు భావిస్తున్నారు. పార్లమెంట్‌లో ఉత్తరాది ప్రాధాన్యం మరింత పెరుగుతుందని, దక్షిణాది వాటా తగ్గిపోతుందని ఆందోళన చెందుతున్నారు'' అని వివరించారు. ఇప్పటికే ఒక బిడ్డ ఉండగా, మరో బిడ్డ కోసం ఎందుకు ప్రయత్నిస్తున్నారని పిటిషనర్లను ప్రశ్నించారు. జనాభా తగ్గుదల వల్ల చైనాలో ఎన్నో ప్రతికూల పరిణామాలు సంభవిస్తున్నారని పిటిషనర్ల తరఫు న్యాయవాది చెప్పారు. అలాంటి పరిస్థితి మన దేశంలో రాదని జస్టిస్ నాగరత్న స్పష్టంచేశారు. ఉత్తరాదిలో జనాభా విపరీతంగా పెరుగుతోందని వెల్లడించారు. దేశ ప్రయోజనాల కోసం ఒక్క బిడ్డతో సరిపెట్టుకోవచ్చు కదా! అని పిటిషనర్లకు సూచించారు. విచారణను వాయిదా వేశారు.



మహిళా సైనికాధికారుల సేవలను ఉపయోగించుకోవాలి

- కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం
- 69 మంది అధికారులను రిలీవ్ చేయొద్దని స్పష్టీకరణ

న్యూఢిల్లీ: షార్ట్ సర్వీసు కమిషన్(ఎస్ఎస్‌సీ)కు సంబంధించిన మహిళా సైనికాధికారులను విధుల నుంచి తప్పించకూడదని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రస్తుతం పాకిస్తాన్‌తో ఘర్షణ నెలకొన్న నేపథ్యంలో వారికి నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసేలా వ్యవహరించకూడదని సూచించింది. ఇలాంటి సమయంలో వారి సేవలు ఉపయోగించుకోవాలని, వారికి అండగా నిలవాలని స్పష్టంచేసింది. తమకు శాశ్వత కమిషన్ ఏర్పాటు చేయకపోవడాన్ని సవాలు చేస్తూ 69 మంది మహిళా సైనికాధికారులకు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. శాశ్వత కమిషన్ ఏర్పాటు చేసేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు క్రమశిక్షణా చర్యల కింద పిటిషనర్లను విధుల నుంచి రిలీవ్ చేసేందుకు కేంద్రం సన్నద్ధమైంది. ఈ తరుణంలో ఈ పిటిషన్లపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. శక్తిసామర్థ్యాలు కలిగిన మహిళల సేవలను చక్కగా వాడుకోవాలని కేంద్రానికి సూచించింది.

ప్రజల భద్రతకు పటిష్టమైన చర్యలు చేపట్టండి

గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్‌కు ప్రధాని మోదీ ఆదేశం

అహ్మదాబాద్: పాకిస్తాన్ సైన్యం దాడులకు పాల్పడే అవకాశం ఉందని, ప్రజల భద్రతకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశించారు. సరిహద్దు రాష్ట్రమైన గుజరాత్‌లో ప్రస్తుత పరిస్థితులపై చర్చించారు. మోదీ శుక్రవారం భూపేంద్ర పటేల్‌తో ఫోన్‌లో మాట్లాడారు. సరిహద్దు రాష్ట్రం కాబట్టి మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భద్రతా సిబ్బంది సన్నద్ధతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ పరిణామాలు ఎదురైనా తిప్పికొట్టడానికి పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని చెప్పారు. ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. భద్రతను ఎప్పటికప్పుడు సమీక్షించాలని ముఖ్యమంత్రికి సూచించారు. సరిహద్దు జిల్లాలైన కచ్, బనస్కాంత, పఠాన్, జామ్‌నగర్ జిల్లాల్లో అమలవుతున్న భద్రతా చర్యలను మోదీకి భూపేంద్ర పటేల్ వివరించారు. గురువారం రాత్రి పాకిస్తాన్ సైన్యం భారత్‌పై దాడులకు దిగిన నేపథ్యంలో గుజరాత్‌లో ప్రజల ఆందోళనకు గురయ్యారు. ప్రభుత్వం పలు జిల్లాల్లో బ్లాక్-ఔట్ ప్రకటించింది. కొన్ని గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

మాజీ సైనికాధికారులతో ప్రధాని మోదీ భేటీ

న్యూఢిల్లీ: త్రివిధ దళాల మాజీ అధిపతులు సహా మాజీ సైనికాధికారులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం సమావేశమయ్యారు. పాకిస్తాన్‌తో ఉద్రిక్తతలు తీవ్రతరమైన వేళ ఈ కార్యక్రమం జరగడం గమనార్హం. ఈ సందర్భంగా ప్రధాని మోదీ వారితో సుదీర్ఘంగా మాట్లాడారని అధికారులు తెలిపారు. సరిహద్దుల్లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను వారికి వివరించి చెప్పారన్నారు. ఉగ్రదాడికి పురిగొల్పిన పాక్‌కు తగురీతిలో జవాబిస్తూ చేపట్టిన ప్రభుత్వ చర్యలను వారు సమర్థించారు. భారత సైనిక వసతులే లక్ష్యంగా పాకిస్తాన్ భారత గగనతలాన్ని అతిక్రమించిందని ఈ సందర్భంగా వింగ్ కమాండర్ వ్యోమికా ఈ సందర్భంగా వారికి చెప్పారు. లేహ్ నుంచి సర్ క్రీక్ వరకు ఉన్న 36 ప్రాంతాలపైకి పాక్ సుమారు 400 డ్రోన్లను ప్రయోగించిందని, వీటిని మన సైన్యం మధ్యలోనే అడ్డుకుందని వారికి వివరించారు.

సరిహద్దుల్లో పరిస్థితిపై అమిత్ షా సమీక్ష

న్యూఢిల్లీ: భారత్–పాకిస్తాన్ సరిహద్దులతోపాటు దేశంలోని విమానాశ్రయాల వద్ద భద్రతా పరిస్థితులపై హోం మంత్రి అమిత్ షా అత్యున్నత స్థాయి సమావేశంలో సమీక్ష జరిపారు. ఇరుదేశాల మధ్య సైనికపరమైన ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో శుక్రవారం జరిగిన భేటీలో బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, బ్యూరో ఆఫ్ సివిల్ ఏవి యేషన్ సెక్యూరిటీ డైరెక్టర్ జనరళ్లతోపాటు కేంద్రం హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్, ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ తపన్ డేకా హాజరయ్యారు. భారత-పాక్ సరిహద్దుల్లో రక్షణ బాధ్యతలను బీఎస్ఎఫ్, విమానాశ్రయాలు, ఇతర కీలక వనరులకు సీఐఎస్ఎఫ్ బలగాలు రక్షణ కల్పిస్తుండటం తెల్సిందే.

మా దాడి ఉగ్రవాదం పైనే: వినయ్ క్వాత్రా

న్యూఢిల్లీ: భారత్ ఉగ్రవాదులతో యుద్ధం చేస్తోందని అమెరికాలోని భారత రాయబారి వినయ్ క్వాత్రా అన్నారు. ఏప్రిల్ 22 పహల్గాం దాడి అత్యంత హేయమైన ఉగ్రవాద చర్యని, ఈ ఉగ్రవాదులకు ప్రపంచంలో మరెక్కడా చోటు లేకుండా చేయడమే భారత్ పనని స్పష్టం చేశారు. భారత ప్రభుత్వం చెప్పినట్లుగా పహల్గాం బాధితులకు న్యాయం చేస్తామన్నారు. పాకిస్తాన్‌తో భారత్ యుద్ధం చేస్తోందా? అని గురువారం స్థానిక మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. భారత్ చర్యలను పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ సభ్యులు, సెనేటర్ల నుంచి యావత్ ప్రపంచం అభినందిస్తోందన్నారు. కశ్మీర్‌పై తిరిగి దాడి చేస్తూ.. పాకిస్తాన్ మరోసారి ఉగ్రవాదులకు అండగా నిలబడిందన్నారు. ఉగ్రవాదులపై చర్యలు తీసుకోవడానికి బదులు వారికి అండగా నిలుస్తున్నదని, ఇక పహల్గాం దాడిలో వారే భాగస్వాములైనా ఆశ్చర్యపోనవసరం లేదని చెప్పారు. భారత్– పాక్ మధ్య ఉద్రిక్తతలు అణుయుద్ధంగా మారే ప్రమాదం ఉందని ప్రపంచం ఎంతో ఆందోళన చెందుతోందన్న ప్రశ్నకు ఆయన సమాధానిమస్తూ.. ఉగ్రవాద కార్యకలాపాలకు పాకిస్తాన్ మద్దతు కొనసాగుతుండటంపై ప్రపంచం ఆందోళన చెందాలన్నారు.

చర్చలతోనే పరిష్కారం: ఏఐఎంపీఎల్‌బీ

న్యూఢిల్లీ: భారత్–పాకిస్తాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలపై ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ ఆందోళన వ్యక్తం చేసింది. సమస్య ఏదైనా పరిష్కారం యుద్ధం కాదని తెలిపింది. ఇస్లాం బోధనల్లో ఉగ్రవాదానికి తావు లేదని ఏఐఎంపీఎల్‌బీ తెలిపింది. భారత్, పాకిస్తాన్‌లు యుద్ధాన్ని భరించలేవని పేర్కొంది. చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే విభేదాలను పరిష్కరించుకోవాలని ఇరు దేశాలకు సూచించింది. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా సేవ్ వక్ఫ్ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేసింది. ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఆందోళనలను ఈ నెల 16వ తేదీ వరకు వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. ఏఐఎంపీఎల్‌బీ సభ్యులు శుక్రవారం వర్చువల్‌గా సమావేశమై ఈ మేరకు తీర్మానించారు.

శ్రీలంకలో కూలిన సైనిక విమానం

ఆరుగురు సైనికులు మృతి

కొలంబో: శ్రీలంకలో శుక్రవారం విషాదం చోటు చేసుకుంది. సైనిక హెలికాప్టర్ కూలి ఆరుగురు సైనికులు మృతి చెందారు. శ్రీలంక వైమానిక దళానికి చెందిన బెల్ 212 విమానం శుక్రవారం మదురు ఓయాలోని జలాశయంలో కూలిపోయింది. ఆర్మీ స్పెషల్ ఫోర్సెస్ బ్రిగేడ్ పాసింగ్ ఔట్ పరేడ్‌లో ప్రదర్శనకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఆరుగురు సైనికులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు వైమానిక దళం, నలుగురు స్పెషల్ ఫోర్స్ సైనికులు ఉన్నారు. ప్రమాదంపై విచారణ జరిపేందుకు శ్రీలంక వైమానిక దళం తొమ్మిది మంది సభ్యులతో కూడిన కమిటీని నియమించింది.

మే 15 వరకు 24 విమానాశ్రయాల మూసివేత

- పలు జాతీయ, అంతర్జాతీయ విమానాల రద్దు
- విమానాశ్రయాలకు భద్రత పెంపు

న్యూఢిల్లీ/గోపాలపట్నం(విశాఖ): శ్రీనగర్, చండీగఢ్ సహా దేశంలోని ఉత్తర, పశ్చిమ ప్రాంతాల్లో 24 విమానాశ్రయాలను మే 15 వరకు మూసివేశారు. విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసివేయడంతో తమ విమానాలను రద్దు చేసినట్లు విమానయాన సంస్థలు శుక్రవారం తెలిపాయి. మే 15 ఉదయం 05:29 గంటల వరకు మూసివేత కొనసాగుతుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. మూసేసిన జాబితాలో చండీగఢ్, శ్రీనగర్, అమృత్‌సర్, లుధియానా, భుంతర్, కిషన్‌గఢ్, పాటియాలా, సిమ్లా, ధర్మశాల, బఠిండా, జైసల్మేర్, జోధ్‌పూ, లేహ్, బికనీర్, పఠాన్‌కోట్, జమ్మూ, జామ్‌నగర్, భుజ్ తదితర విమానాశ్రయాలున్నాయి. ఈ కాలంలో ప్రయాణించేందుకు టికెట్లు తీసుకున్న ప్రయాణికులందరికీ రీ షెడ్యూల్ చేస్తామని, రద్దు చేసుకుంటూ పూర్తిగా రీఫండ్ ఇస్తామని ఎయిరిండియా సహా అన్ని విమానయాన సంస్థలు ప్రకటించాయి. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తూ ఈ ముందుజాగ్రత్త చర్యలు చేపట్టినట్లు ఎయిర్‌లైన్స్ సంస్థలు తెలిపాయి.

ఢిల్లీ విమానాశ్రయంలో శుక్రవారం 138 విమానాలు రద్దు

శుక్రవారం ఢిల్లీ విమానాశ్రయానికి రాకపోకలు సాగించే 138 విమానాలను వివిధ విమానయాన సంస్థలు రద్దు చేశాయి. శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్య మొత్తం 66 దేశీయ నిష్క్రమణలు, 63 రాకపోకలు, 5 అంతర్జాతీయ నిష్క్రమణలు, 4 రాకపోకలను రద్దు చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఢిల్లీ విమానాశ్రయ కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతున్నాయి. గగనతలంలో ఉద్రిక్త పరిస్థితులు, పెరిగిన భద్రతా చర్యల కారణంగా కొన్ని విమానాల షెడ్యూల్లు, భద్రతా ప్రాసెసింగ్ సమయాలు ప్రభావితం కావచ్చని ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ తెలిపింది. తనిఖీల నిమిత్తం భద్రతా చెక్‌పోస్టుల వద్ద అదనపు సమయం వెచ్చించడానికి సిద్ధంగా ఉండాలని, సజావుగా సాగేందుకు భద్రతా సిబ్బందికి సహకరించాలని డీఐఏఎల్ ప్రయాణికులకు సూచించింది.

విశాఖ విమానాశ్రయంలో భద్రత పెంపు..

భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో శాఖ విమానాశ్రయంలో భద్రత పెంచారు. సీఐఎస్ఎఫ్ జవాన్ల పహారా పెంచడంతోపాటు విమానాశ్రయం లోపలకు వెళ్లే వాహనాలను డాగ్, బాంబ్ స్క్వాడ్ అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు. అదనపు తనిఖీల దృష్ట్యా ప్రయాణికులు విమాన సమయానికి కనీసం 3 గంటల ముందు విమానాశ్రయానికి రావాలని సూచిస్తున్నారు.

పోర్ట్‌ఫోలియో విధానాన్ని ప్రవేశపెట్టిన వైస్రాయ్ ఎవరు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ



భారత రాజ్యాంగ పరిణామ క్రమం

1. రాజ్యాంగ భావనను తొలిసారి శాస్త్రీయంగా వివరించిన తత్త్వవేత్త ఎవరు?
   1) సోక్రటీస్ 2) అరిస్టాటిల్
   3) మాఖియవెల్లి 4) రూసో
2. కింది వాటిలో సరైంది ఏది?
   ఎ) ప్రపంచంలో మొదటి లిఖిత రాజ్యాంగం - అమెరికా
   బి) ప్రపంచంలో మొదటి అలిఖిత రాజ్యాంగం - బ్రిటన్
   1) ఎ సరైంది 2) బి సరైంది
   3) ఎ, బి సరైనవి 4) ఏదీకాదు
3. రాజ్యాంగ పాలన ప్రజల్లో చైతన్యానికి, స్ఫూర్తి నింపడానికే తప్ప నియంత్రణకు, బాని సత్వానికి సంకేతం కాదని పేర్కొన్న రాజ నీతిజ్ఞుడు ఎవరు?
   1) డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ 2) ఉడ్రో విల్సన్
   3) అరిస్టాటిల్ 4) లాక్
4. ఫోర్త్ ఎస్టేట్‌కు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
   1) బ్రిటన్ పార్లమెంట్‌లో సభ్యుడు ఎడ్‌బర్గ్ ఈ పదాన్ని తొలిసారి ప్రయోగించాడు
   2) ప్రభుత్వ అంగాలైన శాసన నిర్మాణ శాఖను మొదటి ఎస్టేట్‌గా, కార్యనిర్వాహక శాఖను రెండో ఎస్టేట్‌గా, న్యాయశాఖను మూడో ఎస్టేట్‌గా వ్యవహరిస్తారు
   3) పత్రికలను లేదా ఎలక్ట్రానిక్ మీడియాను ఫోర్త్ ఎస్టేట్‌గా వ్యవహరిస్తారు
   4) పైవన్నీ సరైనవే
5. రెగ్యులేటింగ్ చట్టం - 1773కి సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
   ఎ) భారతదేశానికి సంబంధించిన తొలి లిఖిత చట్టం
   బి) ఈ చట్టాన్ని 1773 మే 18న అప్పటి బ్రిటిష్ ప్రధాని లార్డ్ వార్త్ బ్రిటిష్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాడు
   సి) బెంగాల్ గవర్నర్ హోదాను గవర్నర్ జనరల్ ఆఫ్ బెంగాల్‌గా మర్చారు
   డి) ఈ చట్టం ప్రకారం మొదటి గవర్నర్ జనరల్ వారెన్ హేస్టింగ్స్
   1) ఎ, బి మాత్రమే సరైనవి
   2) బి, డి, మాత్రమే సరైనవి
   3) ఎ, బి, సి, డి 4) ఏదీకాదు
6. రెగ్యులేటింగ్ చట్టం - 1773కి సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
   1) ఈ చట్టం ఆధారంగా 1774లో కలకత్తాలోని పోర్ట్ విలియంలో సుప్రీంకోర్టును ఏర్పాటు చేశారు
   2) ఒక ప్రధాన న్యాయమూర్తి, ముగ్గురు సాధారణ న్యాయ మూర్తులు ఉన్నారు
   3) మొదటి ప్రధాన న్యాయమూర్తి సర్ ఎలిజా ఇంపే
   4) పైవన్నీ సరైనవే
7. రెగ్యులేటింగ్ చట్టం-1773లోని లోపాలను సవరించడానికి బ్రిటిష్ పార్లమెంట్ పిట్స్ ఇండియా చట్టాన్ని ఎప్పుడు చేసింది?
   1) 1780 2) 1784
   3) 1793 4) 1833
8. దేశంలో మొదటిసారిగా ద్వంద్వ పాలనకు నాంది ప్రస్తావన చేసిన చట్టం ఏది?
   1) రెగ్యులేటింగ్ చట్టం - 1773
   2) రెగ్యులేటింగ్ చట్టం -1784
   3) భారత కౌన్సిళ్ల చట్టం - 1909
   4) రెగ్యులేటింగ్ చట్టం - 1861
9. పిట్స్ ఇండియా చట్టం-1784కి సంబంధించి కింది వాటిలో సరైంది?
   1) ఈ చట్టం ప్రకారం ఇండియాలోని పరిపాలనాంశాలను రెండు రకాలుగా వర్గీకరించారు
   2) రాజకీయ వ్యవహారాలు - బోర్డ్ ఆఫ్ కంట్రోలర్, వాణిజ్య వ్యవహారాలు కోర్ట్ ఆఫ్ డైరక్టర్స్
   3) గవర్నర్ కార్యనిర్వాహక మండలి సంఖ్య నాలుగు నుంచి మూడుకు తగ్గించారు
   4) పైవన్నీ సరైనవే
10. చార్టర్ చట్టం-1793 చేసినప్పుడు గవర్నర్ జనరల్ ఎవరు?
    1) వారెన్ హేస్టింగ్స్
    2) కారన్ వాలీస్
    3) విలియం బెంటింక్ 4) ఎవరూకాదు
11. భారత్‌లో క్రైస్తవ మిషనరీలు, చర్చిలు, క్రైస్తవ మిషనరీ హాస్టళ్లను ఏ చట్టం ద్వారా నెలకొల్పారు?
    1) రెగ్యులేటింగ్ చట్టం -1773
    2) రెగ్యులేటింగ్ చట్టం -1784
    3) రెగ్యులేటింగ్ చట్టం -1793
    4) రెగ్యులేటింగ్ చట్టం -1813
12. పన్నులు విధించడానికి, అవి చెల్లించడానికి, చెల్లించని వారిపై చర్యలను తీసుకొనే అధికారాన్ని స్థానిక సంస్థలకు ఏ చట్టం ద్వారా కల్పించారు?
    1) రెగ్యులేటింగ్ చట్టం -1813
    2) భారత కౌన్సిళ్ల చట్టం - 1909
    3) భారత కౌన్సిళ్ల చట్టం - 1919
    4) భారత ప్రభుత్వ చట్టం - 1935
13. చార్టర్ చట్టం -1813కి సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
    1) భారతీయ విద్యాభివృద్ధికి ఒక లక్ష రూపాయాలతో నిధి ఏర్పాటు చేశారు
    2) సివిల్ సర్వెంట్లకు శిక్షణా సదుపాయాన్ని కల్పించారు
    3) ఈ చట్టం ద్వారా మత మార్పిడులకు అవకాశం ఏర్పడింది
    4) మత నియోజక వర్గాలను ఏర్పాటు చేశారు
14. చార్టర్ చట్టం-1833కి సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
    ఎ) బెంగాల్ గవర్నర్ జనరల్ హోదాను ఇండియన్ గవర్నర్ జనరల్‌గా మార్చారు
    బి) తొలి ఇండియన్ గవర్నర్ జనరల్ విలియం బెంటింక్
    1) ఎ సరైంది, బి సరికాదు
    2) ఎ సరైంది కాదు, బి సరైంది
    3) ఎ, బి రెండూ సరైనవే
    4) ఎ, బి రెండూ సరైనవి కాదు
15. చార్టర్ చట్టం-1833 ప్రకారం భారతీయ లా కమిషన్ అధ్యక్షుడు ఎవరు?
    1) లార్డ్ మెకాలే 2) లార్డ్ కారన్ వాలీస్
    3) లార్డ్ మింటో 4) ఎవరూ కాదు
16. 1935 భారత ప్రభుత్వ చట్టాన్ని ఉద్దేశించి 'బానిసత్వానికి ఒక నూతన చట్టాన్ని భారత దేశంపై రుద్దారు. ఇంజన్ లేకుండా గట్టి బ్రేకులున్న యంత్రం' అని వ్యాఖ్యానించిన వారు?
    1) జవహర్ లాల్ నెహ్రూ
    2) గాంధీజీ 3) జిన్నా
    4) సుభాష్ చంద్రబోస్
17. చార్టర్ చట్టాల్లో చివరిది ఏది?
    1) చార్టర్ చట్టం - 1853
    2) చార్టర్ చట్టం - 1833
    3) చార్టర్ చట్టం - 1813
    4) చార్టర్ చట్టం - 1793
18. జతపరచండి.
    జాబితా-I
    i) సివిల్ ప్రొసిజర్ కోడ్
    ii) ఇండియన్ పీనల్ కోడ్
    iii) క్రిమినల్ ప్రొసిజర్ కోడ్
    iv) POTA చట్టం
    జాబితా-II
    a) 1859 b) 1860
    c) 1861 d) 2002
    1) i-a, ii-b, iii-c, iv-d
    2) i-d, ii-c, iii-b, iv-a
    3) i-b, ii-a, iii-d, iv-c
    4) i-c, ii-d, iii-a, iv-b
19. భారత ప్రభుత్వం చట్టం - 1858 (కౌన్సిల్ చట్టాలు)లో పొందుపరిచిన అంశం ఏది?
    1) గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండియా హోదాను వైస్రాయ్ ఆఫ్ ఇండియాగా మార్చారు
    2) తొలి వైస్రాయ్ లార్డ్ కానింగ్
    3) బోర్డ్ ఆఫ్ కంట్రోల్ రద్దు 4) పైవన్నీ
20. భారత ప్రభుత్వ చట్టం - 1935కి సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
    1) సమాఖ్య వ్యవస్థ ప్రతిపాదన
    2) ఆర్‌బీఐ ఏర్పాటు
    3) ఫెడరల్ న్యాయస్థానం ఏర్పాటు
    4) సార్వజనీన ఓటు హక్కు
21. పిట్స్ ఇండియా చట్టం-1784 ద్వారా ప్రవేశపెట్టిన బోర్డ్ ఆఫ్ కంట్రోల్/ కోర్ట్ ఆఫ్ డైరక్టర్స్ అనే ద్వంద్వ పాలన ఏ చట్టం ద్వారా రద్దయింది?
    1) భారత కౌన్సిల్ చట్టం -1858
    2) కౌన్సిళ్ల చట్టం - 1861
    3) కౌన్సిళ్ల చట్టం - 1792
    4) భారత కౌన్సిళ్ల చట్టం-1909
22. భారత కౌన్సిళ్ల చట్టం - 1858 ప్రకారం వైస్రాయ్ పదవీకాలం ఎన్నేళ్లు?
    1) 3 2) 5 3) 1 4) 4
23. భారత కౌన్సిళ్ల చట్టం-1858 సారాంశాన్ని వైస్రాయ్ లార్డ్ కానింగ్ ఏ నగరంలో చదివి వినిపించాడు?
    1) ఢిల్లీ 2) ఆగ్రా
    3) అలహాబాద్ 4) లండన్
24. పోర్ట్‌ఫోలియో విధానం ప్రవేశపెట్టిన వైస్రాయ్ ఎవరు?
    1) లార్డ్ కానింగ్ 2) మింటో
    3) విలియం బెంటింక్ 4) వెవేల్
25. ఇండియా పాలన బ్రిటిష్ చక్రవర్తి లేదా రాణి ఆధీనంలో వచ్చినట్లు బ్రిటిష్ విక్టోరియా రాణి ఎప్పుడు ప్రకటన చేసింది?
    1) 1857 నవంబర్ 1
    2) 1857 డిసెంబర్ 1
    3) 1858 అక్టోబర్ 11
    4) 1858 నవంబర్ 1
26. భారత వైస్రాయ్/ గవర్నర్ జనరల్‌కు ఆర్డినెన్స్ జారీ చేసే అధికారం కల్పించిన చట్టం?
    1) రెగ్యులేటింగ్ చట్టం - 1861
    2) భారత ప్రభుత్వ చట్టం -1935
    3) భారత కౌన్సిళ్ల చట్టం - 1909
    4) రెగ్యులేటింగ్ చట్టం - 1858
27. 1860లో బ్రిటిష్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పద్ధతి ఏది?
    1) పోర్ట్‌పోలియో పద్ధతి 2) బడ్జెట్ పద్ధతి
    3) 1, 2 4) ఏదీకాదు
28. బ్రిటిష్ ప్రభుత్వం సివిల్ సర్వీస్‌ల వయో పరిమితిని 1878లో 19 ఏళ్లకు తగ్గించింది. మళ్లీ ఏ సంవత్సరం నుంచి దాన్ని 24 సంవత్సరాలకు పెంచారు?
    1) 1892 2) 1905
    3) 1895 4) 1891
29. మతతత్వ నియోజక వర్గాల పితామహుడిగా ఎవరిని పిలుస్తారు?
    1) వారన్ హేస్టింగ్స్ 2) లార్డ్ కానింగ్
    3) విలియం బెంటింక్ 4) లార్డ్ మింటో
30. మత ప్రాతిపదికన తొలిసారి నియోజకవర్గ గణాల ఏర్పాటుకు అవకాశం కల్పించిన చట్టం?
    1) భారత కౌన్సిళ్ల చటం-1919
    2) భారత ప్రభుత్వ చట్టం - 1935
    3) భారత కౌన్సిళ్ల చటం-1909
    4) భారత స్వాతంత్ర్య చట్టం-1947
31. భారత కౌన్సిళ్ల చట్టం-1909కి సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
    ఎ) ఈ చట్టాన్ని మింటో - మార్లే సంస్కరణలు అని పేర్కొంటారు
    బి) అప్పటి గవర్నర్/ వైస్రాయ్ లార్డ్ - మింటో, భారత వ్యవహారాల కార్యదర్శి - మార్లే
    సి) గవర్నర్ కార్యనిర్వాహక మండలిలో తొలిసారి భారతీయులకు సభ్యత్వాన్ని కల్పించారు
    డి) సభ్యత్వాన్ని పొందిన తొలి భారతీయుడు సత్యేంద్ర ప్రసాద్ సిన్హా
    1) ఎ, బి సరైనవి 2) బి, సి సరైనవి
    3) సి, డి సరైనవి 4) ఎ, బి, సి, డి
32. భారత కౌన్సిళ్ల చట్టం - 1909ను ఉద్దేశించి హిందువులకు, ముస్లింలకు మధ్య వేర్పాటు బీజాలు వేసి, వారి మధ్య అడ్డుగోడలు సృష్టించిందని, భారత విభజనకు నాంది పలికిందని వ్యాఖ్యానించింది ఎవరు?
    1) డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ 2) గాంధీజీ
    3) జవహర్‌లాల్ నెహ్రూ 4) ఎవరూకాదు
33. 1919 చట్టానికి సంబంధించి కింది వాటిలో సరైనవి ఏవి?
    ఎ) 1919 భారత ప్రభుత్వ చట్టాన్ని మాంటేగు - ఛేమ్స్‌ఫర్డ్ సంస్కరణలు అని పేర్కొంటారు
    బి) నాటి భారత కార్యదర్శి మాంటేగు
    సి) నాటి భారత వైస్రాయ్ ఛేమ్స్‌ఫర్డ్
    డి) ఈ చట్టాన్ని 1919లో రూపొందించినప్పటికీ 1921 నుంచి అమల్లోకి వచ్చింది
    1) ఎ, బి, సి, డి 2) ఎ, డి
    3) ఎ, బి, సి 4) పైవేవీకాదు
34. మాంటెగు - చెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు -1919కు సంబంధించి కింది వాటిలో సరైంది?
    1) రాష్ట్రస్థాయిలో ద్వంద్వ పాలనను ప్రవేశపెట్టారు
    2) దేశంలో మొదటిసారిగా ద్విసభా పద్ధతిని ప్రవేశపెట్టారు
    3) భారత హైకమిషనర్ అనే పదవిని సృష్టించారు 4) పైవన్నీ సరైనవే
35. ఏ కమిటీ సూచన మేరకు భారత్‌కు విడిగా ఒక పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటు చేశారు?
    1) లీ కమిషన్ 2) సైమన్ కమిషన్
    3) క్రిప్స్ కమిషన్ 4) ఏదీకాదు
36. మత ప్రాతినిధ్యం ప్రకారం సిక్కులకు, క్రిస్టియన్లకు, ఆంగ్లో ఇండియన్లకు, ఐరోపా వారికి ప్రత్యేక నియోజక వర్గాలను ఏ చట్టం ప్రకారం ప్రకటించారు?
    1) భారత కౌన్సిళ్ల చట్టం - 1909
    2) భారత కౌన్సిళ్ల చట్టం -1919
    3) భారత ప్రభుత్వ చట్టం-1935
    4) భారత స్వాతంత్ర్య చట్టం - 1947
37. '1919 సంస్కరణలు అసంతృప్తి, నిరాశతో పాటు సూర్యుడులేని ఉదయం'గా ఉందని అభిప్రాయపడింది ఎవరు?
    1) బాలగంగాధర్ తిలక్
    2) బిపిన్ చంద్రపాల్
    3) లాలా లజపతిరాయ్
    4) అరవింద ఘోష్
38. ఏ సంస్కరణలను బ్రిటిషర్లు ప్రకటించి ఉండాల్సింది కాదని, ఏ చట్టాన్ని భారతీయులు స్వీకరించడం తగదని శ్రీమతి అనీబిసెంట్ ఏ చట్టాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు?
    1) భారత కౌన్సిళ్ల చట్టం - 1919
    2) భారత కౌన్సిళ్ల చట్టం -1909
    3) భారత ప్రభుత్వ చట్టం-1935
    4) భారత స్వాతంత్ర్య చట్టం - 1947
39. సైమన్ కమిషన్‌ను బ్రిటిష్ ప్రధాని బాల్డ్విన్ ఎప్పుడు ప్రకటించాడు?
    1) 1927 జనవరి
    2) 1927 ఆగస్టు
    3) 1927 నవంబర్ 4) 1927 డిసెంబర్
40. సైమన్ కమిషన్ భారతదేశానికి ఏ సంవత్సరం లో వచ్చింది?
    1) 1927 2) 1928
    3) 1929 4) 1930

సమాధానాలు

1) 2	2) 3	3) 3	4) 4
5) 3	6) 4	7) 2	8) 2
9) 4	10) 2	11) 4	12) 1
13) 4	14) 3	15) 1	16) 1
17) 1	18) 1	19) 4	20) 4
21) 1	22) 2	23) 3	24) 1
25) 4	26) 1	27) 3	28) 1
29) 4	30) 3	31) 4	32) 3
33) 1	34) 4	35) 1	36) 2
37) 1	38) 1	39) 3	40) 2

'కనికట్టు' విద్యను ప్రదర్శించే జానపదులు?



జానపద సాహిత్యం

డీఎస్సీలో 'జానపద సాహిత్యం' తప్పనిసరి అంశం. లాంగ్వేజ్ పండిట్-తెలుగు, స్కూల్ అసిస్టెంట్ -తెలుగు ఇలా పరీక్షల స్వభావాన్ని బట్టి మార్కుల ప్రాధాన్యముంటుంది. అభ్యర్థులు ఈ విభాగంలో మార్కులు సాధించాలంటే డా॥ జి.ఎస్. మోహన్ 'జానపద విజ్ఞానాధ్యయనం', ఆర్వీయస్ సుందరం 'ఆంధ్రుల జానపద విజ్ఞానం' గ్రంథాలను సేకరించి అధ్యయనం చేయాలి. ప్రత్యేకంగా నోట్స్ తయారు చేసుకోవాలి. అప్పుడే మంచి స్కోరు సాధించవచ్చు. ఈ విభాగంలో ప్రత్యేకించి 'జానపద సాహిత్య పరిచయం - లక్షణాలు - వర్గీకరణ - జానపద సాహిత్య సేకరణలో తెలుగువారి కృషి - పాశ్చాత్యుల కృషి - జానపద సాహిత్య విశేషాలు - జానపద కళారూపాలు - జానపద కళాకారులు, వారి వాద్య విశేషాలు - జానపద సాహిత్యంపై వచ్చిన పరిశోధనలు' మొదలైన అంశాలను క్షుణ్నంగా అధ్యయనం చేయాలి.

రిచర్డ్ ఎం. డార్సన్ 1972లో 'ఫోక్‌లోర్ అండ్ ఫోక్‌లైఫ్' గ్రంథ ఉపోద్ఘాతంలో జానపద విజ్ఞానాన్ని నాలుగు విధాలుగా వర్గీకరించారు. అవి..

1. **మౌఖిక జానపద విజ్ఞానం:** జానపద గేయాలు, కథా గేయాలు, జానపద పురాణాలు, ఇతిహాసాలు, గద్య కథనాలు, సామెతలు, పొడుపు కథలు, మాండలికాలు, నుడికారాలు, తిట్లు, ఒట్లు మొదలైనవన్నీ ఈ విభాగంలోకి వస్తాయి.
2. **సాంఘిక జానపదాచారాలు:** పుట్టుక, వివాహం ,మరణం తదితరాంశాలకు సంబంధించిన ఆచారాలు, కుటుంబం, సంబంధ బాంధవ్యాలు, పండుగలు, వినోదాలు, ఆటలు, జానపద వైద్యం, మతం, నమ్మకం మొదలైనవన్నీ ఈ విభాగంలో చేరతాయి.
3. **వస్తు సంస్కృతి:**
   భౌతిక జీవితానికి సంబంధించిన అన్ని వస్తువులే కాకుండా కళారూపాలు కూడా వస్తు రూపంలో ఉంటే ఈ విభాగంలోనే చోటు పొందుతాయి. చిత్రకళ, వాస్తుకళ, వివిధ వృత్తుల పరికరాలు, దుస్తులు, అలంకరణ, ఆభరణాలు, ఆహార సామగ్రి, పూజా సామగ్రి, శిలా విగ్రహాలు, దారు విగ్రహాలు తదితర వస్తు రూపాంశాలెన్నో ఈ విభాగంలో వస్తాయి.
4. **జానపద కళలు:**
   సంగీతం, నృత్యం, అభినయం ఉండే ప్రదర్శన కళలన్నీ ఈ విభాగంలో చేరతాయి. గాత్ర సంగీతం, వాద్య సంగీతం, తోలు బొమ్మలాటలు, యక్షగానం, వీధి భాగోతం, కోలాటం, పగటి వేషాలు, బహురూపుల గారడీ విద్యలు మొదలైనవి ఈ విభాగంలో వస్తాయి.

జానపద సాహిత్యం- పరిశోధనలు

1. జానపద గేయ సాహిత్యం - బిరుదురాజు రామరాజు
2. జానపద గేయగాథలు - నాయని కృష్ణకుమారి
3. జానపద కళాసంపద -తూమాటి దోణప్ప
4. జానపద కళారూపాలు - మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి
5. తోలుబొమ్మలాట - మొదలి నాగభూషణశర్మ
6. వీరగాథ వాఙ్మయం - తంగిరాల సుబ్బారావు
7. యక్షగాన వాఙ్మయం - ఎస్వీ జోగారావు
8. జానపద కథా స్రవంతి - కె.సుమతి
9. జానపద సాహిత్యం - పురాగాథలు - రావి ప్రేమలత
10. తెలుగు సామెతలు - చిలుకూరి నారాయణరావు
11. స్త్రీల రామాయణ పాటలు - శ్రీపాద గోపాలకృష్ణమూర్తి

భిక్షకులు - ఆశ్రయం

1. పిచ్చుకుంట్లు - రెడ్డి కులాశ్రితులు
2. వీరముష్టివారు -వైశ్యాశ్రితులు
3. భట్రాజులు - క్షత్రియాశ్రితులు
4. విప్రవినోదులు - బ్రాహ్మణాశ్రితులు

జానపద సాహిత్యాన్ని ఎవరు ఎలా పిలిచారు

1. దేశీసారస్వతం - శ్రీపాద గోపాల కృష్ణమూర్తి
2. ప్రజావాఙ్మయం - ఖండవల్లి లక్ష్మీరంజనం
3. పదవాఙ్మయం - తల్లావఝ్జుల శివశంకర శాస్త్రి
4. మధుర గీతాలు - వేటూరి ప్రభాకర శాస్త్రి
5. అనాదృత వాఙ్మయం - మల్లంపల్లి సోమశేఖర శర్మ

మాదిరి ప్రశ్నలు

1. 'Folk Lore' అంటే?
   1) జానపదుల అధ్యయనం
   2) జానపద విజ్ఞానం
   3) జానపద సాహిత్యం
   4) జానపదుల మూఢనమ్మకం
2. జానపద గేయాల ప్రధాన లక్షణాలు?
   1) లిఖిత ప్రచారం, ఏక కర్తృకం
   2) మౌఖిక ప్రచారం, జ్ఞాత కర్తృకం
   3) ఆశురచన, అనామక కర్తృతం
   4) అకృతక శైలి, గానయోగ్యతారాహిత్యం
3. ఆంధ్రుల జానపద సాహిత్య సేకరణలో తీవ్ర కృషి చేసినవారు?
   1) ఆర్వీయస్ సుందరం
   2) నేదునూరి గంగాధరం
   3) జి.ఎస్.మోహన్
   4) బిరుదురాజు రామరాజు
4. 'జానపద వాఙ్మయోద్ధారక' బిరుదాంకితులు?
   1) నేదునూరి గంగాధరం
   2) బిరుదురాజు రామరాజు
   3) తంగిరాల సుబ్బారావు
   4) ఆర్వీయస్ సుందరం
5. శారద కాంద్రు ఏ ప్రాంతానికి చెందినవారు?
   1) తెలంగాణ 2) కోస్తాంధ్ర
   3) రాయలసీమ 4) బీదర్
6. 'తోలుబొమ్మలాట' జానపద విజ్ఞానంలో ఏ విభాగానికి చెందింది?
   1) మౌఖిక జానపద విజ్ఞానం
   2) సాంఘిక జానపదాచారాలు
   3) వస్తు సంస్కృతి
   4) జానపద కళలు
7. తెలుగు జానపద సాహిత్యాన్ని మానవశాస్త్ర దృష్టితో పరిశీలించిన తొలి మహిళా పరిశోధకురాలు?
   1) నాయని కృష్ణకుమారి
   2) కుసుమ కుమారి
   3) డి. లలిత కుమారి
   4) రావి ప్రేమలత
8. యక్షగానం దేనికి సంబంధించింది?
   1) జానపద కళ 2) శిల్పకళ
   3) నాట్య కళ 4) అదృశ్య కళ
9. 'పసిడిపలుకులు', 'మిన్నేరు', 'సెలయేరు' జానపద రచనలు ఎవరు చేశారు?
   1) బిరుదురాజు రామరాజు
   2) ఆర్వీఎస్ సుందరం
   3) నేదునూరి గంగాధరం
   4) జి.ఎస్. మోహన్
10. జానపద సాహిత్య స్వరూపం ఎవరి రచన?
    1) నేదునూరి గంగాధరం
    2) ఆర్వీఎస్ సుందరం
    3) జి.ఎస్. మోహన్
    4) బిరుదురాజు రామరాజు
11. 'జానపద కళాసంపద' పేరుతో ఎనిమిది ఉత్తమ వ్యాస సంపుటాలను ఎవరు వెలువరించారు?
    1) నేదునూరి గంగాధరం
    2) ఆర్వీఎస్ సుందరం
    3) తంగిరాల సుబ్బారావు
    4) తూమాటి దోణప్ప
12. జానపద కళారూపాలపై విశిష్ట గ్రంథం రాసిందెవరు?
    1) యస్వీ జోగారావు
    2) మొదలి నాగభూషణ శర్మ
    3) శ్రీపాద గోపాలకృష్ణమూర్తి
    4) మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి
13. సంగీత, నృత్య ప్రధానమైన దేశీ రూపకం?
    1) కోలాటం 2) తప్పెటగుళ్లు
    3) యక్షగానం 4) బుర్రకథ
14. ఏ ప్రక్రియకు ప్రాచీన రూపంగా 'కొర వంజిని' ని పేర్కొంటారు?
    1) కథా కావ్యం 2) యక్షగానం
    3) చారిత్రక కావ్యం 4) ఇతిహాసం
15. జానపదుల కథల మీద విశేషంగా కృషి చేసిన పాశ్చాత్యుడు?
    1) రిచర్డ్ ఎం. డార్సన్
    2) స్టిత్ థాంప్సన్
    3) జె.ఎ.బోయల్ 4) సి.పి. బ్రౌన్
16. తెలుగులో జానపద గేయాలను ప్రచురించిన వారిలో మొదటివారు?
    1) నేదునూరి గంగాధరరావు
    2) నందిరావు చలపతిరావు
    3) జె.ఎ.బోయల్ 4) సి.పి. బ్రౌన్
17. తోలుబొమ్మలాట, వీధి భాగవతం అనేవి ఏ కళలలోకి వస్తాయి?
    1) జానపద కళలు 2) నృత్య కళలు
    3) నాటక కళలు 4) సంగీత కళలు
18. వంతపాట గల కళారూపమేది?
    1) హరికథ 2) బుర్రకథ
    3) తోలుబొమ్మలాట 4) ప్రహసనం
19. కృష్ణ చెంచులక్ష్మీ సంవాదం, గంగా గౌరీ సంవాదం అనే జానపద గేయాల్లో ఉన్న రసమేది?
    1) శృంగారం 2) హాస్యం
    3) కరుణ 4) అద్భుతం
20. 'జానపద గేయవాఙ్మయ పరిచయం' ఎవరు రచించారు?
    1) ఆచార్య నాయని కృష్ణకుమారి
    2) ఆచార్య బి. రామరాజు
    3) ఆచార్య యస్వీ జోగారావు
    4) హరి ఆదిశేషువు
21. 'ఆంధ్రుల జానపద విజ్ఞానం' రచయిత?
    1) ఆర్వీయస్ సుందరం
    2) బి. రామరాజు
    3) తంగిరాల సుబ్బారావు
    4) యస్వీ జోగారావు
22. 'తెలుగు హరికథా సర్వస్వం' జానపద పరిశోధన గ్రంథం ఎవరిది?
    1) తూమాటి దోణప్ప
    2) బిరుదురాజు రామరాజు
    3) తంగిరాల సుబ్బారావు
    4) ఆర్వీయస్ సుందరం
23. తెలుగులో జానపద గేయాల్లో పల్నాటి వీర చరిత్ర కథాగేయాన్ని ఎవరు సేకరించారు?
    1) సి.పి. బ్రౌన్ 2) జె.ఎ.బోయల్
    3) మెకంజీ 4) కాంప్‌బెల్
24. జుట్టు పోలిగాడు, కేతిగాడు, బంగారక్క పాత్రలున్న కళారూపం?
    1) ఒగ్గు కథ 2) తోలు బొమ్మలాట
    3) వీధి భాగోతం 4) పగటి వేషాలు
25. గోండుల నృత్య విశేషం?
    1) బంజారా 2) మామిడి
    3) గుస్సాడి 4) లంబాడీ
26. జానపద కళాకారులగు బవనీల వాద్య విశేషం?
    1) డమరుకం 2) తప్పెట
    3) గంట, శంఖం 4) జమిడిక

సమాధానాలు

1) 2;	2) 3;	3) 2;	4) 1;
5) 1;	6) 4;	7) 1;	8) 1;
9) 3;	10) 2;	11) 4;	12) 4;
13) 3;	14) 2;	15) 2;	16) 3;
17) 1;	18) 2;	19) 2;	20) 4;
21) 1;	22) 1;	23) 1;	24) 2;
25) 3;	26) 4.		

'రాజుల్లో సూర్యుడు' అని పేరొందిన వారెవరు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

వరల్డ్ హిస్టరీ

మాదిరి ప్రశ్నలు

1. 'పునరుజ్జీవనోద్యమ సాహిత్య పిత'గా ఎవరిని పేర్కొంటారు?
   1) గిట్టో 2) బొకాషియో
   3) పెట్రార్క్ 4) డ్యూరర్
2. జతపరచండి.
   జాబితా – I
   i) కాక్స్‌టన్ ii) జాన్ గూటన్‌బర్గ్
   iii) ఛాసర్ iv) డాంటే
   జాబితా – II
   ఎ) జర్మనీలో ముద్రణా యంత్రం నెలకొల్పాడు
   బి) ఇంగ్లండ్‌లో ముద్రణా యంత్రం నెలకొల్పాడు
   సి) డివైన్ కామెడీ గ్రంథం రాశాడు
   డి) ఆంగ్ల కవితాపిత
   1) i- ఎ, ii- సి, iii- బి, iv-డి
   2) i- డి, ii- బి, iii- సి, iv-ఎ
   3) i- ఎ, ii- బి, iii- సి, iv-డి
   4) i- బి, ii- ఎ, iii- డి, iv-సి
3. 'ఈ విశ్వాన్ని సృష్టించిందీ, నడిపిస్తున్నదీ మేధస్సే' అని వ్యాఖ్యానించిన వారు?
   1) థామస్ అక్వినాస్ 2) ఫ్రాన్సిస్ బేకన్
   3) జాన్ గూటన్ బర్గ్ 4) గెలీలియో
4. జతపరచండి.
   జాబితా – I
   i) విప్లవాల మాత ii) పార్లమెంట్‌ల మాత
   iii) ఐరోపా జబ్బు మనిషి
   iv) దైవ శాపగ్రస్థ దేశం
   జాబితా – II
   ఎ) జర్మనీ బి) టర్కీ
   సి) ఇంగ్లండ్ డి) ఫ్రాన్స్
   1) i- ఎ, ii- సి, iii- బి, iv-డి
   2) i- డి, ii- సి, iii- బి, iv-ఎ
   3) i- ఎ, ii- బి, iii- సి, iv-డి
   4) i- బి, ii- ఎ, iii- డి, iv-సి
5. వ్లాదిమిర్ ఇల్విచ్ ఉల్యనోవ్ అనేది ఎవరి అసలు పేరు?
   1) లెనిన్ 2) స్టాలిన్
   3) టాట్స్కీ 4) మొదటి జేమ్స్
6. ఆంగ్లేయ మహా విప్లవం ఎప్పుడు సంభవించింది?
   1) క్రీ.శ. 1666 2) క్రీ.శ. 1676
   3) క్రీ.శ. 1688 4) క్రీ.శ. 1698
7. పార్లమెంట్ అనే పదానికి మూలమైన 'పార్లీ' అనే పదానికి అర్థం?
   1) చర్చలు, సంప్రదింపులు
   2) రాయడం, వ్యాఖ్యానించడం
   3) ఆసక్తి, పరిశీలన 4) ఆదాయం, వ్యయం
8. కింది వాటిలో ఇంగ్లండ్ 'బిల్ ఆఫ్ రైట్స్'లో ఉండే అంశం ఏది?
   1) పార్లమెంట్ అనుమతి లేనిదే పన్నులు వసూలు చేయకూడదు
   2) పార్లమెంట్‌ను ఎన్నుకోవాలి, తరచూ సమావేశాలు నిర్వహించాలి
   3) శాంతి నెలకొన్న తరుణంలో పార్లమెంట్ అనుమతి లేకుండా శాశ్వత సైన్యాన్ని పోషించకూడదు
   4) ప్రైవసీ సరైనవే
9. జతపరచండి.
   జాబితా – I
   i) లాంగ్ పార్లమెంట్ (ఇంగ్లండ్)
   ii) మొదటి చార్లెస్ (ఇంగ్లండ్) పాలనాకాలం
   iii) లెనిన్ (రష్యా) పాలనాకాలం
   iv) 15వ లూయీ (ఫ్రాన్స్) పాలనాకాలం
   జాబితా – II
   ఎ) 1625 – 1649 బి) 1640 – 1660
   సి) 1715 – 1774 డి) 1917 – 1924
   1) i- బి, ii- ఎ, iii- డి, iv-సి
   2) i- డి, ii- సి, iii- బి, iv-ఎ
   3) i- ఎ, ii- బి, iii- సి, iv-డి
   4) i- బి, ii- ఎ, iii- సి, iv-డి
10. అమెరికాలో సంపూర్ణ స్వాతంత్ర్య ప్రకటన చేసిన ప్రాంతం ఏది?
    1) ఫిలడెల్ఫియా 2) జార్జియా
    3) న్యూయార్క్ 4) వర్జీనియా
11. బ్రెజిల్ పోర్చుగల్ నుంచి ఎప్పుడు స్వాతంత్ర్యం పొందింది?
    1) 1813 2) 1822
    3) 1833 4) 1843
12. 'ప్రపంచ కార్మికులారా ఏకంకండి. పోరాడితే పోయేదేమీ లేదు. బానిస సంకెళ్లు తప్ప' అని పిలుపునిచ్చిందెవరు?
    1) ఫ్రెడరిక్ ఏంజెల్ 2) కారల్ మార్క్స్
    3) బెనిటో ముస్సోలిని
    4) నెపోలియన్ బోనాపార్టే
13. వర్జీనియాలోని యార్క్‌టౌన్ ద్వీపకల్పం వద్ద అమెరికా సేనలకు లొంగిపోయిన బ్రిటిష్ సైన్యాలకు నాయకుడు ఎవరు?
    1) వారన్ హేస్టింగ్స్ 2) వెల్లస్లీ
    3) రాబర్ట్ క్లైవ్ 4) కారన్ వాలీస్
14. కింది వాటిలో సరికాని జత ఏది?
    1) న్యూడీల్ పథకం – ఎఫ్.డి. రూజ్‌వెల్ట్ (అమెరికా)
    2) నూతన ఆర్థిక విధానం – లెనిన్ (రష్యా)
    3) రక్తపాత విధానం – ఆటోవాన్ బిస్మార్క్ (జర్మనీ)
    4) కాల్బర్టిజం – నెక్కర్ (ఫ్రాన్స్)
15. రెండో నల్లమందు యుద్ధానికి తక్షణ కారణం ఏది?
    1) లోర్చాయారో నౌక ఉదంతం
    2) చైనా మకావో ఓడరేవును మూసి వేయడం
    3) ఇంగ్లండ్‌లో చైనా వారు అసాంఘిక కార్య కలాపాలకు పాల్పడటం
    4) చైనా భూగర్భంలో తలపెట్టిన రైలు మార్గ నిర్మాణం
16. 'విముక్తినిచ్చిన జార్' అని ఎవరిని అంటారు?
    1) జార్ మొదటి అలెగ్జాండర్
    2) జార్ మొదటి నికోలస్
    3) జార్ మూడో అలెగ్జాండర్
    4) జార్ రెండో అలెగ్జాండర్
17. నాజీ పార్టీ స్థాపకుడు ఎవరు?
    1) అడాల్ఫ్ హిట్లర్ 2) డ్రెక్లర్
    3) రిబ్బెన్ ట్రాప్ 4) వాన్‌రూన్



18. గ్రంథం, దాని రచయితకు సంబంధించి కింది వాటిలో సరికాని జత ఏది?
    జాబితా – I
    i) మైన్‌కాంఫ్
    ii) ఎ స్టడీ ఆఫ్ ఫిజికల్ కల్చర్
    iii) సోషల్ కాంట్రాక్ట్
    iv) స్పిరిట్ ఆఫ్ లాస్
    జాబితా – II
    ఎ) మావోట్సేటుంగ్ బి) అడాల్ఫ్ హిట్లర్
    సి) మాంటెస్క్యూ డి) రూసో
    1) i- ఎ, ii- సి, iii- బి, iv-డి
    2) i- బి, ii- ఎ, iii- డి, iv-సి
    3) i- ఎ, ii- బి, iii- సి, iv-డి
    4) i- బి, ii- ఎ, iii- సి, iv-డి
19. కింది వాటిలో సరైన జత ఏది?
    1) ఇండల్జెన్సెస్ – పాప పరిహార పత్రాలు
    2) లెజాఫేర్ – జోక్యం చేసుకోకు
    3) అపార్థీడ్ – వర్ణ వివక్ష
    4) పైవన్నీ సరైనవే
20. యూరప్‌లో ఆచరణలో ఉన్న 'పుట్టింగ్ ఔట్ పద్ధతి' అంటే?
    1) ముడి సరుకులను వృత్తి పని వారికి అప్పగించి పని చేయించడం
    2) ఓడరేవులను కార్మికులకు అప్పగించడం
    3) సముద్రాలపై వ్యాపార గుత్తాధిపత్యం కలిగి ఉండటం
    4) వ్యవసాయాన్ని వాణిజ్యీకరణ చేయడం
21. 'ది ప్రిన్స్' గ్రంథ రచయిత ఎవరు?
    1) మాకియవెల్లి 2) రాఫెల్
    3) డ్యూరర్ 4) ఎరాస్మస్
22. జతపరచండి.
    జాబితా – I
    i) దైవ దత్తాధికార సిద్ధాంతం అనుసరించిన వారు
    ii) మానవుడు సమాజం అనే సంకెళ్లలో బంధించబడ్డాడు అని వ్యాఖ్యానించిన వారు
    iii) 'వర్గ పోరాటపు రికార్డే చరిత్ర' అని పేర్కొన్నవారు
    iv) 'నేనే రాజ్యం' అని వ్యాఖ్యానించిన వారు
    జాబితా – II
    ఎ) 14వ లూయీ బి) కారల్ మార్క్స్
    సి) రూసో డి) మొదటి జేమ్స్
    1) i- ఎ, ii- సి, iii- బి, iv-డి
    2) i- డి, ii- సి, iii- బి, iv-ఎ
    3) i- ఎ, ii- బి, iii- సి, iv-డి
    4) i- బి, ii- ఎ, iii- డి, iv-సి
23. 'రాజుల్లో సూర్యుడు' అని పేరొందిన వారెవరు?
    1) 4వ హెన్రీ 2) 14వ లూయీ
    3) 15వ లూయీ 4) 16వ లూయీ
24. 'ఫ్రెంచ్ ఈస్టిండియా కంపెనీ'ని ఎప్పుడు స్థాపించారు?
    1) 1664 2) 1654
    3) 1668 4) 1678
25. పవిత్ర రోమన్ సామ్రాజ్యాన్ని విచ్ఛిన్నం చేసిందెవరు?
    1) 16వ లూయీ
    2) నెపోలియన్ బోనాపార్టే
    3) 7వ హెన్రీ 4) రెండో ఛార్లెస్
26. జతపరచండి.
    సంవత్సరం
    i) 1865 ii) 1869
    iii) 1898 iv) 1929
    ప్రాధాన్యం
    ఎ) ప్రపంచ ఆర్థిక మాంద్యం
    బి) అబ్రహం లింకన్ హత్య
    సి) చైనాలో వంద రోజుల సంస్కరణలు
    డి) సూయజ్ కాలువ తెరవడం
    1) i- ఎ, ii- సి, iii- బి, iv-డి
    2) i- బి, ii- డి, iii- సి, iv-ఎ
    3) i- ఎ, ii- బి, iii- సి, iv-డి
    4) i- బి, ii- ఎ, iii- డి, iv-సి
27. 'ఉదయించే సూర్యుడి భూమి'గా పేరొందిన దేశం?
    1) జర్మనీ 2) జపాన్
    3) ఇంగ్లండ్ 4) ఫ్రాన్స్
28. 'కార్బోనారీ' అంటే?
    1) బొగ్గు కాల్చేవారు 2) స్వేచ్ఛాపుత్రులు
    3) పన్నులు చెల్లించేవారు
    4) విద్యార్థులు
29. జతపరచండి.
    జాబితా – I
    i) ది మోనాలిసా చిత్రం
    ii) ప్రైస్ ఆఫ్ పాలీ గ్రంథం
    iii) గైడ్ టు జాగ్రఫీ
    iv) ది లాస్ట్ జడ్జిమెంట్ చిత్రం
    జాబితా – II
    ఎ) టాలమీ బి) మైఖెలాంజిలో
    సి) ఎరాస్మస్ డి) లియోనార్డో డావెన్సీ
    1) i- ఎ, ii- సి, iii- బి, iv-డి
    2) i- బి, ii- డి, iii- సి, iv-ఎ
    3) i- డి, ii- సి, iii- ఎ, iv- బి
    4) i- బి, ii- ఎ, iii- డి, iv-సి
30. కింది వాటిలో హిట్లర్ స్థాపించనిది ఏది?
    1) గెస్టెపో (రహస్య పోలీస్ దళం)
    2) పీపుల్స్ అబ్జర్వర్ (పత్రిక)
    3) రెడ్ షర్ట్స్ (ఎర్ర చొక్కాల దళం)
    4) ఎలైట్ గార్డ్స్ (అత్యున్నత రక్షక దళం)
31. జతపరచండి.
    ప్రముఖుడు
    i) బెనిటో ముస్సోలిని ii) హిట్లర్
    iii) జోసెఫ్ మాజినీ
    iv) ఆలీవర్ క్రాంవెల్ బిరుదు
    ఎ) ఫ్యూరర్ బి) ఇల్‌డ్యూస్
    సి) లార్డ్ ప్రొటెక్టర్
    డి) ఇటలీ జాతీయోద్యమ ప్రవక్త
    1) i- ఎ, ii- సి, iii- బి, iv-డి
    2) i- బి, ii- డి, iii- సి, iv-ఎ
    3) i- డి, ii- సి, iii- ఎ, iv- బి
    4) i- బి, ii- ఎ, iii- డి, iv-సి
32. 'అన్ని సముద్రాలు కలిసే ఉన్నాయి' అనే విషయాన్ని తొలిసారి తన భౌగోళిక యాత్రల ద్వారా వివరించిందెవరు?
    1) ఫెర్డినాండ్ మాజిలాన్ 2) క్రిస్టఫర్ కొలంబస్
    3) వాస్కోడిగామా 4) ఫ్రెడరిక్ బార్బోసా
33. 'రినైజాన్స్' అనేది ఏ భాషాపదం?
    1) ఫ్రెంచ్ 2) జర్మన్
    3) గ్రీక్ 4) స్పానిష్
34. మధ్యయుగం నాటి ఐరోపా వాస్తు శైలిని ఏమంటారు?
    1) సమురాయ్ 2) పైటా
    3) మీర్ 4) గోథిక్
35. కింది వాటిలో సరికాని జత ఏది?
    1) నిజమైన క్రైస్తవుడు – జాన్ కాల్విన్
    2) మత సంస్కరణోద్యమానికి వేగు చుక్క – జాన్ విక్లిఫ్
    3) ది నావిగేటర్ – హెన్రీ
    4) ఆధునిక జస్టీనియన్ – లూయీ ఫిలిప్
36. 1830 నాటికి ప్రపంచంలోనే తొలి రైలు ఏయే ప్రాంతాల మధ్య నడిచింది?
    1) మాంచెస్టర్ – బ్రిస్టల్
    2) బ్రిస్టల్ – లివర్‌పూల్
    3) లివర్‌పూల్ – మాంచెస్టర్
    4) స్టాకేటన్ – డార్లింగ్‌టన్
37. జతపరచండి.
    జాబితా – I
    i) మరమగ్గం ii) ఆవిరి యంత్రం
    iii) వాటర్ ఫ్రేమ్ iv) స్పిన్నింగ్ మ్యూల్
    జాబితా – II
    ఎ) రిచర్డ్ ఆర్క్‌రైట్
    బి) శామ్యూల్ క్రాంప్టన్
    సి) ఎడ్మండ్ కార్ట్‌రైట్ డి) జేమ్స్‌వాట్
    1) i- ఎ, ii- సి, iii- బి, iv-డి
    2) i- బి, ii- డి, iii- సి, iv-ఎ
    3) i- సి, ii- డి, iii- ఎ, iv-బి
    4) i- బి, ii- ఎ, iii- డి, iv-సి
38. ఫ్రాన్స్ జాతీయ దినోత్సవాన్ని ఎప్పుడు నిర్వహించుకుంటారు?
    1) జూన్ 14 2) జూలై 14
    3) ఆగస్టు 14 4) సెప్టెంబర్ 14
39. 'ఫ్రెంచ్ విప్లవానికి బైబిల్' అని ఏ గ్రంథాన్ని అంటారు?
    1) సోషల్ కాంట్రాక్ట్
    2) వెల్త్ ఆఫ్ నేషన్స్
    3) స్పిరిట్ ఆఫ్ లాస్
    4) ప్రిన్సిపియా మ్యాథమెటికా
40. ఫ్రాన్స్‌లో బానిసత్వాన్ని అధికారికంగా ఎప్పుడు రద్దు చేశారు?
    1) 1789 2) 1794
    3) 1796 4) 1799
41. ఐక్య జర్మనీ తొలి రాజధాని ఏది?
    1) బెర్లిన్ 2) ఫ్రాంక్‌ఫర్ట్
    3) బాండెన్‌బర్గ్ 4) ఉర్టెంబర్గ్
42. బోయర్ల యుద్ధం ఎప్పుడు జరిగింది?
    1) 1899–1902 2) 1905–1909
    3) 1907–1911 4) 1909–1912
43. సెయింట్ పీటర్స్‌బర్గ్ ప్రాంతం పేరు ఏమని మార్చారు?
    1) లెనిన్ గ్రాడ్ 2) స్టాలిన్ గ్రాడ్
    3) కెరెన్స్కీ గ్రాడ్ 4) టాట్స్కీ గ్రాడ్

సమాధానాలు

1) 3 2) 4 3) 1 4) 2 5) 1
6) 3 7) 1 8) 4 9) 1 10) 1
11) 2 12) 2 13) 4 14) 4 15) 1
16) 4 17) 2 18) 2 19) 4 20) 1
21) 1 22) 2 23) 2 24) 1 25) 2
26) 2 27) 2 28) 1 29) 3 30) 3
31) 4 32) 1 33) 1 34) 4 35) 4
36) 3 37) 3 38) 2 39) 1 40) 2
41) 1 42) 1 43) 1

What did the government do right?

Bank Exams
ENGLISH

Model Questions

Directions (Q.No. 1-5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. Many economists and expert committees (1)/ have in the past argued that the RBI is holding (2)/ much higher capital than required (3)/ to cover all its risks and contingency. (4)/ No error (5)
2. Harmanpreet became the first Indian woman cricketer to score a century in T-20 Internationals. (1)/ Earlier this year, she is embroiled in controversy (2)/ after the Punjab government withdrew her DSP rank (3)/ saying her degree had been found to be fake. (4)/ No error (5)
3. Sri Lankan President Maithripala Sirisena on Sunday stoutly defended his controversial move (1)/ to dissolve the parliament, saying it was taken to prevent clashes (2)/ between rival lawmakers (3)/ and also blamed Speaker for not accepting his presidential powers. (4)/ No error (5)
4. The Election Commission on Friday imposed a near month-long ban (1)/ on holding exit polls (2)/ beginning November 12 (3)/ in the five poll-bound states include Telangana. (4)/ No error (5)
5. The National Flag will fly at half-mast throughout the country on Monday (1)/ to pay homage Union minister Ananth Kumar (2)/ who died in the early hours. (3)/ The Central government will also accord a state funeral to the senior BJP leader. (4)/ No error (5)

Directions (Q.No. 6-10): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

6. She looked at him, and laughed; a cold laugh, ____, yet not bitter.
   1) Disdainful 2) respectful
   3) deferential 4) referential
   5) reverent
7. My brother was ____; he has attached himself to the retinue of a wealthy Baroness.
   1) Servile 2) imply
   3) comply 4) entail
   5) authoritative
8. Punishment is ____in deterring from crime only if it be certain and ____.
   1) Useless, slow
   2) futile, leisurely
   3) ineffectual, dawdling
   4) vain, sluggish
   5) efficacious, speedy
9. The Trump administration's ____ indifference to European concerns boils the blood of even the most ____ of Eurocrats.
   1) simple, bustling
   2) basic, docile
   3) ambiguous, serene
   4) undetectable, quite
   5) Apparent, placid
10. The hotel's shabby, outdated exercise room was its ____ attempt at a health spa.
    1) hefty 2) paltry
    3) substantial 4) generous
    5) considerable

Directions: (Q.No. 11 - 15) Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

11. <u>She recommended that John should take the ferry.</u>
    1) She recommended that John takes the ferry.
    2) She recommended that John is taking the ferry.
    3) She recommended that John has taken the ferry.
    4) She recommended that John take the ferry.
    5) No correction required
12. After the attack on the World Trade Center, the President ordered intelligence agencies <u>should prepare lists of who were America's most wanted terrorists.</u>
    1) would do the preparation of lists of America's most wanted terrorists
    2) preparing lists of most wanted terrorists in America
    3) the preparing of a list of the most wanted terrorists in America
    4) to prepare lists of the most wanted terrorists in America
    5) No correction required
13. The exhibit, created by painstaking craftsmanship in the jungles of Burma, consisted of hundreds of paintings, <u>each painting a tiny etched landscape inside its</u> own ceramic work of pottery.
    1) all the paintings a tiny etched landscape inside their
    2) all the paintings a tiny etched landscape inside its
    3) every painting a tiny etched landscape inside their
    4) each painting a tiny etched landscape inside their
    5) No correction required
14. More than one hundred years ago, students of ornithology reported that hummingbirds can hover <u>as insects flitting gracefully from one flower to another.</u>
    1) like insects flitting gracefully from one flower to another
    2) as insects do that flit gracefully from one flower to others
    3) like insects do that flit gracefully from one flower to others
    4) as do insects that flit gracefully from one flower to some other one
    5) No correction required
15. Forced to cut back their stock, automobile dealers in the area have cut prices; <u>have been priced to sell, and they are</u>
    1) are priced to sell, and they have
    2) are priced to sell, and they do
    3) are being priced to sell, and have
    4) had been priced to sell, and they have
    5) No correction required

Directions (Q.No. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) The jump in the ranking, from 100 to 77, is correlated with an improvement in the ratings, a jump of 6.6 per cent over last year.
B) Such questions are critical to help evolve a more focussed set of policy priorities for India.
C) What was even more interesting was that construction permits and cross-border trade were two aspects that showed maximum improvement.
D) What did the government do right? If business has become so much easier, why don't we see a boom in new businesses and investment?
E) The improvement in India's "Doing Business" rankings was quite a surprise, and among the few pleasant ones in recent weeks.
F) This is the second year that India has seen a massive jump in the same ratings with its ranking going up by 23 places this year, on top of 30 places last year.

16. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) B 3) C
    4) D 5) E
17. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D
    4) F 5) E
18. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) D
    4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C
    4) D 5) E
20. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B 3) C
    4) D 5) F

Directions (Q.No. 21-25) Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

Sardar Patel had no time for religious extremists of any kind. It didn't matter whether you were Muslim or Hindu; if you were misusing religion and religious sentiments to further your political power, Patel was not your friend. While he may have had more sympathy towards some Hindu traditions than Jawaharlal Nehru, neither Nehru nor Patel was blind to the fact that the Rashtriya Swayamsevak Sangh and Hindutva lot consistently bowed to the British rulers while Congress leaders, like themselves, were slammed into jail where some of them even died. After the murder of Bapu, Patel's anger towards the RSS was unimaginable, and he banned the organization. He lifted the ban only after the group signed an agreement saying they would stay away from politics. That assurance was given in shameless bad faith, and today we have the irony of that same RSS trying to hollow out the legacies of Gandhi, Nehru, Patel and Ambedkar even while building the gigantic Trojan Horse in Narmada district.

I'm sure there are people in Nagpur chortling into their falangist white shirts, thinking this is sweet revenge, that this statue of Patel will actually be a mausoleum of Gandhi's and Sardar's principles and ideology. The statue itself stares over a land destroyed to make the Narmada Dam and so-called Sardar Sarovar, where thousands of people were ripped out of their traditional lands to create an irrigation project that would benefit only a very few, a project that has failed dismally. To erect this obscene pile on the site of that robbery and disastrous planning is to add insult to injury. The insult is as much to the poor people of Gujarat as it is to Sardar Patel, one of their greatest champions. This statue may be intended as the place to inter Patel's idea of India, but in time, when history kicks back, it might well become the mausoleum for the toxic ideology of Hindutva.

21. Which of the following statements is true?
    1) Sardar Patel was tolerant towards Hindutva
    2) Sardar Patel entertained religious extremists
    3) Those who were misusing religion and religious sentiments occupied the coterie of Sardar
    4) all the above
    5) None of the above
22. What is the odd one out from the following options?
    1) Rip out 2) Relegate
    3) Expunge 4) Ratify
    5) Efface

KEY

1) 4 2) 2 3) 3 4) 4 5) 2
6) 1 7) 1 8) 5 9) 5 10) 2
11) 4 12) 4 13) 5 14) 2 15) 2
16) 1 17) 2 18) 3 19) 5 20) 3
21) 5 22) 4